రాముడుండాడు రాజ్యముండాది

డా॥ కేశవరెడ్డి

నీలకంఠ పబ్లికేషన్స్

RAMUDUNDADU
RAJJIMVUNDADI
– Novel
Dr. KESAVA REDDY

'అతను' ప్రవృత్తిరీత్యా ప్రకృతి ఆరాధకుడు. క్షుద్ర జీవాలలో విరాట్‌స్వరూపాన్ని చూడగల్గిన అంతఃకరణగలిగిన ఒక యోగి. అప్పుడే పుట్టిన పంది పిల్లలో చందమామ సౌందర్యాన్ని చూడగలగటం ఎంతమందికి సాధ్యం?

పేరు వింటేనే ఎదిమైళ్ళు పరుగెట్టే కుష్ఠువ్యాధిగ్రస్తుల సేవలో గత 20 సంవత్సరాలుగా జీవితాన్ని సాగిస్తూ వృత్తిలో దైవాన్ని చూస్తున్న సినాతుడు.

అతిగా వెర్రితలలు వేస్తున్న యాంత్రిక నాగరికతలోని శూన్యాన్ని చూపించి లేని ముసుగులు తొలగించుకోమని చెప్పక చెప్పే సాంప్రదాయవాది. మోడరన్ పెయింటింగ్స్ లోని అందాన్ని గుర్తించిన నవీనుడు. అణగారిన మనుష్యుల స్థితిగతులను చారిత్రక విశ్లేషణ ద్వారా విశదపరచగలిగిన ఒక మార్క్సిస్ట్. ఇవన్నీ తెలిపి మౌనంగా నిలబడిన ఒక బైరాగి.

సామాన్యంగా రచయితలలో కవులలో కన్పించే వైరుధ్యభరిత జీవితం అతనికి లేదు. సత్యాన్ని నిరంతరం అన్వేషించటం వలన కావచ్చు లేదా చుట్టూ ఉన్న వాతావరణ ప్రశాంతత వలన కావచ్చును. కేశవరెడ్డితో మనం మాట్లాడుతున్నప్పుడు ఆ నిశ్శబ్ద సంగీత నేపథ్యంలో మూగవాని పిల్లనగ్రోవి లయ మలయ మారుతంలా మనల్ని స్పృశిస్తుంది. మాకూ గొప్ప రచయితలు ఉన్నారు అని తెలుగు వాడు సగర్వంగా చెప్పుకోగలిగిన ఆత్మవిశ్వాసాన్ని మనకు కలిగించిన కేశవరెడ్డి మన మనస్సులను జయించటంలో ఆశ్చర్యమేముంది.

కాండ్రేగుల నాగేశ్వరరావు

SHOUT
SHARE
IT

Dr. KESAVA REDDY
Ramudundadu Rajjimvundadi (Novel)

Time of Plot : 1995
Locale : A Village in Chittoor Dist.
Plot : Disintegration of caste occupations in rural India
First published : 1986
Second Edition : 1997

Copies : 1200

Cover Design : **LAXMAN** (Aelay)
Cover Sculpture : **Goverdhan Singh Panwar**
Back Cover Photo : **Kandregula Nageswara Rao**

© Dr. Kesava Reddy

Price : Rs. 35/=

REETHIKA PUBLICATIONS : 4
503, Sri Chakra Apartments,
H.No. 123, Anand Nagar Colony,
Khairatabad, Hyderabad - 500 004.
Ph. No. : 3327966

For Copies :
ALL THE BRANCHES OF VISALANDHRA BOOK HOUSE

Sole Distributors :
VISALANDHRA PUBLISHING HOUSE,
Bank Street, Kothi,
Hyderabad

Printers :
Kala Jyothi Process Ltd.
R.T.C. X Roads,
Musheerabad,
Hyderabad - 20



రచనల్ని అభిమానించడమన్నది ఎవరైనాచేస్తారు కాని, అభిమానించిన రచనల్ని అచ్చువేసే సాహసం కొందరే చేస్తారు

మళ్లీ అటువంటి సాహసానికి పూనుకొన్న ఆత్మీయ మిత్రులు **శ్రీ కాండ్రేగుల నాగేశ్వరరావు** గారికి మనఃపూర్వక అభినందనలు

– రచయిత

SIDDHARTHA. V.
M.Sc. (Physics)

ఒయాసిసుల కోసం

''కొలిమి పనేగాదు. అన్ని పన్లూ అట్టినే ఉండాయి. కంసలోనికి కొలిమి గిట్టుబాటుకావటం లేదు. మంగలోనికి అడపం గిట్టుబాటు కావటంలేదు. రైతుకు సేద్దం గిట్టుబాటు కావటంలేదు. మాలోనికి కూలిపని గిట్టుబాటు కావటంలేదు. (పే.44)

''అందరి బతుకులు అట్టనే ఉండాయి. ఎవునికీ కులరుత్తులు గిట్టుబాటు కావటంలేదు.'' (పే.3)

పుల్లిగాడు (పట్నం వలసబోయిన దినకూలి) ఈడిగవాడు వంటి పాత్రల చేతనేకాకుండా రచయిత 11,12,20 అధ్యాయాల్లో స్వయంగా కులవృత్తులు గిట్టుబాటుకాకపోవడం, కాలక్రమాన ఒక కులంవారు వేరొక కుల వృత్తిని ఆశ్రయించడం, అవి కూడ పల్లెల్లో గిట్టుబాటుకాక 'తెంపు చెయ్యాల్నేగానీ ఊరిడ్సినంత పుణ్యం లేదు' అనుకొని కొందరు సమీప పట్టణాలకు తరలివెళ్లడం గురించి చెప్పడమే ఈనవల ప్రధాన ఇతివృత్తం. పట్టణాలకు వెళ్తే మాత్రం ఏం బావుకుంటారు – 'ఎండమావులను తొక్కుకుంటూ రోడ్డుమీద పరుగెత్తడమే'.

ఇది ఒక గ్రామం కథ అయినా రాజ్జెంవంతా ఇలాగేవుంది. కులవృత్తులు వదిలి వేరే కులవృతులు చేపట్టే క్రమంలో గత రెండు దశాబ్దాలుగా ఆ గ్రామంలో వివిధ కులాల మధ్య సాంఘికంగా కాకపోయినా ఆర్థికంగా వర్ణ సంకరం విరివిగా సాగుతున్నది అని కూడ చెప్తారు రచయిత.

ఈ కులవృత్తులు ధ్వంసమయ్యే ప్రాసెస్ ఎక్కడ మొదలైందో రచయిత ఈనవలలో చెప్పలేదు. 'యజ్ఞం'లో కారాగారు చెప్తారు.

ఇది బ్రిటిష్‌వాడి రాకతో మొదలైంది. కంటికి కొట్టొచ్చినట్లు కనిపించిన మార్పుల్లో మిల్లుబట్ట రావడంతో మగ్గాలు మూలబడడంతో మొదలైంది. అది కేవలం ఒక యంత్రం వచ్చి ఒక కులవృత్తిని పక్కకు నెట్టడం కాదు. ఆ యంత్రానికి సహాయంగా రాజ్యాంగయంత్రం ఆ కులవృత్తి మీద చేసిన దాడి, దౌర్జన్యం, విధ్వంసంతో ప్రారంభమైంది. క్రమంగా అన్ని వృత్తిపనులను యంత్రాలు దురాక్రమించాయి. ఆ వృత్తి పని వాళ్లు పట్టణాలకు వెళ్లి ఆ పనులే ఆ యంత్రాల ఆధారంగా చేయడం నేర్చుకున్నారు. పెట్టుబడి ఉద్దేశం ఆ వృత్తులన్నింటినీ యంత్రాల్లో ఇముడ్చుకొని

అందరికీ ఉపాధికల్పించడం కాదు. సరుకుల మీద లాభాలు ఆర్జించడం తక్కువ పెట్టుబడితో, తక్కువ శ్రమతో (కార్మికుల సమస్య లేకుండా తక్కువ మంది కార్మికుల నియామకంతో) ఎక్కువ సరుకుల ఉత్పత్తి, లాభాలు ఆర్జించడం. అందుకే ఇవ్వాళ మరో ప్రాసెస్ కూడ ప్రారంభమైంది. ఇప్పుడు మనుషులు పనిచేసే దశ నుంచి మనుషులు యంత్రాల చేత (లేదా యంత్రాలు మనుషులచేత?) పనిచేయించే దశ కూడ దాటిపోయి మనుషుల్ని నిరుద్యోగుల్ని చేసి యంత్రాలు పనిచేసే కంప్యూటర్ యుగంలోకి మనం ప్రవేశిస్తున్నాం.

ఇవ్వాళ మనకు పట్టణాల్లో అసంఘటిత రంగంలో కార్మికులు, నిరుద్యోగులు అనే రెండు కేటగిరీలే విస్తృతంగా కనిపిస్తాయి. కులవృత్తులు మాసిపోయిన దశనుంచి పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధికోల్పోతున్నదశకు మనకు చేరుకుంటున్నాం.

కేశవరెడ్డిగారు ఈ నవలలో ఇంత విశాల దేశంలో పనిక్కడైనా దొరకకపోకుండా అని గ్రామాలనుంచి వలసపోతున్న కుల వృత్తులవారి జీవితాలు, మనోప్రవృత్తులు చిత్రించారు. చిత్తూరు ప్రాంతంలో వలస పోయే ప్రజలు 'రాముడుండాడు రాజ్జెవుండాది' అనే భరోసాతో యలబారిన వైనాన్ని చిత్రించారు.

'రాముడుండాడు, రాజ్జెవుండాది' అని వలసల విషయంలో ప్రజలకేర్పడిన భరోసాలోనే ఈ పరిణామంలోని రహస్యం ఇమిడివున్నది. దేశం గొడ్డుబోయిందా, ఇంత సువిశాల దేశం ఇది – బతకకపోతామా అని బయల్దేరలేదు వాళ్లు. బ్రిటిష్‌వాళ్లు వచ్చి యంత్రాలు, మార్కెట్ వచ్చాక రాజ్యం (ప్రజల దృష్టిలో ప్రభుత్వానికి పర్యాయపదం) జీవనోపాధి కలిగిస్తుందనే ఒక ఎండమావి ఏర్పడింది. పుట్టిచ్చినవాడు రాతి కింది కప్పకు కూడ బతుకు దెరువు చూపకపోడనే విశ్వాసం మత శాస్త్రాలన్నీ ఉగ్గుపాలతో రంగరించి పోసినదే. కనుక రాముడూ రాజ్జీవూ కలిసి పోయాయి. బ్రాహ్మణీయ హిందూ మత విశ్వాసం కలిగించిన మాయకు మార్కెట్ మాయతోడైంది.

ప్రజలకు, కష్టజీవులకు రాముడు చేయగల సాయమేమిటో రచయితే స్వయంగా గుట్టువిప్పి చెప్పారు. హరిశ్చంద్రుని అప్పుల బాధలు మొదలు తానీషా అప్పుల బాధల వరకు తీర్చిన దేవుడు ఈ దేశంలో రైతుల అప్పుల బాధలు తీర్చే దగ్గరికి వచ్చేవరకు రాతి దేవుడైపోయాడు. కలరా, ప్లేగు వంటి రోగాలు 'స్వామి' వల్లనే మాయమయ్యాయని నమ్మారుగానీ ఆకలి రోగం అరికడతానని ఆయన భరోసా ఇవ్వలేదు. ఈ రోగం ఎందుకు వచ్చిందని వాళ్లు స్వామిని ప్రశ్నలడగడంలేదు.

మునుపు ఆ గ్రామానికి బందిపోటు దొంగల బెడద తరచు వుండేది. వాళ్లు

గ్రామంమీద పడి గ్రామస్తుల కష్టార్జితం యావత్తు దోచుకునేవారు. క్రమక్రమంగా ఆ బందిపోటు దొంగల దాడులు అంతరించిపోయాయి. కాని ప్రస్తుతం మరొక విధమైన దోపిడి నిరంతరంగా, నిరాటంకంగా సాగుతున్నది. ఈ దోపిడే పట్టపగలే సాగుతున్నది. కాని దీన్ని బందిపోటు తనంగా గ్రామస్తులు భావించటంలేదు. దోపిడి, మోసము తమ జీవన సరళిలో అంతర్భాగంగా భావిస్తున్నారు. అందుకే ఈ ఉపద్రవం ఎందుకు సాగుతున్నదని ప్రజలు స్వామిని ప్రశ్న అడగడం లేదు. ఈ ఉపద్రవాన్ని ఆరికడతానని స్వామి అభయమివ్వడమూలేదు.

కనుక రాముని పరిమితులు రాజ్యం దగ్గర ఆగిపోతాయని, అసలు అపుడైనా రాముడైనా, రామభక్త హనుమాన్ అయినా చేసిందేమీ లేదని 13వ అధ్యాయమంతా రచయిత ఎంతో హృద్యంగా కళ్లకు కడతాడు.

ఆ రాముడు రాజ్యం చేతిలోని పావు అని అతడు తన 'జన్మభూమి' పేర బాబ్రీమసీదు విధ్వంసం వంటి బీభత్సాన్ని సృష్టించి మతమారణకాండలను కొనసాగించగలడని సమకాలీన చరిత్ర రుజువుచేస్తున్నది.

ఆకలి గురించి చెప్పిన సందర్భంలో కన్నా బందిపోటు, దొంగతనాల దశనుంచి ఈ వ్యవస్థ దోపిడీ, మోసాల దశకు చేరుకున్న సందర్భం గురించి చెప్పినపుడు రచయిత – జీపులమీద, కార్లమీద వచ్చే పేనాల, కాగితాల వ్యవస్థ గురించి స్పష్టంగా చెప్పారు. అదిపైకి బ్యూరాక్రసీలా కనిపించినా అది ప్రభుత్వం రాజ్యాంగయంత్రంలో భాగం. బందిపోటు దొంగతనాలకు కొన్ని బృందాలుచాలు. కాని దోపిడీ చేయడానికి వర్గాలు కావాలి. ఆ వర్గాల స్వాధీనంలో రాజ్యాంగ యంత్రం వుండాలి. ఆ వర్గ దోపిడీ ప్రస్తావన కేశవరెడ్డిగారు ఈ నవలకే రాసిన ముందుగా ఒకమాటలో సూటిగా తెచ్చారు.

ఈనవలలో తిరుపాలనాయుడు అనే రైతు చేసిన బ్యాంకు అప్పువసూలు చేయడానికి అతని భూమి వేలంవేసే సందర్భంలో ప్రభుత్వ స్వభావం గురించి కొంత వివరిస్తారు.

''గవుర్మెంటోడంటే తెగీ తెగని కత్తితో గొంతులు కోసెటోడన్నా' అని తలారివానితో చెప్పిస్తారు.

ఈ గవర్నమెంటు, దానివెనుక వున్న రాజకీయార్థిక శక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మతకలహాలు సృష్టిస్తున్నాయి. కులం మతం ప్రాతిపదికపై ఓట్ల రాజకీయాలు నిర్వహిస్తున్నాయి.

కులం వృత్తికి సంబంధించిన అంశంగా కాకుండా సాంఘిక వ్యత్యాసాల నిచ్చెనగా మనువు శాసించిన వర్ణాశ్రమ ధర్మకాలంనుంచీ ఈ సమాజంలో అసమానతలను

సృష్టిస్తున్నది. బ్రాహ్మణీయ హిందూ భావజాలం అసమానత, హింసలనే రెండు పాదాల పై ఫ్యూడల్, భూస్వామ్య వ్యవస్థలను నడిపింది. ఆపాదాల కింద కష్టం చేసుకునే కులవృత్తులన్నీ అణగారి బతికాయి. ఈ నవల ఉదాహరణే తీసుకుంటే పెదనాయుడి దగ్గర ముప్పై ఏళ్లు వెట్టి జీతగాడుగా పనిచేసినవాని శరీరంలో రక్తమాంసాలు ఉడిగినపుడు అతని కొడుక్కు ఒక ఎకరం భూమి ఎరజూపి మళ్లీ ముప్పై ఏళ్ల వెట్టి జీతగాన్ని పొందాలనుకున్నాడు. పెదనాయుడు పొలంలో కూలీలు మొదటి నాట్లు వేయడం దగ్గర్నించి, అతనికి ఒక్కరోజే కంసాలి ఏభె కొడవళ్లు చేసి ఇవ్వాల్సి రావడం దాకా ఈ భూస్వామ్య దౌష్ట్యం వ్యక్తం అవుతూనే వుంటుంది.

కష్టజీవులను మతపరంగా హిందూ ముస్లింలుగా విడగొట్టడం బ్రిటిష్ ప్రభుత్వం ప్రారంభించింది. హిందువుల్లో బ్రాహ్మణులను వాళ్ల మను ధర్మశాస్త్ర భావజాలం వల్ల చాలా సులభంగా బ్యురాక్రసీలోకి ఇముడ్చుకున్నారు. ఇప్పటికీ రాష్ట్రాలనుంచి కేంద్రం వరకు చట్టసభల్లో కులాల ప్రాతినిధ్య దామాషా ఎంతగా మారినా బ్యురాక్రసీలో అది బ్రాహ్మణాధిపత్యంగా (ఆంధ్ర ప్రదేశ్ వంటి చోట రాజ్యాంగ పరంగా రిజర్వేషన్లు అమలు చేయాల్సివచ్చినపుడు మాలబ్రాహ్మణాధి పత్యంగా) ఇప్పటికీ చెలామణి అవుతున్నది. అందువల్ల బౌద్ధిక భావజాలంలోనూ దాని పట్టుసడలించడం కష్టంగానే వున్నది. రాజ్యం ఉద్దేశ పూర్వకంగా కుల భావాన్ని పెంపొందించడం ఎన్నికల రాజకీయాలతో పుంజుకున్నది. కేశవరెడ్డిగారు ప్రస్తావించిన అసహజ పరిణామాలకు ఇది ఒక బలమైన కారణం. పీడితజనం వర్గ ప్రాతిపదికపై సంఘటితమయ్యే క్రమాన్ని ఉద్దేశపూర్వకంగానే ఇది అడ్డుకుంటున్నది. ఈ పరిణామం 1857 లోనే మొదలైంది. ఇవ్వాళ ప్రపంచ వ్యాప్తంగా కూడ సామ్రాజ్యవాదం మతప్రాతిపదికమీద రెచ్చగొడుతున్న విద్వేషాలనుచూస్తే, ముఖ్యంగా అరబ్బు దేశాలపట్ల, ముస్లింపట్ల, సద్దాంహుస్సేన్ వంటి వాళ్ల విషయంలో చేస్తున్న ప్రచారం, దాడిని విశ్లేషిస్తే ఇది గ్రహించడం కష్టమేమీకాదు. ఇందులో పెట్రోల్‌రాజకీయార్థిక రహస్యం, అంటే మార్కెట్ రహస్యం వుంది.

భారత దేశంలో 1857 లో ఒక ప్రజాస్వామిక విప్లవం ప్రారంభమై ఓడిపోయిందనుకుంటే అది పరిపూర్తి కాకుండా అడ్డుపడదలుచుకున్న శక్తులన్నీ ఈ కుట్రను కొనసాగిస్తున్నాయి. మరొకవైపు సాంఘిక అంశం ఇమిడి వున్న కులవృత్తి, రాజకీయార్థిక అంశం కూడ అయిన వర్గ చైతన్యంగా పరిణమించాల్సిన క్రమాన్ని శ్రామిక వర్గ పార్టీలు చైతన్య పూర్వకంగా అధ్యయనం చేసి ఆచరించకపోవడంతో కులం బలపడింది. వర్గపోరాటం కులాన్ని రద్దుచేయాలి కానీ, వర్గ రాజకీయాల్లో విశ్వాసం మాత్రమే కులాన్నీ పోగొట్టదు.

ఇంత వరకూ జరిగిన ప్రపంచ విప్లవాల్లో లేని అంశంగా భారతీయ సమాజాల్లో కులసమస్య అదనంగా పరిష్కరింపబడవలసిన వైరుధ్యమని శ్రామిక వర్గ రాజకీయాలో గుర్తించాలి. ఇది కుల, వర్గ పోరాటాల చరిత్ర. అస్పృశ్యత, సాంఘిక అసమానత, వెట్టిచాకిరీ, కులవృత్తులపట్ల చిన్నచూపు (వ్యవసాయ కూలీ అయిన మాలవానికన్న బట్టలు ఉతికే చాకలి బతుకు ఎంత 'అసహ్య' మైందో ఈ నవలలోనే ఒకచోట ప్రస్తావనవుంది) వంటి అంశాలను ప్రత్యేకంగా పరిష్కరిస్తూ అందరి సమస్యలను వర్గపోరాటంలో సంలీనం చేసి సంఘటితం చేసి పరిష్కరించే క్రమంలో ఈ దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం నిర్వహింపబడాలి. కులనిర్మూలనా పోరాటం దోపిడీ వర్గాల పీడన నిర్మూలన మయ్యే వర్గపోరాటంలో సంలీనమై సాగాలి. పార్లమెంటరీ రాజకీయాల చట్రంలో శ్రామికులకే కాదు, దళితులకు కూడ రాజ్యాధికారం నిత్యం కాదు, మాయావతి బిజెపి పొత్తుతో ప్రభుత్వాధికారాన్ని చేపట్టగలదేమోకానీ రాజ్యాధికారాన్ని చేపట్టజాలదు. రాజ్యాంగం దళితులకు కల్పించిన పద్నాలుగు శాతం చట్ట సభల స్థానాలు అగ్రవర్ణాల ప్రయోజనాలకోసం రాజ్యాధికారాన్ని పంచుకోవడానికి పనికొస్తేయేగానీ దళితులకు, ఆదివాసులకు రాజ్యాధికారాన్ని కట్టబెట్టడానికి పనికిరావు. అవి పోరాటపటిమ పోగొట్టి అగ్రకుల, వర్గ సామరస్య భావజాలానికి లోబడడానికే దోహదం చేస్తాయి. సామ్రాజ్యవాదం ప్రపంచవ్యాప్తంగా మతపరంగా చేసినట్లే ఇక్కడ కూడ మతపరంగా మాత్రమేకాకుండా (బ్లూస్టార్ ఆపరేషన్, ఢిల్లీ మరణకాండ సందర్భంగా సిఖ్కుల విషయంలో కూడ చూశాం. కులపరంగా కూడా ఈ విభజననే ప్రోత్సహించి పీడిత కులాలు వర్గ ప్రాతిపదికపై సంఘటితంగా కాకుండా స్వప్రయోజనం కోసమే వస్తుంది.

కేశవరెడ్డి గారి వలెనే నేనుకూడ దీనిని ఇంతటితో మేధావుల, సామాజిక శాస్త్రజ్ఞుల ఆలోచనలకు వదిలి మళ్లీ ఫిక్షన్‌లోకివస్తాను..

వస్తుపరంగానూ, శిల్పపరంగానూ కేశవరెడ్డిగారి నవలలో - ఇన్‌క్రెడిబుల్‌గాడెస్, చివరిగుడిసె, మూగవానిపిల్లనగ్రోవి, రాముడుండాడు రాజ్యముండాది - (నేను చదివినవి ఇవి మాత్రమే) అన్నీకూడ ఎంతో ఉత్తమమైనవి. గూగీ నవలల వలెనాకు ఇష్టమైనవి. ఆయన నవలల్లో కెన్యాలోని గికుయు తెగ జీవితాలు, వాళ్ల పోరాటాలు చోటుచేసుకున్నట్లే ఈయన నవలల్లో మాలల, యానాదుల, బడుగువర్గాల జీవితాలు వాళ్లపోరాటాలు చోటుచేసుకున్నాయి. అవి చిత్తూరు వంటి ఒకానొక ప్రాంతానికి చెందినవైనా కష్టజీవుల బతుకుపోరు కథ గనుక అది ప్రపంచంలో ఏ కష్టజీవుల జీవన్మరణ పోరాటాన్నైనా ప్రతిఫలిస్తుంది. ఈ నవలలోనైనా ప్రాతినిధ్య స్వభావాలుగల కష్టజీవుల పాత్రల, కుటుంబాల గాధలు కనిపిస్తాయి గానీ ఆయన కొన్ని నవలలో ఒక వ్యక్తి లేదా

కుటుంబంపై తీగసాగిన కథలుగా వుంటాయి. దాని అర్థం అది ఒక వ్యక్తి కథనో, ఒక కుటుంబంకథనో కాదు. అది ఒక నిర్దిష్ట ప్రత్యేక అంశంలోని విశ్వసనీనతను చాల సాంద్రంగానూ, గాఢంగానూ, అనుభవపూర్వకమైన వివరణతోనూ చూపుతుంది. అణగారిన బతుకుల గురించి కాదు అణచబడుతూ స్ఫులింగాలై జ్వలిస్తున్న జీవితాల గురించి రాస్తారాయన. అన్నిటికీ మూలాలు బ్రిటిష్ ఇండియావలస పాలనలో చెప్పీ చెప్పకుండా, కనిపించీ కనిపించకుంచకుండా వుంటాయి. సాహిత్యంలో జీవితం ప్రతిఫలించాలంటారు ఏ దృక్పథం గల సాహిత్య విమర్శకులైనా సాహిత్యంలో కమిట్‌మెంట్ కోరుకునేవారికి ఈ విషయంపట్ల గురిలేదన్న ఆరోపణ కూడ కొందరిలో ధ్వనిస్తుంది. అయితే జీవితమంటే ఏమిటో అది ఆహార అన్వేషణ మొదలు ఆత్మగౌరవం నిలుపుకునే దాకా. ఇక కయ్యాలకోసం (భూమికోసం) అయితే చెప్పనక్కర్లేదు - ఎంత అనుక్షణ పోరాటమో కేశవరెడ్డిగారి ఏ నవల చదివినా గ్రహించవచ్చు. కనుక జీవితమంటే పోరాటం కూడ. ఆశ్చర్యంగా ఈ నవల తప్ప ఆయన నవలలన్నీ fatal endings విషాదాంతాలు అననుగానీ మరణించి గెలిచిన జీవితాలు. నవలల్లో పీడిత, పోరాట వర్గాలకు ప్రాతినిధ్యం వహించే మనుషులు మరణిస్తారు - మానవత్వం జయిస్తుంది.

ప్రకృతి, సమాజం, వ్యక్తి అంతస్సంబంధాలు కేశవరెడ్డి గారి నవలల్లో అపూర్వంగా (అటువంటి సాహిత్యం అరుదయినందున అపూర్వంగానే కాకపోతే అతిసహజంగా అనాలి) చిత్రించబడతాయి. అతడు అడవిని జయించాడు, మూగవాని పిల్లనగ్రోవి అందుకు అద్భుతమైన నిదర్శనాలైతే మైదాన ప్రాంతపు కథ అయిన ఈనవలకూడ ఏమీతీసిపోదు.

వాతావరణచిత్రణ, మూడుదృశ్యాల నుంచి కూడ రచయిత పీడిత పక్షపాతాన్ని పోల్చుకోవచ్చు

చెట్టుమీద పూలపిట్ల కొమ్మనుండి కొమ్మకు దూకుకూ, అందిన పూవులో కల్లా ముక్కును జొనుపుతూ హడావిడిగా వుంది. నేలమీద చీమలు ముడ్డిపైకెత్తుకొని, నోటిలో గడ్డిబియ్యాన్ని కరచుకొని గునగున పరుగిడుతున్నాయి. (పే.30)

ఈ వర్ణనను పెదనాయుడు పాలంలో కూలీలకోసం ముత్యాలనాయుడు పురమాయింపు, కూలీల అగచాట్లనేపథ్య వాతావరణంగా చదువుకుంటే రూపుకట్టే దృశ్యం ఎన్నటికీ మనసు మీంచి చెరిగిపోదు.

పూలపిట్టల సందర్భాలు, మాలకాకుల సందర్భాలు ఎంత పరిశీలనగా ఈ నవలలో చోటు చేసుకోంటయో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది.

కేశవరెడ్డిగారిలో అద్భుతమైన సౌందర్య దృష్టివున్నది. అయితే ఆయన సౌందర్యాన్ని ప్రకృతిలో, జీవితంలో, శ్రమైక జీవనంలో చూస్తారు. అది ఒక తాత్విక స్థాయినుంచి, హృదయపు లోయల్లోంచి వచ్చింది గనుక అది భాషలోను, వర్ణనల్లోనూ, పాత్ర చిత్రణలోను - అంతటా వెలుగువలె వెన్నెలవలె, సూర్యకిరణాలవలె, నక్షత్రాల వలె పరచుకొని వుంటుంది. ఇంక భాషా సౌందర్యం గురించి అయితే - చిత్తూరు మాండలికంలోని ఆయన నవలలు చదివితే కానీ శ్రమనుంచి సమస్తసంపదలవలెనే సంపద్యంతమైన భాష పుడుతుందనే విషయాన్ని అనుభూతిచెందలేం. చిత్తూరు అడవుల్లో, పల్లెల్లో, అక్కడ చెట్లమధ్య, పక్షులమధ్య, మనుషులమధ్య ఈ అన్ని సమూహాల భాషనూ ఆస్వాదిస్తూ అక్కడ సంచరిస్తున్నట్లు వుంటుంది ఆయన నవలలు చదువుతూవుంటే.

కేశవరెడ్డిగారికి 'కన్యాశుల్కం' నాటకం నిత్య అధ్యయన గ్రంథమట. బైరాగి పాత్ర ఆయన నవలలన్నింట్లోనూ దాదాపుగా వస్తుంది. అంతవరకే పోలిక. కేశవరెడ్డిగారి బైరాగిలో వేమన, పోతులూరి వీరబ్రహ్మం, స్వయంగా కేశవరెడ్డి వున్నారు. వీళ్లు ఎవ్వరూ ప్రపంచం పట్టని, జీవితంనుంచి పారిపోయే బైరాగులుకాదు. ప్రపంచపోకడ తెలిసిన వారు. ప్రపంచ పోకడను నిర్దేశించిన వారు. జీవితాన్ని పోరాటం వైపు మలిపి జీవితమంటే జీవించడం - సంఘర్షణ జీవలక్షణం - అనినేర్పి - పర్యవసానం వ్యక్తుల మరణమైతే కావచ్చు - అది జననం వలెనే సహజమైన విషయం - కాని సమష్టిగా అవి పురోగమనం - అనిచెప్పే ఒక తాత్విక అవగాహన ఆయన నవలలు అందిస్తాయి.

పాఠకునిగా నా అనుభవంతో కేశవరెడ్డి వంటి గొప్పరచయితకు ఒక అరచయిత (అందులోనూ గతంలోనూ ఫిక్షన్‌రాయని పచనకవి) రాయడానికి సాహసిస్తున్న ముందుమాటను ముగిస్తాను.

ఫిబ్రవరి 16 నుంచి ఏప్రిల్ 6 వరకు తెలుగు నేల ఒక మృత్యు నిశ్శబ్దాన్ని చీల్చే పొలికేక వేసింది. అక్షరాల అది ఆటగా, పాటగా, మాటగా మెతుకులేని మెదక్ జిల్లాలో అడవిలో జలపాతంవలె ఎగసింది. పురిటికంపు తల్లికీ, మంత్రసానికీ తప్పనట్లే శవాలవాసన - అవి వీరుల శవాలైనపుడు - ప్రజల ఊపిరిలో భాగమవుతాయి.

విద్యుత్‌కొరతకు, లోవోల్టేజికి వ్యతిరేకంగా వేలాదిమంది ప్రజలు తెలంగాణాలో వీధుల్లోకి వచ్చారు, వీరోచిత పోరాటాలు చేసారు. వీరి వెనుక విప్లవ శక్తులు వున్నాయని, ఎపుడూ చేసే, 'ఎన్‌కౌంటర్ల'నే ఉధృతం చేసింది రాజ్యం. ఫిబ్రవరి 16 మార్చి 21,24 వరుసగా నాలుగు, ఏడు, నాలుగు 'ఎన్‌కౌంటర్' హత్యలు. శవాల

గుర్తింపులు, పోస్ట్‌మార్టమ్, రిపోస్ట్ మార్టమ్, రక్తబంధువులకు మృతదేహాల అప్పగింత వారి వారి గ్రామాల్లో అంత్యక్రియలు ఈ క్రమమంతా ఆరువారాల పాటు ఆసుపత్రుల్లో, శవయాత్రల్లో కోర్టులో పిటీషన్లలో రోజుల తరబడి మృతదేహాలతో సంభాషణ. అది ప్రజలవీరుల మృతదేహాలు, ఆ మృతదేహాల కోసం, ఆ మృత దేహాల చుట్టూ వేలాదిమంది ప్రజలు, లాటిన్ అమెరికా నవల 'విడోస్' (తెలుగులో మిస్సింగ్) వలె మృతుని శవాన్ని అడగడమనే బాధాకరమైన ప్రాధేయతనుంచి శవం చేత సత్యాన్ని చెప్పించడమనే రాజ్యానికి సవాల్ దగ్గరికి చేరుకున్న తీగను కదిపితే డొంకంతా కదిలిన పోరాటం. దినమంతా అడవిలో సుడిగాలి వలె తిరిగి (మెదక్‌జిల్లా నర్సపూర్ అడవుల్లో తొంటి జిన్నారందాటాక అప్రయత్నంగా మృత్యు వాసనతో ఊపిరి తిత్తులు నిండిపోయేవి) ఏ రాత్రో ఇంటికి చేరి శవాలను సృశించిన చేతుల్లోకి కేశవరెడ్డిగారి నవలలు తీసుకుంటే అందులోనూ ఆభర్న మృత్యువు! అయితే అది మృత్యువే అయితే అతడు అడవినిట్లా జయిస్తాడు! అది మృత్యువే అయితే మూగవాడు పిల్లనగ్రోవినెలా పలికిస్తాడు.

సాహిత్యానికుండే గొప్ప ఆత్మ విశ్వాసాన్నిచ్చే శక్తి, కేశవరెడ్డిగారి నవలల్లో అనుభవిస్తున్న కాలంలోనే, 'నిత్య ఎన్‌కౌంటర్ల'లో తెలంగాణలో నిప్పులమీద నడుస్తున్న కాలంలోనే శత్రువు అత్యంత పిరికి చర్య - గద్దర్‌పై హత్యప్రయత్నం. పాట అజేయం - ఇపుడు మెటఫర్‌కాదు. జనపదాల సంగీతం లాసాగే కేశవరెడ్డిగారి నవలల్లోని అంతస్రోతస్వినీ కళ్లముందు సంఘటనల్లో సూర్యకాంతివలె ప్రతిఫలించిన ఒక దృష్టాంతం.

మృత్యువు ఒక కామా మాత్రమే. ఒక లిప్తమాత్రమే. జీవితం పరమసత్యం. అంతిమసారం. ఆ అంతరాన్ని అందించేదే సాహిత్యం. ఈసాహిత్య కృషిలో ఇప్పటికి కేశవరెడ్డిగారు రాసినవన్నీ నవలికలే. బహుశా యజ్ఞం, చావు, ఆర్తి వంటి పెద్ద కథలే. మొదటినవల ఇంక్రెడిబుల్ గాడెస్, ఈ రాముడుండాడు, రాజ్జిఁవుండాది చిన్నపాటినవలలు. కాలవిస్తృతి, జీవనవైవిధ్యం, అనుభవాల పరంపర, సంక్లిష్టమైన వైరుధ్యాలు, సారాన్ని ఎంతో లోతుల్లో తప్ప దర్శించలేని రూపవిభ్రాంతి - రాముడు- రాజ్యం మాయనుతొలగించగల నైశిత్యం - ప్రతిఫలించే సమగ్రమైన నవల కేశవరెడ్డిగారి నుంచి ఇంకా రావలసే వుందని, వస్తుందనే ఆకాంక్షతో

- వరవరరావు

హైదరాబాదు మేడే, 1997.

ముందుగా ఒక మాట

నేటి సమాజంలో కులవృత్తులు క్రమక్రమంగా ధ్వంసమైపోతున్న వైనాన్ని చూపించటం ఈ నవలలోని ప్రధాన ఇతివృత్తం. ఇందులో దళితులూ ఉన్నారు. దళితేతరులూ ఉన్నారు. కొలిమి పని గిట్టుబాటుగాని ఒక కంసాలిని, కట్టుబానిస కొలువు గిట్టుబాటుగాని ఒక కట్టుబానిసను, కూలిపని గిట్టుబాటుగాని ఒక దినకూలిని, వ్యవసాయం గిట్టుబాటుగాని ఒక రైతును ఈ నవలలో చూస్తాం.

పల్లెలో తమ తమ కులవృత్తులు గిట్టుబాటు కాకపోవడం వల్ల పొట్టచేతబట్టుకుని, పట్నానికి బయలు దేరి లారీకోసం ఎదురుచూస్తూ రోడ్డుపక్కన చింతచెట్టు కింద కూర్చుని ఉన్న రైతు, కంసాలి, జీతగాడు, ఒక కూలి, చివరకు పూజారి మనకు నవల చివరి అధ్యాయంలో కనిపిస్తారు. అలా చింత చెట్టు కింద కూర్చుని ఉన్నప్పుడు ఆ ఐదుగురి కులం ఏమిటి? వారికి కులం లేదు. వారికి ఉన్నది ఒక్కటే. వర్గం. పీడిత వర్గం. వారందరికీ ఉన్నా ఉమ్మడి సమస్య ఆర్థిక సమస్య, సమాజంలో ఉన్న అన్ని రుగ్మతలకు ఆర్థిక అసమానతలే మూలకారణమనీ, దానికి అంతిమ పరిష్కారం వర్గపోరాటమేననీ నేను గట్టిగా నమ్ముతాను. దళితేతరులకు లేని కొన్ని ప్రత్యేక సమస్యలు దళితులకు ఉన్నాయన్నది ఎవరూ కాదనలేని సత్యం. ఐతే అవి ప్రధానంగా ఉపరితలానికి సంబంధించినవని గుర్తించాలి.

కులవృత్తులు అంతరించిపోతుండడంవల్ల, కులాలు అంతరించిపోయి, నీరు పల్లానికి ప్రవహించినంత సహజంగా వర్గాలే మిగల వలసిన తరుణమిది. కాని బిడ్డచచ్చినా పురిటి కంపు పోలేదన్నట్లు, కుల'వృత్తులు' అంతరించిపోతున్నా, ఆమేరకు కుల'భావం' అంతరించి పోవడం లేదు. పైపెచ్చు అది నానాటికి బలపడుతుంది.

తరతరాలుగా అణగారి ఉండిన దళితులు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం కోసం సాగిస్తున్న ఉద్యమాలు ఎంతయినా ఆహ్వానించ దగ్గవి. ఐతే ఆ ఉద్యమాలు వర్గపోరాటంలో భాగంగా సాగితే అవి మరింత ఆహ్వానించదగ్గవీ, ప్రోత్సహించ దగ్గవీ అవుతాయి. అలాకాని పక్షంలో అవి కొంత దూరంసాగి ఆగిపోయే అవకాశం ఉంది. అంతేగాక పేదరికం ఉమ్మడి సమస్యగా కలిగిన దళిత, దళితేతర పీడిత జనం వర్గప్రాతిపదికపైన Polarise అయ్యేక్రమం కుంటుపడే అవకాశమూ ఉంది.

ఒక గ్రామంలోని వివిధ కులాల అంతస్సంబంధాలను, interdependencyని చిత్రించిన నవల ఇది. ఒక ఘట్టంలో రెండు కులాల వాళ్ళు ఘర్షణకు దిగి ఒకరినొకరు

పరుషపదజాలంతో దూషించుకుంటారు. కథనంలో సహజత్వాన్ని కాపాడుకునేందుకు మాత్రమే ఆ పదజాలాన్ని వాడవలసి వచ్చిందేగాని, ఆయా కులాలను కించపరచడం నా ఉద్దేశ్యం ఏమాత్రం కాదు.

నవల ముగింపు గురించి ఒక చిన్న మనవి. కులవృత్తులు మూల బడడంతో ఆ ఐదుగురు పల్లెను వదిలి పట్నానికి వలసవెళ్ళినట్టు చూపించానేగాని, అలా పట్నాలకు వెళ్ళిపోవడం వాళ్ళసమస్యలకు పరిష్కారమనే భ్రమ నాకెన్నడూ లేదు. పట్నంలో వాళ్ళశ్రమ మరింత దోపిడికి గురవుతుందని ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. వాళ్ళు ప్రయాణిస్తున్న లారీ తారురోడ్డుమీద ' ఎండమావుల'ను తొక్కుకుంటూ పరుగెత్తడం గమనార్హం.

ఈ నవలను ఆంధ్రజ్యోతి వారపత్రికలో ధారావాహికగా ప్రచురించిన స్వర్గీయ శ్రీపురాణం సుబ్రమణ్య శర్మగారిని ఈ సందర్భంగా స్మరించుకోవడం నా కనీస ధర్మంగా భావిస్తున్నాను. దీనిని ప్రస్తుతం పుస్తక రూపంలో వెలువరిస్తున్న రీతికా పబ్లికేషన్స్ వారికి, కవర్ డిజైన్ చేసిన ఆర్టిస్టు లక్ష్మణ్‌కు, పుస్తకం అందంగా ముద్రించిన కళాజ్యోతిప్రాసెస్‌కు నా స్నేహాభివందనాలు తెలియజేస్తున్నాను.

- డాక్టర్ కేశవరెడ్డి

7-4-97.

"....కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం,

జాలరి పగ్గం,

పాలెల మగ్గం,

శరీర కష్టం స్మృరింపజేసే

గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి,

సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు -

నా వినుతించే,

నా విరుతించే,

నా వివరించే నవీన గీతికి

నా విరచించే నవీన రీతికి

భావం!

భాగ్యం!

ప్రాణం!

ప్రణవం!"

-శ్రీశ్రీ 'ప్రతిజ్ఞ' నుంచి.

SIDDHARTHA, V.
M.Sc. (Physics)

వేసవి కావటం వల్ల త్వరగా తెల్లవారింది. తూర్పుకొండ వెనక దాగి ఉన్న సూర్యుని కిరణాలు ఆకాశాన్ని పొడుస్తూ కనిపిస్తున్నాయి. ఆ కిరణాలు ఆకాశం మీదనుండి పరావర్తనంచెంది భూమి మీదకు వ్యాపిస్తున్నాయి.

ఏటికి పడమటివైపున ఉన్న వరిపైరు విరగపండి ఉన్నది. పొలానికి ఒక వైపున వరుసగా కానుగ చెట్లున్నాయి. మరొక వైపున కాకి వెదురు పొదలు, తీంత్ర పొదలు ఉన్నాయి. పొలంలో అక్కడక్కడ వెదురు బొంగులు నాటి వాటిమీద దిష్టికుండలు ఉంచారు. నల్లటి దిష్టికుండలు మీద తెల్లటి సున్నపు బొట్లున్నాయి. పొలం మధ్య తటాకమంత బావి ఉన్నది. బావిగట్టున కరెంటుతో నడిచే పంపు సెట్టున్నది. దాని నానుకుని తాటి ఆకులతో కప్పబడిన కావలి గుడిసె ఉన్నది.

సూర్యుడు కొండలమీద దృగ్గోచరుడయ్యాడు. ఉదయపు ఎండ వలన వరిపొలం బంగారు వన్నెను సంతరించుకుని కన్నుల పండువుగా ఉంది. పిచ్చుకలు అప్పుడే గుంపులు గుంపులుగా పొలం మీద పడి తింటున్నాయి. అసలే కంకుల భారానికి వంగిపోతున్న వరి కర్రలు పిచ్చుకల భారానికి తట్టుకోలేక పోతున్నాయి. జారి పడిన పిచ్చుకలు ఒడుపుగా తమాయించుకుని మరొక కర్రమీద కూర్చుంటున్నాయి. పిచ్చుకల కిచకిచలతో ఆ ప్రాంతం ప్రతిధ్వనిస్తున్నది. కడుపు నిండిన పిచ్చుకలు రెక్కలు కొట్టుకుంటూ ఎగిరి కానుగచెట్ల కొమ్మలమీద కూర్చుంటున్నాయి.

ఏటి వద్ద ప్రారంభమై అల్లంత దూరాన కనిపిస్తున్న 'మోకాళ్ళ కొండ' దాక పరచుకుని ఉన్న రెండు వందల ఎకరాల మాగాణి భూమిని 'యానాది మిట్ట' అంటారు. ఈ భూమి పెదనాయుడు గారిది. యాకిరి మిట్టలో వరి, చెరకు, రాగి, వేరుశనగ, పసుపు వగైరా పంటలు పండుతాయి. ఆ భూమిలో పనిచేయడానికి ఒకప్పుడు ఇరవైమంది జీతగాళ్ళుండేవారు. కాలక్రమాన ట్రాక్టర్లు, పంపు సెట్లూ వచ్చి వ్యవసాయం యంత్రమయం కావడంమూలాన ప్రస్తుతం ఎనిమిది మంది జీతగాళ్ళు మాత్రమున్నారు. వీళ్ళుగాక కోతలప్పుడు, నాట్లప్పుడు వందల కొలది దినకూలీల అవసర ముంటుంది.

పెదనాయుడు గారు గ్రామంలో ఉండడం చాలా అరుదు. సంవత్సరంలో

చాలా భాగం అతడు జిల్లా ముఖ్యపట్టణంలో, హైదరాబాదులో గడుపుతుంటాడు. కనుక సేద్యపు పనులను చూసుకోవడానికీ, జీతగాళ్ళపైన, కూలీలపైన అజమాయిషి చేయడానికీ ఒక ఏజెంటు ఉన్నాడు. అతని పేరు ముత్యాలనాయుడు.

ముత్యాలనాయుడు ఏరు దాటుకుని, కాకి వెదురు పొదలవద్ద మలుపు తిరిగి ఇటే వస్తున్నాడు. అతడు ఒక చేత్తో పంచెను ఎగబట్టుకుని, మరొక చేత్తో పందుంపుల్ల పట్టుకుని పండ్లు తోముకుంటూ వస్తున్నాడు. అతని వెనక ఈడిగవాడు వస్తున్నాడు. ఈడిగ వాడు ఒక చేత్తో కల్లుబానను భుజం మీద పట్టుకుని, మరొక చేత్తో బీడీ తాగుతూ నడుస్తున్నాడు. అతని నడుంచుట్టూ తోలు దారాలున్నాయి. ఆ దారాలలో కత్తి ఉలి గుచ్చబడి ఉన్నాయి. వాళ్ళిద్దరు ఒకరి వెనుక ఒకరుగా నడుస్తూ వరిపొలం దాపుకు వచ్చారు.

వాళ్ళరాకతో పిచ్చుకలు చివ్వుమని లేచి కానుగ చెట్లవైపు ఎగిరి పోయాయి. గుంపుగా లేచిన పిట్టలను చూసి ముత్యాలనాయుడు అకస్మాత్తుగ ఆగి, ''ఈ నమ్మ'' అన్నాడు.

అతడలా అకస్మాత్తుగా ఆగడంతో ఈడిగవాడు అతని గుది కాళ్ళను తొక్కి, అతనిమీద పడబోయి తమాయించుకున్నాడు. పిచ్చుకలన్నీ ఎగిరిపోగా ఒకటిమాత్రం నిర్భయంగా వరి కర్ర మీద కూర్చుని ఉన్నది.

ముత్యాలనాయుడు పట్టరాని కోపంతో, ''దానికేవన్నా బయవా? బత్తివా? మనుషులింత దగ్గరుంటే గూడా పైకి లేవటం లేదు.'' అంటూ వంగి రాయి తీసుకుని విసిరాడు. రాయి గురితప్పి వరి కంకులకు తగిలి కొన్ని విత్తనాలను జల్లున నేలరాల్చింది. ముత్యాల నాయుడు మళ్ళీ వంగి రాయి తీసుకుని గురి చూసి ప్రయోగించాడు. రాయి మళ్ళీ గురి తప్పి దిష్టికుండకు తగిలింది. కుండ పెళ్ళున పగిలి పెంకులు కింద రాలాయి. పిచ్చుక వరి కర్ర మీదనుండి లేచి కుండలేని వెదురు బొంగు మీద కూర్చొని టిక్కు టిక్కుమని తోక ఆడించసాగింది. ముత్యాలనాయుడు కోపంతో ఊగిపోతూ మరొక రాయి తీసుకుని నడుమెత్తేలోగా ఆ పిచ్చుక మాయమైపోయింది.

ముత్యాలనాయుడు ఖాళీగా ఉన్న వెదురు బొంగును చూస్తూ, ''పోయిందా? దాని పుర్రె పగలగొడతాననుకుంటి. ఈ పొద్దు అది కుడి పక్కన నిద్దర్లేసింది.'' అంటూ రాయి కింద పడేశాడు.

ఈ గడబిడలో అతని పందుంపుల్ల జారి ఇసుకలో పడింది. ఈడిగ వాడు పుల్లను తీసి, ''ఇంద సావి'' అని అందించాడు.

ముత్యాలనాయుడు పుల్లను ఇసుకతో సహా అలాగే నోట్లో పెట్టుకుని, కానుగ చెట్ల వైపు చూస్తూ, ''గువ్వలా ఇవి? వీటికన్న బలరాకాసులు మేలు.

అట్ట జూడు ఒక్కొక్కటి సుక్కపందులు మాదిరి బల్సుకోనుండాయి'' అన్నాడు.

ఈడిగవాడు, ''బల్సు కోనుండక ఏవి జేస్తాయి సావి. ఈడ వడ్ల గింజలు తింటాయి. నా ఈత చెట్ట కాడి కొచ్చి కల్లు దాగతాయి. నేను చెట్టుకు ముంత కట్టిసి తిరుక్కున్నానంటే సాలు. ఇవి గుంపులు గుంపులుగా వచ్చి చెట్టు మీద వాల్తాయి. కల్లు ఒక బొట్టు గూడా ముంతలోకి పోనీవు. అంతా ఇవే తాగేస్తాయి.'' అన్నాడు.

ముత్యాలనాయుడు కావలి గుడిసె వైపు చూసి, ''ఈ కోనిగాడు ఏవి జేస్తా ఉన్నట్టు? పంటను గువ్వల కప్పగించేసి ఈడేవిజేస్తా ఉండాడు. గుడిసె ఏసిచ్చింది కావిలికాసే దానికా, నిద్దర్లు చేసే దానికా?'' అని ఎలుగెత్తి, ''ఓరి కోనిగా!'' అనరిచాడు.

గుడిసె దగ్గర ఏ అలకువా కానరాలేదు. ముత్యాలనాయుడు, ఈడిగవాడు గనిమవెంబడి నడవసాగారు.

ఈడిగవాడు వరి కంకులను నిదానించి చూస్తూ, ''పంట నరగావు అడగతా ఉండాది సావి. ఒక్కొక్క కంకి నలిపితే దోసెడు వడ్లు రాల్తాయి. కోసి కళ్ళం చేస్తే యకరా మూడు పుట్లకు తక్కువగాకుండా రాల్తాయి'' అన్నాడు.

ముత్యాలనాయుడు, ''అందాక ఈ గువ్వలు దక్కనిస్తే గదా. పూటకు పుట్టెడ్లు తిని నీళ్లు తాగేస్తా ఉండాయి'' అన్నాడు.

ఈడిగవాడు ఆగి ఒక కంకిని తెంపి దోసిట్లోనలిపి, ''కంకి గూడా ముగ్గ పండిపోయింది సావి. పాలగింజ ఒక్కటి గూడా లేదు. ఇంగ ఆల్సిం దేనికి సావి. కూల్లోల్లను పిల్చి కోసి ఒబ్బిడి చేసెయ్'' అన్నాడు.

ముత్యాలనాయుడు, ''పోయిన సెనివారమే కోత మొదలు పెట్టాల్సింది. కూల్లోల్లకేవి కరువు. కొడవండ్లు దిక్కులేకనే కోత మొదులు పెట్టలేదు. కంసలోడు అల్లనింటికి పోయి కూసుని వారమయింది. వొచ్చినాడో లేదో కనుక్కోవాల. ముండాకొడుకు గట్టిగా మాట్లాడితే కొలిమి పని గిట్టుబాటు కావటం లేదంటాడు'' అన్నాడు.

ఈడిగ వాడు వడ్లగింజ కొరుకుతూ, ''అందరి బతుకులూ అట్టనే ఉండాయి. ఎవునికీ కులరుత్తులు గిట్టుబాటు కావటం లేదు'' అన్నాడు.

ముత్యాలనాయుడు ఆగి, వెనుదిరిగి చూసి, ''నువ్వు గూడా కల్లుగీసే పని మానేస్తావా యట్ట?'' అన్నాడు.

ఈడిగవాడు. ''ఊ. గిట్టుబాటు కాకపోతే మాత్రం మానేస్తానా? మానేస్తే కూడా, గుడ్డ గడిసేదెట్లా? ఈడిగోడై పుట్టినాక ఈత చెట్లు పొడుచుకోని బతకాల్సిందే.'' అని సూర్యుని వైపు చేయి అడ్డం పెట్టుకుని చూసి, ''అప్పుడే పొద్దు బారడెక్కింది. నేను పోతాను సావి. ఓపినన్ని చెట్లుదించాలి.'' అని దూరంగా కనిపిస్తున్న ఈతచెట్ల వైపు చక చక నడవసాగాడు.

ముత్యాలనాయుడు కావలి గుడిసె వైపు నడవసాగాడు.

2

ఏట వాలుగా పడుతున్న ఎండ కావలి గుడిసెలోకి చొచ్చుకుని వస్తున్నది. గుడిసె మధ్యన కొబ్బరి కీతును పరచుకుని కోనిగాడు పడుకుని ఉన్నాడు. రెండు ఇటుక రాళ్ళను తలగడగా జేసుకుని అతడు నిద్రిస్తున్నాడు. అతని తలవద్ద ఒక వైపున దుడ్డు కర్ర, మరొక వైపున కత్తి ఉన్నాయి. మరి కొంత దూరాన ఆర్పివేసిన లాంతరు నిలబడి ఉన్నది.

ముత్యాల నాయుడు గుడిసె ముందు నిలబడి '' ఒరే కోనిగా, ఒక పక్క పొద్దు రెండు బార్లెక్కి వస్తె ఉంటే ఇంగా నిద్దర్లు జేస్తె ఉండవంట్రా'' అన్నాడు.

కోనిగాడు మెల్లగా పక్కకు వొత్తిగిలి, కండ్లు తెరిచి, గబగబ లేచి కూర్చున్నాడు. సూర్యకిరణాల కడ్డంగా అరచేతిని పెట్టుకుని, ''ఎవురాడ? నువ్వా సావీ. దండాలు.'' అంటూ బయటకొచ్చాడు.

ఆకస్మాత్తుగా ముత్యాలనాయుడి కంఠం మారిపోయింది. అతడు కోనిగాడి జీర్ణదేహాన్ని, తల నుండి బొన వేళ్ళదాక మడతలు పడి ఉన్న చర్మాన్ని, కండలు హరించి పోగా తిత్తుల వలె ఊగుతున్న దండలను, నెరసిన వెంట్రుకలను అనుకంపతో చూస్తూ ''ఊ వయసనేది అట్టాంటిది. వయసుడిగినాక ఎట్టాబోడూ నేల బడాల్సిందే. నా కండ్ల ముందర్నే ఈ యానాది మిట్టను మిట్టలు, పల్లాలు పిడుగు మాదిరి చీల్చినోడివి, ఇప్పుడు మోచేతులు, మోకాళ్ళు నేలమీద ఊనుకుంటా పైకి లేస్తె ఉండవు.'' అన్నాడు.

కోనిగాడు తలవంచుకుని, ''ఔ సావి, ఉడిగినేళ ఒకదానికొగిటి వొదగదు సావి. పడుకుంటే నిద్దరు పట్టదు. నిద్దర పట్తే మెలకువ రాదు. గుడ్డి సుక్క పుట్టేటప్పటికి మడకో, మానో కట్టుకోనుండే వాణ్ణి. ఈ పొద్దిటికి ఎండకడ్డంగా చెయ్యి పెట్టుకుంటూ నిద్దరలేసినా.'' అన్నాడు.

ముత్యాలనాయుడు పందుంపుల్లను నోట్లోనుంచి బయటకు తీసి, ''నీ తప్పుగాదురా, నీ తప్పుగాదు.'' అని మామిడి చెట్టువైపు చూపిస్తూ, '' ఆచెట్టు చూసినావా, దాన్ని పెదనాయుడోల్ల తాతనాటినాడంట, మద్రాసునుంచి పిలక తెప్పించి నాటినాడంట, మొన్నటి దాక అది కాపుకు నాలుగు బండ్ల కాయలు కాస్తె ఉండే. ఇప్పుడు జూడు, చిత్తర్నెల పోతా ఉందిగాని, అది పూత గూడా పూయలేదు. దాని తప్పుగాదు, దాని వయసయి పోయింది. అంతే.'' అన్నాడు.

అతడు కరెంటు మోటారు వద్దకు నడిచి మీటనొక్కాడు. నీళ్లు చప్పుడు చేసుకుంటూ పైపు లోంచి సిమెంటు తొట్టిలోకి దూకసాగాయి.

కోనిగాడు వరి చేను వైపు చూశాడు. పిచ్చుకలు గుంపులు గుంపులుగా వరికర్రల మీద కూర్చుని దాడి చేస్తున్నాయి. అతడు చప్పట్లు చరుస్తూ, పెద్దగా గొంతు పెంచి ''హా...హూ...'' అనరిచాడు. పిట్టలు లేచి కానుగ చెట్ల మీద కూర్చున్నాయి.

కోనిగాడు వెనుదిరిగి, ''కోత వాయిదా ఏసే కోద్దీ పంట శాదం అవతానే ఉంటుంది సావి. పగలు గువ్వల పోరు. రాత్రి ఎలుకల పోరు. కొడవండ్ల కత యాడిదాక వచ్చింది సావి.'' అన్నాడు.

ముత్యాలనాయుడు మోటారు వద్దనుండి వస్తూ, ''నాకు రొండు కాళ్ళాక చోట పెట్టేదాని గ్గూడా తీరిక లేకుండా ఉంది. ఒక పక్క చెరకుతోట కోత జరగతా ఉండాది. ఇంగొక పక్క దేవలం మరమ్మత్తు జరుగతా ఉండాది. మనూరి కంసలోడు అల్లునింటికి పోయి కూసున్నాడు. వాడొచ్చినాడో లేదో కనుక్కోవాల. వాడు రాకుండా ఉంటే సుద్దపల్లి కంసలోని దగ్గరకు మనిషిని పంపించాల'' అన్నాడు.

కోనిగాడు నిరాశగా, ''మనిషిని పంపించి ఏం పుణ్యం సావి, నువ్వే దగ్గరుండి పని సరసరా అయ్యేట్టు చూడు సావి. ఈ గువ్వలు పూటకు పుట్టెడు తినిపోతా ఉంటే నా కడుపు దగోత్తరంగా కాలిపోతూ ఉంది సావి.'' అన్నాడు.

ముత్యాలనాయుడు, ''మద్దనపల్లికి పోదామని బయల్దేరినా, ఇంతలోకే పెదనాయుడొచ్చి నీదగ్గరకు అర్జంటుగా తరిమినాడు'' అన్నాడు.

కోనిగాడు, ''నా దగ్గకేవిటికి సావి,'' అన్నాడు.

ముత్యాలనాయుడు పుల్లను పండ్లమీద రాకుతూ, ''గంగ పండక్కు ఇంగ నాలుగుదినాలు ఉండాదిరా. గంగ పండగ అయిపోయినాక నీకత ఏందో తెల్సుకోని రమ్మని పెదనాయుడు పంపించినాడు'' అన్నాడు.

కోవిగాడు అయోమయంగా చూడసాగాడు.

ముత్యాలనాయుడు పుల్లను పండ్లమీద రాకడం ఆపి ''అట్ల జూస్త ఉండావేందిరా. రేపొచ్చే గంగ పండక్కు నీ వాయిదా తీరిపోతుంది. పెదనాయుడు నీ బాండు కాగితం నీకిచ్చేస్తాడు. మల్ల నువ్వేవి చెయ్యబోతా ఉండావని అడగతా ఉండా''. అన్నాడు.

కోవిగాడు తలవంచుకుని నిల్చున్నాడు.

సిమెంటు తొట్టి నిండిపోయింది. అందులో నుండి నీళ్ళు నాలుగు గజాల క్రిందున్న నాపరాతి మీదకు సాళసాళమని దూకుతూ, కాలువ వెంబడి ప్రవహిస్తున్నాయి.

ముత్యాలనాయుడు, ''మాటా మంతి లేకుండా ఐపోతివేందిరా కోనిగా'', అన్నాడు.

కోవిగాడు మెల్లగా తలెత్తి, ''ఏవి చెప్పమంటావు సావి, ఈ యానాది గెడ్డమీదనే ముప్పై ఏండ్లుగా బతికితి. ఈడనే పెద్దోడైతి. ఈడనే ముసిలోడైతి. ఈ ముప్పై ఏండ్లు తిండికీ గుడ్డకు తడువుకునే పని లేకుండా జరిగిపోయింది...''

ముత్యాలనాయుడు మధ్యలోనే అందుకుని, ''ఇప్పుడు మాత్రం ఈ యానాది గెడ్డ నీది కాదనేటోడెవుర్రా. ఈ గెడ్డ యిడ్సి నిన్ను పొమ్మనేటోడెవురు? ఆ ఎవురంట?'' అన్నాడు.

కోనిగాడు, ''ఒకరు తనీగా అనాల్నా సావి, గంగ పండగ అయిపోయినాక నేనీ గెడ్డమీద ఉంటానన్నా ఉండ నిచ్చేటోడెవరు?'' అన్నాడు.

ముత్యాలనాయుడు పందుం పుల్లను కోని గాని ముందర ఆడిస్తూ, ''ఆమాట నువ్వే అంటివి. నేనన్లేదు. పెద నాయుడు అన్లేదు. నువ్వే అంటివి.'' అని కాస్త చేరువగా వచ్చి, తగ్గు స్వరంతో, ''పెద నాయుడు గారి కత నీకు తెలవదురా, ఆయన నమ్మినోని నోట్లో దుమ్ము కొట్టేటోడు కాదు.'' అన్నాడు.

కోనిగాడు, ''ఆ మాట నాకు తెలవదా సావీ. ఆ మారాజు సల్లగా సూడబట్టే నాకట్టి ఇంగా భూమ్మీద ఉండాది. ఆ పుణ్యార్తుడు ఆదుకోకుండా ఉంటే నేనూ, నాకొడుకూ ఎప్పుడో సచ్చి మాగుంత మీద గెరికి మొలిచి పోయుండును''. అన్నాడు.

ముత్యాలనాయుడు ఆ సమాధానం కోసం ఎదురుచూస్తున్న వాడిలాగ, ''అదే, అదేరా కావల్సింది, కావల్సిందంతా మనిషి మీద మనిషికి నమ్మకం, ఆ

నమ్మకవనేదుంటే మిగతా వంతా ఉన్నట్టే. పెదనాయుడుగారికి ఆ నమ్మక ముండబట్టే ఈ యానాది గెడ్డంతా జీతగాళ్ళచేతిలో పెట్టేసినాడు. ఈ ముప్పై ఏండ్లలో ఆయన ఎప్పుడన్నా ఆ వంకదాటి ఈ గెడ్డమీదికి వొచ్చినాడా? మిమ్మల్ని తనికీ చేసినాడా? నేనే అప్పుడప్పుడు ఇట్టొచ్చి అట్ట తిరుక్కోని పోతా ఉండా. ఈ యానాది మిట్ట మీద వరి పండినా, చెరకు పండినా, రాగులు పండినా అంతా మీ చేతుల మీదనే జరగతా ఉండాది. ముప్పై ఏండ్లుగా ఈడ జరిగే పనంతా నీ చేతి మీదనే జరగతా ఉండాది,'' అని పందుంపుల్లను పారవేసి, పక్కకు తిరిగి తుప్పు తుప్పుమని ఉమిసి, ''నువ్వు ముప్పై ఏండ్లుగా చేసిన కష్టం పెదనాయుడు మర్చిపోయి నాడనుకోవద్దు. పొద్దున ఐద్రాబాదు నుండి రాంగానే నీ కతే ఎత్తినాడు. రాత్రి తెల్లవార్లూ కార్లో పయనం చేసి పొద్దుపుట్టేటప్పటికి ఊరుచేరినాడు. కారు దిగీ దిగంగానే నీ మాటే ఎత్తినాడు.'' అన్నాడు.

కోనిగాడు ఆశగా, ''ఏవి చెప్పినాడు సావి''. అన్నాడు.

2

ముత్యాలనాయుడు, ''చెప్తా ఉండు''. అని కాలువ గట్టుమీద చెప్పులను తువ్వాలను ఉంచి కాలువలోకి దిగాడు. నోరు, ముఖం కడుక్కుని, చేతులను మోచేతులదాకా, కాళ్ళను మోకాళ్ళదాక కడుక్కున్నాడు. ముఖం మీద నుండి నీళ్ళు కారుతుండగా తూర్పు వైపు తిరిగి ''సూర్యనమస్కారం'' చేశాడు. నోట్లోనే ఏదో గొణుక్కుంటూ, చెంపలు వేసుకున్నాడు.

తరవాత గట్టుకెక్కి తువ్వాలుతో ముఖం తుడుచుకుని, ''ఈ ఉడిగినేళ నీకొక దోవజేయాలని పెదనాయుడు తాపత్రయ పడతా ఉండాడురా, ఈ యానాది మిట్టన నీ పేరున ఒక యకరా పట్టాజేసిస్తానంటా ఉండాడు'' అన్నాడు.

కోనిగాడు నోరు తెరిచి కాసేపు అలాగే ఉండి, ''నాకా?పట్టాజేసిస్తాడంట నా?!'' అన్నాడు.

ముత్యాల నాయుడు, ''ఔన్రా నువ్వొప్పుకుంటే నేరుగా రిజస్ట్రారాఫీసుకు పోయి ఏలి ముద్దర్లు, సంతకాలు ఏసెయ్యడవే. నువ్వేవీ బెమ్మోళాలు చెయ్యాల్సిన పని లేదు. పడమటడివికి పోయి పులిపాలు పిండుకోని రానవసరం లేదు. నీ కొడుకుండాడే వాని పేరేందీ - పుల్లిగాడు ఆ వాణ్ణి పెద్దనాయుడి దగ్గర జీతగాడుగా పెట్టేయ్. నువ్వా పన్జేసినావంటే యానాది గెడ్డన యకరా

నీపరమైపోతుంది''. అని, బావి వైపు చేయి చూపిస్తూ ''సముద్రాలట్టా బావులంతాయి. ఏడేండ్లు కరువొచ్చినా నీళ్ళు అడ్డేలు జగ్గదు. ఇట్టాడి తావున యకరా సంపాదించినావంటే మల్ల నిన్ను కొట్టేటోడెవురు? ఒక జత గిత్తల్ను పెట్టుకున్నావంటే కాలు మీద కాలేసుకుని నీ నెత్తిన చెత్తెత్తేటోడు లేకుండా బతకొచ్చు'' అన్నాడు.

కోనిగాడు తన జబ్బల మీద చీమల పాకుతున్నట్టు, కుడిచేత్తో ఎడమ జబ్బమీద, ఎడమచేత్తో కుడి జబ్బ మీద గోక్కోసాగాడు.

ముత్యాల నాయుడు, ''కాసేరాకు తగిల్నట్టు గోక్కుంటా ఉండావేందిరా, నేన్జెప్పింది నీ కిష్టం లేకుంటే ఇప్పుడే చెప్పెయ్. పెదనాయుడికి చెప్పేస్తా. ఆయన నా కోసరం కాసుకోనుంటాడు''. అన్నాడు.

కోనిగాడు జబ్బలమీద గోక్కోవడం ఆపి, '' ఇష్టం లేదని ఎందుకంటాను సావి. తిరుపతి యంకటేస్సుడు మాదిర నాముందర నిల్చుకుని చెప్తె ఉంటే ఇష్టం లేదని యట్టంటాను సావి'' అన్నాడు.

''మరింగేవి. వెంటనే రమ్మని నీకొడుక్కు జాబురాయి. వాడిప్పుడు యాడుండాడు?''

''నీకు తెలవందే వుంది సావి. వాడు చెప్పకుండా, పెట్టకుండా ఊరిడ్చి పెట్టి ఆరవదేశం ఎల్లిపోయి సంవత్సరమయింది. ఇప్పుడు మదరాసులో ఉండాడంట. నేను జాబు రాస్తే వస్తాడో రాడో.''

''ఎందుకు రాడురా. వాడు నీ కొడుకు కాడా? నీకు పుట్టినోడు కాడా? వాడుగాక పోతే నీ మాట ఇంగెవుడింటాడు? ఇంతకూ నీ దగ్గర వాడి అడ్రసు ఉందా?''

''ఉంది సావి. వారం దినాల కింద ఇరవై రూపాయల మనియార్డరు గూడా చేసినాడు. అడ్రసు ఉంది సావి''.

''ఐతే నువ్వు నేరుగా ఊర్లోకి పో. నువ్వు పొయ్యేటప్పటికి గంట పదవుతుంది. తపాలోణ్ణడిగి కార్డు తీసుకుని రాయి. పో. పొయ్యి ముందా పన్నాడు.

కోనిగాడు బిరబిర గుడిసెలోకి వెళ్ళి, పై గుడ్డను తీసుకుని భుజం పైన వేసుకుని గనిమ వెంబడి ఏటివైపు నడవసాగాడు.

3

ముత్యాల నాయుడు కోనిగాడు కనుమరుగయ్యేదాకా చూస్తూ కాలువ గట్టు మీద నిలబడ్డాడు. తరవాత కాలవ గట్టు మీద అటూ ఇటూ పచార్లు చేయడం ప్రారంభించాడు. కొంత సేపటికి పచార్లు ఆపి అల్లంత దూరాన ఉన్న ఈత చెట్ల వైపు చూస్తూ, ''ఓరి ఈడి గోడా!'' అనరిచాడు .

ఒక ఈత చెట్టు మీద నిలబడి కల్లు దుత్తలను మారుస్తున్న ఈడిగవాడు, ''ఏంది సావీ'' అన్నాడు.

ముత్యాలనాయుడు, ''తేటగా ఉండేది ఒక దుత్త ఇట్ల పట్టుకురా'' అని అరచి మళ్ళీ పచార్లు చేయడం ప్రారంభించాడు.

కొంత సేపటికి ఈడిగవాడు ఒక కల్లు దుత్తను భుజం మీద పెట్టుకుని తీసుకొచ్చాడు. ముత్యాల నాయుడు దుత్తను అందుకుని దుంగ మీద కూర్చున్నాడు. దుత్తమూతి మీద తెల్లటి నురగ గోపురం వలె లేచి ఉంది. అతడు చూపుడు వ్రేలితో నురగను తీసి వేశాడు. నురగ కింద గండు చీమలు ఒక వరస పేరుకుని ఉన్నాయి.

ముత్యాల నాయుడు నిష్మరంగా చూస్తూ, ''ఇదేందిరా బెస్టునాకొడకా. దుత్త నిండా చీమలే ఉండేట్టుగా ఉంది'' అన్నాడు.

ఈడిగవాడు, ''నన్నేవి జెయ్యమంటావు సావి. ఈ చీమల్ను దుత్తలో నేనిడిస్తినా యట్ట. అవి గూడా మనుమల మాదిర్నే కైపెక్కే దాక తాగినాయి. అందులోనే పడి చచ్చినాయి'' అన్నాడు.

ముత్యాలనాయుడు అసహాయంగా చూస్తూ, ''జావు నేపు సూర్య నమస్కారం చేసినాన్రా, ఇప్పుడీ చీమల్ను మింగినానంటే ఆ పాతకం నీదే. నాది గాదు'' అన్నాడు.

ఈడిగవాడు, ''అట్లయితే మూతి కడ్డంగా గుడ్డ ఏసుకుని తాగు'' అని సలహా ఇచ్చాడు.

ముత్యాలనాయుడు తువ్వాలను దుత్తమూతికడ్డంగా పరచి, పైకెత్తి నోటికి కరిపించుకున్నాడు. ఒక్కసారిగా సగం దుత్తను ఖాళీ చేసి దుత్తను కింద పెట్టి, ''పొద్దు రొండు బారలన్నా ఎక్కలేదు. అప్పుడే పులిసి పోయింది గదరా, ఇది నిన్నటి సరుకా? ఈ పొద్దిటిదా?'' అన్నాడు.

ఈడిగ వాడు ''మొగోడైనోడు పులిసి పోయిందన్నే తాగాల సావి. తేటగా, ఉండేది ఈ కాలం ఆడోల్లు గూడా తాగరు'' అన్నాడు.

ఈలోగా ముత్యాల నాయుడికి ఎక్కిళ్ళు ప్రారంభమయ్యాయి. అతడు కాలువలోకి దిగి దోసిలితో నీళ్ళుతాగి తిరిగి వచ్చాడు.

ఈడిగవాడు ఈత చెట్ల వైపు చూస్తూ, '' ఇంగ నేను పోతాను సావి. ఓ పిన్నన్ని చెట్లు దించాల. తాగటం ఐనాక దుత్తను ఆడ పెట్టేయ్ సావి. నేనొచ్చి తీసకపోత'' అంటూ వెళ్ళిపోయాడు.

ముత్యాలనాయుడు మళ్ళీ దుంగ మీద కూర్చున్నాడు.

మరికొంత సేపటికి పెద్దనాయుడుగారి మరో జీతగాడు గనిమలమీద పడుతూ లేస్తూ ఇటే వస్తుండడం కనిపించింది. ముత్యాల నాయుడు సూర్యుని కిరణాల కడ్డంగా చేయి పెట్టుకుని చూడసాగాడు. జీతగాడు దగ్గరగా వచ్చాక ముత్యాలనాయుడు, '' ఇట్టొచ్చినావేందిరా. పొద్దు పుట్టక ముందే మిరప తోటకాడుండాల్సినోడివి. ఈడేవి జేస్తె ఉండావు'' అన్నాడు.

జీతగాడు గసపోసుకుంటూ, '' ఆడ్నించే వస్తె ఉండాను సావి, మిరపతోట కాడనుండే వస్తె ఉండాను. గుండాల బాయి కాడ నీళ్ళింజను కొత్తది పెట్టినారు గద సావి. గోపాలగాడు మిసన యిడ్సేదానికి వొచ్చినాడు. హాండిలు రెండుసార్లు తిప్పినాడు. అంతేసావి. చెయ్యిజారి పోయింది. ఇసరక పోయి బెల్టు మీద పడినాడు. ఆయాలకు ఇంజను స్టార్టయి పోయింది. బెల్టు గోపాలుగాడ్ని పంపు మీదకి ఇసిరి కొట్టింది. ఒక చెయ్యి ఇరిగి పోయింది సావి'' అన్నాడు.

ముత్యాలనాయుడు గబుక్కున దుంగ మీద నుండి లేచి, ''థూ పేగుల్లేని నా కొడుకులు. ఒక్కొక్కడు రావణాసురుడు మాది రుండాడు. పెట్రింజన్ను సమాళించలేరంట్రా. ఇప్పుడు గోపాలు గాడు యాడుండాడు?'' అనడిగాడు.

జీతగాడు, ''వానికి తెలివి తప్పి పోయింది సావి. ఎముక కండల్ను చీల్చుకొనొచ్చేసింది. పంపుకాడనే నాలుగు బళ్ళల రక్తం కారింది. వాడ్ని బండి మీదేసుకొని ఆసుపత్రికి తీసక పోయినారు సావి'' అన్నాడు.

ముత్యాల నాయుడు సహనం గోల్పోయినట్టు అరుస్తూ ''వాడు పోయి ఆస్పత్రిలో పడుకుంటే మిరప చెట్టుకు నీళ్ళెవడు పెడ్తాడంట? వాని పెండ్లాం పక్కన పడుకున్నోడు పెడ్తాడంటనా? అసలే ఎండకాలం. ఒక దినం తడి తప్పితే చెట్టు వాడాకు ఏసేస్తుంది. థూ. అడపాసు నాకొడుకులు. వొట్టి అడపాసు నాకొడుకులు'' అంటూ కల్లు దుత్తను ఒక తన్ను తన్నాడు. దుత్త పెళ్ళున పగిలి పెంకులు చెల్లా చెదరై పోయాయి.

4

యానాది మిట్టను ఆనుకుని ఒక వాగు ప్రవహిస్తూంది. వేసవి కాలం గనుక వాగు ఎండిపోయి అడుగున ఉన్న ఇసుక, గులకరాళ్ళు, నల్లగుండ్లు బయటపడి ఉన్నాయి. ఆ వారన మాత్రం సన్నటి ధార సళ సళమని చప్పుడు చేసుకుంటూ ప్రవహిస్తోంది.

కోనిగాడు యానాది మిట్టదిగి ఏట్లో ఇసుక మీద నడుస్తున్నాడు. రెండు దుత్తల కల్లు తాగి నంతగా అతని మనసు హుషారుగా ఉంది. అతడు దుడ్డు కర్రను మెడ వెనక భుజాల కడ్డంగా ఉంచుకుని దాని మీద రెండు చేతులు వేసుకుని నడుస్తున్నాడు. ఇసుకలోని దారిని వదలి నల్ల గుండ్ల మీద కెక్కి ఒక గుండు మీద నుంచి మరొక గుండు మీదకు చెంగు చెంగున దాటుతున్నాడు.

అలా నడుస్తూ అతడొక మడుగు చెంతకు వచ్చాడు. మడుగులో నీళ్ళు నిశ్చలనంగా ఉన్నాయి. ఏటి గట్టున ఉన్న చెట్ల నీడలు నీటిలో ప్రతిఫలిస్తున్నాయి. కోనిగాడు దుడ్డు కర్రను దించి పెట్టి, పల్చగా ఉన్న రాయిని చేతిలోకి తీసుకున్నాడు. నడుమును కుడివైపుకు వంచి, కుడిచేత్తో లాఘవంగా 'కప్పరాయి' విసిరాడు. రాయి నీటి మట్టం మీద చెంగు చెంగున ఎగురుతూ వెళ్ళి అవతలి గట్టు మీద పడింది. కోనిగాడు నీటి అంచు వద్దకు నడిచి నీళ్ళలో తన బింబాన్ని చూసుకున్నాడు. భుజం మీదున్న తుండుగుడ్డను తీసి తల మీద ఎడమవైపున కుచ్చు నిఠారుగా వచ్చేట్టుగా తలపాగ చుట్టుకున్నాడు. వంగిన మీసాలను పైకెత్తి మెలి తిప్పాడు. తలపాగా వల్లను, పైకి మెలితిప్పిన మీసాల వల్లను అతని ముఖం నీటి మట్టం మీద కడు రీవిగా కనబడింది. అతడు నడుం వాల్చి అలా తన నీడను చూస్తూండగా అతని పెదవుల చివరన చిరునవ్వు మెదిలింది. క్రమక్రమంగా అది పెద్దదయింది. అతడు పక పక నవ్వుతూ నడుమెత్తి నిలుచున్నాడు.

చాకలివాడు మైలబట్టల మూటను వీపువీద మోసుకుంటూ ఇసుక మీద నడిచి వస్తూండడం కనిపించింది. చాకలివాడు మడుగు చెంతకు వచ్చి '' ఏందిరా కోనిగా, నిలుకు లేకుండా నవ్వతా ఉండావు. రేపు గంగ పండగ వస్తె ఉండాది. పండక్కు కొంచెం దాచుకో.'' అన్నాడు.

కోనిగాడు, ''ఈ పొద్దిట్నుంచి నాకు దినావు పండగే మడి విలన్నా, ఇంగ నాకు బతికినంత కాలవూ పండగే'' అన్నాడు.

చాకలి వాడు బట్టల మూటను నీటి అంచు వద్ద దించి, ''ఏంది కత? యానాది మిట్టన లబ్బి దొరికిందా యట్ట?'' అనడిగాడు.

కోనిగాడు, ''లబ్బి దొరికితే ఏవిలాబవన్నా? అది ఈ పొద్దుంటుంది. రేపు పోతుంది.'' అని తలపాగా విప్పి మళ్ళీ భుజాన వేసుకుని, ''రేపు యానాది మిట్టన యకరా నేల నాకు పట్టా అవుతుంది. పెదనాయుడు పట్టా జేసిస్తాడంట'' అన్నాడు.

చాకలివాడు, ''యట్టిట్టా? పట్టాజేసిస్తాడం టనా? వెలకా? ఊరికేనా?'' అనడిగాడు.

''వెలకు కాదు ఊరికేనే.''

చాకలివాడు, ''తెల్లవారి లేసి సుక్కేను కున్నావంట్రా? పెద నాయుడేంది! యకరం నేల దానం చేసేదేంది? దేవలం పూజారి సంవత్సరం దినాలు సతాయిస్తే పెదనాయుడు గుడిమాన్యం కింద రొండెకరాలు దానివిచ్చి నాడు. పూజారి మీద దయబుట్టి గాదు, వొచ్చే జన్మలో పుణ్యమొస్తుందని. అట్టాటి మనిషి మాలోనికి యకరా నేల దానవిచ్చినాడంటే ఎవురునమ్ముతారు?'' అన్నాడు.

కోనిగాడు, ''పూజారికి దానవిస్తే వొచ్చే జన్మలో పుణ్యమొస్తుంది. మరి నేను పెద నాయుడ్ని ఈ జన్మలోనే సుఖపెడ్తిని గదా. జీతగాడుగా ఉండి ముప్పై ఏండ్లు యానాది మిట్టన వొళ్ళు గుల్ల చేసుకుంటిగదా. నాకు యకరా ఇస్తే దాంట్లో ఇచిత్రమేముంది'' అన్నాడు.

చాకలివాడు, ''ఐతే నువు చేసిన కష్టానికి పెదనాయుడు ఈనాం ఇస్తె ఉండాడంటావు. అట్టాజెప్పు''. అని వెనుదిరిగి సస్యశ్యామలంగా ఉన్న యానాది మిట్టను కలయజూసి, ''మ్. యానాది మిట్టంటే దిక్కులకు పెక్కాసి కెక్కిన నేల. ఇట్టాంటి తావున యకరా సంపాదించినావంటే నువు రొండు జేతులా పుణ్యం జేసుకున్నోడివురా'' అన్నాడు.

కోనిగాడు పండ్లికిలిస్తూ, ''ఆమాటే మా దొర గూడా చెప్పినాడు. ఒక యకరా నేల పెట్టుకుని, జతగిత్తల్ను పెట్టుకుంటే మల్ల నా నెత్తిన చెత్త ఎత్తేటోడు లేడు'' అన్నాడు.

చాకలి వాడు ''ఔ నెత్తిన చెత్తెత్తేటోడుం డడు. కాలుమీద కాలేసుకుని బతకొచ్చు.'' అని కోనిగాడిని ఆపాదమస్తకం చూసి, ''మాలోడుగా పుడ్తివి. మాలోడుగా పెరిగితివి. ఈ పొద్దిటికి కాపోళ్ళలో జవయితివి.'' అన్నాడు.

కోనిగాడు తన సంతోషాన్ని ఆపుకోలేక అలాగే పండ్లికిలించసాగాడు.

చాకలివాడు బట్టల మూటను విప్పుతూ, ''మీ బతుకులే మేలు. గవుర్మెంటోని సత్తు తినేదానికైనా, రైతుల సత్తు తినేదానికైనా మాల్లకు రద్దే. మా బతుకుల్దూడు. తాతల కాలం నుంచి ఈ మడుగు కాడనే ఊరోల్ల ముట్టుకోకలు ఉతకతా ఉండాం. ఈ బతుకులు ఇట్ట తెల్లారి పోవాల్సిందే'' అన్నాడు.

5

కోనిగాడు పాగడ చెట్టు కింద నేలమీద కూర్చుని ఉన్నాడు. పాగడ చెట్టునానుకుని తపాలాఫీసు ఉంది. తపాలాఫీసు కిటికీ కింద సిమెంటు అరుగు ఉన్నది. కిటికీకి ఒకవైపున గోడకు ఎర్రటి తపాల పెట్టె వ్రేలాడుతూంది. మరొక వైపున సినిమా పోస్టరు అతికించబడి ఉంది.

కోనిగాడు పోస్టాఫీసు ముందర కూర్చుని ఉన్నాడేగాని, అతని మనసంతా యానాది మిట్ట పైననే ఉన్నది. రేపు తనకు స్వంతం కాబోయే యకరా నేలను గురించి అతడు ఆలోచిస్తున్నాడు. రేపటి నుంచి తను గూడా రైతుకిందే లెక్క. అదిగో! తను యకరం నేలలో నాగలి కట్టి దున్నుతున్నాడు. తను ఇన్నాళ్ళు జీతగాడుగా ఉన్నప్పుడు నాగలి దున్నిన తీరు వేరు. ఇప్పుడు రైతుగా నాగలి దున్నుతున్న తీరువేరు. ఇప్పుడీ భూమి తనది. ఈ నాగలి తనది. ఈ గిత్తలు తనవి. తను మాటిమాటికి తల పైకెత్తి పొద్దు ఎంత ఎక్కింది – అని ఆకాశం వైపు చూడడం లేదు. నాగలి తన అంగాంగాలలో ఒకటైనట్టు గాను, తానొక యజ్ఞం సాగిస్తున్నట్టుగానూ భావిస్తూ దీక్షగా, శ్రద్ధగా దున్నుతున్నాడు. నాగటి చాళ్ళలో కొండ్రలలో అతని దీక్ష, శ్రద్ధ కనిపిస్తున్నది. తొలి దుక్కి ముగిసేటప్పటికి నేల ఉపరితలం రెండు జానల లోతు పిండి పిండి అయిపోయింది. అదిగో! తను తలపాగా చుట్టుకుని, చుట్టకాలుస్తూ రచ్చబండమీద కూర్చుని ఉన్నాడు. చెరువులో నీటిమట్టం గురించి, ఎండ తీవ్రత వలన చెరకు ననలు వాడిపోవడం గురించి, మంచు తాకిడి మూలాన మిరపచెట్ల పూత రాలిపోవడం గురించి రైతులు సాగిస్తున్న చర్చలలో తను పాల్గొంటున్నాడు.

ట్రింగ్ ట్రింగ్ మన్న సైకిలు బెల్లు శబ్దం విని కోనిగాడు తల పైకెత్తాడు. పోస్టుమాస్టరు సైకిలు మీద గరుత్మంతుడిలా దూసుకుని వస్తున్నాడు. అతడు పాగడ చెట్టుకింద సైకిలు దిగి స్టాండు వేశాడు.

కోనిగాడు పైకి లేచి, ''దండం సావి. జావుసేపట్నుంచి నీకోసరం దేవజూస్తా ఉండా.'' అన్నాడు.

పోస్టుమాస్టరు తపాల పెట్టె తాళం తెరుస్తూ, ''ఏంది కత? నీ కొడుక్కు జాబు రాయాలా?'' అన్నాడు.

''ఔను సావి.''

పోస్టుమాన్ పెట్టెలో నుండి ఉత్తరాలను బయటకు తీసి, ''మొన్ననే రాస్తివి గదరా. వాడు మనియార్డరు పంపినప్పుడు రాస్తివిగద. ఇంతలో ఏమొచ్చింది?'' అన్నాడు.

కోనిగాడు ''మళ్లీ పనిబడింది సావి. అర్జంటుగా మావోడ్ని పిలిపించాల'' అన్నాడు.

పోస్టుమాస్టరు చేతిలోని ఉత్తరాలను లెక్క పెట్టుకుంటూ లోపలకు వెళ్ళి టేబిలు మీద పడేశాడు. టేబిలు డ్రాయరులాగి రెండు పెద్ద రిజస్టర్లను, ఇతర సామగ్రిని తీసి టేబిలుమీద పెట్టి మళ్ళీ గుమ్మం వద్ద నిల్చున్నాడు. వీధి చివరిదాక దృష్టిసారించి, తరవాత తన ముంజేతికి ఉన్న గడియారాన్ని చూసుకుని తనలో తాను అనుకుంటు న్నట్టు, ''గంట పదిన్నర అయింది. ఈ రన్నరు ముండ కొడుకు ఇంగారాలేదు. వాడు తపాల సంచి తెచ్చేదెప్పుడు? నేను పని ముగించుకుని కొంపజేరేదెప్పుడు?'' అన్నాడు.

కోనిగాడు తిన్నె చెంతకు నడిచి, ''ఆ మనిషి వొచ్చేలోగా నా జాబు రాసి పెట్టునావి'' అన్నాడు.

పోస్టుమాస్టరు మళ్ళీ తనలో తాను అనుకుంటున్నట్టు, ''అదీ నిజమే. ఊరికే ఉండే దానికన్నా ఊగులాడేది మేలంట'' అని, లోపలకు వెళ్ళి ఒక పోస్టుకార్డును పట్టుకొచ్చాడు. అతడు తిన్నెమీద కూర్చుని ''ఇరవై పైసలిస్తావా దీన్ని గూడా గాంధీ లెక్కల్లో రాసుకోమంటావా?'' అన్నాడు.

కోనిగాడు ''ఇరవైపైసలు నా దగ్గర యాడుండాయి. కాతాలో రాసుకో సావీ. మావోడొచ్చినాక అంత ఒకేసారి ఇచ్చేస్తా'' అన్నాడు.

పోస్టుమాస్టరు ''ఏవని నీ కొడుకు అరవదేశం పోయినాడో ఆ పొద్దుట్నుంచీ ఈ మాటే అంటా ఉండావు. వారానికి ఇరవైపైసలు కాతా పుస్తకంలో ఎక్కిస్తా ఉండావు'' అన్నాడు.

కోనిగాడు ''ఇదే ఆకీరు జాబు సావి. ఇంగ మళ్లి మళ్లీ రాసే పనే ఉండదు'' అన్నాడు.

పోస్టుమాస్టరు పెన్ను తీసుకోవడానికై పై కెత్తిన చేయి కిందకు దించి ఆశ్చర్యంగా ''అదేందిరో!'' అన్నాడు.

''ఔ సావి, మావాడు ఈసారి వొస్తే ఇంగ ఇట్టనే ఉండిపోతాడు సావి. ఈ పొద్దిటికి యంగటేస్వర సావి మాపాలొచ్చినాడు....'' అంటూ ప్రారంభించి ఉదయం తనకూ, ముత్యాల నాయుడికీ మధ్య జరిగిన ఒప్పందాన్ని వివరించి చెప్పాడు.

పోస్టుమాస్టరు అంతావిని, అతడిని మెచ్చుకోలు దృక్కులతో చూస్తూ ''మ్ మాలోడివై పుడితివిగాని నీ వంటిమీద యాడనో పారకసుడి ఉండాదిరా. అదుండబట్టే నీకు కయ్యాలు సంపాదించే యోగం పట్టింది'' అని దీర్ఘంగా నిట్టూర్చి, ''యానాది మిట్టంటే అది ఒకిటో రకం నేల. అట్టాటి తావున యకరా సంపాదించటం చిన్న మాట కాదు. ఈ కత తెలిస్తే నీ కొడుకు రెక్కలు గట్టుకోనొచ్చేస్తాడు.'' అన్నాడు.

కోనిగాడు ''నేను కయ్యా కాలవా సంపాదించలేదనే కోపంతోనే వాడు ఊరిడ్సి పెట్టినాడు సావి. నాతో చెప్పకుండా పెట్టకుండా ఊరిడ్సి పెట్టిపోయినాడోడి మాదిరి బతకతా ఉండాడు. నేను ఉడిగి మూలబడితి. చస్తే తలకొరివి పెట్టేదానిగ్గూడ వాడు వస్తాడో రాడో అనుకుంటా ఉంటి. యంగటేస్వరసామికి నా గోడు యినపడింది సావి. ఇంగ మావోడు కట్టుగొత్తు కాడ, గొడ్డుమాదిరి ఇంట్లోనే పడుంటాడు'' అన్నాడు.

పోస్టుమాస్టరు తిన్నె మీద గోడకానుకుని కూర్చుని జేబులో నుండి పెన్ను తీసుకుని కార్డుమీద తారీఖు, ఊరి పేరు రాసి, '' ఊ చెప్పు, ఏవి రాయమంటావు అన్నాడు.

కోనిగాడు మళ్ళీ నేలమీద కూర్చుని ''జాస్తిగా ఏ వీ రాయొద్దు సావి. జాబు చూసిన తచ్చనం బయల్దేరి రమ్మని రాయి సావి. యకరా నేల కతగూడ రాయొద్దు. జాబు సూడంగానే గుడ్డా, గుసురు ఎత్తుకోని యల బారొచ్చేయ్యే మని రాయి సావి'' అన్నాడు.

పోస్టుమాస్టరు కార్డును తొడమీదుంచుకొని రాయసాగాడు. కోనిగాడు చేతులు పిసుక్కుంటూ కార్డువైపు చూడసాగాడు.

పోస్టుమాస్టరు రాయడం ముగించి, ''రాసింది చదవతా యిను'' అని కార్డులోకి చూస్తూ చదివాడు:

''ప్రియ కుమారుడైన పుల్లిగానికి తండ్రి కోనిగాడు దీవించి రాయించిన విషయార్థము లేమనగా-

ఈ జాబు చూసిన తక్షణం బయలుదేరి నీవు మన ఊరికి రావలెను. ఏవో రాసినాడని తాచ్చారం చెయ్యక వెంటనే బయలుదేరవలెను మిగతావిషయములు నేరుగా మాట్లాడు కొందుము.

ఇట్లు నీ తండ్రి''

అతడలా చదివి ముగింగానే కోనిగాడు, ''అంతే సావి, అజ్జాలు. ముద్దర కొట్టి పంపించెయ్ సావి'' అన్నాడు.

తరవాత కోనిగాడు వీధి చివరి వైపు దృష్టి సారించి నిరాశగా ''తపాల కట్టతెచ్చే మనిషి ఇంగా రాలేదు సావి. సదువుకున్నోల్లుగూడా ఏటయానికి చెయ్యాల్సిన పని ఆ టయానికి చెయ్యకపోతే యట్ట సావి'' అన్నాడు.

పోస్టు మాస్టరు విసుగ్గా ''యట్టంటే నన్నేవి చెప్పమంటావు. సదువుకున్నో డైతేనేవి, సదువు లేనోడైతేనేవి. కూలికి చేసే పన్లన్నీ అట్టనే ఉంటాయి'' అన్నాడు.

కోనిగాడు అలాగే కాసేపు కూర్చుని లేచి సాగబారబోయి ఆగి, ''ఈ జాబు మావేనికి చేరేదానికి ఎన్ని దినాలు పట్తుంది సావి'' అన్నాడు.

''యట్ట లేదన్నా రొండుదినాలు పడ్తుంది. ఈ పొద్దు సోమవారం కద బుధవారం మధ్యాహ్నానికి చేరుతుంది''.

కోనిగాడు ''మావోడు ఆడ బయల్దేరితే ఈడకు చేరేదానికి ఎన్ని దినాలు పడుతుంది సావి'' అన్నాడు.

''జాబు సూడంగానే బయల్దేరితే రైల్లో వచ్చినా, బస్సులో వచ్చినా బుధవారం పొద్దుపోయేటప్పటికి మనూర్లో ఉంటాడు. మదరాసంతా ఎంతరా- ఈడకు నూటపది మైళ్ళే కదా''.

కోనిగాడు కాసేపు నేలకేసి చూస్తూ నిలబడి ''మావోడు వచ్చేలోగా తిరపతికి పోయి రావాలనుకుంటా ఉండాను సావి. తిరపతికి పోయి సావి దర్శనం చేసుకుని తలనీలాలిచ్చి రావాలనుకుంటా ఉండా'' అన్నాడు.

పోస్టుమాస్టరు, ''ఔ. మనిషి ఏవి సంపాదించినా ఎంత సంపాదించినా దేవున్ని నాబిలో పెట్టుకోవాల. దేవుని మీద చెత్త ఏసేస్తే చేతి కొచ్చింది నోటికి రాకుండా పోతుంది'' అని తిన్నె దిగి ''ఇంగేవి. బయల్దేరు- ఇప్పుడు బయల్దేరి నావంటి సావి దర్శనం చేసుకుని రేపు పొద్దు పోయేలోగా తిరుక్కోనొచ్చేయచ్చు'' అన్నాడు.

6

ఒక లారీ తారురోడ్డు మీద పరుగిడుతూ వుంది. దాని నుదుట ''తిరుమగళ్ ట్రాన్స్‌పోర్ట్స్'' అని రాసి వుంది. డ్రైవరు విసుగును పారదోలేందుకై ఈల వేస్తూ స్టీరింగు చక్రాన్ని తిప్పుతున్నాడు. కాబిన్‌లో ఆ చివరన వెనక్కు జారగిలబడి క్లీనరు నిద్రపోతున్నాడు.

వారిద్దరి మధ్య ఒక యువకుడు కూర్చుని వున్నాడు. అతని ముఖంలో నిద్రచ్ఛాయలుగాని, విసుగు గాని లేవు. అతని ముఖంలో ఆందోళన వుంది.

డ్రైవరు కిలోమీటరు రీడింగ్ వైపొకసారి చూసి, యువకుని వైపు తిరిగి కళ్ళెగరవేశాడు.

యువకుడు ''ఇంగా పోవాలన్నా'' అన్నాడు.

డ్రైవరు, ''బయల్దేరినప్పటి నుంచి ఈ మాటే అంటా వుండావు. మద్రాసులో బయలు దేరేటప్పుడు యాభైమైళ్ళుంటవి. ఇప్పటికే తొంబై మైళ్ళొచ్చినాం'' అన్నాడు.

యువకుడు, ''నాకేవి తెల్సన్నా. సదువురాని ముండాకొడుకును. ఎన్నిమైళ్ళో సుక్కపెట్టినట్టు నాకెట్ట తెలుస్తుంది'' అన్నాడు.

డ్రైవరు, ''ఈ మాట బస్సోనితో అంటే వింటాడా? మెడబట్టి గెంటేస్తాడు'' అన్నాడు.

యువకుడు ముఖంలో భయం కదులాడుతుండగా, ''నువ్వట్టా పనిచెయ్యొద్దన్నా, నువ్వట్టా పన్జేస్తే నేను నట్టేట్లో మునిగినట్టే. ఇంగొక గెడిసేపిటికి మావూరొచ్చేస్తుంది. నీ పేరు చెప్పుకుంటా. నన్ను మావూరు కాడదింపెయ్'' అన్నాడు.

డ్రైవరు ఫకాలున నవ్వి, ''దీనికే ఈ మాదిరి అడుక్కోవాల్నా. ఎర్రోడా. నేనేవి నాకోసరం తనీగా ఇంజనుకు డీజిలు పోస్తానా? నీ కోసరం తనీగా

చక్రాలకు గ్రీసు ఏస్తానా? ఈ లారీ ఇదే రోడ్డు మీద బెంగుళూరు దాక పోతుంది. నీకిష్టవొచ్చిన తావున దిగు'' అన్నాడు.

డ్రైవరు మళ్ళీ ఈల వేస్తూ స్టీరింగును తిప్పసాగాడు. కొంత సేపటికి అతనికా ఈలపాట గూడా విసుగనిపించింది. అతడు ఎడమ చేతిని చాచి తనముందున్న సొరుగు లాగి సిగరెట్టు పెట్టెను, అగ్గిపెట్టెను తీసుకున్నాడు. బండిని సెకెండ్‌గేర్ లోకి తీసుకొచ్చి, స్టీరింగ్ చక్రాన్ని వదిలేసి, రెండు చేతులతో సిగరెట్టును, ముట్టించుకోసాగాడు. లారీ క్రమంగా తారురోడ్డును వదిలి, ఇసుక మీద చెట్లను వొరుసుకుంటు పరుగెత్తసాగింది.

యువకుడు భయంతో కనుగుడ్లను తిప్పుతూ, ''చక్రం పట్టుకో అన్నా. చక్రం పట్టుకో. బండి యాడనో పోతా ఉంది'' అన్నాడు.

డ్రైవరు అగ్గిపుల్లను కిటికీ గుండా బయటకు విసిరి, స్టీరింగును పట్టుకుని లారీని తారురోడ్డు మీదకు తీసుకొచ్చాడు. గుప్పున పొగ వదిలి యువకునితో, ''మీ అయ్యకు నువ్వు ఒకడవే కొడుకా యట్ట'' అన్నాడు.

యువకుడు భయం తీరి సన్నగా నవ్వుతూ, ''అవునన్నా. నువ్వు చక్రం వొదిలెయ్యంగానే నాపానం తల్లబిల్లిపోయింది. పానం మీది కొచ్చే పన్లు చేసేదేవిటికన్నా. యాదన్నా సెట్టుకింద ఆపేసి తీరుబాటుగా సిగరెట్టు కాల్చుకొని యలబార్తే పోలా'' అన్నాడు.

డ్రైవరు, ''బండి సొంతనిది అయితే ఆపనే చేద్దును. ఇది కంపెనీ బండి. టయ్యానికి తావు చేరకుంటే కంపెనీ వోడు పంచాయితీ పెడ్తాడు. డూప్టింగు ఆర్డరు చేతిలో పెట్టి ఇంటికి పొమ్మంటాడు. నేను దిగితే నానీట్లో కూసునే దానికి ఈచనం యాభైమంది రడీగా ఉన్నారు'' అన్నాడు.

యువకుడు విరాగివలె నవ్వి, ''మన బతుకులే అంత. మనవి అడుమానం పెట్టేసిన బతుకులు'' అన్నాడు.

డ్రైవరు సిగరెట్టు చివరన ఉన్న బూడిదను రాల్చి, ''నువ్వేవి పనిచేస్తె ఉండావు?'' అన్నాడు.

యువకుడు,''పట్నంలో బిల్డింగులు కట్టేతావున పన్జేస్తె ఉండనన్నా. దినానికి ఇరవై రూపాయలు చేతిలో పడ్తాయి. మిగిలేదీ, మిట్టన పడేదీ లేదు. మిగలెయ్యాలంటే కడుపు యండగట్టాల కడుపు యండగట్తే పన్జేసేదానికి సత్త యాడ్నుంచి వస్తుంది. అడిగినంత పని చూపించకుంటే కంట్రాక్టరోడు లిస్టులోంచి

పేరు తీసేస్తాడు. ప్చ్. మనవన్నీ అడుమానం పెట్టేసిన బతుకులే నన్నా'' అన్నాడు.

డ్రైవరు సైడు మిర్రర్‌లోకి చూస్తూ, బండిని పక్కకు పట్టిస్తూ, ''ఈ మాత్రపుబతుకు ఉండూర్లోనే బతక లేక పోతివా?'' అన్నాడు.

యువకుడు, ''ఊర్లోనే ఉంటే ఏవి అడ్డం పెట్టుకుని బతకాలన్నా? చేతమంటే పనిదొరకదు. పనిదొరికితే కూలి గిట్టదు'' అన్నాడు.

లారీ పక్క గుండా ఒక కారు సర్రున దూసుకు పోయింది. డ్రైవరు లారీని తారురోడ్డు మీదకు తీసుకొచ్చి ''మీ అయ్య కయ్యా, కాలవా సంపాదించ లేదా?'' అన్నాడు.

యువకుడు, ''కయ్యా లేదు. కాలవాలేదు. నాకు బుద్ధి తెల్సినప్పట్నుంచి గొడ్డు మాదిర కష్టపడతా ఉండాడు. ఎంత కష్టపడినా, ఎంత గోజారినా తమలపాకు తొడిమంత మిగలాటం లేదు'' అన్నాడు.

డ్రైవరు, ''ఏవి పనిజేస్తె ఉండాడు?'' అన్నాడు.

యువకుడు, ''మా పెదనాయుడి దగ్గర జీతగాడుగా ఉండాడన్నా. ముప్పై ఏండ్లనుంచి ఆ రానీ పోని కొలువు చేస్తె ఉండాడు. ఈ నాటికీ నాలుగడ్డేళ్ళ గోచి పాత తప్ప ఒంటి మీద ఇంగొకటి కట్టింది లేదు. ఒట్టి పిండి సంగటి తప్ప కడుపులోకి ఇంగొకటి పొయ్యింది లేదు''. అని దీర్ఘంగా నిట్టూర్చి, ''ఎప్పుడో ఓబుకాలాన పెద నాయుడి దగ్గర ఎనిమిది నూర్లు అప్పు తీసుకున్నాడంట. అద్దీర్స లేక ఈ సచ్చీసావని బతుకు బతకత ఉండాడు. అప్పు తీరింది లేదుగాని, ఈడు మాత్రం ముసిలోడై మూలబడి పోతా ఉండాడు'' అన్నాడు.

డ్రైవరు చివరిదాకా కాలిన సిగరెట్టును బయటపడేసి, కాసేపు మౌనంగా ఉండి, ''ఔ. నువు చెప్పింది నిజం. మనవన్నీ అడుమానం పెట్టేసిన బతుకులు'' అన్నాడు. అతడు రోడ్డు మీద దృష్టిని కేంద్రీకృతం చేసి లారీని నడపసాగాడు.

యువకుడు బండ బారిన తన చేతి వేళ్ళను పిసుక్కుంటూ, ''మా అయ్య జాబు రాయించి నాడన్నా. అర్జంటుగా యలబారి రమ్మని రాసినాడు. జాబు చేతిలో పడినప్పట్నుంచి నాకు దిక్కు తెలవాటం లేదు. ఇంటికాడ యట్టుందో ఏవో'' అన్నాడు.

డ్రైవరు, ''యట్టనో ఉండేదేంది. మీ అయ్య ఏవి అడివిలో ఉండాడా''.

అని తల తిప్పి యువకుడిని ఉత్సాహపరచడానికి ప్రయత్నిస్తూ ''నీకు పెండ్లి పెట్టుకోనుంటాడు. పిల్లను చూసుకునే దానికి రమ్మనుంటాడు'' అన్నాడు.

యువకుడు, ''ఈ బతుక్కు అదొక్కటే తక్కువ. మిగలేసేది, ఉడ్డేసేది లేకపోయినా ఇప్పుడు మూడుపూట్ల తిండికి గడిసి పోతాండాది. ఆ పెండ్లావనే దాన్ని తగిలించుకుంటే ఇంగ పూటలు మారి పోతాయి'' అన్నాడు.

డ్రైవరు అతడన్నది వినిపించుకోకుండా, ''నేన్జెప్పింది రైటో కాదో ఇంటికి పోయినాక సూసుకో. నీ అయ్యకు వయసుడిగి పోయిందంటివి గదా. సచ్చేముందు నిన్నొక యింటోడ్ని చేద్దావనుకోనుంటాడు. పేరు బలాలు చూసుకుని మూర్తం పెట్టుకునే దానికి రమ్మనుంటాడు'' అని, ''నీ పేరేందో'' అనడిగాడు.

యువకుడు, ''పుల్లి గాడన్నా'' అన్నాడు.

డ్రైవరు సావధానంగా వినడానికన్నట్టు తల పక్కకు వాల్చి, ''పులిగాడా? పుల్లిగాడా?'' అనడిగాడు.

యువకుడు ఇంజను శబ్దాన్ని అధిగమించేట్టుగ గొంతు పెంచి, ''పుల్లిగాడు'' అన్నాడు.

డ్రైవరు. ''అదేం పేరు. ఇచిత్రంగా ఉండాది. ఇట్టా పేరు యాడా ఇన్లేదు'' అన్నాడు.

పుల్లిగాడు, ''అది మా అయ్య పెట్టిన పేరన్నా. దిబ్బలో పారేసే ఎంగిలిస్తరాకును పుల్లాకు అంటారు. నాకు ఒక అక్క, ముగ్గురు అన్నలుండి నారంట. నేను పసిబిడ్డగా ఉండేటప్పుడు మా యింట్లో వాళ్ళకేదో రోగవొచ్చింది ఇంకేవి రోగం? తిండిలేని రోగవే. ఒకే సంవత్సరంలో నా తల్లితో బాటు, నా తోడబుట్టిన వాళ్లందరూ-మొత్తం ఐదుమంది రాలి పోయినారంట. మా అయ్య, నేను మాత్రం మిగిల్నాం. నేనొకణ్ణన్నా బతికి చెట్టుగట్టేట్టు చూడమని మా అయ్య బాట గంగమ్మకు మొక్కు కున్నాడంట. బాట గంగమ్మ పూనకం వచ్చి యినేదానికి ఆసింకంగా ఉండే పేరు గనక మీ వాడికి పెడితే వాణ్ణి నేను కాపాడుకుంటా అని వాక్కు ఇచ్చింది. ఆ పకారవే మా అయ్య నాకు పుల్లాకు అని పేరు పెట్టేసినాడు'' అన్నాడు.

డ్రైవరు ఏదో చెప్ప బోగా ఇంతలో ఒక గొర్రెల మంద రోడ్డును దాటుతూ కనిపించింది. అతడు హారన్ మ్రోగిస్తూ, బండిని మందగమనంతో నడిపించసాగాడు. గొర్రెల మందను దాటుకున్న తరవాత అతడు తన ముంజేతి

గడియారాన్ని చూసుకుని ''ఓరి దీనమ్మ. అప్పుడే ఐదయింది. ఈ పాటికి నేను పలమనేరు దాటి ఉండాల్సింది'' అంటూ గేర్ మార్చి ఆక్సిలేటరు తొక్కాడు.

లారీ శర వేగంతో పరుగెత్త సాగింది. వెనక నుండి వచ్చే బండ్లకు సైడు ఇవ్వకుండా, ఎదురుగా వచ్చే బండ్లను వొడుపుగా తప్పించుకుంటూ అది సాగుతున్నది. చెట్లు, వంతెనలు, కొండలు వెనక బడుతున్నాయి.

కొంత సేపటికి పుల్లిగాడు సీటుమీద నిఠారుగా కూర్చుని, అద్దం గుండా దూరంగా చూపిస్తూ, ''అద్దో ఆడ కనపడతా ఉండాది సూడన్నా. అదే మోకాళ్ల కొండ. కొండ కిందనే మావూరు'' అన్నాడు.

7

పుల్లిగాడు రోడ్డుదిగి మాలపల్లి వైపుగా నడవసాగాడు. గత నాలుగైదు గంటలుగా హోరుమని చప్పుడు చేస్తుండిన లారీలో కూర్చుని ఉండడం వల్ల అతని తల దిమ్ముగా ఉంది. అతడు తలను ఒకసారి విదిలించి, జనపనార సంచిని భుజానవేసుకుని పెద్ద పెద్ద అంగలేసుకుంటూ నడవసాగాడు.

అతడలా కొంతదూరం నడిచి బొంతజెముడు పొదవద్ద మలుపు తిరిగాడు. అప్రయత్నంగా అతని నడక ఆగిపోయింది. అతడు నోరు వెళ్ళ బెట్టుకుని చూడసాగాడు. అతడు పుట్టి పెరిగిన హరిజనవాడ పూర్తిగా మారిపోయింది. మట్టి గోడలతోను, తాటాకు కప్పులతోను ఉండిన గుడిసెలన్నీ మాయమై పోయాయి. వాటి స్థానంలో బొమ్మరిండ్లవంటి ముచ్చటైన ఇండ్లు నిలబడి ఉన్నాయి. వాటి గోడలు ఇటుక రాళ్ళతోను, వైకప్పులు మంగుళూరు పెంకులతోను నిర్మింపబడి ఉన్నాయి. అగ్గిపెట్టెలవలె ఉన్న ఆ యిండ్లు వరుసలు వరుసలుగా ఉన్నాయి. వీధులు నేర్పరియైన రైతుకొండ్రవేసినట్లు తిన్నగా ఉన్నాయి. వీధుల వెంబడి విద్యుద్దీపాలున్నాయి.

పుల్లిగాడు బొంతజెముడు పొదవద్ద అలాగే నిలబడిపోయాడు. హరిజనవాడ అంచున ఒక విప్పచెట్టు ఉంది. విప్పచెట్టు కింద తలారివాడు, మరొక అపరిచితుడు కూర్చుని ఉన్నారు.

పుల్లిగాడు జనపనార సంచిని పక్కకు ఊగించుకుంటూ మెల్లగా విప్పచెట్టువైపు నడిచాడు. విప్పచెట్టు కిందున్న వాళ్ళిద్దరు సాయంత్రపు సూర్యకిరణాల కడ్డంగా చేతులడ్డం పెట్టుకుని పుల్లిగాడిని చూడసాగారు. అతడు దగ్గరగా వచ్చాక

తలారివాడు, ''నువ్వంట్రా పుల్లిగా, కాకి చెడ్డీ ఏసుకోనొస్తా ఉంటే నేనింగా ఎవురోపోలీసోడనుకుంటి, ఇదేనంట్రా రావటం?''. అన్నాడు.

పుల్లిగాడు దగ్గరకు వచ్చి ''ఇదే రావటం మావా. రోడ్డుకాడ లారీ దిగి నేరుగా వస్తా ఉండా. నువ్వు బాగుండావా మావా?'' అన్నాడు.

తలారివాడు, ''ఏదో ఇట్టుండా, కూలిచేస్తే కుండకాలె, లేకపోతే ఎండకాలె'' అన్నాడు.

పుల్లిగాడు హరిజన వాడవైపు చూస్తూ ''ఊరంతా మారిపోయింది గదమావా. ఎప్పుడు జరిగినాయి యివన్నీ?'' అనడిగాడు.

తలారివాడు ''గవుర్మెంటోడు చేసినాడు. కుటింబరాని కొగిటి లెక్కన ఇండ్లు కట్టించినాడు. ఇండ్లముందర నాటుకునేదానికి తైలం చెట్లిచ్చినాడు. ఈదీదికి నీళ్ల కొళాయిలు పెట్టించినాడు. ఈదులమ్మిడి కరెంటు దీపాలు పెట్టించినాడు. మ్. ఇంగా ఏవే చేస్తాడో'' అని తలెత్తి, ''నిలబడే ఉండావు, ఇట్లకూసో'' అన్నాడు.

పుల్లిగాడు కూర్చోకుండా ''నేనుపోతా మావా. మా అయ్య ఎట్టుండాడో సూడాల'' అన్నాడు.

తలారివాడు ''మీ అయ్య ఇంట్లో యాడుండాడు. నిన్న తిరపతికి పోయినాడు. నిన్న మావిటేళ బయలుదేరి పోయినాడు'' అన్నాడు.

పుల్లిగాడు ''ఎట్టిట్టా!?'' అన్నాడు.

తలారివాడు, ''సావి దర్శనం చేసుకుని తలనీలాలిచ్చి రావాలని నిన్ననే యలబారి పోయినాడు. నువ్వు ఒక దినం ముందుగా రావాల్సింది'' అన్నాడు.

పుల్లిగాడు రుసరుసలాడుతూ, ''నా కేవిదెల్సు. అర్జంటుగా యలబారి రమ్మని జాబురాసినాడు. ఈ పొద్దు మద్దానానికి జాబు నా చేతిలో పడింది. వాడ్నీ, ఈడ్నీ గిరంసెడి యాబైరూపాయలు అప్పుదీసుకుని గుడ్డగుసురు సర్దుకుని లారీలో పడొచ్చినా. నన్నిట్టరమ్మని ఈడు తిరపతి కేవిటికి పాయ్యినట్టు, కుందేల్ను లేవదోలేసి కుక్క ఏదో సేసేదానికి పాయిందంట. అట్లుంది మా ముసిళోడు చేసిన పని'' అన్నాడు.

తలారివాడు, ''పోయినోడేవి అట్టనే పోతాడా? సావి దర్శనం చేసుకోని తిరుక్కొనొచ్చేస్తాడు. ఈ పొద్దో రేపో కాళ్లుచాపేస్తాడు. చచ్చేముందు పాపం పుణ్యం కంళ్లజూడనీ, నువ్విట్టకూసో'' అన్నాడు.

పుల్లిగాడు అయిష్టంగ విప్పచెట్టుకింద కూర్చున్నాడు. అపరిచితుడు తలారివానికి కాస్త చేరువగా జరిగి, ''ఈ పిలగోడు ఎవురన్నావు?'' అనడిగాడు.

తలారివాడు, ''మావూరి పిలగోడే, ఊరిడ్చి పెట్టిపోయి సంవత్సరమయింది. అరవరాజ్జింపోయి పొట్టపోసుకుంటా ఉండాడు''. అని పుల్లిగాని వైపుతిరిగి, ''అరవ రాజ్జింలో ఏవి జేస్తే ఉండావురా? ఏదైనా ఉద్యోగవా'' అన్నాడు.

పుల్లిగాడు నోరు చప్పరించి, ''ఉద్యోగాలు చేసే బగిసి మనకు యాడిది మావా. బిల్డింగులు కట్టేతావున ఇటికి రాళ్ళు, ఇసుక బస్తాలు మోస్తా ఉండా,'' అన్నాడు.

''వరుమానం బాగుందే వో''.

''వరుమానమూ లేదు, వంకా లేదు. దంచినమ్మకు బొక్కిందే దక్కుడంటారే అట్ల ఆపూటకాపూటకు సరిపోతుంది. దినానికి ఇరవై రూపాయలిస్తారు''

పుల్లిగాడు ఇంకా ఏదో చెప్పబోయేంతలో తలారివాడు నిఠారుగా కూర్చుని, కండ్లు గుండ్రంగా తిప్పి, ''ఎట్టిట్టా దినానికి ఇరవై రూపాయలా?!'' అని నోరు వెళ్ళ బెట్టుకుని చూడసాగాడు.

పుల్లిగాడు ''మనూర్లో ఐతే ఇరవై రూపాయలు బెమ్మాళవే. పట్నంలో అది యాడకు సాల్తుంది''. అన్నాడు.

తలారివాడు అతడు చెప్తున్నదానితో ఏకీభవించక, ''దినానికి ఇరవై రూపాయలు సంపాదించే మొగోడు మనూర్లో ఈనాటికి పుట్టలా. ఎన్నన్నా చెప్పు నువ్వు రొండు చేతులా పుణ్యం చేసుకున్నోడివిరా'' అన్నాడు.

విప్పచెట్టుకు నాలుగు బారల దూరాన ఒక కోడె రెండు పగ్గాలతో కట్టివేయబడి ఉన్నది. దాని రొమ్ము భారీగాను, నడుము సన్నంగాను ఉన్నది. గంగడోలు విశాలంగాను, గోపురం ఉన్నతంగాను ఉన్నది. దాని చర్మం ఈగ వాలితే జారిపోతుందా అన్నంత నున్నగాను, నాజూకు గాను ఉంది. దాని అంగాంగాలలో జవసత్వాలు ఉట్టిపడుతున్నాయి.

పుల్లిగాడు కోడెవైపు చూస్తూ ''ఎవుర్దిమావా కోడె? రొండు పగ్గాలతో కట్టేసుండారేంది?'' అన్నాడు.

తలారివాడు ''మనదే. పిడికొట్టేదానికి తీసుకొచ్చినాం. పిడికొట్టే మనిషి కోసరం జావు సేపట్నుంచి చూస్తా ఉండాం. 'మీరు పోయి ఇప్పసెట్టుకింద కూసోండి. నేను గెడిసేపిట్లోవస్తా' అన్నెప్పినోడు ఇయ్యాలకు రాలా. పొద్దు గూట్లో పడతా ఉంది.'' అన్నాడు.

దూరంగా ఎక్కడో కుక్క ''బౌబౌ'' మని మొరిగింది. కోడె చెవులు నిక్కరించుకుని ఆవైపే చూసి ఖరోల్లని రంకె వేసింది.

తలారి వాడు కోడెవైపు కసిగా చూస్తూ, ''ఇంకెంత సేపు రంకె లేస్తావు! ఇయ్యాలకు నీమొగుడొస్తా ఉంటాడు. జరగాల్సిన పూజ జరిగి పోతే నీ కోపులన్నీ అణిగిపోతాయి'' అని పుల్లిగాని వైపు తిరిగి, ''సూసేదానికి అట్టుందేగాని అదేవి సటపటవైన గొడ్డనుకుంటివా. ఒక పగ్గం వదులుచేస్తే చాలు. నాలుగు కాళ్ళ పరుగు మొదులు పెడ్తుంది. కనపడిన ఆవులన్నిట్నీ తరుముతుంది. అడ్డమొచ్చిన ఎద్దులన్నిటినీ పొడిచి పండ పెట్టేస్తుంది''. అన్నాడు.

పుల్లిగాడు సన్నగా నవ్వి, ''సుల్లరం మీదుండే గొడ్డు అట్టగాక ఇంగెట్టుంటుంది?'' అన్నాడు.

తలారి వాడు అతని వైపు నిష్మరంగా చూసి, ''గొడ్డా అది. దీనికన్న బలరాకాసి మేలు! గాట్లో కసువు ఏస్తే వాసనగూడా చూడదు. మైదానంలోకి తీసుకుపోతేగాని మెడ వంచదు. తప్పితగిలి పగ్గం చెయి జారిందంటే ఇంగ గొడ్డుమనది కాదు. ఏవాగులో చూసినా ఇదే. ఏ వంకలో చూసినా ఇదే''. అని మళ్ళీ కసిగా కోడెవైపు చూసి, ''ఆ నరం నలిపేస్తేగాని దీని నాలుగు కాళ్ళికచోట ఉండవు'' అన్నాడు.

పుల్లిగాడు నిక్కరు జేబులోకి చేయిజొనిపి, బీడి కట్టను, అగ్గిపెట్టెను బయటకు తీశాడు. ఒక బీడీని నోట్లో పెట్టుకుని వెలిగించుకున్నాడు.

తలారివాడు, ''పట్నంపోయినాక ఈ తూటాలు కాల్చేదిగూడా నేర్చినావంట్రా. ఏదీ ఇటొగిటి పడేయ్'' అన్నాడు.

పుల్లిగాడు అగ్గిపెట్టెను, బీడీ కట్టను అతని చేతికిచ్చాడు. తలారివాడు వాటిని పుచ్చుకుని, ''ఇంగ ఇట్టనే ఉండిపోతావా? మళ్లీ యలబార్తావా?'' అన్నాడు.

పుల్లిగాడు ''మా అయ్య వొచ్చినాక వానితో నాలుగు మాటలు మాట్లాడేసి యలబారటవే,'' అన్నాడు.

తలారివాడు బీడీకొనను కొరికి ఉమిసి, ''పట్నంలో సంవత్సరం దినాలున్నా దమ్మిడీ యనకెయ్యలేదంటివి. మళ్లీ ఆడకు బయల్దేరేదేవిటికి?'' అన్నాడు.

పుల్లిగాడు తలవంచుకుని కాసేపు మౌనంగా ఉండి, ''మంచికో చెడ్డకో కాల్దీసి ఊరెలబారినా, ఇంగనేను మునిగినా తేలినా ఆ గెడ్డ మీదనే,'' అన్నాడు.

తలారివాడు, ''నిన్ను కాల్దీసి ఊరెలబారమనిందెవడు? ఉండూర్లోనే నలుగురితో నారాయణ అని బతికితే వద్దనిందెవుడు?'' అన్నాడు.

పుల్లిగాడు అలాగే మౌనంగా తలవంచుకుని కూర్చున్నాడు. తలారివాడు అపరిచితునివైపు తిరిగి, 'వీడి ధోరణి నీకేమైనా అర్థమౌతూందా?' అన్నట్టు చూశాడు.

అపరిచితుడు గొంతు సవరించుకుని, మరి కాస్త ముందుకు జరిగి, ''కొందరి జాతకాలే అట్టుంటాయి. వాళ్ళకాళ్ళలో చక్రాలుంటాయంట. అట్టాటోల్లు ఒక పూట చెయ్యి కడిగిన ఊర్లో ఇంకొక పూట చెయ్యి కడగరు. ఒకపూట నిద్దర చేసినూర్లో మరొక పూట నిద్దర చెయ్యరు. రెండుగాళ్ళికచోట పెట్టకుండా దేశమంతా తిరగతా ఉంటారు,'' అన్నాడు.

తలారివాడు, ''ఐతే ఈ పిలగోని గూడా పిడికొట్టేద్దావంటావా యట్ట?'' అని పకపక నవ్వటం ప్రారంభించాడు. గారగట్టి ఉన్న పళ్ళు, ఆనారోగ్యంతో ఉబ్బిన్న చిగుళ్ళు వికృతంగా కనపడసాగాయి. అతని కడుపు డొక్కలు ఎగిరెగిరి పడసాగాయి. క్రమంగా అతని కళ్ళలో నీళ్ళు కమ్మసాగాయి. అతన్ని ఆనుకుని కూర్చుని ఉన్న అపరిచితుడు గూడా అతనితో కలిసి నవ్వసాగాడు. కొంతసేపటికి పుల్లిగాడు గూడా అసంకల్పితంగా వాళ్ళతో శృతి కలిపాడు.

8

గాఢ నిద్రలో ఉండిన పుల్లిగాడు ఏదో సవ్వడి విని మేలుకున్నాడు. దిగ్గున కళ్లు తరిచి లేచి కూర్చున్నాడు. అల్లంత దూరాన సుట్రగాలి చెలరేగుతున్నది. సుట్రగాలిలో చిక్కుకున్న ఎండుటాకులు, గడ్డిపోచలు వలయాకారంగా తిరుగుతున్నాయి. ఆవలయం క్రమక్రమంగా జరగుతూ పుల్లిగాని వైపుగా వస్తున్నది.

''దీనమ్మ ఇది నామీదకే వొచ్చేట్టుగా ఉంది'' అంటూ అతడు బిరబిర పైకి లేచాడు. ఈలోగా సుట్రగాలి అతని మీద పడింది. ఎండుటాకులు, గడ్డిపోచలు అతనిని ఆపాదమస్తకం కమ్మివేశాయి. అతడు నిద్రిస్తుండిన ఈత చాప పైకి లేచి బారెడు దూరాన పడింది.

ఆ గాలి తనను దాటుకుని పోయాక అతడు విపరీతంగా దగ్గడం ప్రారంభించాడు. గడ్డికసుమ అతని నోట్లోకి ప్రవేశించి కొండనాలుకను తాకినట్టున్నాయి. కొండ నాలుక దురద పెట్టే కొద్దీ దగ్గు తెరలు తెరలుగా రాసాగింది. గొంతుమీద తీడుకుంటూ అతడు దగ్గుతుండగా కళ్లలో నీళ్లు కమ్మసాగాయి.

తలారివాడు కాళ్లీడ్చుకుంటూ వీధి వెంబడి వస్తున్నాడు. అతడు పుల్లిగాడు పడుతున్న అవస్థను చూసి, ''నిలుకు లేకుండా దగ్గతా ఉండావు. ఒక పక్క పొద్దుపుట్టక ముందే ఏవి కసమాలం తింటివిరా?'' అనడిగాడు.

పుల్లిగాడు దగ్గును సమాళించుకుని, ''తినిందీ లేదు తాగిందీ లేదు. ఈడ పడుకొని నిద్దరపోతా ఉంటే సుట్రగాలొచ్చి మీద పడింది మావా. చెత్త చెదారం ఒక పిడికెడు నోట్లోకి పొయ్యింది. కొండనాలికి కాసేరాకు తగిల్నట్టు మండతా ఉంది'' అన్నాడు.

తలారివాడు ''కొండనాలిక మండే దట్టుండనీ. ఎగుబొద్దున సుట్రగాలి మీద పడితే సెనేస్సుడు నెత్తిన కూసుంటాడంట. పూజారి దగ్గరకు పోయి మంత్రం ఎయ్యించుకో'' అన్నాడు. పుల్లిగాడు ఈత చాపను తీసి చుట్ట చుట్టుతూ, ''ఇంగ నేను పూజారిని ఎతుక్కుంటా పోవాలంటే ఒక దినం కూలి పంచేటు. ఇట్టొచ్చి అట్ట పొయ్యిందానికి మంత్రాలేవిటి? మందులేవిటికి?'' అన్నాడు.

తలారివాడు గుడ్లు తిప్పుతూ, ''అట్టను కోవద్దురా పుల్లిగా, అట్టనుకోవద్దు. సుట్రగాలి మీద పడిందంటే ఇంటిమీద గుడ్ల గూబ కూసున్నట్టే. ఇట్టనే ఒకసారి ఒక కాపాయనింటి మీద గుడ్లగూబ కూసునింది. అది ఎన్నుగాడు మీద కూసోనుండాటం కాపాయన కండ్లార చూసినాడు. ఐతే ఇదేవి జేస్తుందిలే అనుకున్నాడు. బాపనోనితో చెప్పినోడుగాదు. శాస్త్రం చూపించుకున్నోడు గాదు. ఏవయిందనుకున్నావు. సంవత్సరం తిరక్కుండానే ఇంటి అడియాలం గూడా లేకుండా అంతా పోగొట్టుకున్నాడు'' అన్నాడు.

పుల్లిగాడు నోరు చప్పరించి ''ప్చ్ అట్టాటిదేవన్నా జరిగితే కాపోల్లకు జరుగుతుంది. మనం మాలోల్లం. మనకిప్పుడుండేదేంది? సెనేస్సుడొచ్చి లేకుండా చేసేదేంది?'' అన్నాడు.

తలారివాడు చేతులు తిప్పి ''నీ యబ్బతోడు, నేను చెప్పాల్సిన మాట చెప్పినా'' అని వీధి వెంబడి సాగిపోయాడు.

పుల్లిగాడు చాప చుట్టను తీసుకెళ్లి పెంకుటింటి గోడకు ఆనించాడు. పెరట్లో కెళ్లి ముఖము, కాళ్లు, చేతులు కడుక్కుని తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ వచ్చి ఇంటి అరుగుమీద కూర్చున్నాడు.

తెలతెలవారుతుంది. హరిజనులు పెంకుటిండ్ల నుండి బయటపడి కలలో నడుస్తున్నట్టుగ వీధుల వెంబడి నడుస్తున్నారు. ఏండ్ల తరబడి వస్తున్న అర్ధాకలి వల్ల వాళ్ల డొక్కలు, కళ్లు పీక్కుపోయి ఉన్నాయి. మోకాళ్లు, నడుములు వంగి ఉన్నాయి.

రైతులు అప్పుడే హరిజనవాడ మీద పడి కూలీలకోసం వేట ప్రారంభించారు. వీధుల్లో నడుస్తున్న హరిజనులను నిలవేసి, ఇండ్లలో ఉన్న వాళ్లను బయటకు పిలిచి కూలికి రమ్మని పిలుస్తున్నారు. బలహీనత వల్ల వాలిపోతున్న కనురెప్పలను బలవంతంగా పైకెత్తుతూ వాళ్లు తలలు అడ్డంగా ఆడిస్తున్నారు.

ఒక రైతు కోపంతో చిరచిరలాడుతూ వీధి వెంబడి నడిచి వస్తున్నాడు. తువ్వాలను విదిలించి భుజాన వేసుకుని పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ నడుస్తున్నాడు.

అతడు దాపుకు వచ్చాక పుల్లిగాడు, ''ఏంది సావీ పిడికెడు ఉలవలు పోస్తే కాలిబొగ్గయేట్టుగా మొకం పెట్టుకో నుండావు?'' అన్నాడు.

రైతు ఆగి ''ఈ నమ్మ. ఈ మాలోల్లతో ఏగేదానికన్నా నడుంకొక బండ కట్టుకుని బాయిలో దూకేది మేలు.

''కూలి మనిసి దొరకతాడేవేనని వారందినాల్నుంచి తిరగతా ఉండా. ఎవున్ని పిలిచినా పెదనాయుడికి మాటిచ్చేసినా ననటవే. ఈ నమ్మ ఎవుర్నడిగినా ఆమాటే'' అన్నాడు.

పుల్లిగాడు ''మాలోల్లను తిట్టి ఏం లాభం సావి గిట్టుబాటుకాని పనులకు వాళ్లు మాత్రం యట్టపూనుకుంటారు?'' అన్నాడు.

రైతు, ''గిట్టుబాటు కాక పోయేదేంది? దినానికి ఆరు రూపాయిస్తానంటే ఇంగా ఏవి తీపరమా?'' అన్నాడు.

పుల్లిగాడు రెండు చేతుల్లో మూడేసి వేళ్లు చూపించి ''నువు ఆరు రూపాయలిస్తావు. అంతే గదా. పెదనాయుడు ఆరు రూపాయలిచ్చి మూడు పూట్ల సంగటికూడు ఏస్తాడు. మరి కూల్లు నీకు పలుకుతారా? పెదనాయునికి పలుకుతారా?'' అన్నాడు.

రైతు వస్తున్న కోపాన్ని ఆపుకుంటూ ''వానికేమితోటలూ, దొడ్లూ పోగా ఇన్నూ రెకరాల బూవుంది.వాడు సంగటి ఏస్తాడు. అందులోకి పప్పు, నెయ్యి గూడ పోస్తాడు. అట్టా చేసేదానికి నాకేడ తీరింది? నాకుండేదంతా గోచిపాతయడం కయ్యలు రెండు'' అన్నాడు.

పుల్లిగాడు, ''నీకు అదన్నా ఉంది. మాకు అదిగూడా లేదు. మాకుండేదంతా మారెక్కల బలవే, మా రెక్కల బలాన్ని అయినకాడికి మద్యానంగా అమ్ముకుంటే మేమెట్ట బతుకుతాం. అజ్జెప్పు'' అనడిగాడు.

''మరి మీరడిగిన కాడికి కూలిచ్చి సేద్దించెయ్యించాలంటే మేమెట్ల బతకతాం? అజ్జెప్పు. ఇత్తనం గింజ కాడ్నుంచి, ఎరువులు కాడ్నుంచి అన్నీ అప్పుచేసి తెచ్చినవే. ఈ రానీ పోని సేద్దానికి మీరడిగినంత కూలియ్యాలంటే మేం ఉండే కయ్యల్ను అమ్ముకుని దేశం మీదకి పోవాల్సిందే'' అన్నాడు.

పుల్లిగాడు కొంతసేపు ఊరుకుని ''జరగతా ఉండేది అట్టనే గదసావి. అనగూడదు కాని, లోకం మీద జరగతా ఉండేది అట్టనే గదసావి'' అని జేబులో చెయ్యి వేసి బీడి అగ్గిపెట్టె బయటకు తీసి ''నీ కిప్పుడు కూల్లు ఏం పని చేసేదానికి కావాల్నో'' అనడిగాడు.

రైతు మెత్తబడిన కంఠంతో ''కలుపు తియ్యాల. ఆరుకుంటల మడి నాట్టి. గెనిమీద నిలబడి చూస్తే కలుపు మొక్కలు కనిపిస్తె ఉండాయేగాని, వరిపైరు కనపడడం లేదు. నేనూ, నా పెండ్లాం వారం దినాల్నుంచి గోజార్తా ఉండాం. మారెక్కలు పడిపోతా ఉండాయేగాని, కలుపు సవసడం లేదు'' అని పుల్లిగాని వైపు ఆశగా చూస్తూ, ''నువ్వీ తిన్నె మీద ఈలకర్సుకోని పడుండేదేవిటికి? లేచొచ్చి మాతోపాటు నడుం వ్వంచ కూడదా?'' అన్నాడు.

పుల్లిగాడు నోటి దగ్గరకు తీసుకుపోయిన బీడిని కిందకు దించి ''నాకేడ తీరిందిసావి. నేను నిన్నట్నుంచి కంసలోని పనిలో ఉండా. సమ్మెట వేసేపని. రేపు గావాలంటే నీ కలుపులోకి వస్తా'' అన్నాడు.

రైతు కోపంగా మళ్లీ తువాలును భుజంమీదనుంచి తీసి విదిలించి ''రా. రెపొచ్చినాకు తలకొరివి పెట్టు. ఇప్పటికే వరి కర్రలు ఎర్రగా గింజుకోని, నేలమొక వేసుకో నుండాయి. నువురేపు నేరుగ నా దింపుడు కళ్లం కాడకురా'' అనేసి విసవిస నడిచి పోయాడు.

పుల్లిగాడు నోరు తెరుచుకుని అలా వెళుతున్న రైతువైపు చూడసాగాడు. అతని ఒకచేతిలో అగ్గిపెట్టె, మరొక చేతిలో బీడికట్ట అలాగే ఉన్నాయి. రైతు వీధి మలుపు తిరిగి అదృశ్యమయ్యాక అతడు అసంకల్పితంగా అగ్గి పుల్లను గీచాడు. మొదలంట కాలేదాక దానిని చేతిలో ఉంచుకుని నేలమీద పారేశాడు. అతడు మళ్లీ ఒక పుల్లను గీసి బీడీ ముట్టించుకున్నాడు. పొగపీలుస్తూ నేలమీద ఉరుకులు, పరుగులుగా వెళుతున్న చీమల బారును దీక్షగా చూడసాగాడు.

పుల్లిగాని పెంకుటింటికి ఒక వైపున తైలం చెట్టు ఉన్నది. మరొక వైపున సుంక్రేసు చెట్టున్నది. చెట్టునిండా పసుపు పచ్చని పూలున్నాయి. పూలపిట్ట తన సన్నటి, పొడుగాటి ముక్కుతో పూల మకరందాన్ని పీలుస్తూ ఉంది.

ఇందాక వెళ్లిన తలారివాడు నారకట్టను చంకనిరికించుకుని తిరిగి వచ్చాడు. అతడు సుంక్రేసు చెట్టుకింద నిలబడి ''ఏందిరా మూతి నేలకేసుకోని రాజ్జాలు పట్టేవోడు మాదిరి ఆలోచిస్తా ఉండావు?'' అన్నాడు.

పుల్లిగాడు తలెత్తి ''ఏవాలోచిస్తా ఉండానంటావా? కూలి చేసేటోనికి కూలి దక్కాటం లేదు. చెయ్యించుకున్నోనికి పనిదక్కాటం లేదు. రాజ్జివంతా ఇట్టనేనా? మనూర్లో మాత్రవేనా అని ఆలోచిస్తా ఉండా'' అన్నాడు.

తలారివాడు ''రాజ్జివంతా ఇట్టనే, దీన్తల్లిని - రాజ్జివంతా ఇట్టనే'' అని నారకట్టను కిందవేసి, ''నీకిప్పుడీ దరమ సందేహం ఎందుకొచ్చింది?'' అనడిగాడు.

పుల్లిగాడు ''నాగమ నాయుడు ఇంచేపు ఈడనే ఉండినాడు మావా. ఒక పక్క తెల్లవారకముందు కాలూకాలు కొట్టుకుంటా కూల్లకోసరం వొచ్చినాడు. ఎవుర్ని మాట్లాడించినా పెదనాయుడికి మాట చెప్పేసినాననడవే. ఈదులన్నీ తిరిగి వొట్టి చేతుల్తో తిరుక్కొని పోయినాడు మావా'' అన్నాడు.

తలారివాడు నేలమీద కూర్చుని సుంక్రేసు చెట్టుకు జారగిలబడి '' ఊ.ఎ ని కడుపాత్రం వానిది. రైతుల కడుపాత్రం రైతులది. మాల్ల కడుపాత్రం మాల్లది. రైతులు నీలిగి నీలిగి దినానికి ఆరు రూపాయలు కూలిస్తారు...''

పుల్లిగాడు మధ్యలో అందుకుని ''పెదనాయుడు ఆరు రూపాయలిచ్చి, మూడు పూటలు తిండిగూడా పెడ్తాడు. ఔ నీల్లకోపు చూసేగదా చాపలు ఎగబడేది'' అన్నాడు. అతడు గూడ ఇంటిగోడకు జారగిల బడి ''నాగమ నాయుడు కండ్లలో నీళ్లు పెట్టుకున్నాడు మావా. అరు కుంటలు మడి నాటినాడంట. కలుపు బలిసిపోయి వరికర్రలు నేలమొక వేసేసి నాయంట'' అన్నాడు.

తలారివాడు సాలోచనగా తలాడించి, ''ఔ. నేనుగూడ సూసినా, ఆరుకుంటల మడి కోళ్ళు సిల్లాడేసిన దిబ్బ మాదిరుండాది. కర్రలు సెట్టుగట్టి పంట చేతికొచ్చేమాట వొట్టిదే. దోవనపోతా సూసినోళ్ళకే కడుపు కాలిపోతుంది. ఇంగ సొంతగాని కడుపు యట్టకాలును'' అని నోరు చప్పరించి, ''రాజ్జివంతా ఇంతే. కూలి చేసే మాల్లకు కూలి గిట్టాటం లేదు. చెయ్యించుకునే రైతులకు పనిగిట్టాటం లేదు. రాజ్జివంతా ఇంతే''. అన్నాడు.

పుల్లిగాడు ఆరిపోయిన బీడీని చెవిలో చెక్కుకుని, ''మరి దీనికి దోవయట్ట?'' అన్నాడు.

తలారివాడు తేలికగా, ''ఒగిటే దోవ. పుట్టితే పెదనాయుడు మాదిరి

''మరి మీరడిగిన కాడికి కూలిచ్చి సేద్దించెయ్యించాలంటే మేమెట్ల బతకతాం? అజ్జెప్పు. ఇత్తనం గింజ కాడ్నుంచి, ఎరువులు కాడ్నుంచి అన్నీ అప్పుచేసి తెచ్చినవే. ఈ రానీ పోని సేద్దానికి మీరడిగినంత కూలియ్యాలంటే మేం ఉండే కయ్యల్ను అమ్ముకుని దేశం మీదకి పోవాల్సిందే'' అన్నాడు.

పుల్లిగాడు కొంతసేపు ఊరుకుని ''జరగతా ఉండేది అట్టనే గదసావి. అనగూడదు కాని, లోకం మీద జరగతా ఉండేది అట్టనే గదసావి'' అని జేబులో చెయ్యి వేసి బీడి అగ్గిపెట్టి బయటకు తీసి ''నీ కిప్పుడు కూలోల్లు ఏం పని చేసేదానికి కావాల్నో'' అనడిగాడు.

రైతు మెత్తబడిన కంఠంతో ''కలుపు తియ్యాల. ఆరుకుంటల మడి నాట్టి. గెనిమీద నిలబడి చూస్తే కలుపు మొక్కలు కనిపిస్తా ఉండాయేగాని, వరిపైరు కనపడడం లేదు. నేనూ, నా పెండ్లాం వారం దినాల్నుంచి గోజార్తా ఉండాం. మారెక్కలు పడిపోతా ఉండాయేగాని, కలుపు సవసడం లేదు'' అని పుల్లిగాని వైపు ఆశగా చూస్తూ, ''నువ్వీ తిన్నె మీద ఈలకర్సుకోని పడుండేదేవిటికి? లేచొచ్చి మాతోపాటు నడుం వంచ కూడదా?'' అన్నాడు.

పుల్లిగాడు నోటి దగ్గరకు తీసుకుపోయిన బీడిని కిందకు దించి ''నాకేడ తీరిందిసావి. నేను నిన్నట్నుంచి కంసలోని పనిలో ఉండా. సమ్మెట వేసేపని. రేపు గావాలంటే నీ కలుపులోకి వస్తా'' అన్నాడు.

రైతు కోపంగా మళ్లీ తువాలును భుజంమీదనుంచి తీసి విదిలించి ''రా. రెపొచ్చినాకు తలకొరివి పెట్టు. ఇప్పటికే వరి కర్రలు ఎర్రగా గింజుకోని, నేలమొక వేసుకో నుండాయి. నువురేపు నేరుగ నా దింపుడు కళ్లం కాడకురా'' అనేసి విసవిస నడిచి పోయాడు.

పుల్లిగాడు నోరు తెరుచుకుని అలా వెళుతున్న రైతువైపు చూడసాగాడు. అతని ఒకచేతిలో అగ్గిపెట్టి, మరొక చేతిలో బీడికట్ట అలాగే ఉన్నాయి. రైతు వీధి మలుపు తిరిగి అదృశ్యమయ్యాక అతడు అసంకల్పితంగా అగ్గి పుల్లను గీచాడు. మొదలంట కాలేదాక దానిని చేతిలో ఉంచుకుని నేలమీద పారేశాడు. అతడు మళ్లీ ఒక పుల్లను గీసి బీడీ ముట్టించుకున్నాడు. పొగపీలుస్తూ నేలమీద ఉరుకులు, పరుగులుగా వెళుతున్న చీమల బారును దీక్షగా చూడసాగాడు.

పుల్లిగాని పెంకుటింటికి ఒక వైపున తైలం చెట్టు ఉన్నది. మరొక వైపున సుంక్రేసు చెట్టున్నది. చెట్టునిండా పసుపు పచ్చని పూలున్నాయి. పూలపిట్ట తన సన్నటి, పొడుగాటి ముక్కుతో పూల మకరందాన్ని పీలుస్తూ ఉంది.

ఇందాక వెళ్లిన తలారివాడు నారకట్టను చంకనిరికించుకుని తిరిగి వచ్చాడు. అతడు సుంక్రేసు చెట్టుకింద నిలబడి ''ఏందిరా మూతి నేలకేసుకోని రాజ్జాలు పట్టేవోడు మాదిరి ఆలోచిస్తా ఉండావు?'' అన్నాడు.

పుల్లిగాడు తలెత్తి ''ఏవాలోచిస్తా ఉండానంటావా? కూలి చేసేటోనికి కూలి దక్కాటం లేదు. చెయ్యించుకున్నోనికి పనిదక్కాటం లేదు. రాజ్జివంతా ఇట్టనేనా? మనూర్లో మాత్రవేనా అని ఆలోచిస్తా ఉండా'' అన్నాడు.

తలారివాడు ''రాజ్జివంతా ఇట్టనే, దీన్తల్లిని - రాజ్జివంతా ఇట్టనే'' అని నారకట్టను కిందవేసి, ''నీకిప్పుడీ దరమ సందేహం ఎందుకొచ్చింది?'' అనడిగాడు.

పుల్లిగాడు ''నాగమ నాయుడు ఇంచేపు ఈడనే ఉండినాడు మావా. ఒక పక్క తెల్లవారకముందు కాలూకాలు కొట్టుకుంటా కూలోల్లకోసరం వొచ్చినాడు. ఎవుర్ని మాట్లాడించినా పెదనాయుడికి మాట చెప్పేసినాననడవే. ఈదులన్నీ తిరిగి వొట్టి చేతుల్తో తిరుక్కొని పోయినాడు మావా'' అన్నాడు.

తలారివాడు నేలమీద కూర్చుని సుంక్రేసు చెట్టుకు జారగిలబడి '' ఊ.ఎ ని కడుపాత్రం వానిది. రైతుల కడుపాత్రం రైతులది. మాల్లోల్ల కడుపాత్రం మాల్లోల్లది. రైతులు నీలిగి నీలిగి దినానికి ఆరు రూపాయలు కూలిస్తారు...''

పుల్లిగాడు మధ్యలో అందుకుని ''పెదనాయుడు ఆరు రూపాయలిచ్చి, మూడు పూటలు తిండిగూడా పెడ్తాడు. ఔ నీళ్లకోపు చూసేగదా చాపలు ఎగబడేది'' అన్నాడు. అతడు గూడ ఇంటిగోడకు జారగిల బడి ''నాగమ నాయుడు కండ్లలో నీళ్లు పెట్టుకున్నాడు మావా. ఆరు కుంటలు మడి నాటినాడంట. కలుపు బలిసిపోయి వరికర్రలు నేలమొక వేసేసి నాయంట'' అన్నాడు.

తలారివాడు సాలోచనగా తలాడించి, ''ఔ. నేనుగూడ సూసినా, ఆరుకుంటల మడి కోళ్ళు సిల్లాడేసిన దిబ్బ మాదిరుండాది. కర్రలు సెట్టుగట్టి పంట చేతికొచ్చేమాట వొట్టిదే. దేవనపోతా సూసినోళ్ళకే కడుపు కాలిపోతుంది. ఇంగ సొంతగాని కడుపు యట్టకాలును'' అని నోరు చప్పరించి, ''రాజ్జివంతా ఇంతే. కూలి చేసే మాల్లోల్లకు కూలి గిట్టాటం లేదు. చెయ్యించుకునే రైతులకు పనిగిట్టాటం లేదు. రాజ్జివంతా ఇంతే''. అన్నాడు.

పుల్లిగాడు ఆరిపోయిన బీడీని చెవిలో చెక్కుకుని, ''మరి దీనికి దోవయట్ట?'' అన్నాడు.

తలారివాడు తేలికగా, ''ఒగిటే దోవ. పుట్టితే పెదనాయుడు మాదిరి

సావకారిగానన్నా పుట్టాల. లేకపోతే అడవిలో నల్లతుమ్మ చెట్టుగా నన్నా పుట్టాల. అంతేగాని గోచిపాత యడం కయ్యలు పెట్టుకుని రైతులుగా పుట్టగూడదు. మాలపుటక అసలే పుట్టగూడదు'' అన్నాడు.

చెట్టుమీద పూలపిట్ట కొమ్మనుండి కొమ్మకు దూకుతూ, అందిన పూవులోకల్లా ముక్కును జొనుపుతూ హడావిడిగా ఉంది. నేలమీద చీమలు ముడ్డిపైకెత్తుకుని, నోటిలో గడ్డిబియ్యాన్ని కరచుకుని గున గున పరుగిడుతున్నాయి.

తూర్పు అంతకంతకు ఎర్రనవుతున్నది. కొండల అంచులు స్పష్టంగా కనపడసాగాయి. సూర్యబింబం దృగ్గోచరం కాలేదుగాని, సూర్యుని కిరణాలు కొండవెనుక నుండి ప్రసరిస్తుండడం కనిపిస్తూంది.

పుల్లిగాడు తూర్పుదిక్కుగా చూస్తూ, ''దీనమ్మ ఈ ఎండాకలమంత రోతకాలం ఇంగొకటుండదు. పడకేసుకుని ఒక నిద్రతీసేయాలకు తెల్లారిపోతుంది. నిద్దర సాలేదీ లేదు. వొళ్ళు నొప్పులు తీరేదీ లేదు''అన్నాడు.

''వొళ్ళు అట్ట నొప్పులు పెట్టేట్టుగా నిన్నంతా ఏంపని చేస్తివి?'' అనడిగాడు తలారి వాడు.

''కంసలోని దగ్గర కొలివి పనిచేస్తె ఉంటి. నిన్నంతా అదే పనిలో ఉంటి. కొలివి శాకం ఒక పక్క. ఎండ ఒక పక్క. పొద్దుపోయేటప్పటికి వొళ్ళంతా సచ్చి పోయిందనుకో.''

''ఎంతిస్తాడు కూలి?''

''దినకూలి లేదు. చేసే కొరమట్టును బట్టి ఇంత అని ఇస్తాడు. కొడవలికి ఇరవై పైసలు. పారకు ముప్పై పైసలు.''

సూర్య బింబం కొండల వెనక తొంగి చూసింది. అది క్రమక్రమంగా పైకి ఎగబ్రాకసాగింది.

పుల్లిగాడు కాళ్ళకు తిన్నెకిందకు జారవిడిచి '' ఈ పొద్దు సుక్కారం. వాడు దేవలం సుట్టేదానికి పోతాడు. పొద్దు నాలుగు బారలెక్కే దాక దేవలం సుట్టి కొలివి ఆల్సింగా తెరస్తాడు. లేకపోతే నేను ఈ పాటికి కొలివిగా డుండాల్సి నోడిని'' అన్నాడు.

తలారివాడు, ''అంటే పొద్దు నాలుగు బారలెక్కేదాక నీకు తీరుబాటేనంటావు. ఐతే ఇట్టొచ్చి నాకొక చెయ్యి అందించు'' అని నారకట్టను చేతిలోకి తీసుకుని, ''ఊరంతా గిరం సెడి ఈ నార సంపాదించినా. దీన్ని దారం పేడాల

తడపలందించే దానికి తలమాసినోడివురన్నా దొరకతాడేవేనని చూస్తె ఉండ'' అన్నాడు.

పుల్లిగాడు తిన్నెదిగి, ''తలమాసినోడ్ని నేను దొరికి నానంటావు'' అన్నాడు.

తలారివాడు నారకట్టను అతనికందిస్తూ ''అంత మాట నిన్నెందుకనాల. తలమాసినోణ్ణీ నేను. ముడ్డి మాసినోణ్ణీ నేనే. ఇంద. ఇట్టొచ్చి కూసో.'' అన్నాడు.

పుల్లిగాడు తలారివాడి కుడిపక్కన కూర్చున్నాడు. తడపలను చీలుస్తూ, ''తడపల్ను యట్ట చీల్చమంటావు? లావుగానా? సన్నగానా?'' అన్నాడు.

''సన్నగానే చీల్చు. లావుదారం నాకేవిటికి? ఉరిబోసుకోనా?''

నార నాసిరకంది కావటం మూలాన తడపలు చిక్కు పడసాగాయి. పుల్లిగాడు పండ్లు కరచుకుని తడపలను చీల్చుతూ, ''ఏవి నారసంపాదించినావు మావా. దిబ్బలోకి పోయే సరుకు సంపాదించినావు'' అన్నాడు.

తలారివాడు తడపలను తొడమీదుంచి పేనుతూ, ''దిబ్బలోకి పొయ్యే సరుకుగాక పనికొచ్చే సరుకు నాకిప్పుడు ఎవురిస్తారు! వయసు మీదుండేప్పుడు ముప్పైరెండు కీళ్ళు వొంచి పన్జేసేటోణ్ణి. కోడి కూసింది మొదులుకుని రాతిరి మాట మునిగేదాక రొండుగాళ్ళాక చోట పెట్టకుండా పన్జేసేటోణ్ణి. అప్పట్లో నేనేది అడిగితే అది ఎత్తిచ్చేటోల్లు పెద్ద రైతులు. ఇప్పుడు నెత్తురంతా వొడిగిపోయి మూలబడిపోయినా. ఇప్పుడు నేనడిగేదీ బిచ్చవే. వాళ్ళిచ్చేదీ బిచ్చవే'' అన్నాడు.

''అదే అర్థం కాకుండా ఉండాది. నువు పుట్టి బుద్ధి తెల్సింది మొదులుకుని నెత్తురుడిగి నేల బడేదాక కష్టపడ్తిని. కడన మిగిలిందేంది? నాలుగడ్డేళ్ళ గోచిపాత, ఉత్తిపిండి సంగటి. నువ్వే గాదు. మన మాల పిల్లలంతా అంతే. మరి మనం జేసే కష్టవంతా యా పెద్దేట్లో కల్సిపోత ఉంది?''

''మాలోల్లేగాదు. రైతులు గూడా అంతే. రైతు పుట్టీ పుట్టంగానే నాగలి పిడి చేత పట్తాడు. సచ్చేదాక ఆ రానీపోని సేద్దింతోనే గోజార్తాడు. సచ్చేనాటికి కయ్యలు, కొంప ఆడుమానంలోనే ఉంటాయి. రైతులు గూడా అంతే.''

పుల్లిగాడు మళ్ళీ, ''అదే అర్థంగాకుండా ఉండాది. ఈళ్ళందరి కష్టం యా పెద్దేట్లో కల్సిపోతా ఉన్నట్టు?'' అన్నాడు.

తలారివాడు ''ఏవో మనకేం తెల్సు. మనకు తెలిస్తే మన బతుకులిట్టుండునా. ఇట్లా నారాగోరం బతుకులు బతికే గతి పట్టునా'' అన్నాడు.

ఇంతలో వారి వెనుక నుండి ''ఎవుర్రా ఆడ. సుంక్రేసు చెట్టుకింద కూసోనుండేది? నీ యమ్మల'' అంటూ కేక వినిపించింది.

చెట్టుమీద తిరుగాడుతూ ఉండిన పూల పిట్ట చివ్వున లేచి రెక్కలు కొట్టుకుంటూ ఎగిరిపోయింది. పుల్లిగాడు నారను, తలారివాడు దారాన్ని కింద పెట్టి తలలు తిప్పి చూశారు. ముత్యాలనాయుడు ఒక చేత్తో కాలుతున్న బీడీని పట్టుకుని పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వస్తున్నాడు. అతడు నేరుగ వొచ్చి సుంక్రేసు చెట్టు నీడన నిలబడి, ''ఇంటి కొకడు లెక్కన రమ్మని నిన్ననంగా మాట పంపిస్తిని. పొద్దుపుట్టి ఎక్కి వస్తె ఉంది. ఏవయినార్రా జనవంత? యలబార్తా ఉండారా? పెండ్లాల పక్కన నిగడదన్నుకోనుండారా?'' అన్నాడు.

అతడు చెట్టు నీడలోకొచ్చి నిలబడడంతో తలారి వాడు, పుల్లిగాడు గబగబ లేచి నీడ బయట నిలబడ్డారు. తలరివాడు చేతులను రొమ్ముమీద కట్టుకుని, ''మా యింట్లో నుంచి నా మనుముడు వస్తాడు సావి. నిద్దర్లేసి ముకం కడుకోని సద్ది తాగత ఉండినాడు. ఇయ్యాలకు బయల్దేరత ఉంటాడు సావి'' అన్నాడు.

ముత్యాలనాయుడు ఏదో చెప్పబోయి పుల్లి గాని వైపు చూసి, ''నీదేవూరు?'' అనడిగి తలారివాని వైపు తిరిగి, ''ఎవురీ పిలగాడు! నీకు సుట్టవా?'' అనడిగాడు.

తలారివాడు, ''సుట్టం గాదు సావి. ఈ ఊరోడే. కోనిగాడు. కొడుకు'' అన్నాడు.

ముత్యాలనాయుడు కనుబొమలను ముడి వేస్తూ, ''ఏ కోనిగాడు? మా కోనిగాడా?'' అనడిగాడు.

తలారివాడు, ''ఔను సావి. మీ కోనిగాని కొడుకే ఈడు. అరవ దేశం పోయి పొట్టపోసుకుంటా ఉండాడు. మొన్ననే వొచ్చినాడు'' అన్నాడు.

ముత్యాల నాయుడు పుల్లిగాణ్ణి ఎగాదిగా చూసి, ''గుర్తుపట్టే దానిక్కాకుండా యిడిగి పోయినావురా. పిడిగొట్టిన గిత్త మాదిరయి పోయినావు. అరవ దేశంలో ఏపని చేస్తె ఉండావు?'' అనడిగాడు.

పుల్లిగాడు, ''ఒగిటని లేదు సావి. ఓటల్లో క్లీనరు పని మొదులుకుని బజార్లలో రిక్షా తొక్కే పనిదాక అన్నీ చేసినా సావి. ఇప్పుడు బిల్డింగులు కట్టే తావున పని చేస్తె ఉండా'' అన్నాడు.

ముత్యాలనాయుడు రొండిలోనుంచి పొగాకు కాడ తీసి తుంచి, ''ముందు కాలాన జోగల్లు, పిచ్చి గుంటల్లు దేశం మీద తిరిగేటోల్లు. ఇప్పుడు

మాల్లు, రైతులు అందరూ దేశాల్దిరిగేదానికి మల్లుకుంటా ఉండారు. అందరికీ నాడోడి బుద్దులు పట్టిపోత ఉండాయి'' అన్నాడు.

పుల్లిగాడు దీర్ఘంగా నిట్టూర్చి, ''నొస్టిన రాసిన కాడికి బతకాల గద సావి. మా చేతుల్లో ఏవుంది. పొట్టపోసుకునే దోవ ఉండూర్లో లేక పోయె. రాజ్జింమీద పడక ఏవి జేతు?'' అన్నాడు.

ముత్యాల నాయుడు, ''నండ్రకాయలు బొక్కల్లోంచి బయటకొచ్చేది తిండి దొరకనప్పుడు కాదురా, కొవ్వు జాస్తయినప్పుడు. ఈ మాల పల్లిలో పిల్లా జెల్లా కల్సి ఐదు నూర్ల చిల్లర మంది ఉండారు. ఈళ్ళలో తిండి తినకుండా పస్తులుండే దెవుడు? ఎవురికతో ఎందుకు? మీ అయ్య కత జూడు. వాడు మా దగ్గిర చేరి ముప్పై ఏండ్లయింది. ఈ ముప్పై ఏండ్లలో వానికి ఏవి తక్కవయింది? మూడుపూట్ల తిండి తక్కవయిందా? మానంమీదకు గుడ్డ తక్కవయిందా? ఉండేదానికి కొంప తక్కవయిందా? మనిషై పుట్టినోనికి కావల్సింది ఇంతకన్న ఏందిరా'' అనడిగాడు.

ఆ ప్రశ్నకు సమాధానం తనవద్ద లేదన్నట్టు పుల్లిగాడు తల వంచుకుని నిలుచున్నాడు.

ఇంతలో ఇంటికొకడు చొప్పున హరిజనులు పెంకుటిండ్ల నుండి బయటపడి సుంక్రేసు చెట్టు వైపు రాసాగారు. మీసాలకంటుకుని ఉన్న చద్ది యన్నపు మెతుకులను, గొంతుమీద జారిన నీటి ధారలను తుడుచుకుంటూ, గోచెలను, పంచెలను సర్దుకుంటూ వారు బిరబిర వీధివెంబడి నడుస్తున్నారు. సుంక్రేసు చెట్టును సమీపించే కొద్ది వారి అడుగులు మరింత వేగంగా పడసాగాయి.

ముత్యాలనాయుడు పొగాకు కాడను నోట్లో వేసుకుని, '' ఇంటికొకడు లెక్కన రమ్మని నిన్ననంగా మాట పంపిస్తిని. పొద్దు పుట్టి నాలుగు బార లెక్కింది. మీరిప్పుడు నీలుక్కుంటా వస్తె ఉండారు. పెండ్లాల పక్కన పడుకుంటే మీకు తెల్లవారేదీ తెలియదు. పొద్దు పుట్టేదీ తెలియదు'' అన్నాడు.

ఒక హరిజనుడు వినయంగా, ''నిద్దర యాడిది సావి. దోమలు ఒక పక్క. ఉమ్మ ఒక పక్క. కంటిమీద రెప్ప ఏసింది లేదు. ఎండకాలం గద సావి'' అన్నాడు.

ముత్యాల నాయుడు ''ఎండకాలమొస్తే ఉమ్మకు నిద్దర రాలేదంటారు. సలికాలం వస్తే సలికి మెలకువ రాలేదంటారు. కూలోని నోరొకటి గాదు.

జల్దారుగుంత ఒగిటి కాదు'' అని, పొగాకు రసం కలిసిన ఎంగిలిని నేల మీద ఉమ్మి, అందర్నీ కలయజూసి, ''ఇంటికొకడు లెక్కన అందరూ వొచ్చినట్టేనా? అందరూ యాడోడు ఆడ నిలబడండి. లెక్క పెడ్తా'' అన్నాడు. హరిజనులు ఎక్కడి వారక్కడ రాతి స్తంభాలవలె నిలుచున్నారు. ముత్యాల నాయుడు పొగాకు కాడను నమలడం ఆపి, ''ఒగిటి, రెండు....''అంటూ వాళ్ళను లెక్క పెట్టసాగాడు.

ఎటో వెళ్ళి ఉండిన పూలపిట్ట రెక్కలు కొట్టుకుంటూ తిరిగి వచ్చి సుంక్రేసు చెట్టు మీద కూర్చుంది.

ముత్యాల నాయుడు వాళ్ళను లెక్క పెట్టడం ముగించి, ''ముప్పైమంది. అంతా కల్సి ముప్పై మంది ఉండారు. ఇంకొకడేవయినాడురా ఎవునికిరా ఈ పొద్దు మాలపల్లిలో దొర్తానం వచ్చేసుండేది'' అన్నాడు.

ముప్పైమంది హరిజనులు ఒకరి ముఖాలొకరు చూసుకుంటూ కళ్ళతో ఒకరినొకరు ప్రశ్నించుకోసాగారు. చివరకు ఒకడు, ''బాలిగాడు కనిపించాటం లేదు సావి. బాలిగాడు వొచ్చినట్టు లేదు'' అన్నాడు.

ఇంతలో ఒక నడి వయస్కురాలు వీధి మలుపు తిరిగి ఇటే వస్తుండడం కనిపించింది. మెడ మీద జుత్తును ముడి వేసుకుంటూ, కొంగును నడుములో దోపుకుంటూ ఆమె ఆతురతతో నడిచి వస్తుంది.

ముత్యాలనాయుడు, ''ఎవుడ్రా ఆడొచ్చేది?'' అన్నాడు.

ఒక హరిజనుడు సూర్య కిరణాల కడ్డంగా చేయి పెట్టుకుని చూసి, ''సాయిత్రి సావి. బాలిగాని పెండ్లాం'' అన్నాడు.

సావిత్రి దాపుకు రాగానే ముత్యాల నాయుడు, ''ముడ్డి తిప్పుకుంటా వస్తె ఉండావేందే. నీ మొగుడు యాడ సచ్చినాడు?'' అనడిగాడు.

సావిత్రి విచారంగా ''వాడు సచ్చేట్టుగానే ఉండాడు సావి. నిన్నట్నుంచి యిడవకుండా జరం కాస్తె ఉంది. మూసిన కన్ను తెరవటం లేదు. వాని బదులు నేనొస్తె సావి'' అంది.

ముత్యాల నాయుడు నిరంతరంగా పొగాకు నమలడం వల్ల నల్లబారిన పండ్లు కనిపించేట్టు నవ్వి, ''చెరుకు నరికే తావు కొచ్చి నువ్వేవి జేస్తావే. ముట్టుకోకలు ఉతికి ఆరబెట్టుకుంటావా?'' అని, వెంటనే ముఖంలో కోపం ప్రదర్శిస్తూ,

''ఒరే పులుపోడా. నువ్వు పోయి నీ కాలి మెట్టుతో వాడి నెత్తిన ఒగిటేసి ఇట్ట ఈడ్సుకరా'' అన్నాడు.

ఒక హరిజనుడు ఎక్కుపెట్టి విడిచిన బాణం వలె గుంపులోనుండి వీధి వెంబడి పరుగెత్తసాగాడు.

ముత్యాలనాయుడు కోపంగా అటూ, ఇటూ పచార్లు చేస్తూ; ''రాంగ రాంగ పెదనాయుడోల్ల నేద్దివంటే అందరికీ సవకయిపోతా వుంది. సంత దినమొచ్చిందంటే మాలపల్లిలో ఒక మొగోడుండరు. అందరూ యలబారి పెదనాయుడి దగ్గర కొచ్చేస్తారు'' అని పచార్లు ఆపి, యాచనను అభినయిస్తూ ''పది రూపాయలిప్పించు సావి. ఇరవై ఇప్పించు సావి. బియ్యం కొనుక్కుంటా, మిరప కాయలు కొనుక్కుంటా. బిడ్డలు పస్తులు సావి. పెండ్లాం పస్తు సావి' అని గోస పెడతారు. ఇచ్చేదాక అడుగెత్తి పెట్టరు. తీర అవసరమొచ్చి కూలికి పిలిస్తే జరాలొస్తాయి, జాడ్యాలొస్తాయి'' అని సావిత్రి వైపు ఝసరుసలాడుతూ చూసి, ''నీ మొగుడు ఇరవై రూపాయలు తీసుకుని మూడు నెలలయింది, ఇయ్యాలకు దమ్మిడీ తీర్చలేదు'' అన్నాడు.

సావిత్రి, ''తీర్చక యాడికి పోతాం సావి, ఈ పొద్దుగాక పోతే రేపైనా కష్టం జేసి తీర్చేబోల్లం మేవే గద సావి'' అన్నది.

ముత్యాల నాయుడు వెటకారంగా, ''ఔ రేపయినా తీరుస్తారు. ఇంగొచ్చే సంవత్సరానికైనా తీరుస్తారు. మీరు తీర్చేదాకా మేవు సాంబ్రాణి ఏసుకొని సూసుకోనుంటే మాకే మొస్తుంది? వడ్డా? వరుమానమా?'' అని మళ్ళీ పచార్లు ప్రారంభించి, ''అసలు తప్పంతా మీదిగాదు. మీరడిగినప్పుడల్లా బాండు, పత్రం లేకుండా పదులు, ఇరవైలు ఇచ్చేదానికి పెదనాయుడుండాడు. తిని నిద్దర్లు జేసేదానికి గవుర్మెంటోడు కట్టించుండే ఇండ్లుండాయి. ఇంగ మీకు కన్ను, మిన్ను యాడ తెలుస్తుంది'' అన్నాడు.

ఇంతలో బాలిగాడు అడుగులో అడుగేసుకుంటూ, వీధి వెంబడి నడుస్తూ సుంక్రేసు చెట్టు దగ్గరకు వచ్చాడు. అతడు భుజం నుండి మోకాళ్ళదాక ఒక నల్లని దుప్పటిని కప్పుకుని ఉన్నాడు. అస్వస్థత వల్ల వాని ముఖం నల్లబడి ఉన్నది. కళ్ళు లోతుకు పీక్కుపోయి ఉన్నాయి.

బాలిగాడు చేరువగా రాగానే ముత్యాల నాయుడు, ''ఏవిరా బాలిగా. డ్యూల్లో ఉండాలనుందా? లేదా?'' అని అడిగాడు.

బాలిగాడు వణుకుతున్న చేతులను దుప్పటి కిందనుంచి బయటకు తీసి జోడించి, ''దండం పెడ్తా సావి. ఆడ్నుంచి ఈడికి నడిసేటప్పటికి కండ్లు బూసులు కమ్మతా ఉండాయి. నిన్నట్నుంచి పులక జరం పట్టుకునింది సావి'' అన్నాడు.

ముత్యాలనాయుడు పాగాకు కాడను ఈ దవడ నుండి ఆ దవడకు మార్చి, ''చెరుకు తోట కాడికి పోయి గొడ్డలి చేత బట్టుకుంటే ఈ పులక జరాలన్నీ ఎగిరిపోతాయి. నువ్వు ముందు ఆ దుప్పట తీసి నీ పెండ్లానికిచ్చి యల బారు'' అన్నాడు.

బాలిగాడు మళ్ళీ చేతులు జోడించి, ''ఈ పొద్దిటికి నన్నిడ్చి పెట్టుసావి. నిన్నట్నుంచి కడుపులోకి పచ్చి గంగ కూడా పోలేదు. గొడ్డలి చేత పట్టుకునే దానిగ్గూడా సత్తలేదు సావి'' అన్నాడు.

ముత్యాలనాయుడు సహనం చచ్చినట్లు గొంతు పెంచి, ''నువ్వు చెప్పేదేవన్నా వుంటే ముందు చెరుకు తోటకాడికి పొయ్యి గొడ్డలి చేత బట్టుకుని మల్ల మాట్లాడు'' అని ఒక హరిజనుని వైపు తిరిగి, ''ఒరే పులుపోడా నువ్వా దుప్పటి తీసి వాని పెండ్లాం మొకాన కొట్టు'' అన్నాడు.

పులుపోడు బాలిగాడి దగ్గరగా వెళ్ళి, ''చెప్పింది చెయ్యిబే.పాడిన పాటే పాడుకుంటా అయ్యకు కోపం తెప్పించేద్దేనికి?'' అంటూ బాలిగాని భుజాల మీద నుండి దుప్పటిని లాగి సావిత్రి మీదకు గిరవాటు పెట్టాడు.

బాలిగాడు ఎండిన బోరతో, లోతుకు పీక్కుపోయిన డొక్కలతో, గోచిపాత తప్ప మరే ఆచ్ఛాదన లేకుండా నిల్చున్నాడు. వాడు గద్గదస్వరంతో ఏదోచెప్పడానికి ప్రయత్నించగా ముత్యాలనాయుడు ''నీ నంగి ఏడుపులు మల్లా మొదులు పెట్టొద్దు. నీ ఏడుపులు ఇనుకుంటాకూసుంటే ఇంగ మేవు సేద్దిం పన్లు ఇడ్చిపెట్టేయాల్సిందే. కయ్యాగట్రా అమ్ముకుని దేశం మీద పడాల్సిందే'' అని మిగిలిన హరిజనుల వైపు చూస్తూ, ''ఇంగ నడవండ్రా. పొద్దునడి వింటికి రాకముందే పది లారీలు లోడ్డు కావాల. గంట పన్నెండు కాకముందే లారీలు రోడ్డు మీదకెక్కాల. పన్నెండు దాటిందంటే ఆ డ్రైవరు నాకొడుకులు బత్తా ఇమ్మని ఆడగ తారు. నడవండి. ఒరే పులుపోడా ముందు నువు దారితియ్'' అన్నాడు.

9

పొద్దురెండు బారలెక్కింది. పుల్లిగాడు చద్ది తాగి బ్రేవ్‌మని త్రేన్చుతూ బయటకొచ్చి ఇంటి అరుగు మీద కూర్చున్నాడు.

సన్నగా వీస్తున్న గాలి తాకిడికి తుక్కునార పుల్లదుమ్ము మీద నిశ్శబ్దంగా పరుగిడుతూంది. పుల్లలను, ఆకులను తనలో కలుపుకుంటూ పరుగిడుతున్న నార ఉండను చూస్తూ పుల్లిగాడు అలాగే కూర్చున్నాడు. నార ఉండ అలా వీధి చివరిదాక పరుగెత్తి, అకస్మాత్తుగ గాలి ఉరవడి పెచ్చడం వల్ల పైకి పైపైకి ఎగురసాగింది.

వీధి చివరన కంసాలివాడు నడచి వస్తుండడం పుల్లిగాడు గమనించాడు. పంచె గాలి పాటుకు రెపరెప లాడుతుండగా అతడు గాలికభిముఖంగా సాగివస్తున్నాడు. అతడు అల్లంత దూరం నుంచే ''ఇంట్లోనే ఉండా వట్రా పుల్లిగా. నువ్వు కనపడతావో లేదోనని నోట్లో రూకేసుకుని వస్తా ఉండా'' అంటూ దగ్గరకు వచ్చి, ''మొకం కడుక్కోని సద్ది తాగినావంట్రా?'' అనడిగాడు.

పుల్లిగాడు తెన్నెమీద నుంచి దిగి, ''ఇప్పుడే సద్దిదాగి ఇట్ట కూసున్నా. ఇట్ల పరుగెత్తుకోనొచ్చినా వేందన్నా?'' అన్నాడు.

కంసాలి, ''సద్దితాగి నోడివి నేరుగ కొలివి కాడికి రాకపోతివా? కొలివి రగలేసి నీకోసరం దోవజూస్తా ఉంటి. చూసి చూసి ఇంక సాలై పోయి నేనే యలబారొస్తి'' అన్నాడు.

పుల్లిగాడు, ''ఈ పొద్దు సుకురారంగదన్నా. నువు పూజ ముగించేటప్పటికి నాలుగు బారల పొద్దవుతుందిలే అని తాచ్చారంగా కూసున్నా. నువ్వింత బిన్నె పూజ ముగించి కోనొస్తావని నాకేవి దెల్సు?'' అన్నాడు.

కంసాలి, ''పూజ మొదులు పెట్టనూలేదు. ముగించనూలేదు. తెల్లవారుజామున లేచి నీళ్ళు పోసుకుని ఈబూది పెట్టుకుని కాయా కర్పూరం గంగాళంలో పెట్టుకుని దేవలానికి యలబారి నానంతే. పెదనాయుడోల్ల మనిసొచ్చి నిలేసినాడు. అర్జంటుగా యాభై కొడవండ్లు కావాలంట. వరిమడి కోత కొచ్చిందంట. పొద్దు పోయేలోగా యాభై కొడవండ్లు తయారుజేసి, కక్కు ఏసి రడీ చెయ్యమని పెదనాయుడు మాట పంపించినాడు - అంతే. గంగాళం తీసకపోయి మూల పెట్టి నేరుగా పోయి కొలివి రగిలించినా'' అన్నాడు.

వాళ్ళిద్దరు, మాలపల్లిని కడచి సన్నటి కాలి బాటమీద, ఒకరి వెనుక ఒకరుగ నడవసాగారు.

వెనక నడుస్తున్న పుల్లిగాడు, ''ఒగిటిగాదు రెండు గాదు యాభై కొడవండ్లు పొద్దు పొయ్యేలోగా చెయ్యాలంటే ఎవుని తరం? మిసన్లు పెట్టినా అయ్యే పనికాదు'' అన్నాడు.

కంసాలి దీర్ఘంగా నిట్టూర్చి, ''ఆ మాట చెప్తే వినేటోడెవురు? ఆ మాట గనక చెప్తే చాకలి గురవనికి పట్టిన గతె పట్టుంది'' అన్నాడు.

పుల్లిగాడు కంసాలి వీపును చూస్తూ, ''సాకలోనికి ఏవయింది?'' అనడిగాడు.

కంసాలి తల వంచుకుని నడుస్తూ, ''మూడురాత్రుర్లు, మూడు పగళ్ళు పెండ్లాం బిడ్డల్తో ఈదుల్లో పడి ఆకోరించినాడు'' అని తలెత్తి, ''పోయిన నోముల పండక్కు పెదనాయుడింటికి సుట్టాలొచ్చినారు. ఒకరూ, ఇద్దరూ గాదు. మూడు కార్ల నిండా వొచ్చినారు. సాకలోడు పొయ్యేటప్పటికి ఈళ్ళ గుడ్డలు, వాళ్ళ గుడ్డలు కలిసి ఒక గుట్ట మాదిరి పడుండాయి. ఒక లారీకి సరిపోయేటన్ని గుడ్డలు. ఇవిట్ని ఉతికి, ఇస్త్రీచేసి పొద్దు పోయేలోగా ఇల్లు చేర్చమని దొరసాని ఆడ్రు వేసింది. సాకలోడు గుడ్డలన్నిటినీ చెరువు కాడికి చేర్చి ఉతకాటం మొదులు పెట్టినాడు. ఉతికి, ఉతికి, ఉతికి ఈని నడువిట్ట ఇరిగిపోయింది. పొద్దట్ల గూట్లో పడింది. గుడ్డలేవో సవసలా. గుడ్డలు ఇల్లు చేరక పోయేటప్పటికి పెదనాయుడికి ఉగ్ర మొచ్చేసింది. 'నా మాట ఇనిపించుకోనోడు. నా ఊర్లోనే వొద్దు' అన్నెప్పి మనుములు పంపిసాకలోనింటికి బీగం ఏయించినాడు. సాకలోడు పెండ్లాం బిడ్డల్తో ఈదుల్లో రావగోసపడినాడు. ఊ సాకలోడైనా సరే. కంసాలోడైనా సరె. దేవుణ్ణి కాదని బతకొచ్చుకాని, పెదనాయుణ్ణి కాదంటే ఇంగ బతుకు యాడిది'' అన్నాడు.

పుల్లిగాడు అతని అడుగుల్లో అడుగేస్తూ, ''సాకలోడూ, కంసలోడేగాదు మాలోడు గూడా అంతే'' అన్నాడు.

ఊరికి వెలుపల ఉన్న చింతచెట్ట కింద కొలిమి నెలకొల్పబడి ఉంది. కంసాలి భార్య ఒక గుండు మీద కూర్చుని కునికిపాట్లు పడుతూ కొలిమి చక్రాన్ని తిప్పుతూంది. పాయ్యిలోని బొగ్గులు ఒక్కటొక్కటే రాజుకుంటున్నాయి. మంట దాపున ఒక సమ్మెట్ట, సుత్తి, పటకారు పడి ఉన్నాయి. ఎడమ వైపున ఒక

తట్టలో బొగ్గులు, మరొక తట్టలో వరి పొట్టు ఉన్నాయి. మరికొంత దూరాన మోకాటిత్తు బూడిద రాశి ఉన్నది. బారెడు పొడవున్న ఉక్కు కడ్డీలు కొన్ని చింత చెట్టు బోదెవద్ద పడి ఉన్నాయి.

కొలిమికి ఇరవై బారల దూరాన ఒక సత్రం ఉన్నది. సత్రం చుట్టూ గోడలు లేవు. బండలతో నిర్మించిన పైకప్పు, రాతిస్తంభాలు మాత్రం ఉన్నాయి. చుట్టగా చుట్టబడిన ఒక ఈత చాప స్తంభానికి ఆనించబడి ఉన్నది. ఆ చాప తప్పిస్తే సత్రమంతా ఖాళీగా ఉన్నది. సత్రాన్నానుకుని ఒక చేదబావి ఉన్నది. బావి చుట్టూ గుర్రపు బండలున్నాయి. బావి గచ్చు మీద చిల్లులు పడిన బొక్కెన ఉన్నది. బొక్కెన తాలూకు ఇనప గొలుసు రాట్నం మీదుగ పడవేసి ఉన్నది.

కునికిపాట్లు పడుతూ చక్రం తిప్పు తుండిన కంసాలి భార్య కళ్ళు నులుముకుని దూరంగా చూడసాగింది. కంసాలి, అతని వెనుక పుల్లిగాడు కాలిదారి వెంబడి ఇటే వస్తుండడం కనిపించింది. ఆమె గుండుమీద నిఠారుగా కూర్చుని చక్రాన్ని తిప్పసాగింది. సవ్వడి చేసుకుంటూ కొలిమి మండసాగింది.

కంసాలి, పుల్లిగాడు కొలిమి చెంతకు వచ్చారు. పుల్లిగాడు చుట్టూ కలియజూసి, చింత చెట్టు బోదె వద్ద పడి ఉన్న ఉక్కు కడ్డీలను చూపుతూ, ''ఇవేనా మనవిప్పుడు కొడవండ్లు చెయ్యాల్సింది?'' అనడిగాడు.,

కంసాలి పంచెను గోచెపోసి కట్టుకుంటూ, ''అవే. రొండు తీసి కొలిమిలో ఎయ్'' అన్నాడు.

పుల్లిగాడు వంగి రెండు కడ్డీలను తీసుకుని వచ్చి కొలిమిలో వేసి, ''ఒక్కొక్కటి ఏవి బరువుండాయన్నా. అసలైన సరుకుగా ఉంది. యాడ సంపాదిస్తివి?'' అన్నాడు.

కంసాలి కొలిమి మంట వద్ద కూర్చుని, ''నేను సంపాదించలేదు. పెదనాయుడే పంపించినాడు. దిగవ తిరపతిలో బంగళా కట్టించినాడుగదా. ఆడ మిగిలిన సామాను'' అన్నాడు. అతడు ఉక్కు కడ్డీలను మంటలో సర్ది ఉంచి, భార్యను చూసి చక్రం జోరుగా తిప్పు అన్నట్లు సైగ చేసి, పుల్లిగాని వైపు తిరిగి, ''ఈ కడ్డీలు మాత్రం పంపినాడు. బొగ్గులూ పంపలేదు. వరిపొట్టూ పంపలేదు'' అన్నాడు.

పుల్లిగాడు చొక్కాను తీసి దాపున ఉన్న జిల్లేడు చెట్టుమీద వేసి, ''బొగ్గులు, వరిపొట్టు పంపకుంటే కొలివి దేన్తో రగలెయ్యాలంట?'' అన్నాడు.

కంసాలి, ''వానమ్మదాన్తో రగలెయ్యాల్నేవో. ఈ బొగ్గులు, వరిపొట్టు రైతుల

దగ్గర కొనుకొచ్చినా. ఇది రెండు రూపాయలు.అది ఒక రూపాయ. మొత్తం మూడు రూపాయలయింది. ఎప్పుడూ ఇంతే. పెద్దనాయుడి పని చేసినప్పుడంత ఇంతే. నాచేతి నుంచి నాలుగు దుడ్లుపోవాల్సిందే గాని, వరుమానం ఉండదు'' అన్నాడు.

పుల్లిగాడు తలపాగా చుట్టుకుంటూ, ''ఈ వరుమానం లేని పని చేసేదానికి దేవుని నెత్తిన గూడా చెత్త ఎయ్యాల్సొచ్చింది'' అన్నాడు.

కొంత సేపటికి ఉక్కు కడ్డీలు మంటలో కరిగిపోతున్నట్టుగ నిగనిగలాడ సాగాయి. కంసాలి పటకారుతో ఒక ఉక్కు కడ్డీని తీసి ఇనుప దిమ్మ మీదుంచాడు. కుడిచేత్తో సుత్తిని తీసుకున్నాడు. ఇంతలో పుల్లిగాడు సమ్మెటను అందుకున్నాడు. ఇంతలో పుల్లిగాడు సమ్మెట ఒక దాని తరవాత ఒకటి లయబద్ధంగా ఉక్కు కడ్డీని ఢీ కొంటున్నాయి.

సూర్యుడు ఆకాశం మీద ఎగబ్రాకి వస్తన్నాడు. ఎండ తాకిడికి రోడ్డుమీది తారు అప్పుడే కరగడం ప్రారంభించింది. రోడ్డుమీద కార్లు, లారీలు సర్రుసర్రుమని దూసుకుని పోతున్నాయి. రోడ్డు పక్కన వరుసగా టెలిగ్రాఫ్ స్తంభాలు నిలబడి ఉన్నాయి. కొన్ని పిచ్చుకలు గుంపుగా ఎగిరి వచ్చి టెలిగ్రాఫ్ తీగల మీద కూర్చున్నాయి. అవి అలా కూర్చున్న కొంత సేపటికి రోడ్డుమీద ''ఢాం'' మని చప్పుడు వినిపించింది. పిచ్చుకలన్నీ ఒక్కసారిగా లేచి ఎగిరిపోయాయి. రోడ్డుమీద శరవేగంతో పరుగిడుతుండిన కారు-దాని టైరు పగిలింది గాబోలు-రోడ్డు పక్కగా వచ్చి ఆగిపోయింది. కారు ఆగగానే దాని-నాలుగు తలుపులు తెరచుకున్నాయి. లోపల్నుంచి ఆరుగురు బయటకుదిగారు. వాళ్ళు తమ భారీ శరీరాలను నెట్టుకుంటూ ఫ్లాస్కులను, ప్లాస్టిక్ బుట్టలను మోసుకుంటూ నడిచి రోడ్డు పక్కనున్న చింత చెట్టు కింద కూలబడ్డారు. డ్రైవరు జాకీని బయటకు తీసి, పంక్చరయిన టైరును మార్చే ప్రయత్నం ప్రారంభించాడు.

సుత్తి, సమ్మెట అవిరామంగా ఉక్కు కడ్డీని తాకుతున్నాయి. దెబ్బలు పడేకొద్ది ఉక్కు కడ్డీ ఎర్రదనాన్ని కోల్పోతూ సాగుతున్నది. కొంత సేపటికి ఆ ఉక్కు కడ్డీ నల్లగా మారింది.

కంసాలి తన చేతిలోని సుత్తిని కిందకు దించాడు. అది సైగగా పుల్లిగాడు గూడా తన చేతుల్లోని సమ్మెటను కిందకు దించి నుదిటి మీద చెమటను తుడుచుకున్నాడు. నల్లగమారిన ఉక్కు కడ్డీని కంసాలి మళ్ళీ కొలిమిలో ఉంచి, తలపాగ తీసి ముఖం తుడుచుకుని వొళ్ళు విరచుకున్నాడు. ఇంతలో పుల్లిగాడు

తన చొక్కాలోనుండి బీడీ కట్టను తీసుకొచ్చి, రెండు బీడీలను కొలిమిలో ముట్టించి ఒకటి తను నోట్లో పెట్టుకుని, మరొకటి కంసాలి కిచ్చాడు.

పుల్లిగాడు బీడీని ఊదుతూ కాసేపు రోడ్డు కేసి చూసి, ''ఊ. చేసేటోడు ఒక్కడు. చూసేటోల్లు ఆరుగురు'' అన్నాడు.

''ఏంది?'' అన్నాడు కంసాలి.

పుల్లిగాడు, ''పని'' అంటూ రోడ్డువైపు చేయి చూపించి, ''అట్టజూడు. టైరు పగిలి అప్పచ్చి అయిపోయింది. దాన్ని ఊడ బెరికే దానికి డ్రైవరు పడే కష్టం పడతా ఉండాడు. సొంత గాళ్ళేవో చెట్టునీడన కూసుని, ఇసన కర్రలు తిప్పుకుంటా తవాస జూస్తా ఉండారు'' అన్నాడు.

కంసాలి గూడా కాసేపు రోడ్డువైపు చూసి, పిడికెడు బొగ్గుల్ను కొలిమి మంటలో వేసి, ''పోయిన జన్మలో ఈడు వొంబి చేత్తే పూజ్జేసినాడు. వాళ్ళు రెండు చేతులా పూజ్జేసినారు. కతలన్నీ మనకెందుగ్గాని, నువ్వు పట్నంలో చేసే పనేందో చెప్పు'' అన్నాడు.

పుల్లిగాని చేతిలో బీడీ ఆరిపోయింది. అతడు దానికి కొలిమి నిప్పులమీద ముట్టించి, ''ఒగిటని లేదన్నా. మేస్త్రీవోడు ఏది చెప్తే అది చెయ్యాల. ఒక దినం సిమెంటు మూటలు మోయమంటాడు. ఇంకొక దినం ఇటుక రాళ్ళు మోయమంటాడు. మల్లొక దినం ఇసుక మూటలు మోయమంటాడు. అన్నీ గుండెల్లో నీళ్ళు దిగే పన్లే'' అన్నాడు.

''సేద్దిం నాద్దిం కొట్టినోడివి నీకివొక లెక్క''.

''అట్టనుకోవద్దన్నా. ఒక్కొక్కసారి నోట్లో రూకేసుకోని పనిలోకెక్కాల. సిమెంటు మూట నెత్తిన బెట్టుకోని - ఈ సింత మానుండాది. సూసినావా - ఇంతకు రెండంతలెత్తు నిచ్చెన మీదెక్కాల. కాలు జారిందంటే మల్ల పుల్సులోకి ఎవిక గూడ మిగల్దు.''

కంసాలి తానే అంత ఎత్తున నిల్చుని ఉన్నట్లు గుడ్లు పెద్దవి చేసి, ''అట్టాటివి గూడ జరగతా యంట్రా?'' అన్నాడు.

పుల్లిగాడు, ''ఎందుకు జరగవన్నా - మొన్ననేనిట్ట యలబారొచ్చేదానికి నాలుగు దినాల ముందు ఏవి జరిగిందనుకున్నావు?'' అని ఆరిపోయిన బీడీని గిరవాటు పెట్టి, ''నలుగురు మనుషులు సిమెంటు, ఇసుక మిసన్లో ఏసి కలపతా ఉండినారు. పక్కనే మేస్త్రీ ఇనప దూలాన్ని క్రేన్‌తో ఎత్తతా ఉండాడు.

క్రేనంటే అదొక పెద్ద మిసన్. ఎంత పెద్ద బరువైనా సరే అలాగ్గా ఈడనుండి ఎత్తి ఆడ పెట్టేస్తుంది. ఇనప దూలం నాలుగో అంతస్తుదాక లేచిందన్నా. అంతే! యాడ మిస్టేకు జరిగిందో ఏవో, దూలం జారిపోయిందన్నా. అమాంతంగా వొచ్చి ఈ నలుగురి మీద పడిందన్నా. నిలుచుకోనుండిన తావున్నే నలుగురు పానాలలొదిలేసి నారన్నా. వీళ్ళు గూడా అడిగినోళ్ళుకారు. పీనుగులు ఈడ పడుంటే పేగులు నాలుగు బారల దూరాన పడుండాయి. ఇంజనీర్లు కంపెనీ వోడు అందరూ పరుగెత్తుకుంటా వొచ్చినారు. ఎవురొచ్చి మాత్రం ఏవి జేస్తారు. పీనుగుల్ను ఈత చాపలో కుట్టి వాళ్ళ పెండ్లాల అడ్రసుకు పార్సిలు చేసేసినారు'' అన్నాడు.

కంసాలి తన చేతిలోని బీడీ ఆరిపోయి ఉండడం గూడా గమనించకుండా తలవంచుకుని మౌనంగా కూర్చున్నాడు. కొలిమిలోని బొగ్గులు పూర్తిగ కాలి తెల్లగ మారి, తేలికై మంటల ఉరవడికి ఎగిరి పక్కలకు పడుతున్నాయి. బొగ్గులన్నీ పక్కలకు పడిపోవడంతో భాళీగా ఉన్న కాలిమి మోత పెడుతూ మండసాగింది. అది గమనించి పుల్లిగాడు తట్లలోనుంచి రెండు దోసిళ్ల బొగ్గులను తీసి కొలిమిలో పోశాడు. కొలిమి నిశ్శబ్దంగా మండసాగింది.

పుల్లిగాడు చేతులను తుడుచుకుని ''ఐతే ఒగిటన్నా. నోట్లో రూకేసుకుని పని చేయాల్నేగాని చేసిన దానికి వరుమానం ఉందన్నా. పొద్దున ఎనిమిది గంటలకు డూటిలో కెక్కతాను. సాయంత్రం ఐదుగంటల్దాక పని. డూటీ అయిపోగానే ఇరవైరూపాయలు చేతిలో పడతాయి'' అన్నాడు.

కంసాలి తలెత్తి ''ఇరవై రూపాయలా? పొద్దుట్నుంచి మావిటేళదాక పన్జేస్తే ఇరవై రూపాయలా? అంతకన్న ఏవి గావాల?'' అన్నాడు.

''అంతే ననుకున్నావా? ఓవర్ టైం అని ఒకటుంది. నీకు ఓపిక ఉంటే ఐదుగంటల తరవాత రాత్రి పదిదాక పని చెయ్యొచ్చు. దానికి తనీగా ఇరవై రూపాయలు.''

కంసాలి ముంజేతులను మోకాళ్ల చుట్టూ వేసుకుని కూర్చుని, ''ఇంగ నీకు కావల్సిందే వుందిరా? ఈ లెక్కన నువ్వు ఒకటి రెండేండ్లలో మిద్దె కట్టేట్టుండావు'' అన్నాడు.

పుల్లిగాడు సన్నగా నవ్వి, ''మిద్దెలు కట్టే దానికి మనగుండా యాడవుతుం దన్నా. కూటికి, గుడ్డకు సరిపోతుందంతే. ఒకర్ని దేహీ అనే పనుండదు'' అన్నాడు.

కంసాలి కొలిమివైపు చేయి చూపించి, ''నాకత జూడు, సంవత్సరంలో ఆర్నెల్లు పనిదొరకదు. పని దొరికినప్పుడు కూలి గిట్టదు. ఇప్పుడీ కొడవండ్లు చేస్తే పెదనాయుడు ఏవిస్తాడు? కొడవలికి యాభై పైసలిస్తే జాస్తి. అంతకన్నా జాస్తి నేనడిగేదీలేదు. అడిగినా వాడిచ్చేదీ లేదు. ఇంగ మిగతా రైతుల పన్లు పుణ్యానికి చెయ్యాల్సిందే గాని, వరుమానం ఉండదు, కొరముట్టు చేసిస్తే కూలి యియ్యరు. నీకు రావల్సింది కళ్లం కాడకొచ్చి తీసుకో అంటారు. తీరా కళ్లం కాడికి పోతే అప్పులోడు గింజలు కొలస్తా ఉంటాడు. నేనింగ వొట్టి చేతుల్తో తిరుక్కోని రావల్సిందే'' అని తల అడ్డంగా ఆడించి, ''ప్చ్ ఊరిడిసి పెట్టినంత పుణ్యంలేదు. ఈ పల్లికొంపలో ఎంత గోజారినా మిగిలేదీ లేదు. మిట్టన పడేదీ లేదు'' అన్నాడు.

పుల్లిగాడు అతని కళ్లలోకి సూటిగా చూస్తూ ''ఐతే ఇంగేవి? నువ్వు కూడా బయల్దేరు. ఇద్దరం కలిసి యలబారదాం'' అన్నాడు.

కంసాలి బిత్తర పోతున్నట్టు చూస్తూ ''యాడికి?'' అన్నాడు.

పుల్లిగాడు 'యాడికేంది? పట్నం. మా సూపరైజరు నాకు బాగ తెల్సినోడే. నీ సత్తకు తగిన పని ఇప్పిస్తా. నువ్వు నా మాదిర ఎడ్డోడివి కాదు. పనోడివి. నీ యట్టాటోల్లకు మంచినీళ్లు తాగినంత సులభంగా పని దొరుకుతుంది. మా అయ్య వచ్చినాక నాలుగు మాటలు మాట్టాడేసి యలబారదాం. '' ఏ వంటావు?'' అన్నాడు.

కంసాలి పుల్లిగాని చూపుల్ను తప్పించుకుంటూ దూరంగా చూస్తూ ''అట్ట తెగవచేసే ధైర్యం ఉంటే ఎప్పుడో బాగు పడుందును. ఆ ధైర్యం లేకపోబట్టే గొర్రెతోక ముడ్డి చుట్టూ తిరిగినట్టు ఈ నారాగోరం బతుకు బతకతా ఉండా'' అన్నాడు.

పుల్లిగాడు అలాగే గుచ్చి చూస్తూ ''అదే మాట మల్లీ మల్లీ అనుకుని ఏవిలాబం? ఇప్పుడు అయ్యేకత జూడు'' అన్నాడు.

కంసాలి అతని చూపులకు భయపడుతున్నట్టు తలవంచుకుని ''నీకు గెవనముందో లేదో. పదేండ్ల కింద ఈ ఊళ్లో కంసల కుటుంబాలు మూడుండె. ఇప్పుడు నేనొకడు మాత్రం. మిగిలినా వాళ్లిద్దరు నాడే ఊరిడ్సిపోయిరి. ఒకడు తిరపతికి పోయి వర్కుషాపు పెట్టుకునె. ఇంగొకడు బెజవాడకు పోయి ఆడనే కాయవైపోయె. నేను పోయేటోడినైతే అప్పుడే పోవాల్సి వుండేవాన్ని.

పుల్లిగాడు ''ఇప్పుడు మాత్రం మించి పోయిందేంది? నాతో వచ్చేట్టుగా ఉంటే చెప్పు యాలబారదాం'' అన్నాడు.

కంసాలి తల ఎత్తి ''నువ్వు మొన్న పుట్టి నిన్న కండ్లు తెర్చినోడివి. నేను ఇదే కొలివి దగ్గర యాభై ఏండ్లు బతికినా యాభై ఏండ్ల మర్లు తెంచుకుని బయలు దేరాలంటే....

పుల్లిగాడు అతడు చెబుతున్నదానికి అడ్డు వస్తూ ''పావరం- ఇదంతా పావరమన్నా. యాభై ఏండ్లుగా ఈ కొలిమి దగ్గర గోజార్తివి. ఇది నిన్ను యాడికి తీసుకొచ్చింది. గోచి పాతకాడికి తీసుకొచ్చింది. ఇంగా దీని మీద ఏవిటికన్నా పావరం?'' అన్నాడు.

కళ్లలో బాధ కనిపిస్తుండగా కంసాలి ''కొలిమినని ఏవి లాబంరా. అది మా లక్ష్మి. దాన్నడ్డం పెట్టుకుని మా అయ్య, మా తాత ఇదే ఊర్లో పాలెగాళ్లు మాదిరి బతికినారు. ఇప్పుడు కలిమాయ వచ్చి కూచోబట్టి కొలివిపని గిట్టుబాటు కావడంలేదు'' అన్నాడు.

పుల్లిగాడు ''కొలిమి పనేగాదు. అన్ని పన్లూ అట్టనే ఉండాయి. కంసలోనికి కొలిమి గిట్టుబాటు కావటం లేదు. మంగలోనికి అడపం గిట్టుబాటు కావటం లేదు. రైతుకు సేద్దిం గిట్టు బాటు కావటం లేదు. మాలోనికి కూలిపని గిట్టుబాటు కావటంలేదు. ఈనమ్మ అన్నీ అట్టనే ఉండాయి. ఇవన్నీ కండ్ల చూసినాకనే ఊరిడ్సిపోయినా. ఇది నీకు గోసిరం కావాలంటే ఇంకెన్నాళ్లు పడ్తుందో'' అన్నాడు.

కంసాలి దీర్ఘంగా నిట్టూర్చి ''ఊ. సూద్దాం. నొస్టిన రాసిన కాడికి అవుతుంది. రాజ్జిం మీద పోయి బతకాలని రాసుంటే అట్టనే అవుతుంది'' అని పైకి లేచాడు. లేస్తుండగా అతని నడుము మోకాళ్లు పటపటమన్నాయి. అతడు అల్లంత దూరాన ఉన్న జిల్లేడు చెట్ట చాటుకు నడిచి మూత్ర విసర్జన చేసి తిరిగి వచ్చాడు.

కొలిమిలో ఉక్కు కడ్డీ ఎర్రగా కాలి ఉన్నది. అది ద్రవ రూపాన్ని సంతరించుకుని ప్రక్కలకు ప్రవహించనున్నట్టుగా అనిపిస్తున్నది. కంసాలి దానిని పటుకారుతో తీసి ఇనుప దిమ్మ మీద ఉంచి, సుత్తిని చేతిలోకి తీసుకున్నాడు. పుల్లి గాడు పైకి లేచి గుండెల నిండా గాలి పీల్చుకుని సమ్మెటను అందుకున్నాడు.

కంసాలి చేతిలోని సుత్తి, పుల్లిగాని చేతిలోని సమ్మెట లయతప్పకుండా

ఉక్కు కడ్డీని బాదుతున్నాయి. వాళ్లిద్దరి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఎద్దుబుసవలె వినిపిస్తున్నది. వాళ్ల రెక్కల మీది కండరాలు కప్పను మింగిన పాములె సాగుతూ, సట్టు చిక్కిన జలగవలె సాగుతూ ఉన్నాయి. వాళ్ల శరీరాలలోని కీళ్లు కిటికీ రెక్కల వలె ముడుచుకుంటూ, తెరచుకుంటూ ఉన్నాయి. వాళ్ల నుదిటి మీద, ఛాతిమీద, రెక్కల మీద చెమట బిందువులు ప్రత్యక్షమయ్యాయి, ఆ బిందువులు ఒక దానితో ఒకటి కలిసి ధారలుగా ప్రవహించ సాగాయి.

ఒక కాకి రెక్కలు కొట్టుకుంటూ వచ్చి సత్రం మీద వాలింది. కావు కావుమని కొంత సేపు అరచి ఎగిరి బావి చుట్టూ ఉన్న గుర్రపు బండలలో ఒకదానిమీద కూర్చున్నది. అది తన తలను అటూ ఇటూ వాలుస్తూ బావి గట్టు మీదున్న బొక్కెనలోకి తొంగి చూసింది. మరి కొంతసేపు కావు కావుమని అరచి గబుక్కున బొక్కెన అంచు మీదకు దూకి, అంది అందీ నీళ్లు తాగ సాగింది. క్షణమాలస్యమైతే బొక్కెన లోని నీళ్లు ఇంకిపోతాయన్నంత ఆత్రంగా తాగి రివ్వుమని ఎగిరి మళ్లీ సత్రం మీద కూర్చుంది.

సూర్యుడు ఆకాశాన ఎగబ్రాకేకొద్ది అతని కిరణాలు మరింత నిలువుగా భూమిని తాకుతున్నాయి. చింతమాను కొమ్మల ద్వారా పాడ ఎండ కొలిమిమీద పడుతున్నది.

కంసాలి, పుల్లిగాడు బిస ఇచ్చిన యంత్రాల వలె, మంత్రించిన బొమ్మల వలె పనిచేస్తున్నారు. ఆయాసం ముంచుకొస్తున్నా గాని వారి చేతులలోని ఆయుధాల లయ తప్పడం లేదు. అంతకంతకు తమను ఆవరిస్తున్న ఆయాసాన్ని భయపెట్టి పారద్రోలేందుకన్నట్టు వారు తమ ఊచ్ఛ్వాస, నిశ్వాసాలను మూల్గులుగా మార్చుకుని హుంకరిస్తున్నారు. ఎడతెగని రాపిడి వలన వాళ్ల కీళ్లలో పుట్టిన వేడి సూర్యతాపాన్ని అధిగమించడానికి ప్రయత్నిస్తున్నది. వాళ్ల దేహాలు సన్నటి చెమట పొరతో కప్పబడ్డాయి. పొయ్యిలో నుండి లేచిన బూడిద వాళ్ల చర్మం మీద పడి కరిగి వాళ్లకు వికృత రూపాన్ని ఆపాదిస్తున్నది.

చాల సేపటినుంచి నిశ్శబ్దంగా కూర్చుని ఉండిన కాకి ఆగ్రహారం వైపు మెడ ఎత్తి చూస్తూ అరవ సాగింది. కంసాలి నల్ల బారిన ఉక్కు కడ్డీని మళ్ళీ మంటలో పెట్టాడు. అతడు చిరాకు కలిగించేట్టుగా అరుస్తున్న కాకివైపు కళ్ళు చిట్లించుకుని కొంత సేపు చూసి, కూర్చుని ఉన్నచోటునుండే వెనుదిరిగాడు.

అతనికి రెండు బారల దూరాన ఒక రైతు నిలబడి కోపం కొట్ట వచ్చినట్టు కనిపిస్తున్నది. అతడు కొలిమిని కలయ జూసి, '' ఏంరా కంసలోడా? ఈ పొద్దు

నిద్దర్లేస్తానే నా గానిగి పెనం కట్టిస్తానంటివి. ఇదేనా నువ్వు కట్టియ్యటం?'' అన్నాడు.

కంసాలి నిరుత్తరుడై నేల చూపులు చూశాడు.

రైతు ఒకడుగు ముందుకేసి, ''నేనడిగిందేందిరా. పెనుముకు సరిపొయ్యే రేకు కొనిస్తిని. కావల్సినన్ని చీలలు కొస్తిని. బొగ్గులిస్తిని. పని నీకు అప్ప జెప్పి వారం దినాలయింది. ఈయాలకు నువ్వు పని మొదులుపెట్టలేదు. నీ నాబిలో నువ్వు ఏమనుకుంటా ఉండావు?'' అన్నాడు.

కంసాలి తల ఎత్తి ''ఏవి చెయ్యమంటావన్నా'' అని ఏదో చెప్పబోయి, ''నువ్విచ్చిన సావానంతా ఇంట్లో బద్రంగా ఉందన్నా. రేపు పొద్దు పొయ్యేలోగా నీ పని చేసిపెట్తా'' అన్నాడు.

రైతు, ''సావానం ఇంట్లో పెట్టుకోనుంటే నాకేమొస్తుందిరా. అదేవన్నా పిల్లలు పెడ్తుందా? ఒక పక్క పరాయోని గానుగ తెచ్చి ఇంట్లో పెట్టుకోని మూడు దినాలయింది. దినానికి బాడిగ ఇరవై రూపాయలు. ఇప్పటికే అరవై రూపాయలు ఏట్లో ఏసినా. నువ్వేమో సావానంతా ఇంట్లో బద్రంగా ఉండాదంటా ఉండావు'' అన్నాడు.

కంసాలి బూడిదతో నిండిన ముఖాన్నితుడుచుకుని, ''ఈ పొద్దు నిద్దర లేవగానే నీపనే ఎత్తుకోవాలనుకుంటిన్నా. ఏవి జెయ్యాల. నేను ఈదిలోకి రాగానే పెదనాయుడోల మనిసొచ్చినాడు. అర్జంటుగా యాబై కొడవండ్లు చెయ్యమని సామాను పంపినాడు'' అన్నాడు.

పుల్లిగాడు అందుకుని, ''అవును సావి. పెదనాయుడోల్ల మనిసి రాంగానే కంసలాయన దేవలానికి పొయ్యేపని గూడా సాలించుకుని కొలివి కాడి కొచ్చేసివాడు'' అన్నాడు.

రైతు పుల్లిగాని వైపు, 'నువ్వు నోర్ముయ్' అన్నట్టు చూసి గొంతు పెంచి కంసాలితో, ''పెదనాయుడు నీ కంత ఎక్కవైనోడనిపిస్తే నీ పెండ్లాన్ని తీసికిపోయి వాని పక్కన పండబెట్టు. అంతేగాని ఊర్లో రెతుల్ను ముండమొయ్యించొద్దు'' అనరిచాడు.

చెమట తుడుచుకోవడంలో మరింత నల్ల బారిన ముఖాన్ని పైకెత్తి కంసాలి, ''అట్టాటి సిన్నమాటలేవిటికన్నా? నీ పని చెయ్యనంటినా. నువ్వు సామాను ఇయ్యలేదంటినా. ఇంకొక దినం సమాళించుకోనుండన్నా. రేపు మావిటేళకు నీ కొరముట్టు నీకు చేరుస్తా'' అన్నాడు.

రైతు మరింత కోపంగా, ''నేను సమాళించుకోనుంటాన్రా. నేను సమాళించుకోనుంటే ఏవి పుణ్యం. గానిగి బాడుక్కిచ్చినోడు సమాళించుకోనుండాల గదా. ఈ పొద్దికి దాని బాడుగ అరవై రూపాలయింది. రేపటికి యనభై. ఈ యనభై రూపాయలు అచ్చుకునేదెవుడు? నీ పెండ్లాంతో పొయ్యినోడు అచ్చుకుంటాడా? నీయమ్మతో పొయ్యినోడు అచ్చుకుంటాడా''? అన్నాడు.

అకస్మాత్తుగా కొలిమి చక్రం వేగంతో పోయింది. కంసాలి భార్య మగవాళ్ళ వైపు నిర్జీవంగా చూస్తూ, అసంకల్పితంగా చక్రాన్ని మెల్లగా తిప్పసాగింది.

కంసాలి పైకి లేచి, ''మల్లీ చిన్నమాటలేవిటి కన్నా. తక్కువ కులపోణ్ణయినా నేనూ పనోణ్ణే. నిర్మిమిత్తంగా నోరు జారొద్దన్నా'' అన్నాడు.

రైతు, ''పని వొప్పుకుని వారం దినాలయింది. కొరముట్టు వొప్ప జెప్పే బగిసిలేద. ఇంగ నీ పని తనమేందిరా? ఏందిరా నాలిక పెరుక్కుంటా వస్తె ఉండావు?'' అన్నాడు.

ఇంతలో మరొక రైతు విసవిస నడుస్తూ కొలిమి దగ్గరకొచ్చాడు. అతడు మొదటి రైతును చేరువుగా వచ్చి ''ఏంది మావా రంపు?'' అన్నాడు.

మొదటి రైతు కంసాలి వైపు చూపిస్తూ, ''ఈ కంసలోడు ఊర్లో వాళ్ల పన్లేవీ చెయ్యడంట. ఈణ్ణి పెదనాయుడు గుత్తకు కొనేసినాడంట. ఇంగ పెదనాయుడి పన్లు తప్ప ఇంగెవురి పన్లూ చెయ్యడంట'' అన్నాడు.

కంసాలి, ''ఆ మాట నేనెప్పుడెంటిన్నా. ఊరికంతా ఒకటే కొలివి. ఒకడే కంసలోడు. అందరి పన్లూ ఒకసారే చెయ్యాలంటే నాగుండాయట్ట అవుతుంది? నాకు మాత్రమేవి నాలుగు చేతులు, నాలుగు కాళ్ళుండాయా?'' అన్నాడు.

రెండవ రైతు, ''అందుకే గదా నీ కంత ఆంకారం. ఊరికంతా ఒకే కంసలోడుండబట్టే నీ కింత ఆంకారమొచ్చింది. అద్దెల్సుకుని నువ్వు రైతుల్నందర్నీ కోతుల్నాడించినట్టు ఆడిస్తె ఉండావు'' అన్నాడు.

కంసాలి, ''నువ్వుగూడా అట్టనే అంటా ఉండావేందన్నా. మీ పన్లు జేసి మీరు పోసే గెంజి తాగి బతికేటోణ్ణి. నేను మిమ్మల్ను ఆడించేదేందన్నా. ఇంతకు ముందు ఈ ఊర్లో ముగ్గురు కంసలోల్లుండిరి. ఇప్పుడు నేను ఒంటి గాణ్ణయితి. పెండ్లాన్ని ఆ చక్రం కాడ కూసోబెట్టి నేనీ పొయ్యి ముందర గోజార్తా ఉండా. అన్నీ తెల్సినువ్వూ అట్టనే మాట్లాడితే యట్టన్నా'' అన్నాడు.

రెండవ రైతు మోర ఎగర వేసుకుంటూ ముందుకు వచ్చి, ''అట్టగాక

ఇంగెట్ట మాట్లాడమంటావురా, మా గిత్తలకు లాడాలు చెయ్యమని పద్దినాల్నుంచి అడుక్కుంటా ఉండా. ఇద్దో అద్దో అని తిప్పించుకుంటా ఉండావు. గిత్తలకు గొట్టిలరిగిపోయి అడుగు తీసి అడుగేస్తే నెత్తురు కార్తా ఉంది. ఐదెకరాల దుక్కి అట్టనే దున్నినాయి. ఒక్కొక్క కొండ్రకు పడినెత్తురు కార్సినాయి. తల్చుకుంటే కడుపు కాలిపోతూ ఉంది. ఊర్లో కంసలోడు ఉండి పుణ్యమా లేక పుణ్యమా?'' అన్నాడు.

కంసాలి, ''దీంట్లో నా తప్పేముందన్నా, నీ గిత్తలు నెత్తురు కార్సుకుంటా దుక్కిదున్నితే నాకేవన్నా సంతోసవా? నువ్వు దుడ్డు చేతిలో ఎయ్యంగానే సామాను కోసం యలబార్తివి. తిరగని సంతలేదు. తిరిగి తిరిగి నిన్నటికి సామానం సంపాదిస్తి. రేపో, మొన్నాడో తీరుబాటు చేసుకుని లాడాలు చేద్దామనుకుంటా ఉండా'' అన్నాడు.

రెండవ రైతు, ''ఇప్పుడు చేసి ఏవి లాబంరా? పనంతా అయిపోయినాక లాడాల్తో నాకింగేం పని? తయారు చేసి నీ పెండ్లాం దానికి కొట్టుకో'' అన్నాడు.

కంసాలి కళ్ళలో కొలిమి మంటలు ప్రతి ఫలించ సాగాయి. అతడు, '' ఎగు బొద్దున నా కడుపులో మంట పెట్టొద్దన్నా. ఎక్కవ కులంలో పుట్టినారు. ఇట్టా సీనాగెతి మాటల నొద్దన్నా'' అన్నాడు.

రెండవ రైతు ఏదో అన బోతుండగా మొదటి రైతు అతనిని వారించి, ''కంసలోడా మేము ఎగబొద్దున ఏవి జెయ్యాల్నో, దిగు బొద్దున ఏవి జెయ్యాల్నో నువ్వు చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడు నేనడిగే దానికి జవాబు చెప్పు. నా గానిగి పెనం కట్టిస్తావా లేదా అజ్జెప్పు'' అన్నాడు.

కంసాలి మళ్ళీ పాయ్యి ముందర కూర్చుని ''చెప్పినాను గదన్నా. రేపు మావిటేళకు నీ కొరముట్టు తయారుజేసి నీ కొప్పగిస్తా'' అన్నాడు.

మొదటి రైతు భుజం మీదున్న కండువాను తీసి తలకు చుట్టుకుని, ''రేపుమావిటేళగాదు. ఇప్పుడు నీ చేతిలో ఉండే పని కింద పెట్టేసి నాపని ఎత్తుకుంటావా లేదా?'' అన్నాడు.

కంసాలి తను కూర్చుని ఉన్న చోటునుండి తల ఎత్తి, ''నీకు తెలవందే వుందన్నా. పెదనాయుడోల్ల పని మద్యన వొదిలేస్తే మల్లనేనీ ఊర్లో బతకతానా? ఆ పనీ ఈ పనీ ఒకేసారి చెయ్యాలంటే నాగుండా అవుతుందా?'' అన్నాడు.

మొదటి రైతు, ''మరి మాపన్లు చెయ్యనప్పుడు నువ్వీ ఊర్లో ఉండి ఏవిలాబం? ఈడ ఈ కొలివి ఉండి ఏవి లాబం?'' అని చక్రం చెంతకు నడిచి, ''ఆడ్నుంచి లెయ్యవే కంసల దానా!'' అన్నాడు.

కంసాలి భార్య భయపడుతూ లేచి దూరంగా నిలుచుంది. తిరుగుతున్న చక్రాన్ని రైతు తన రెండు చేతులతో పట్టి ఆపి, ''నాపని జరగనప్పుడు ఈ చక్రం యట్ట తిరుగుతుందో చూస్తా. ఈ కొలివి యట్ట పన్జేస్తుందో నేన్జూస్తా'' అన్నాడు.

పాయ్యిలో మూరెడెత్తు లేచి ఉన్న మంట చక్రం ఆగిపోవడంతోనే గబుక్కున కూలిపోయి మాయమయింది. ఆమంట యావత్తూ కంసాలి శరీరంలోకి ప్రవేశించినట్లుగా అతని కళ్ళు ఎర్రనయ్యాయి. అతడు పైకిలేచి, ''ఇద్దో, నువ్వు రైతువి గదా అని ఇంతసేపు మర్యాద ఇస్తావొచ్చినా. నా కొలివి మీద సెయ్యి ఏసినాక ఇంగ నీకు మర్యాద దక్కదు. ముందు ఆ చక్రం మీదనుంచి చెయ్యితియ్''. అన్నాడు.

మొదటిరైతు, ''కొలిమి మీద చెయ్యి ఎయ్యటం కాదురా. దీన్ని ఇరగొట్టి కుప్ప పెట్రాన్రా. అదీ నేనొచ్చుండే పని. నువ్వు ఎవుర్తో చెప్పుకుంటావో పోయి చెప్పుకో'' అని ఒక అంగవేసి సమ్మెటను తీసుకుని పుష్టికొద్దీ చక్రం మీద మోదాడు. చక్రం పెళ్ళుమని విరిగి కిందబడింది. రైతు మళ్ళీ సమ్మెటను పైకెత్తి నీలిగి చక్రానికి ఆధారంగా ఉన్న నిద్రాతి పైన బాదాడు. నిద్రాయి రెండుగ పగిలి నేల మీద పడింది.

కంసాలి హుంకరిస్తూ ముందుకురక బోయాడు. ఇంతలో రెండవ రైతు పరుగెత్తి వచ్చి పిడికిలితో పుష్టిగా అతని మీద గుద్ది, ఎగిరి మోకాలితో రొమ్ము మీద పొడిచాడు. వయసు చేతను, అర్థకలివల్లను బలహీనుడై ఉన్న కంసాలి వెలకిల పడ్డాడు. అతడు పక్కకు తిరిగి మోచేతులను, మోకాళ్ళను భూమిపైన ఆనుకుని అతికష్టం మీద లేచి కూర్చున్నాడు.

ఈలోగా మొదటి రైతు సమ్మెటను గిరవాటు పెట్టి చేతులను తుడుచుకుని వెనుదిరిగి గ్రామంవైపు నడవసాగాడు. రెండవ రైతు గూడా అతననుసరించి నడవసాగాడు.

కంసాలి మండుతున్న తన ఎదను, నెత్తురోడుతున్న పెదాలను తడివి చూసుకున్నాడు. ముక్కలు ముక్కలైన చక్రాన్ని చూశాడు. అతడు పులివలె రొప్పుతూ, ''ఒరె. నాకొడుకుల్లారా, ఆడనే ఉండండ్రా. నోరులేని ఆ చక్రాన్ని

ఇరగ్గొట్టంగానే మొగోళ్ళయిపోయినారంట్రా. నీ యమ్మల. నేనొచ్చేదాక ఆడనే ఉండండ్రా'' అంటూ ఉరకబోయాడు. పుల్లిగాడు గబగబ వచ్చి అతని రెక్కల కింద చేతులేసి వాటేసుకుని ఆపుతూ, ''కోపం సల్లార్చుకో అన్నా. కాలం కానప్పుడు ఇట్టాటివన్నీ వోర్చుకోవాల. మనసు నిబ్బరించుకో అన్నా'' అన్నాడు.

కంసాలి పుల్లిగాణ్ణి మోచేతులతో కుమ్ముతూ, ''నన్నిడవరా పుల్లిగా, నన్నిడిసి పెట్రా. నా కొలివి పోయినాక ఇంగ నేను బతికేదేవిటికి? నన్నిడ్సి పెట్రా. వాళ్ళను తీసుకొచ్చి నా కొలివికి గావియ్యాల. వాళ నెత్తుర్దీసి కొలిమి చుట్టూ పాలి చల్లాల. నన్నిడ్సిపెట్రా'' అంటూ అరవసాగాడు

రైతులు సత్రాన్ని, చేదిబావిని దాటుకుని వెంపలి చెట్లగుండా, జిల్లేడు చెట్లగుండా నడుస్తూ గ్రామం వైపు సాగుతున్నారు.

కంసాలి పుల్లిగాని పట్టునుండి తప్పించుకోవడానికై ప్రయత్నిస్తూ పెనుగులాడుతున్నాడు. అతని కాళ్లతాకిడికి నేలమీద బూడిదతోకలిసిన దుమ్ము మేఘం వలె లేస్తున్నది. అతడు నెత్తురు కలిసిన ఎంగిలి ఉమ్ముతూ బూతులు తిడుతున్నాడు.

రైతులు కనుచూపు మరుగయ్యేక పుల్లిగాడు కంసాలిని వదిలి పెట్టాడు. అప్పటికి కంసాలికి విశత్వం ముంచుకు రాసాగింది. అతడు కలలో నడుస్తున్నట్టు నాలుగు అడుగులు వేసి చిందర వందరగా పడి ఉన్న కొయ్య పలకల చెంతకు నడిచాడు. విరిగిపోయిన కొయ్యచక్రం తాలూకు ముక్కలు కన్నీటిపొర గుండా మరింత చిందర వందరగా, మరింత గజిబిజిగా కనిపించాయి. వేదనతో రుద్దమయిన కంఠంతో అతడు, ''నా కొలివిని కూలగొట్టినార్రా. నా గెంజిలో మన్ను పోసినారు. ఈ పన్జేసే దాని కన్న నా కాళ్ళు; చేతులు ఇరగ్గొట్టరాదా. అదే సమ్మెటతో నా తల పగలగొట్టరాదా? నేనింగేవి అడ్డం పెట్టుకోని బతకాల'' అన్నాడు.

పుల్లిగాడు అతనికి చేరువగా నడిచి ఏదో చెప్పబోయి నోటమాట రాక తలవంచుకుని నిలుచున్నాడు.

కంసాలి కళ్ళు తుడుచుకుని, ''రేపట్నుంచి చిప్ప పట్టుకుని యాదిక్కుకని పోవాల? ఎవుని పంచ జేరాల. కీలు కీలూ వొంచి కష్టం జేసినోణ్ణి. 'యాబై ఏండ్లు వొళ్ళు గుల్ల జేసుకుని ఆకిరుకు ఈ పొద్దిటికి బిచ్చ గోడినయితి'' అన్నాడు.

దుఃఖము, అసమర్థత రెండు కొండలవలె మారి తనను ఆణగ ద్రొక్కుతున్నట్టు అతని నడుము, మోకాళ్ళు వంగసాగాయి. అతడలాగే నేలమీదకు వాలి పిర్రలు మీదను, గుది కాళ్ళ మీదనూ కూర్చున్నాడు. ముంజేతులను మోకాళ్ళ చుట్టూ వేసి నుదుటిని మోకాళ్ళమీద ఆనించాడు. చింతమాను కొమ్మల గుండా ప్రసరిస్తున్న ఎండ ఎగిరెగిరి పడుతున్న అతని డొక్కల మీదను, కంపిస్తున్న గూళ్ళ మీదనూ పడుతూ ఉంది. అతన్ననునయించ డానికి మాటలు రాక, అక్కడ నుండి వెళ్ళి పోవడానికి మనసురాక పుల్లిగాడు మౌనంగా నిలబడ్డాడు.

10

అది పౌర్ణమి వెళ్ళిన తరువాతి రాత్రి. సందెచీకటి దట్టంగా అలుముకుని ఉన్నది. కూలి పోయిన కొలిమి దాపున ఉన్న సత్రం నక్షత్రాల కాంతిలో లీలగా కనిపిస్తున్నది. మందంగా వీస్తున్న గాలిపాటుకు బూడిద తొలిగిపోవడంతో పొయ్యిలోని నిప్పు కణికలు నిగనిగలాడుతూ కనిపించసాగాయి. కొలిమి వెనక నున్న వెంపలి చెట్ల లోను, జిల్లేడు చెట్లలోను అసంఖ్యాకములైన మిణుగురు పురుగులు అవిరామంగా ఎగురుతున్నాయి.

సత్రంలో ఎక్కడో ఒక బైరాగి కూర్చుని తంబుర మీటుతూ వీరబ్రహ్మంగారి తత్వాలను పాడుతున్నాడు. అతని పాటకు శ్రోత లెవరూ లేరు. శాపగ్రస్తమైన జీవితం లోని అనుభవాలను, జ్ఞాపకాలను తాత్కాలికంగా మరచి పోవడానికి అతడు ప్రయత్నిస్తున్నాడు. ఆర్ద్రమైన అతని కంఠంలో నిరాశ, పరాజయం ధ్వనిస్తున్నాయి. వీరబ్రహంగారు తన ప్రధాన శిష్యుడైన సిద్ధయ్యకు లోకపు తీరును వివరిస్తున్నాడు. మానవ సంబంధాలలోని రాక్షసత్వాన్ని, సృష్టియొక్క నిరర్థకతను అతడు విపులీకరిస్తున్నాడు.

గాలి వీచే కొద్ది కొలిమి పొయ్యిలోని బూడిద తొలిగి పోయి నిప్పులు బయట పడుతున్నాయి. గాలి పాటుకు చెట్ల కొమ్మలు, ఆ కొమ్మలను అంటి పెట్టుకుని ఉన్న మిణుగురు పురుగులు కూడా కదులుతున్నాయి.

ఊరి చివరనున్న ఇంట్లో నుండి ఒక యువకుడు గర్రున త్రేన్చుతూ వీధిలో కొచ్చాడు. వీధిలో నిలబడిభుక్తాయాసం వలన ముఖం మీద పట్టిన చెమటను తుండు గుడ్డతో తుడుచు కున్నాడు. చొక్కా జేబులో నుండిన ఒక బీడీని తీసుకుని దాపునున్న కొలిమివైపు నడిచాడు. వంగి కొలిమి పొయ్యిలోని నిప్పుమీద బీడిని అంటించుకుని వెనుదిరిగి రెండడుగులు వేసి సత్రంలో నండి వస్తున్న

పాటను విని ఆగిపోయాడు. బీడిపొగను లాగుతూ కాసేపు ఆ పాటను విని అసంకల్పితంగా సత్రం దాపుకు నడిచాడు.

బైరాగి తన పాటను ఆపి, ''ఎవురాడ?'' అన్నాడు.

యువకుడు బీడీ ఉన్న తన చేతిని వీపు మీద కట్టుకుని ''మాదీవూరే సావి. ఆ కడా ఇల్లే మాది. బీడీ ముట్టించుకుందావని కొలివి కాడి కొచ్చినా. నువ్వు పాడే పాట ఇంకా నాలుగు నుడుగులిందావనిపించింది. లోకమ్మీద జరిగేది పాడతా ఉండావు. ఇదేవి పాట సావి?'' అన్నాడు.

బైరాగి తంబురను కిందపెట్టి, ''దీన్నిగురుసిష్యుల సంవాదవంటారు నాయనా. గురువు వీరబ్రహ్మం. శిష్యుడు సిద్దయ్య. ఈ లోకం యట్టానడస్తా ఉండాద నేది బెమ్మంగారు ఇలా వరిగా సిద్దయ్యగారికి చెప్తా ఉండాడు'' అన్నాడు.

యువకుడు బీడీని స్తంభానికి రాచి, చెవిలో చెక్కుకుని, ''సరిగ్గా మా వూర్లో జరిగేవే చెప్తా ఉండావు సావి. ఈ కరుమోలాలు మా వూర్లోనే జరగతా ఉండాయనుకుంటి. ప్రపంచమంతా ఇట్టనేనా సావి?'' అన్నాడు.

బైరాగి దీర్ఘంగా నిట్టూర్చి, ''లోకమంతా ఇట్లనే. ఎండలు గాసే మండలమంతా ఇట్లనే. ఐతే సిద్దయ్యకు గూడా నీ కొచ్చిన డగుట్టే వచ్చింది. లోకం నిండా ఇన్ని కరుమోలాలు, కల్లేడుపులు ఉండాయంటే సిద్దయ్య నమ్మలా. అప్పుడు బెమ్మంగోరు 'శిష్యా' నేను చెప్పింది ఎక్కువగాదు, నువ్వు యినింది ఎక్కువగాదు. నువ్వు కట్టుగుడ్డల్తో బయల్దేరి లోకమంతా తిరిగి నేను చెప్పింది జరగతా ఉందో లేదో పెబ్బిలిగ్గా చూసిరా, అని ఆగ్ని ఏసినాడు. ఆ పకారవే సిద్దయ్య గోరు కట్టుగుడ్డల్తో యిల్లిడిసి యలబారి నాడు. ఒక దినంగాదు. రొండు దినాలుగాదు. ఐదు సంవత్సరాలు లోకవంతా కల్దిరిగినాడు. తిరగని ఊరులేదు. ఎక్కిదిగని గడప లేదు. పలకరించని మనిసి లేదు. సూడని యవ్వారం లేదు. ఐదు సంవత్సరాలయినాక ఆయన తిరిగి రాంగానే బెమ్మంగోరు, 'లోకం ఎట్టుందిరా శిష్యా?' అనడిగినాడు. దానికి సిద్దయ్య ఒకే మాట చెప్పినాడు. 'లోకం ఎవుని లోకం వానిదిగా ఉంది సావి. ఇంతలోకం తిరిగి నేను తెల్సుకునింది ఇదొక్కటే' అన్జెప్పినాడు'' అన్నాడు బైరాగి.

యువకుడు ఫకాలున నవ్వి, ''సరిగ్గా చెప్పినాడు సావి. లోకం ఎవుని లోకం వానిదిగా ఉంది. అంతా టూకీగా ఒకే మాటలో బలే చెప్పినాడు. అందుకే అంటారు: బెమ్మంగారి వంటి గురువులేదు. సిద్దయ్యగోరివంటి శిసువు

లేదు అని'' అంటూ సత్రపు స్తంభాన్ని ఆనుకుని కూర్చుని, ''ఇంగొక నాలుగు నుడుగులు పాడుసావి'' అన్నాడు.

బైరాగి తంబుర తీగలను సవరించుకుని, తన గాత్రం విప్పాడు.

11

ఆ గ్రామంలో పలురకాలైన వృత్తి పనుల వారున్నారు. చాకలి, మంగలి, కంసాలి, వడ్రంగి, కుమ్మరి– ఇలాంటి జాతుల వారందరు నివసిస్తున్నారు. వాళ్ళందరికీ తమతమ కుల వృత్తులే ప్రధాన జీవనాధారం. ఐతే కాలక్రమాన ఒక కులం వారు వేరొక కులవృత్తిని ఆశ్రయించడం జరుగుతున్నది. మంగలివాడు తన అడపానికి, తగినంతపనిలేనప్పుడు వ్యవసాయ భూములలో కూలిపని చేస్తున్నాడు. కుమ్మరివాడు తన కుండలకు గిరాకి లేనప్పుడు రైతుల దగ్గర కూలి పని చేస్తున్నాడు. వడ్డెరవాళ్ళు తమ రాతిపని గిట్టుబాటుగానప్పుడు పెద్ద రైతుల దగ్గర కొంత పొలం కౌలుకు తీసుకుని చేస్తున్నారు. రైతులు తమకున్న గోచి పాత యడం కయ్యలలో వ్యవసాయం గిట్టుబాటు కానప్పుడు అదనపు ఆదాయం కోసం పందులను, మేకలను మేపుకుంటున్నారు.

సాలె, కమ్మరి వంటి వాళ్ళు కొందరు సమీప పట్టణాలకు తరలి వెళ్ళి తమ కుల వృత్తులను యంత్ర సహాయంతో కొనసాగిస్తున్నారు. ఆ పట్టణాలలో వాళ్ళ మనుగడ గ్రామంలో ఉన్నప్పటికన్న సుఖతరంగా ఉన్నట్టు వినికిడి. అందుకే సాలెవాళ్ళ మగ్గం దగ్గిర, కంసాలి వాని కొలిమి దగ్గిర, కుమ్మరివాని ఆవం వద్ద, 'ఈనమ్మ. తెంపు చెయ్యాల్నేగాని ఊరిడ్సినంత పుణ్యం లేదు' అన్న మాట తరచూ వినిపిస్తుంటుంది.

ఇకపోతే సాంఘిక, ఆర్థిక పరిస్థితుల వొత్తిడి మూలాన కొందరు తమ కులవృత్తులకు స్వస్తిచెప్పి, వేరొక వృత్తిని చేపట్టడం గూడా జరుగుతున్నది. మొన్నటి దాక ఆ గ్రామంలో ఇద్దరు చాకలి వాళ్ళుండేవారు. వాళ్ళిద్దరూ అన్నదమ్ములు. రెండుకుటుంబాలు కలిసి ఉండేవి. ఊర్లో వాళ్ళ బట్టలన్నీ వాళ్ళిద్దరే ఉతికేవాళ్ళు. వాళ్ళకు నాలుగెకరాల భూమి, జత గిత్తలు, ఒక నాగలి, ఇతర వ్యవసాయ పనిముట్లు ఉండేవి. ఇద్దరుకలిసి వ్యవసాయం చేసేవాళ్ళు. క్రమక్రమంగా వాళ్ళిద్దరి మధ్య రవరవలు బయలు దేరాయి. వాళ్ళు విడిపోవాలనుకున్నారు. వాళ్ళ ఆదాయపు వనరులను రెండు సమభాగాలుగ విభజించడంలోచాల గొడవయింది. వాళ్ళ సమస్యను తీర్చడానికి ఊరి పెద్దలు

కూర్చున్నారు. అంచనా వేయగా నాలుగెకరాల భూమి ద్వారా వస్తున్న ఆదాయము, కులవృత్తియైన చాకలిపని ద్వారా వస్తున్న ఆదాయము సరిసమానంగా ఉన్నట్టు తేలింది. ఊరి పెద్దల, ''ఇంకేవి, తీరిపాయె. ఒరే పెద్దోడా! నువ్వా నాలుగెకరాల చెక్క దున్నుకుని బతుకు. ఇంగనువ్వు రేవుకాడకు పోబాక. ఒరే చిన్నోడా! ఊర్లో వాళ్ళ సాకల పనంతా ఇంగ నీదే. ఆ నాలుగెకరాలూ మీ అన్నకు రాసిచ్చెయ్'' అని తీర్పు చెప్పారు. ఆ తీర్పును అన్నదమ్ములు శిరసావహించారు. నాటినుండి పెద్దవాడు పుట్టుకతో చాకలివాడైనా వృత్తిచేత రైతుగా మారిపోయాడు. క్రమక్రమంగా అతడి కాళ్ళమీద, చేతులమీద ఉన్న వెంట్రుకలు పుల్లరంగునుండి నల్లరంగులోకి మారాయి.

గత రెండు దశాబ్దాలుగ ఆ గ్రామంలో వివిధ కులాల మధ్య సాంఘికంగా కాకపోయినా, ఆర్థికంగా వర్ణసంకరం విరివిగా సాగుతున్నది.

12

గ్రామానికి తూర్పున మైలు దూరాన 'తూకాలబండ' ఉన్నది. ఆ బండ సువిశాలమైనది. దాని పొడవు అర ఫర్లాంగు, వెడల్పు అర ఫర్లాంగు ఉంటుంది. బండను ఆనుకుని ఒడ్డెర గూడెం ఉన్నది. గూడెంలో వాళ్లకు తూకాల బండయే జీవనాధారం. కొన్ని తరాలుగ ఆ బండమీద ప్రతి చదరపు అంగుళం గూడెపువారి చెమటతో తడుస్తున్నది. నోరులేని ఆ బండ తనను తాను ఛిద్రం చేసుకుంటూ గూడెపు వాళ్లకు జీవగర్రగా ఉపయోగపడుతున్నది. సూర్యోదయం మొదలుకుని సూర్యస్తమయం దాక సీర్నం మీద సమ్మెటలు, సుత్తులు మోదుతున్న చప్పుడుతో ఆ ప్రాంతం ప్రతి ధ్వనిస్తూ ఉంటుంది. ప్రతిదినం ఆ బండలో కొంత భాగం మాయమై రాతిస్తంభాలుగా, దిమ్మలుగా, కంకరగా మారుతూ ఉంటుంది. ఆ రాతి సామగ్రిని తోలుకుని పోవడానికి వచ్చే లారీల రాకపోకలతో బండ కింద ఉన్న మట్టి బాట మీద ఎర్రదుమ్ము సదా రేగుతూ ఉంటుంది.

ఆదిలో ఆ బండ ఉనికి వల్లనే ఒడ్డెర గూడెం వెలసి ఉండవచ్చు. భవిష్యత్తులో కొంత కాలానికి ఆ బండ పూర్తిగా సమసి పోయిన నాటికి ఆ గూడెం అంతరించవచ్చు.

నిన్న మొన్నటిదాక ఆ బండమీద ఒడ్డెర వాళ్లు తప్ప ఇతర కులాలవారు పని చేసేవారు కారు. కాలక్రమాన తమ కులవృత్తులు గిట్టుబాటుకాని వృత్తిపనులవారు, కూలి గిట్టుబాటు గాని హరిజనులు గూడా ఆ బండమీద పని చేయడం ప్రారంభించారు.

పుల్లిగాడు సీర్నంమీద సుత్తితో మోదుతూ రాతి స్తంభాన్ని మలుస్తున్నాడు. అతనికా పని కొత్తగనుక అప్పుడప్పుడు సుత్తిజారి చేతివేళ్ల మీద పడుతున్నది. అతని ఎడమ చేతిలోని ఐదువేళ్లూ అప్పటికే కమిలిపోయి ఉన్నాయి. కమిలిన వేళ్లను నోటితో ఊదుకుంటూ అతడు పనిచేస్తున్నాడు. శీర్నం తాకిడికి రాతి పలుకులు చివ్వున దూసుకు వెళ్లి అల్లంత దూరాన పడుతున్నాయి. అతడే గాక ఆ బండమీద పది పన్నెండు మంది వడ్డెర వాళ్లు పని చేస్తున్నారు.

సూర్యుని కిరణాలు నిట్టనిలువుగా బండను తాకుతున్నాయి. బండ కాగిపాయ్యిమీద పెనం వలె తయారయింది. వేడి అన్ని వైపులనుంచి ఆవరిస్తూ అక్కడ పని చేస్తున్న వాళ్లను మాడబెడుతున్నది. వాళ్లు లయబద్ధంగా రొప్పుతూ, వేడిని అలసటను మరచిపోయి పని చేస్తున్నారు.

పుల్లిగాడు తన చేతిలోని కొరముట్లను కిందబెట్టి నిల్చున్నాడు. అతని ముందర ఒకదాని పక్కన ఒకటిగా రెండురాతిస్తంభాలు పడి ఉన్నాయి. తాను గత మూడు రోజులుగ శ్రమించి చెక్కిన ఆ రెండు స్తంభాలను అతడు తృప్తిగా చూశాడు. తలపాగాను తీసి ముఖంమీద చెమట తుడుచుకుని, ఒక స్తంభంమీద కూర్చుని బీడీ వెలిగించుకున్నాడు.

తూకాల బండ కింద ఉన్న మట్టిబాట మీదుగా, ఒక కారు, దాని వెనక ఒక ట్రాక్టరు చప్పుడు చేసుకుంటూ వస్తున్నాయి. పుల్లిగాడు బీడీ కాలుస్తూ ఆ వచ్చే వాహనాలను చూడసాగాడు.

కారు, ట్రాక్టరు మెల్లగ వచ్చి బండ అంచువద్ద ఆగాయి. కారులోనుంచి ముత్యాల నాయుడు, ఒక సిల్కు జుబ్బా మనిషి కిందకు దిగారు. ట్రాక్టరు బాడీలో గోచిపాతలు మాత్రం ధరించి ఉన్నవాళ్లు ఓ పదిమంది ఉన్నారు.

ముత్యాల నాయుడు, సిల్కుజుబ్బా మనిషి బండమీదకు ఎక్కిరాసాగారు. పుల్లిగానికి పది బారల దూరాన పని చేస్తుండిన ఒంటికన్ను ముసలి వాడు కళ్ళు చిట్లించుకుంటూ ఆ ఎక్కవస్తున్న వారివేపు చూశాడు. అలా కొంత సేపు చూసి, తన చేతిలోని కొరముట్లను కింద బెట్టి లేచి, వాళ్ళకు ఎదురుగా వెళ్ళాడు.

''ఏవిగావాల సావి. కూసాలా? దిమ్మలా? ఏవిగావాలంటే అవి ఉండాయి''. అన్నాడు.

ముత్యాల నాయుడు బండను ఎక్కిరావడం వల్ల జనించిన ఆయాసంతో గసపోసుకుంటూ, ''దిమ్మలు మాకేవిటికి? నెత్తులు పగలు గొట్టుకోనా. రాతికూసాలు రెండు కావాల'' అన్నాడు.

ఒంటికన్ను ముసలివాడు వాళ్ళకు తను చెక్కి ఉంచిన రాతి స్తంభాలను చూపిస్తూ, ''ఉండాయి సావి. బలపరాతివి ఉండాయి. సారరాతివి ఉండాయి. నీకు ఏకొలతల్లో కావాల్నో?'' అన్నాడు.

సిల్కుజుబ్బా మనిషి తనతో తెచ్చుకున్న టేపును బయటకు తీశాడు. అతడూ, ముత్యాల నాయుడు కలిసి రాతి కూసాల మధ్య వెడల్పులు కొలవసాగారు. ఒంటికన్ను ముసలి వాడు చేతులు పిసుక్కుంటూ నిల్చున్నాడు.

సిల్కు జుబ్బా మనిషి రాతికూసాలను కొలవడం ముగించి, నడుం పైకెత్తి, ''సరిగ్గా మాగ్గావలసిన కొలతలే ఉండాయి, ఒక్కొక్కటి ఎంత ధర చెప్తావు?'' అన్నాడు.

ఒంటికన్ను వాడు చేతులు పిసుక్కోవడం ఆపి, ''ఒక్కొక్కటి నలబై రూపాయలవుతుంది సావి. రొండుగావాలంటిరిగదా. డెబ్భై రూపాయలకు రొండు తీసకపాండి''. అన్నాడు.

సిల్కు జుబ్బా మనిషి టేపును చుట్ట చుటుతూ. ''ఓరినీ! ఇవిటికి డెబ్భయి రూపాయలేందిరా. ఇవేవి రాతికూసాలా? బంగారు కడ్డీలా?'' అన్నాడు.

ఒంటి కన్నువాడు, ''రాళ్ళను అడ్డం పెట్టుకుని బతకమని బగవంతుడు మా నొస్టిన రాసినాడు సావి. మా పానాలకు ఈ రాతికూసాలే బంగారుకడ్డీలు. ఇవిట్నీ అయినకాడికి మద్దేనంగా అమ్ముకుంటే మేవు బతికే దెట్టసావి?'' అన్నాడు.

ముత్యాలనాయుడు, ''అయిన కాడికి మద్దేనంగా ఇమ్మని నిన్నడిగెందెవుర్రా? మేవేదో నీ కడుపు కొట్టేదానికే ఇంతదూరం వొచ్చినట్టు మాట్లాడతా ఉండావు'' అన్నాడు.

సిల్కు జుబ్బా మనిషి అతని వైపు ' ఊరుకో' అన్నట్టు చూసి. ఒంటికన్ను వానితో, ''ఊరికే మాటలేవిటికిరా వొడ్డోడా. మా బేరం చెప్తాయిను. రొండుకూసాలకు కలిపి అరవై రూపాయలిస్తాం. ఏవంటావు?'' అన్నాడు.

ముసలివాడు తన ఒంటికన్నుతో రాతి కూసాలను చూస్తూ, ''ఒదగదు సావి. ఈ కూసాల కోసరం పెండ్లాం బిడ్డల మొకం గూడా చూడ కుండా ఈ బండమీద పడుండా. ఎత్తిన నీర్నం దించకుండా కొట్టీ కొట్టీ రెక్కలు పచ్చి పుండ్లయి పోయినాయి.'' అన్నాడు.

ముత్యాల నాయుడు. ''నిష్టూరం మా మీదేసే దేవిటికిరా. నిన్ను రెక్కలుపుండ్లు చేసుకోమని మేవు చెప్తిమా? నువ్వు ముక్కల్దాక తిని పంకాకింద

నిద్దర్లు జేస్తెమేవు ఒద్దంటిమా?'' అని గొంతు తగ్గించి, ''ఈ కూసాల్ను తీసకపోయి మేవు మా బంగళా మీద మూడో అంతస్తు కట్టుకోవాటంలేదు. ఊరు ముందర ఆంజనేయస్వామి గుడిని మరమ్మత్తు చేసినాం. తీరా అయినాక దేవలం ముందర దద్దిలం కట్టాలనుకున్నాం. దాని కొసరవే మేవి కూసాల్ను బేరం చేసేది.'' అన్నాడు.

ఒంటికన్నువాడు, ''నేను గూడా సూసినా సావి. వేలుకర్చు జేసి మరమ్మత్తు చేసినారు. మరమ్మత్తు పూర్తయినాక వెయ్యిమందికి సమారాధన చేసినారు. కష్టం జేసే నాబోటోనికి పది రూపాయలు జాస్తి చేస్తే అదిగూడా పుణ్యమే గదాసావి'' అన్నాడు.

అతడేదో ఛలోక్తి విసిరినట్టు వాళ్ళిద్దరు గల గల నవ్వారు. సిల్కు జుబ్బామనిషి నవ్వు సమాళించుకుని, ''నీ మాదిరిగానే మేవు గూడా అనుకుని ఉంటే దేవలం పని మొదులు పెట్టిన కాడనే ఉండిపోవును''. అన్నాడు.

ముత్యాల నాయుడు బండమీద అడుగులు మారుస్తూ, ''వొట్టినోరు నవిలేదేవిటికిరా వొడ్డోడా? ఈ ఎండలో నిల్చుకోనుంటే నా కండ్లు బూసులు కమ్మతా ఉండాయి. సరసరామని బేరం తెంచు'' అన్నాడు.

ఒంటికన్నువాడు, ''నా బేరం ముందుగానే చెప్తినిగ సావి డెబ్భయికి తక్కవైతే ఆ మాటే ఎత్తెద్దండి''. అన్నాడు.

సిల్కుజుబ్బా మనిషి ఆశ్చర్యపోతూ, నోరు తెరచి, ''దేవుని కార్యవని చెప్పినా గూడ నువ్వు ఒక్క మెట్టుదిగవంటావ్రా?'' అన్నాడు.

ఒంటి కన్నువాడు నిర్లీవంగానవ్వి, ''రొండురాతికూసాల్ను బేరం చేసేదానికి కారేసుకోనొచ్చి నోళ్ళు మీరు. కడుపు కోసరం ఈ బండమీద గోజార్తా ఉండేటోడ్ని నేను. పాపం పుణ్యం అని లెక్కలేసే దానికి నాకు యాడ తీరిందిసావి''. అన్నాడు.

ముత్యాల నాయుడు మరింత అసహనంగా అడుగులు మూరుస్తూ సిల్కుజుబ్బా మనిషితో, ''ఇది వొరిగే బేరం కాదన్నా. వీడు సేరుకు రెండు సేర్లు పట్టే మాటలు మాట్లాడుతూ ఉండాడు. ఈని బేరం తెగేటప్పటికి పొద్దు పోయి చీకటయ్యేట్టుగా ఉంది''. అన్నాడు.

పుల్లిగాడు బీడిని రాతిస్తంభం మీద రాచి చివిలో చెక్కుకుని పైకి లేచాడు. మెల్లగా నడుస్తూ ముత్యాల నాయుడు చెంతకు వచ్చి, ''దండాలు సావి'' అన్నాడు.

ముత్యాల నాయుడు వెనుదిరిగి చూసి, ''నువ్వంట్రా పుల్లిగా. తూకాల బండమీద ఏవిజేస్తె ఉండావురా?'' అనడిగాడు.

పుల్లిగాడు వినయంగా చేతులు కట్టుకుని,''మొన్నట్నుంచి ఈ బండమీదనే పన్జేస్తె ఉండాను సావి. కంసాలాయన కొలివి కూల గొట్టుకుని ఇంట్లో కూసునింది మొదలుకుని ఈడనేపన్జేస్తె ఉండా. ఈ మూడు దినాలు కష్టపడి రొండు రాతి కూసాలు చెక్కినాను. మీకు సరిపొయ్యేట్టుగా ఉంటే అవిట్ని తీసక పొండి సావి'' అన్నాడు.

ముత్యాల నాయుడు, ''ఏవి? ఏవి నీ కూసాలు?'' అనడిగాడు.

పుల్లిగాడు, ''సూద్దురురండి సావి'' అంటూ వాళ్ళను తీసుకెళ్ళి తను చెక్కిన రెండుస్తంభాలను చూపించాడు.

వాళ్ళు మళ్ళీ టేపును విప్పిస్తంభాల పొడవు వెడల్పులను కొలవసాగారు. ఒంటికన్నువాడు నిస్సత్తువగా తన స్తంభాలవద్ద కూర్చుని ఇటే చూడసాగాడు.

కొలవడం ముగించి సిల్కుజుబ్బా మనిషి '' ఎంతకిస్తావు రొండూ కలిపి?'' అన్నాడు.

''మీతో బేరం వేంటి సావి. ఆ ముసిలోనికి చెప్పిన కాడికే తీలుకుని పొండి''

సిల్కు జుబ్బా మనిషి వెంటనే జేబులో చేయివేసి పైకంతీసి పుల్లిగాడికిచ్చి ''ఇంద, అరవై రూపాయలు. లెక్క సరిచూసుకో'' అన్నాడు.

పుల్లిగాడు ఆ కాగితాలను లెక్క పెట్టుకోసాగాడు. ముత్యాలనాయుడు రాతి స్తంభాలను చేతితో తడుముతూ, పరిశీలనగా చూడసాగాడు.

పుల్లిగాడు కాగితాలను లెక్కపెట్టడం ముగించి, ''సరిగ్గా ఉంది సావి. అరవైరూపాయలుండాయి'' అన్నాడు.

ముత్యాలనాయుడు, ''రూపాయలు, సరిగ్గా ఉండాయిగాని, సొత్తులో నాణ్యం లేదుగదరా. గేళ్ళు మడవనేలేదు. పక్కలు గరుకుగా ఉండాయి'' అన్నాడు.

పుల్లిగాడు, ''గేళ్ళు మడిచేది ఎంతసేపు సావి. మీరీ కూసాలను ట్రాక్టరులో ఏసుకుని పొండి. నేను కొరముట్లు తీసుకుని నేరుగా దేవలం కాడికొస్తా. గెడిసేపిట్లో గేళ్ళు మడిచేసి, పక్కలు నునుపుచేసేస్తా'' అన్నాడు.

సిల్కుజుబ్బా మనిషి, ''అదీ,పనోడంటే అట్టుండాల. దుడ్డు ఈ

పొద్దుంటుంది. రేపు పోతుంది. నువ్వేదన్నా పన్జేస్తే దాన్ని నలుగురూ మెచ్చుకోవాల. అదీ కావాల్సింది''. అని జేబులోంచి మరో పది రూపాయల నోటు తీసి పుల్లిగాడికిచ్చి, ''ఇంద కొరముట్లు తీసుకుని దేవలం కాడికొచ్చెయ్. పొద్దు పొయ్యేలోగా గేళ్ళు మడిచి, పక్కలు నునుపు చేసెయ్'' అన్నాడు.

తరవాత సిల్కుజుబ్బా మనిషి వెను దిరిగి ట్రాక్లరులో ఉన్నవాళ్ళను పైకి రమ్మని చేత్తో సైగచేశాడు. వాళ్ళు గడ్డపారలను, కొబ్బరి పీచుదారాలను తీసుకుని పైకి వచ్చారు. దారాలను కూసాల చుట్టూ రానిచ్చి ముడులు వేశారు. దారాల కింద గడ్డపారలను దూర్చిభుజాలపైన మోసుకుంటూ రాతి స్తంభాలను ట్రాక్లరులోకి చేర్చారు. ముందు కారు, దాని వెనుక ట్రాక్టరు పుల్లదుమ్మును రేపుకుంటూ సాగిపోయాయి.

పుల్లిగాడు ఆ వాహనాలు కనుమరుగై పోయేదాక చూసి, రూపాయనోట్లను మళ్లీ ఒకసారి లెక్క పెట్టి బొడ్లో దోపుకున్నాడు.

ఇంతలో ఒంటికన్ను వాడు అతనికి చేరువుగా వచ్చి, ''నువ్వు జేసిన పని నాయవేనంట్రా?'' అన్నాడు.

పుల్లిగాడు బండమీదున్న కొరముట్లు తీసుకుని, ''నేనేవి జేసినానిప్పుడు?'' అన్నాడు.

ఒంటికన్నువాడు, ''ఏవి జేసినానంటావా? ఒక్కొక్క కూసాన్ని అయినకాడికి మద్దేనంగా ముప్పై రూపాయలకు అమ్మినావు. నువ్వు జేసింది నాయవేనా అని అడగతా ఉండా'' అన్నాడు.

''ఆ కూసాలు నావి. నా చేతుల్లో నేను చెక్కినాను. నా ఇష్టమొచ్చిన కాడికి అమ్ముకుంటా. మద్దిన నీ కెందుకు పులుపు?'' అన్నాడు.

ఒంటికన్నువాడు, ''నువ్వీ బండమీదకు నిన్నగాక, మొన్నవస్తివి. మేవు పుట్టింది మొదులుకుని దీని మీదనే గోజార్తా ఉండాం. మద్దిన వచ్చే టోళ్ళు దర దించుకుంటూ పోతాంటే మే వెట్ట బతకాల?'' అన్నాడు.

''ఔ, మీరు ఎల్లకాలం ఈ బండమీదనే ఉండే టోల్లు. నేను ఈ పొద్దుండి రేపు పోయేటోడిని. సరైన బేరం వొచ్చేదాక యగజూసుకోనుండాలంటే నాకుయాడ తీరుతుంది. అజ్జెప్పు.''

ఇంతలో మరొక వడ్డెరవాడు తన చేతులోని సామగ్రిని కిందబెట్టి ఒంటికన్ను వానిదగ్గరకు వచ్చి, ''ఏంది మావా? కూసాల్ను ఎంతకు అమ్మినాడు?'' అనడిగాడు.

ఒంటికన్నువాడు, ''అరవై రూపాయలుకు అమ్మినాడు. రెండూ కలిపి అరవైరూపాయలకు అమ్మినాడు. చేసింది సాలక మళ్ళీ సవాలేస్తె ఉండాడు. సరైన బేరం వొచ్చేదాక ఎగజూసుకోనుండే దానికి నాకేడ తీరింది అనడగత ఉండాడు'' అన్నాడు.

రెండవాడు పుల్లిగాడిని చురచురచూస్తూ, ''నువ్వా పన్జేసేదానికన్నా ఆ సమ్మెటతో మా నెత్తులు పగల గొట్టరాదంట్రా. మా నోటికూడు పడగొట్టేదానికి నువ్వు యాడునుంచొస్తివిరా'' అన్నాడు.

పుల్లిగాడు అతడి చూపుల్ను తప్పించుకుంటూ, ''నన్ననేదేవిటి కన్నా. నాకు కాలం గాక కూసాల్ను అరవై రూపాయలకు అమ్ముకుంటి. మీరుగూడా అదే దరకు అమ్మమని నేన్జెప్తినా?'' అన్నాడు.

రెండవవాడు గొంతు పెంచి, ''నువ్వు తనిగా చెప్పేదేవిటికి? నువ్వీ పొద్దు అరవైరూపాయలకు అమ్మితిని. రేపు ఇంగొకడొచ్చి యాభైరూపాయల కమ్మతాడు. మేవీబండను నమ్ముకోని బతకత ఉండాం. నానాటికీ దర పడిపోతా ఉంటే చేసిన కష్టం గిట్టుబాటయ్యేదెట్ట?'' అన్నాడు.

ఒంటికన్నువాడు అతడి భుజం మీద చేయివేసి, ''వాడినని లాబం లేదురా. కాలం మారి పోతాంది. మొన్న మొన్నటిదాక ఒడ్డెరోడు తప్ప ఇంగొకజాతోడు ఈ బండమీద అడుగు పెట్టేటోడుగాదు. ఇప్పుడు మాలోల్లు, మంగలోల్లు అందరూ వాళ్ళ కుల వుత్తులు ఇడ్చి పెట్టేసి బండమీదికి వస్తా ఉండారు. ఇంకొన్నాళ్ళు పోతే రైతులు గూడా మనకు పోటికి వస్తారు'' అన్నాడు.

రెండవ వడ్డెరవాడు కంఠం ఇంకా తగ్గించ కుండా, ''తప్పంతా మనదే మావా. అడ్డమైన జాతోల్లను బండమీదకు రానియ్యటమే మన తప్పు. రాతి మతింపు వొడ్డెరోనికి తెల్సు. కడవ జాతోనికి యట్ట తెలుస్తుంది.'' అని చేయి గాలిలోకి ఎత్తి, ''ఈ పొద్దిట్నుంచి మనవంతా కట్టుగా ఉండాల. ఒడ్డెరోడు తప్ప వేరే జాతోడు ఈ బండమీద అడుగు పెట్టకుండా సూడాల'' అనరచాడు.

ఇంతలో బండమీద ఆ చివరన రేకు డబ్బా మీద కర్రతో డబడబ బాదుతున్న చప్పుడు వినిపించింది. అది సంకేతకంగా గ్రహించి పుల్లిగానితో సహా బండమీదున్న వాళ్ళందరూ దిక్కుకొకరుగా పరుగెత్తి పెద్దపెద్ద గుండ్ల వెనుక నక్కి కూర్చున్నారు. కొంత సేపటికి బండమీద ఆ చివరన నల్లమందు నాటు 'ఢాం' మని చప్పుడు చేస్తూ ప్రేలింది. ఆ చప్పుడు దూరంగా ఉన్న కొండలను తాకి ప్రతిధ్వనించింది. పగిలిన బండతాలుక శకలాలు వివిధ పరిమాణాలలో రివ్వున ఆకాశంలోనికి ఎగిసి గిరగిర తిరుగుతూ కిందపడ్డాయి.

13

గ్రామానికి పడమటి సరిహద్దువలె ఆంజనేయస్వామి దేవాలయం ఉంది. దేవాలయం చాల పురాతనమైనది. దేవాలయం వెలిశాక ఊరు ఏర్పడిందో, లేక ఊరు ఏర్పడినాక దేవళం వెలసిందో ఎవరికీ తెలియదు. ఈ దేవాలయానికో స్థల పురాణముంది. అది రామాయణ గాథతో ముడిపడి ఉంది. రామరావణ యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛపోయాడు. అతనిని బతికించడానికి హనుమంతుడు సంజీవి పర్వతాన్ని తీసుకువచ్చాడు. ఆ పర్వతం వెడల్పు కొన్ని ఆమడలు, పొడవు మరి కొన్ని ఆమడలు ఉంది. అలాంటి పర్వతాన్ని మోసుకుంటూ హనుమంతుడు ఆకాశంలో ఎగిరి వస్తున్నాడు. ఎగరగా, ఎగరగా అతనికి అలసట ముంచుకు వచ్చింది. ఆ గ్రామం వద్ద క్షణకాలం కాలుమోపి అలసట తీర్చుకున్నాడు. అతడు కాలు మోపిన స్థలం పవిత్రమై పోయింది. అక్కడ దేవాలయం వెలిసింది.

పెదనాయుడుగారే ప్రస్తుతం దేవాలయానికి ధర్మకర్త. కాని పెదనాయుడిగారి ఇంటి వ్యవహారాలను, వ్యవసాయాన్ని అజమాయిషి చేస్తున్నట్టే ముత్యాలనాయుడు గుడి వ్యవహారాలను కూడా చూసుకుంటున్నాడు. చాకిరేని చెరువు కింద గుడి మాన్యం భూమి పన్నెండు ఎకరాలుంది. గ్రామంలోని పెద్దరైతులు తమకేదైనా శుభం జరిగినప్పుడు దేవునికి కృతజ్ఞతలు చెల్లిస్తూ ఎకరా, అరెకరా భూమిని గుడి మాన్యంలో కలుపుతుంటారు.

హనుమంతుడు తన తోకను గ్రామం చుట్టూ, కోట గోడవలె పెంచుకుని కాలిని గోరువలె, కంటిని రెప్పవలె కాపాడుతున్నాడని గ్రామస్థుల నమ్మకం. ఇప్పుడు తగ్గిపోయాయి గాని మునుపు ఈ దేవాలయంలో అభిషేకాలు జాతరలు నిత్యము జరిగేవి. కలరా, ప్లేగు, మశూచి వంటి ఉపద్రవాలు తరచు సంభవించేవి. అలాంటి ఉపద్రవాలు సంభవించగానే గ్రామస్థులు దేవాలయానికి పరుగెత్తేవారు. ''స్వామీ! మాకీ విపత్తు ఎందుకొచ్చింది? మేవు నీకేవి తక్కువ చేసినాము?'' అని ప్రశ్న అడిగేవాళ్ళు. స్వామి పూజారి మీద పూనకం వచ్చి కాసేపు ఊగి, ''ఇదంతా నేనే చేసినాన్రా ఊర్లో ఫలానా సిసువు ఎంగిలి మంగలం ఏకం జేసినాడు. నేనే తోకపైకెత్తి కలరాను లోపలకు వొదిల్నాను. మీ దొడ్లో మేకను నాకు ఆగారవియ్యండి. నేను మిమ్మల్ను కాపాడుకుంటాను'' అని అభయమిచ్చేవాడు.

కాలక్రమాన కలరా, ప్లేగు వంటి రోగాలు మటుమాయమయ్యాయి. కాని ప్రస్తుతం ఒక రోగం గ్రామాన్ని నిరంతరంగా బాధిస్తూంది. అది తగినంత తిండి లేక పోవడంవల్ల వచ్చే రోగం. కాని అదొక రోగంగా గ్రామస్థులు భావించడంలేదు. ఆకలి, అర్థాకలి అన్నవి వాళ్ళ జీవన సరళిలో అంతర్భాగమైపోయాయి. అందుకే ఈ రోగం ఎందుకు వచ్చిందని వాళ్ళు స్వామిని ప్రశ్న అడగటంలేదు. ఆరోగాన్ని అరికడతానని స్వామి అభయమివ్వడమూ లేదు.

మునుపు ఈ గ్రామానికి బందిపోటు దొంగల బెడద తరచు పంభవించేది. బంది పోటు దొంగలు రాత్రిపూట గుర్రాల మీద వచ్చేవాళ్ళు. వాళ్ళ చేతుల్లో కత్తులు, బరిసెలు ఉండేవి. వాళ్ళు గ్రామం మీద పడి గ్రామస్థుల కష్టార్జితం యావత్తును దోచుకునేవారు. క్రమక్రమంగా ఆ బందిపోటు దొంగల దాడులు అంతరించిపోయాయి. ఆ దాడులకు సంబంధించిన - వివరాలు జానపద కథల్లో కలిసి పోయాయి. కాని ప్రస్తుతం మరొక విధమైన దోపిడి నిరంతరంగా, నిరాటంకంగా సాగుతున్నది. ఈ దోపిడి పట్టపగలే సాగుతున్నది. వీళ్ళు జీపులమీద, కార్లమీద గ్రామంలోకి వస్తారు. వీళ్ళ చేతుల్లో పేనాలు, కాగితాలు ఉంటాయి. కాని దీన్ని బందిపోటుతనంగా గ్రామస్థులు భావించడంలేదు. దోపిడి, మోసము తమ జీవనసరళిలో అంతర్భాగంగా వారు భావిస్తున్నారు. అందుకే ఈ ఉపద్రవం ఎందుకు సాగుతున్నదని స్వామిని ప్రశ్న అడగడం లేదు. ఈ ఉపద్రవాన్ని అరికడతానని స్వామి అభయ మివ్వడమూ లేదు.

14

గ్రామానికి పడమటి సరిహద్దువలె బహుపురాతనమైన ఒక మర్రి చెట్టు ఉంది. భూమినుంచి వచ్చిన దాని కాండం కన్న భూమిలోనికి వెళ్ళిన ఊడలు ఘనంగా ఉన్నాయి. దాని కొమ్మలు శాఖోపశాఖలుగ చీలి పక్కలకు వ్యాపించి ఉన్నాయి. మర్రిచెట్టు కింద ఆంజనేయస్వామివారి ఆలయముంది. దేవాలయాన్ని ఇటీవలే మరమ్మత్తుచేశారు. దద్దిలం కోసం తేబడిన రాతికూసాలు, బండలు దేవాలయం ముందర నేలమీద పడి ఉన్నాయి. పుల్లిగాడు సీర్నం మీద సుత్తితో మోదుతూ రాతి కూసాలను నునుపు చేస్తున్నాడు. సుత్తిసీర్నాన్ని తాకినప్పుడు పుట్టేధ్వని లయబద్ధంగా వినిపిస్తూంది.

పూజారి గర్భగుడిలో నుంచి బయట కొచ్చాడు. గర్భగుడి మొదటి

మెట్టుమీద నిలబడి తలయెత్తి చూశాడు. సూర్యుడు పడమటి కొండ అంచుకు రెండు బారల ఎత్తున నిలిచి ప్రకాశిస్తున్నాడు.

చాల సేపటినుంచి గర్భగుడిలో ఉండడం వలన పూజారి శరీరం మీద పల్చగా చెమట పట్టి ఉంది. చెమట వలన కలిగిన దురదను బాపుకునేందుకై అతడు జబ్బలమీద గోక్కుంటూ మెట్టుదిగి సింహద్వారం వద్దకు వచ్చాడు. ద్వారం ముందర ఒక భిక్షగాడు భుజానికి జోలె తగిలించుకుని నిలుచుని ఉన్నాడు. మర్రి చెట్టు వాలాడు కొమ్మమీద ఒక కోతి జోలెపైనే చూపుని నిలిపి కూర్చుని ఉన్నది.

పూజారి భిక్షగానితో, ''జోలెలో ఏమైనా పడిందంట్రా?'' అనడిగాడు.

భిక్షగాడు, ''ఏవి పడటం సావి'' అని జోలెలోకి తొంగి చూసి, ''నాలుగు కొబ్బరి ముక్కలు, నాలుగు బెల్లం ముక్కలు, పిడికెడు బొరుగులు, సెనగలు అంతే'' అన్నాడు.

పూజారి దీర్ఘంగా నిట్టూర్చి ''కాలం మారిపోయిందిరా. ఈ కాలం పూజపెట్టే వాళ్ళంతా కర్పూరం ఎలిగించి యనక్కు తిరుక్కోని పాయ్యేటోళ్ళేగాని ప్రసాదం తెచ్చేటోళ్ళే లేరు. బుద్ధి తెల్సినప్పట్నుంచి నే నీడ పూజారిగా ఉండా. ఆ కాలంలో టెంకాయనీళ్ళు గర్భ గుడియనక పిల్లకాలవ మాదిర పారతా ఉండె. పూజ పెట్టే ప్రతోడూ నాలుగేసి గంగాళాలూ తెస్తా ఉండె. ఒక గంగాళంలో అరటిపండ్లు. ఇంకొక దాంట్లో ఖర్జూరపండ్లు. ఇంకొక దాంట్లో వరి పిండి . నీయట్టాటోళ్ళు పదిమంది ఆ ప్రసాదం తినే బతికిపోతా ఉండిరి'' అన్నాడు.

భిక్షగాడు ''ఆకాలం పోయింది సావి. ఇప్పుడు పండగ దినాల్లో తప్ప మిగతా దినాల్లో జోలె నిండటం లేదు సావి. జనం చేతులూపుకుంటా వొచ్చి కర్పూరం ముట్టించి, చేతులూపుకుంటా పోతా ఉండరు'' అన్నాడు.

పూజారి, ''వాళ్ళనని ఏవి లాబంరా సంతలోకి పోయి ఏది కొనాలన్న గుండె గబీ మంటుంది. అరటి పండ్లు డజను నాలుగు రూపాయలు. ఒక్క టెంకాయ బుడత మూడు రూపాయలు. ఇవన్నీ కొని పూజ పెట్టే సత్త ఎవునికుండాది? కర్పూరమొక్కటే సలీసుగా దొరికేది. అది గూడ ఇంగ నాలుగు దినాలు పోతే బంగారం మాదిర అమ్మటం మొదులు పెడ్తుంది'' అన్నాడు.

దూరంగా ఉన్న టౌనులో సైరన్ మ్రోగడం అస్పష్టంగా వినిపించసాగింది. భిక్షగాడు చెవి. యొగ్గివిని, ''అప్పుడే గంట ఐదయింది సావి. ఇంగ నేను

ఊరిమీదపోతా. నువ్వు గుడికి తాళమేసుకోని పోసావి'' అని అక్కడ నుంచి బయలుదేరి ఊరి వైపు నడవసాగాడు.

పూజారి గుడి తలుపులు మూయలేదు. అతడు మెట్లుదిగి వచ్చి ద్వారం ముందర ఉన్న బండ మీద కూర్చున్నాడు.

దేవాలయాన్నానుకుని పడమటి దిశగా ఒక మట్టి రోడ్డు పోతున్నది. కనుచూపు మేరకు ఆ బాట కిరువైపుల రెండు వరుసలుగా ఉన్నతమైన తాటి చెట్లు నిల్చుని ఉన్నాయి. మర్రి చెట్టు కింద నిలబడి చూసేవారికి తాటి చెట్ల వరసలు రెండూ అల్లంత దూరాన కలుసుకుంటున్నట్లు అనిపిస్తూంది. అవి కలుసు కుంటున్న కోణం వద్ద సాయంకాలపు సూర్యుడు క్రమక్రమంగా కిందకు దిగుతున్నాడు.

పూజారి చూపులు ఆ మట్టి రోడ్డుమీద అన్వేషిస్తున్నాయి. భక్తులకోసం ఎదురు చూసేటప్పుడు కనిపించే యాంత్రికత ఇప్పుడతని ముఖంలో లేదు. అతని ముఖంలో ఆందోళన ఆతురత కనిపిస్తున్నాయి.

పుల్లిగాడు రాతికూసాలను నునుపు చేయడం ముగించాడు. చేతిలోని కొరముట్లను కిందబెట్టి ఆయాసం తీర్చుకుంటూ ఇందాక తను నునుపు చేసిన రాతికూసాల మీద కూర్చున్నాడు.

మేతకై వెళ్ళి ఉండిన పశువుల మంద మట్టి బాట మీద ఊరివైపు సాగివస్తున్నది. బాటమీద నాలుగడ్డేళ్ళు పేరుకుని ఉన్న మెత్తని పుల్ల దుమ్ము పశువుల గిట్టల తాకిడికి మేఘాల వలె లేస్తున్నాయి.

ఆయాసం తీరిన పుల్లిగాడు కొరముట్లను చేతిలోకి తీసుకుని పైకి లేచాడు. సాగబారి రెండడుగుల వేసి పూజారిని చూసి ''పొద్దు గూట్లో పడిపొయ్యింది. అట్టనే కూచోనుండా వేంది సావి?'' అన్నాడు.

పూజారి మట్టిబాట మీద నుంచి చూపులు మరల్చి, ''నేనొక మనిషి కోసరం చూస్తావుండా'' అన్నాడు.

''ఎవరు సావి?''

''మనూరు మనిషే, తిరిపాల నాయుడు. పొద్దున కోడి కూయకముందే నన్ను నిద్రలేపి పూజ పెట్టించినాడు. పూజ అయినాక ఈడ్నుంచి కడదోవన్నే రోడ్డు కాడికి పోయి బస్సెక్కి టౌనుకు పోయినాడు. ఆయన ఎప్పుడొస్తాడా అని దోవ జూస్తా ఉండా'' అన్నాడు.

''టౌనుకు ఏం పని మీద పోయినాడు సావి?''

పూజారి ఆశ్చర్యపోతున్నట్టు చూసి, ''నీకు తెలవదా? ఊర్లో అందరికీ తెల్సు. పాల్దాగే పసిబిడ్డలు మొదులుకుని ముసిలోళ్ళదాక అందరికీ తెల్సు. నీ చెవి దాక రాలేదా?'' అన్నాడు.

పుల్లిగాడు, ''నాకెట్ల తెలుస్తుంది సామీ. నేను దేశాంతరం పాయ్యిండి మొన్ననే నొస్తిగదా'' అన్నాడు. పూజారి ఏదో జ్ఞాపకమొచ్చినట్లు, ''ఔ సంవత్సరమై నువ్వు ఊర్లో లేకుంటివి'' అని బండమీద సర్ది కూర్చుని–

''తిరిపాలనాయుని కయ్యలు యాలానికొచ్చినాయి. అప్పు కట్టలేదని బాంకీవోడు యాలం నోటీసు ఇప్పించినాడు. యాలం నోటీసు పంచాయితీ ఆఫీసు గోడకు అతికించినారు. రేప్పొద్దున పది గెంటలకు యాలం'' అన్నాడు.

పుల్లిగాడు, ''అంతకన్నా ఏవిగావాల! రైతు పుటక పుట్టినోనికి అంతకన్న గాచ్చారం ఏవి గావాల? రైతు పానాలన్నీ కయ్యలమీదనే ఉంటాయి. మాయల పకీరోని పానాలు రామచిలకలో ఉంటుంది జూడు, అట్ట. ఒక చెయ్యి, ఒక కాలు ఇచ్చెయ్యమన్నా ఇచ్చేస్తాడుగాని రైతు పుటక పుట్టినోడు కయ్యల్ను వొదులుకుని బతక లేడు'' అని తను గూడా దుమ్ములో కూర్చుని, ''మరి రేప్పొద్దున యాలవుందనగా ఈయన టౌను కెందుకు పోయినాడు?'' అన్నాడు.

పూజారి, ''బాంకీ వోని కాళ్ళు పట్టుకునే దానికి పోయినాడు. వాని కాళ్ళు, కడుపులు పట్టుకుని అప్పు ఒకటి రెండు సంవత్సరాల వాయిదా ఎయ్యించుకునే దానికి పోయినాడు'' అన్నాడు.

పుల్లిగాడు, ''కాళ్ళూ కడుపులు పట్టుకుంటే వాళ్ళు ఇంటారా సావి. వాళ్ళ సట్టాలే వాళ్ళు మాట్లాడ్తారుగాని. జప్తు నోటీసు వాపసు తీసుకుంటారా?'' అన్నాడు.

పూజారి, ''నాకేవిదెల్సు. అదేదో గవుర్మెంటోని సట్టం ఉండాదంట. అప్పు దీసుకున్నప్పట్నుంచి నేలమీద దమ్మిడి ఆదాయం లేదని కరణం సిఫారసు చేస్తే అప్పు వాయిదా ఏస్తారంట. ఆపకారం ఈయన కరణంపోని దగ్గర కాగితం రాయించుకోని పోయినాడు'' అన్నాడు.

పుల్లిగాడు ''చట్టాలకేవి సావి. గవుర్మెంటోని పుస్తకాల్నిండా సట్టాలే ఉండాయి. పోతే అవిట్నీ మనకు కట్టించేటోడెవరు? మనట్టాటోళ్ళ కడుపులు కొట్టే గవుర్మెంటోడు బతకతా ఉండాడు. మన గోడు వాళ్ళేవిటికి యింటాడు?'' అన్నాడు.

మట్టిరోడ్డుమీద ఆలమంద వెళ్ళిపోయాక ధూళి మేఘం మెల్లమెల్లగా భూపతనం కాసాగింది. కొంతసేపటికి కుంకుతున్న సూర్యబింబం ముందు తాటిచెట్ల కోణం వద్ద ఒక నల్లని ఆకారం కనబడింది.

మర్రిచెట్టుక్రింద నున్న వారికి ఆ ఆకారం ఒక నలుసువలె కనబడింది. ఆ నలుసు క్రమక్రమంగా పెద్దదవుతూ ఊరివైపే సాగివస్తున్నది. అలా ఘడియ సేపు గడిచాక ఆ ఆకారం ఒక మానవుడని పోల్చుకోడానికి వీలయింది.

చేటలవంటి పాదాలను ఈడ్చుకుంటూ తూలుతూ తిరిపాలనాయుడు మట్టిమీద నడిచి వస్తున్నాడు. అతడు కట్టుకుని ఉన్న అడ్డపంచె మాసికలతో నిండి ఉంది. తొడుక్కుని ఉన్న ముతకనూలు చొక్కా వీపుమీదను, రొమ్ము మీదను చెమట మూలాన శరీరానికి అతుక్కుని ఉంది. అతని కళ్ళు ఎర్రనై ఉన్నాయి. జుత్తు రేగి ఉన్నది. అతని రెండు చేతులలో రెండు కల్లుసీసాలున్నాయి.

పాదాలతో పుల్లదుమ్మును రేపుకుంటూ అతడు నడుస్తుండగా అతని న్యూనతను చాటుతూ బాటకిరువైపుల ఉన్న తాటిచెట్లు ఉన్నతంగా నిలుచుని ఉన్నాయి. కుంకుతున్న సూర్యుడు కలగజేసిన అతని నీడ మట్టి రోడ్డు మీద నల్లటి చారవలె వ్యాపించి మర్రిమానువైపు సాగుతున్నది. క్రమక్రమంగా ఆ నీడ మర్రిమాను బోదెను, ఊడలను తాకి కొమ్మల మీదకు ప్రాకుతూ చిటారు కొమ్మవైపు ఎగబ్రాకుతున్నది.

అతడు చేరువగా రాగానే పూజారి పైకిలేచి, ''ఇదేనా రావటం తిరిపాలన్నా?'' అనడిగాడు.

తిరిపాలనాయుడు ఎవరో తట్టిలేపగా గాఢ నిద్రనుంచి మేల్కొన్నట్టు తల విదిలించి, కనురెప్పలు టపటపలాడించి, ''ఎవరూ! ఓ దేవలం పూజారా దండాలు సావి దండాలు'' అని సీసాలున్న రెండు చేతుల్ను పైకెత్తి జోడించాడు.

పూజారి అతనికి చేరువగా వచ్చి ''ఇవేందన్నా? చేతుల్లో ఇవేంది?'' అనడిగాడు.

తిరిపాలనాయుడు సీసాలవైపు చూసి ''ఇవేం దంటావా? ఇవి సీసాలు. వాటిలోపల ఏవుందంటావా? చెప్తా యిను'' అని తను ఇందాక నడిచి వచ్చిన బాటవైపు చేయి చూపిస్తూ రోడ్డుకాడ బస్సుదిగినా, దిగంగానే రోడ్డుపక్కన కల్లంగడి కనిపించింది. నిండా మునిగినాక సలేందని చెప్పి లోపలకు దూరినా. లోపల గూసొని ఎన్ని సీసాలు తాగినానో ఏవో నాకే తెలవదు. వాడు అందించడం,

నేను తాగడం. వాడు అందించడం, నేను తాగడం. కడాన ఇవి రెండు చేతబట్టుకుని యలబారొచ్చినా. మరి ఇవి రొండు ఎందుకంటావా? చెప్తా యిను. ''అని గ్రామం వైపు చేయి చూపించి, ''ఇవి నా పెండ్లాం కోసరం తీసకపోతా ఉండా. నేను ఇంట్లో అడుగు పెట్టంగానే నా పెండ్లాం అడుగుతుంది. పోయిన పనేవయింది? కాయా? పండా? అని. కాయే అయిందనే మాట నా నోట్లోనుంచొస్తే అది ఇరగబడది చస్తుంది. నా నోట్లోమాట దాని చెవిలో పడేముందు ఈ సీసాలోది దాని కడుపులో పడాల'' అన్నాడు.

పూజారి ''మరి నువు పోయిన పనేవయిందన్నా?'' అనడిగాడు.

తిరిపాలనాయుడు ''కాయే అయింది. నేను పోయిన పని నాశనమై నల్లబాగులయింది. నా ఇంటి మీదెప్పుడో గుడ్లడూబ కూసునింది. అప్పుడే నాకు శని మాయ పూనింది'' అంటూ సాగబారాడు.

అతడు తడబడుతూ పది బారల దూరం నడిచి గబుక్కున ఆగిపోయాడు. మెల్లగ మెడను, ఆ తరవాత నడుమును వెనక్కు తిప్పిచూశాడు. పూజారి అతనివైపే చూస్తూ నిలబడి ఉన్నాడు. తిరిపాలనాయుడు గబగబ వెనక్కు వచ్చి ''నీకు చెప్పితీరాల. నువ్వు దేవుని మనిషివి. పొద్దున నాకోసరం పూజ్జేసినోడివి. జరిగిందంతా నీకు యిలా వరిగా చెప్తా. నువ్వు నీ దేవునికి చెప్పు'' అంటూ పూజారి భుజం మీద చెయ్యివేసి రోడ్డు పక్కకు గుంజసాగాడు. వాళ్ళిద్దరూ మర్రి మాను ఊడల నానుకుని కూర్చున్నారు.

తిరిపాలనాయుడు సీసాలనుకిందబెట్టి ''అంత ఇలావరిగా చెప్తా ఇను. నీ దేవుని దొర్తానంలో ఏవేవి జరగతా ఉండాయో ఇను'' అని గుడివైపు చూసి, ''గర్భగుడి మూసి ఉండాది. తలుపు తెర్సిపెట్టరా. నేన్జెప్పేది దేవుడుగూడా ఇనాల'' అన్నాడు.

పూజారి ''తలుపు తెర్సే ఉండాది సూడు'' అన్నాడు.

తిరిపాలనాయుడు కైపెక్కిన తన కళ్ళను నులుముకుని గర్భగుడివైపు చూసి, ''ఔ. తెర్సే ఉండాది. లోపల దీపం గూడా యలగతా ఉండాది'' అని తల తిప్పుకుని, ''యాడ్నుంచి మొదులు పెట్టమంటావు? నేను ఇంటికాడ బయల్దేరి నప్పట్నుంచా? ఆఫీసరోనితో బేటీ ఏసినప్పట్నుంచా?'' అన్నాడు.

పూజారి, ''తొల్నుంచి చెప్పు'' అన్నాడు.

తిరిపాలనాయుడు చెప్పడం ప్రారంభించాడు. చెప్పిన వాక్యాన్ని

మళ్ళీచెబుతూ. తప్పుగా ఉచ్చరించిన మాటను సరిగా ఉచ్చరించడానికి ప్రయత్నించి మరింత తప్పుగా ఉచ్చరిస్తూ, మధ్యమధ్య ప్రశ్నలు వేసుకుంటూ, ఆ ప్రశ్నలకు తనే సమాధానం చెబుతూ వాగసాగాడు.

తూరుపున గుడ్డిసుక్క పుట్టకముందే ఇంటి కాడ బయల్దేరినా? తెల్లరినాక బయల్దేరితే ముడ్డి కడగనోడెవుడన్నా ఎదురుగా వస్తే బయల్దేరినపని జరగదని అంత మొబ్బుకాడ బయల్దేరినా. నిన్ను లేవదీసుకోనొచ్చి పూజ పెట్టించినా. నువ్విచ్చిన విబూది నొస్టిన రుద్దుకున్నా. ''సావి నీ పాదాల కాడుండే విబూది తీసి నొస్టిన పెట్టుకుని యల బార్తా ఉండా. నన్నుకాయి'' అని దేవునికి దండం పెట్టుకున్నా. రోడ్డుకాడకు పోయి బస్సెక్కినా. టౌనులో బస్సుదిగి నడుసుకుంటా బాంకీ కాడికి పాయ్యేటప్పటికి రొండుబారల పొద్దెక్కింది.

''నేను పోయి చేరేటప్పటికి ఆడ పలకరించే దానిగ్గూడా ఎవుడూ లేడు. గేటుగూడా తెరవలేదు. ముందుస్తే ముందొచ్చినావులే అని గేటు ముందర గంగరావి చెట్టుకింద కూసున్నా. ఇంగేడికి పోయేది? ఆ టౌనులో మనకు సుట్టాలా పక్కలా? ఐనోళ్ళా? పాయినోళ్ళా? వాళ్ళు పంపిన తాకీదు చేతబట్టుకుని గంగరావి చెట్టుకింద కూసున్నా. ఇంకొంచేపిటికి పది గెంటల సెంకు పట్టుతుందనంగా గేటుతీసే మనిసొచ్చి గేటు తీసినాడు. ఒక ముసల్దొచ్చి చెత్త తోసేదానికి మొదులు పెట్టె. అదయినాక జనం ఒక్కరొక్కరే రావటం మొదులు పెట్టినారు. సైకిళ్ళ మీదొచ్చేటోల్లు, గుడుగుడు మోటార్ల మీదొచ్చేటోల్లు, కార్ల మీదొచ్చేటోల్లు. ఒచ్చినోడు ఒచ్చినట్టుగానే మెట్లెక్కి లోపలకు పోయి డస్కుల ముందర కూసోని గీకాటం మొదులు పెట్టినారు.''

పూజారి అడ్డువస్తూ ''ఆఫీసరు ఎట్టొచ్చె? నడిసొచ్చినాడా? దేనిమీదైన వొచ్చినాడా?'' అన్నాడు.

తిరిపాలనాయుడు ''నడిసొచ్చే గాచ్చారం వానికేవి పట్టింది. గవుర్మెటోడిచ్చే జీతం అట్టుండగా పై సంపాదనే నెలకు నాలుగు వేలుందట'' అన్నాడు.

పూజారి జోస్యం చెప్తున్నవాడిలాగ, ''ఐతే వాడు కార్లోనే వొచ్చుండాల'' అన్నాడు.

తిరిపాల నాయుడు, ''కారంటే కారా అది? దాన్ని చూసేటోల్ల కండ్లు బెవిసి పోవాల్సిందే. దాని వీపు మీద ఏకంగా నాలుగు కళ్ళాలు పెట్టుకోవచ్చు'' అన్నాడు.

పుల్లిగాడు ఏదో చెప్పబోగా తిరిపాలనాయుడు, అవకాశం ఇవ్వకుండా, ''కారు గేటుకాడికి రాంగానే గేటు మనిషి పాదాలు రెండూ ఒక తావున పెట్టుకొని నిద్రాయి మాను మాదిరి నిలుచుకుని సలాం జేసినాడు. గేటులోపల కారు నిలబెట్టేదానికి రేకుల్తో ఒక జోబిడీ ఏసుండారు. మన బతుకంతా కలసి ఆ జోబిడీకి దీటురాదు. ఆఫీసరు కారును ఆ జోబిడీలో పెట్టి తిరిగొచ్చి మెట్లెక్కేదానికి మొదులు పెట్టినాడు. నేను పరుగున పోయి 'నేనొచ్చినా దొర' అన్నెప్పి తాకీదు కాయితం చూపిస్తూ, వాడు కాయితం చూసుకుని, 'సరె, ఆడ కూసో. నేను పిలిపించినప్పుడు లోపలికిరా' అనేసి లోపలకు మాయమైపోయె. నేను మల్లా వొచ్చి చెట్టుకింద గూసుంటి. ఆ కూసోవడం కూసోవడం మద్యానందాక కూసుకుంటి'' అన్నాడు.

పూజారి ''అదెట్ట? అందరి కన్నా ముందొచ్చింది నువ్వు గదా. ఆఫీసరు నీ పని గదా ముందు చూసి పంపించాల?'' అనడిగాడు.

పుల్లిగాడు, ''ఈ కతాలన్నీ మనం ఈడ గూసోని మాట్లాడుకొవల్సిందే. గవుర్మెంటోనితో మాట్లాడితే వాడు నడు బయటకు అంటాడు'' అన్నాడు.

పూజారి ''అదీ నిజవే. అట్లా కొచ్చిన్లడిగే సత్త మనకుంటే మన బతుకులిట్టెందుకుంటాయి?'' అన్నాడు.

తిరిపాలనాయుడు మళ్ళీ అందుకుని ''కూసున్న తావు కదలకుండా చెట్టుకింద పన్నెండు గెంటల సెంకు పట్టే దాక కూసున్నా. ఉచ్చ పోసుకునే దానిగ్గూడా అట్ట పాయినోడ్ని గాను. నేనట్టపోతే ఆఫీసరోడు పిలిపిస్తాడేవోనని భయం. పన్నెండు గెంటలయినాక బిళ్ళ జవానొచ్చి 'ఎవురయ్యా తిరిపాల నాయుడు? దొర పిలస్తా ఉండాడు. లోపలికి రా' అనె. ఆ మాటినంగానే నాకు ఏడుకొండలవాడు పిలిచినంత సంతోసవైపోయింది.

''నేను ఆఫీసరోని రూములో అడుగు పెట్టంగానే వళ్ళంతా సల్లగా అయిపోయింది. చలికాలంలో గుడ్డల్దీసేసి నీళ్ళ తొట్టిలో కూసుంటే యట్టుంటుంది? అట్టయిపోయింది నాకు'' అన్నాడు.

పూజారి ''అట్ట బయపడేదేవిటికి? ఆఫీసరేవి తలకాయ గిల్లేస్తాడా? వాడూ మనిసేగదా?'' అన్నాడు.

తిరిపాలనాయుడు ''భయపడి కాదు. లోపలేదో మిసన పెట్టుండారంట. బయట ఎండ ఎంత జోరుగా కాస్తా ఉన్నా సరే ఆ మిసన్ పన్జేస్తా ఉన్నంతసేపు లోపలసల్లగా ఉంటుంది. సరె. ఆఫీసరోడు డస్కుముందర కూసోనుండాడు.

సల్లో వొణుక్కుంటూ వాన్దగ్గరకు పోయి నిల్చుంటి. ఆఫీసరోడు తాకీదు కాయితం తీసుకుని చదివి, 'ఏవయ్యా. జప్తు రేపుజరగబోతుందనంగా ఈ పొద్దొస్తే నేను మాత్రం ఏవి జేస్తాను? నాకేవి మంత్రాలు తెల్సునా ఎక్కడి దక్కడ ఆపుజేసే సేదానికి?' అనె. నేను మడి చేతులు కట్టుకుని, 'మన్ను షిషుక్కుని బతుక్కు నేటోల్లం దొర. ఆ మన్ను గూడా పోగొట్టుకుంటే మేవెట్ట బతకతాం?' అంటి. ఆఫీసరోడు తాకీదు కాయితాన్ని మడత పెట్టి, 'అవన్నీ నాకు చెప్పి ఏవి లాబం? అప్పు దీసుకోమని నేను నీకు చెప్తినా? ఏలి ముద్దర్లెయ్యమని నేన్జెప్తినా? అంతా జేసి ఇప్పుడు నా దగ్గరకొచ్చి వొప్పారం మొదులు పెత్తే నేనేం జెయ్యాల?' అని ఆ మడత పెట్టిన కాయితాన్ని డస్కులోపలేసి, 'నన్నిప్పుడేవి జెయ్యమంటావు?' అనడిగె. 'ఒక సంవత్సరం దినాలు అప్పు వాయిదా ఎయ్యించు దొరా. నా పెండ్లాం బిడ్డలు కూలీ నాలీ చేసి సంవత్సరంలోగా అప్పు కట్టేస్తాం. ఒక్క సంవత్సరం దినాలు వాయిదా ఎయ్యించు దొరా' అంటి. ఆఫీసరోడు 'వాయిదా ఎయ్యాలంటే మాటల్తో అయ్యే పనా? నేనీడ కుర్చీ మీద కూసోనుండానే గాని నా పైవోళ్ళు లచ్చాతొంబైమంది ఉండారు. వాళ్ళందరికీ సమాదానం చెప్పాలంటే వొట్టి నోటి మాటల్తో అయ్యే పనిగాదు' అని తలుపు దిక్కొకసారి, కిటికీ దిక్కొకసారి చూసి, ''ఇద్దో. ఇట్ట జూడు. నేను రేపట్నుంచి లీవులో పోత ఉండా. రేపు పోయినానంటే ఒక నెల దినాలురాను. చెప్పే దేవన్నా ఉంటే ఇప్పుడే చెప్పు' అనె'' అన్నాడు.

పూజారి, ''చెప్పాల్సింది చెప్పినావు గదా. ఇంకా ఏవి చెప్పాలంట?'' అన్నాడు.

తిరిపాలనాయుడు, ''నేనూ అదే మాట అంటి. నేనా మాట అనంగానే వానికి ఇంత పొడగు కోపం వొచ్చేసింది. బిళ్ళ జవాన్ను దగ్గరకు పిలిచి వానికేదో చెప్పినాడు. బిళ్ళ జవాను 'ఇట్టర' అన్జెప్పి నన్ను రెక్కపట్టుకుని ఆ రూవు నుంచి పక్క రూవుకు, ఆడ నుంచి ఇంగొక రూవుకు తీసకపోయి కడాన యాడికి తీసకపోయినాడనుకున్నావు?'' అన్నాడు.

పూజారి, ''యాడికి తీసక పోయినాడు?'' అనడిగాడు.

''కక్కూసు రూవుకు తీసకపోయినాడు''

పూజారి, ''కక్కూసు రూవంటే ఏంది?'' అనడిగాడు.

పుల్లిగాడు, ''ఉచ్చ పోసుకునే తావు. ఆఫీసులో పన్జేసేటోల్లు వొంటికొస్తే పోసుక నేదానికి ఆరూవులోకి పోతారు'' అని వివరించాడు.

తిరిపాల నాయుడు ''ఒంటికే గాదు. రొంటికొచ్చినా ఆడికే పోతారు'' అన్నాడు.

పూజారి ముఖం చిట్లించుకుని, ''ముండుగుంపు. కసమాలం పన్లు చేసే దానిగ్గూడా రూవులు కట్టుకోనుండారా?'' అని తన అసహ్యాన్ని వెల్లడించాడు.

పుల్లిగాడు, ''ఈ సదువుకున్నోల్లంత అంతే చేతిగుడ్డలోకి చీమిడి చీది జేబులో దాచుకునేటోల్లు'' అని తిరిపాల నాయుడి వైపు తిరిగి ''వాడు నిన్ను కుక్కూసు రూవులోకి ఏవిటికి తీసకపోయినట్టు?'' అనడిగాడు.

తిరిపాల్నాయుడు ''చెప్తా యిను. బిళ్ళ జవాను నన్ను కక్కూసు రూవులోయిడ్సి పెట్టేసి ''మవ్వీడనే ఉండు. దొరొచ్చి మాట్లాడతాడు అనేసి మాయమైపోయె. అది పేరుకు కక్కూసు రూవేగాని, మన నట్టిల్లు కన్నా సుబ్బరంగా ఉండాది. గుక్కూమిక్కూ మనుకుంటా నేనాడ నిలుచుకుంటి. కొంచేపిటికి ఆఫీసరోడు రానే వొచ్చె. బూట్లు టక్కు టక్కు మనిపించుకుంటా నేరుగా వొచ్చి పాంటు గుండీలు ఇప్పి నిల్చుకునే ఉచ్చపోసేదానికి మొదలు పెట్టె'' అన్నాడు.

పుల్లిగాడు. ''ఔ. సదువుకున్నోల్లు నిలబడే ఉచ్చపోస్తారు. మన మేకలు, ఆవులు పోస్తె ఉండ్లా అట్ట'' అన్నాడు.

తిరిపాలనాయుడు ''ఉచ్చ పోసుకుంటా మెడ యనక్కు తిప్పి 'ఇద్దో ముసిలాయనా. నువ్వు చెప్పిన పని దుడ్డుతో అయ్యేదే గాని మాటల్తో అయ్యే పనిగాదు. ఐదు నూర్లుంటే గాని పని జరగదు. యంతుంది నీ దగ్గర?' అని రాతికి టెంకాయ కొట్టేసినట్టు అడిగేశె. 'ఇల్లంతా కడిగి బోర్లించేసొచ్చినాను దొరా. ఐదు నూర్లు నన్ను కోసినా గూడ రాలవు. నూర్రూపాయలు తెచ్చుకోనుండా. అద్దీసుకోని నా కయ్యలు నాకు దక్కించు దొరా. నా తరం, నా బిడ్డల తరం నీ పేరు చెప్పుకుంటాం' అంటి. నేనా మాట అనగానే వాడు ఉచ్చబోసేది గూడా నిలిపేసి గుండీలు పెట్టుకుంటూ వచ్చి చెయ్యి చాపినాడు. ఆ చేతి మీద ఉచ్చ తేమ అట్టనే ఉండాది. సంచిలోనుంచి నూర్రూపాయల నోటుతీసి ఆ చేతిలో పెట్టితి. అది మాలచ్చిమి అని గూడా సూడకుండా దాన్ని తీసి ముడ్డి కాడుండే పాంటుజేబులో పెట్టుకునే. ఆదరాబదరా కొళాయి తిప్పి చెయ్యి కడుక్కుని, 'ఇంక నాలుగు నూర్లెత్తు' అనె. 'ఉండిన కాడికిచ్చినా దొరా. ఇంక దారి కర్చులకు గూడా నా దగ్గర దమ్మిడీ లేదు. ఆ నూరూ తీసుకుని నా పని చేసిపెట్టు దొరా' అంటి. వాడు జేబులో నుంచి చేతి గుడ్డ తీసి చేతుల

మీదుండే తేమ తుడుచుకుని, 'ముసిలోడా. ఈ నక్కజిత్తులు ఈడ పనికిరావు. మీకర్నపోడు ఆ కాయితం ఊరికే రాసిచ్చినాడా? వానికి యట్ట లేదన్నా ఐదు నూర్లిచ్చి రాయించుకోనొచ్చుంటావు. మరి ఈడ మాత్రం ఉత్త పుణ్యానికి నీ పని ఎవుడు చేసి పెట్తాడు?' అనె. 'ముందుగానే చెప్తిని గద దొరా. ఇల్లు కడిగి బోర్లించేసొచ్చినా. ఐదు నూర్లిచ్చే సత్త ఉంటే నువ్వడక్క ముందే ఇచ్చుందును దొరా' అంటి. వాడు నా భుజం మీద చెయ్యేసి, 'ముసిలోడా. ఈ బిత్తిరేడుపు లేడ్సి లాబం లేదు. నేను చెప్పేది యిను. ఈ నూర్రూపాయలేదో బెమ్మోళవును కుంటా ఉండావు. ఒక చిన్నగీటు గీసేదానికి వెయ్యి రూపాలయలిచ్చేబోళ్ళుంటారు. ఇంక నువ్వడిగిన పని సిన్నదేమీ కాదు. వడ్డీ, అసలూ కలిసి నీ అప్పు తొమ్మిది వేలయ్యుండాది. అంత పెద్ద మొత్తం సంవత్సరానికి వాయిదా ఎయ్యాలంటే అది నూర్రూపాయల్తో జరిగే పనిగాదు. నీ పని జరగాలంటే నేన్జెప్పిన పని చెయ్. నువ్విప్పుడు నేరుగా మీ ఊరికి పో. నాలుగు నూర్లు చేతబట్టుకుని రేపు పదిగంటలకురా' అని చెప్పి నా బుజం మీద మల్లీకసారి తట్టి ఆడ్నుంచి యలబారి నాడు. నేను వాని ముడ్డినక పడితి. సాయిత్రి యమధర్మరాజెనక పడినట్టు నేను వాడెనకపడితి. తీరా వాడు ఆఫీసు రూవులోకి పాయ్యేటప్పుడు వాని జబ్బ వొడిసి పట్టుకుని 'నన్నొక దోవ జెయ్యిదొరా. నేను మా వూరికి పోయినాగూడా నాలుగునూర్లు పుట్టించలేను. ఇప్పుడే నాకొక దోవచెయ్యి దొరా' అంటి. వాడు నా చెయ్యి విదిలించి, 'చెప్పాల్సిన మాట ఆడనే చెప్పినాను. ఇంక నన్ను నసపెట్టి లాబం లేదు' అనేసి లోపలికి పోయినాడు. నేరుగా పోయి కుర్చీలో కూర్చున్నాడు. నేను లోపలకు పోబోతే బిళ్ళ జవాను యనక్కు తోసేసినాడు. నేను బయటే నిటబడి గట్టిగా, 'నా పని చెయ్యకపోతే పోతివి దొరా. నా నూర్రూపాయలు నా మొకాన కొట్టు. నా దోవన నేబోతా' అంటి. నేనా మాట అనంగానే ఆడ డస్కుల ముందర కూసుని రాసుకునే వోళ్ళంత పేనాలు కిందిబెట్టేసి నా దిక్కు సూసినారు. అంతే. ఆఫీసరోడు నాగుబాము మాదిరి కుర్చీలోనుంచి లేసినాడు. నాగుబాము మాదిరి బుసకొట్టుకుంటా నా దగ్గర కొచ్చినాడు. ''ఏవి కూసినావురా ముసలి నక్కా. నీ దగ్గిర నూర్రూపాల్దీసుకున్నానా? తగొచ్చి నావురా లంజకొడుకా' అని చెయ్యి పైకెత్తినాడు. చెయ్యినాగుబాము పడిగ మాదిరి పైకి లేచింది. ఆ దెబ్బ యాడ పడిందో నాకు తెలవదు. నాకండ్లు బూసులు కమ్మినాయి. తెలివొచ్చేటప్పటికి నేను ఆఫీసు ముందర లేను. గేటుముందర గంగరావి చెట్టు కింద పడుకోనుండాను. నా చుట్టూ శానామంది జనం నిల్చుకోనుండారు. వాళ్ళందరూ పాంట్లు ఏసుకోనుండారు.

వాళ్ళ జేబుల్లో పేనాలుండాయి. అప్పటికి నాకు అర్థవయింది. నా కయ్యాలు నల్లబాగులై పోయినాయి. నా బతుకే నల్లబాగులై పోయింది. నిండా మునిగినాక సలేంది అనుకుని మొదులు పెట్టినాను. నోటికొచ్చినట్టు తిట్టాటం మొదలు పెట్టినాను. ఆఫీసరోని జేబులో ఉండేది నా నూర్రూపాయలు గాకుంటే ఇంగేందని అడిగినాను. నూర్రూపాయలు గాకపోతే వాని జేబులో ఉండేది నా అమేద్యమా అనడిగినా. గోచిపాతకు మించిన దరిద్రం లేదు. సిరుస్సుకు మించిన దరిద్రం లేదు. అంతా పోగొట్టుకుని బిక్కా పకీరు మాదిర నిలబడుకోనుండా. ఎవుడు మాత్రం నన్నింగేవి జేస్తాడు? తిట్టిన తిట్టు మళ్ళీ తిట్టకుండా జావు సేపు తిట్టినాను. ఆఫీసరోడు బయటకురాలేదు. బిళ్ళజవాను మాత్రం పండ్లు బయట పెట్టి నవ్వతా ఉండినాడు.

''అట్ట జావు సేపైనాక యాడ్నుంచి వొచ్చినారో ఇద్దరు పోలీసోల్లొచ్చినారు. వొచ్చీరాంగానే నా భుజాల కింద చేతులేసి 'లేరా ముసిలోడా. పైకిలే' అనిరి. నేను బిత్తర పోయి, 'యాడికి?' అంటిని. వాళ్ళు నన్ను అలాగ్గా పైకెత్తి నిలబెట్టి 'నడు' అన్నారు. నేను యాడికి? యక్కడికి? అనడగతా ఉండాను. వాళ్ళు నేనడిగింది యినిపించుకున్నోళ్ళుగాదు. నన్ను బరబర లాక్కుంటా రోడ్డు మీద తీసక పోయినారు. ఆడ్నుంచి నాలుగు బజార్లు తిప్పి ఒక పెద్ద బిల్డింగులోకి తీసకపోయినారు. ఆడొక బుర్ర మీసాలోడు కుర్చీలో కూసోనుండాడు. వాని ముందర బారెడు పొడుగుండే డస్కు ఉండాది. డస్కు మీద కాయితల కట్టలు సందు లేకుండా ఉండాయి. పోలీసోళ్ళు నన్ను తీసుకుపోయి ఆ డస్కు ముందర నిలబెట్టినారు. మీసాలోడు నన్ను యగాదిగా చూసి, 'తిరిపాల నాయుడు నువ్వేనా?' అనడిగినాడు. నేనేనన్జెప్తి. ఊరి పేరడిగినాడు. అదీ చెప్పితి. మీసాలోడు పోలీసోలిచ్చిన కాయితాన్ని తిప్పించి, మల్లించి చూసి, 'పెద్దాయనా. బాంకు సూపరైజరు నీ మీద కేసు పెట్టినాడు. నువ్వునూర్రూపాయలు లంచవిచ్చేదానికి సూసినావంట. జప్తు నోటీసును వాపసు చేసుకోమని లంచవిచ్చేదానికి సూసినావని నీ మీద కేసు పెట్టినాడు. దీనికి నువ్వేమి చెప్తావు?' అనడిగినాడు. నేనేవి జెప్పాల. కార్ల మీద తిరిగే దొర. సూటు బూటు ఏసే దొర. మన్ను పిసుక్కుని బతికేటోని మీద కత్తిగట్టినాడు. ఇప్పుడు నేను ఏవి చెప్తే మాత్రం అది యాడకెక్కుతుంది? ఆ మాటే మీసాలోనికి చెప్పినా. మీసాలోడు తల అడ్డంగా ఊపినాడు. ఊపి, 'అదిగాదయ్యా, సూపరైజరు నీ మీద కేసు పెట్టినాడు. ఆకేసు ఏందో ఇంటివి గదా. దానికి నువ్వు చెప్పేదేందో చెప్పు. మేవు రికార్డు రాసుకోవాల' అన్నాడు. నేను ఆచ్చిరమ్మక్క తెలవనోడ్ని. నేను చెప్పేది

యాడికీ ఎక్కదు. ఉట్టికీ ఎక్కదు, సొర్గానికీ ఎక్కదు. నాకు తెల్సు. ఆయన రాసుకోవాలంటా ఉంటాడు గాబట్టి చెప్పాటం మొదులు పెట్టినా. కక్కూసు రూవులో జరిగిందీ, ఆఫీసు రూవులో జరిగిందీ అంతా యిలావరిగా చెప్పినా. మీసాలోడు నేన్జెప్పిందంతా రాసుకున్నాడు. ఆకాయితం మీద నా ఏలి ముద్దరేయించు కున్నాడు. అదయినాక కాయితాలు మూసేపి, 'పెద్దాయనా, నీ మీద కోర్టులో కేసు జరుగుతుంది. ఇప్పుడు నువ్వు ఇంటికి పో. సమన్లు పంపుతాం. సమన్లు పంపినప్పుడు నువ్వు కోర్టుకు హాజరు కావాల' అన్జెప్పె. ఆ మనిషి కొక దండం పెట్టేసి నేరుగా రోడ్డు మీద కొచ్చి బస్సెక్కి ఊర్లోపడ్తి''.

తిరిపాల నాయుడు తన కథనాన్ని ముగించి పూజారి వైపు చూసి, ''వింటివా సావి. నీ దేవుని దొర్తానంలో ఎన్నెన్ని కరుమోలాలు జరగత ఉండాయో వింటివా? కయ్యలు దక్కించమని కాళ్ళు పట్టుకుంటే వాడు నూర్రూపాయలు గుంజుకునింది గాక నన్ను జైలుకు పంపించే ఏర్పాటు చేసినాడు'' అన్నాడు.

పూజారి సమాధానం చెప్పలేదు. అతడు తలవంచుకుని మౌనంగా కూర్చుని ఉన్నాడు.

తిరిపాల్నాయుడు కల్లు సీసాలను చేతిలోనికి తీసుకున్నాడు.

''ఇంగ నేను పోతాసావి. నా పెండ్లాం నా కోసరం దేవజూస్తా ఉంటుంది.'' అని పైకి లేచి మళ్ళీ పూజారి వైపు చూసి, ''నువ్వు మూతి నేలకేసుకుని కూసోనుండేదేవిటికి సావి. అరిచ్చెంద్రుట్టాటోనికి తప్పలేదు. నలచక్రవర్తికి తప్పలేదు. మనకు యాడ తప్పుతుంది? జరగనీ, ఇంగా ఏవేవి జరగాలని నొస్టిన రాసుందో జరగనీ.'' అని తూలుతూ గ్రామం వైపు సాగి పోయాడు.

పూజారి అలాగే తలవంచుకుని మౌనంగా కూర్చున్నాడు. పుల్లిగాడు ఏదో చెప్పడానికి నోరు తెరచి, పూజారి ముఖంలోని గంభీరతను గమనించి ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

సూర్యుడస్తమించి చాల సేపయింది. చీకటి అలుముకుంటూ ఉంది. దూరంగా కొండల మీదుగా ఎగిరి వస్తున్న కొంగలు తెల్లటి నలుసుల వలె కనిపిస్తున్నాయి. అనుభవం గరపిన జ్ఞానంతో అవి పరిసరాలలోని ఆనవాళ్ళను జాగ్రత్తగా గమనిస్తూ తమ నివాస స్థానమైన మర్రిచెట్టు వైపు సాగి వస్తున్నాయి. అవి ఒక్కటొక్కటిగా, జంటలు జంటలుగా, గుంపులు గుంపులుగా వచ్చి మర్రి మాను కొమ్మలు పైకి కిందకు ఊగసాగాయి. అవి అవిరామంగా సందడి చేస్తున్నాయి.

ఒక బాటసారి మట్టి మీద నడచి వస్తున్నాడు. అతడు దేవాలయం వద్ద బాట దిగి ప్రహరీ గోడకు వెలుపల నున్న చేదబావి చెంతకు నడిచాడు. అతడు దూరాన్ని రాట్నం మీదుగా వేసి, బొక్కెనను బావిలోకి వదిలాడు. జబ్బల మీదను, భుజాల మీదను కండరాలు పొంగుతుండగా అతడు బొక్కెనను పైకి చేదాడు. బొక్కెన పైకి రాగానే దానిని అందుకుని చప్టా మీద దించి పెట్టకుండా అలాగే పైకెత్తి నోటికి కరిపించుకుని గటగట తాగసాగాడు. నీళ్ళు నోటి అంచుల వద్ద నుంచి తప్పించుకుని గడ్డాన్ని, గొంతును తడుపుతూ, రొమ్ము మీదుగా, పొట్టమీదుగా ప్రవహించి నడుము చుట్టూ ఉన్న బట్టను తడపసాగాయి. దప్పిక తీరాక అతడు బొక్కెనను దించి పెట్టాడు.

అప్పటికి తల పైకెత్తిన పూజారి ఆగంతకుడి వైపు చూస్తూ, ''బాగ దప్పికైనట్టుంది. యాడ్నుంచొస్తె ఉండావు?'' అనడిగాడు.

ఆగంతకుడు తలపాగాను విప్పి, ''ఓపినంత దూరం నడిసొచ్చినానన్నా'' అని నాలిక్కరచుకుని ఆగిపోయాడు. అతడు తలుపులు తెరచి ఉన్న గర్భగుడిని, పూజారి నుదుటి మీదున్న నామాన్ని, ఛాతి మీదున్న జందెపు పోగును చూసి, తను చేసిన సంబోధన సరైనది కాదని గ్రహించి, ''ఓపినంత దూరం నడిసొచ్చినాను సావి. పుణ్యార్తుడెవుడో ఈడ బాయి తొవ్వి పెట్టుండ బట్టి సరిపోయింది. లేక పోయుంటే ఈ యాలకు సోసతప్పి పడిపోయుందును'' అన్నాడు. అతడు ముందుకు రెండడుగులు వేసి ''ఇది ఏవి దేవలం సావి?'' అనడిగాడు.

పూజారి దేవాలయంలోని రాతి విగ్రహం వలె నిశ్చలనంగా, మౌనంగా కూర్చున్నాడు.

ఆగంతకుడు తుండగుడ్డతో ముఖాన్ని, మెడను, ఛాతీని తుడుచుకుంటూ ''ఈ దేవాలయంలో ఉండే దేవుడు ఎవురు సావి?'' అన్నాడు మళ్ళీ.

పూజారి తలెత్తి ''యాదేవుడైతేనేవి? మూసిన కన్ను తెరవనోడు యాదేవు డైతేనేవి?'' అన్నాడు.

ఒళ్ళు తుడుచుకుంటున్న ఆగంతకుడు గబుక్కున ఆగిపోయి అవాక్కయి పోయాడు. అతడు తన చూపులతో పూజారిని కాసేపు పరిశీలించి. ''పూజారైనోడే ఇట్టాటి మాటంటే యట్ట సావి?'' అన్నాడు.

పూజారి, ''పూజారంటే ఎవురనుకున్నావు? తర్పుడుగానట్టాటోడు. తర్పుడు గాడంటే ఎవురో తెల్సునా?'' అనడిగాడు.

ఆగంతకుడు ''తెల్సు, ముండలను పై ఆటగాళ్ళ దగ్గరకు చేర్చుటోడిని తార్పుడుగాడంటారు.'' అన్నాడు.

పూజారి, ''నేను చేసే పని సరిగ్గా అదే. నేను పుట్టి బుద్ధి తెల్సినప్పట్నుంచి ఈ గుళ్ళో పూజల్జెయ్యిస్తా ఉండా. నా కిప్పుడు నలభై ఏండ్లు. నేన్జెస్తా ఉండే పనేందో తెల్సుకుని దానికి నాకు నలభై ఏండ్లు పట్టింది'' అన్నాడు.

ఆగంతకుడు యాంత్రికంగా వొళ్ళు తుడుచుకుంటూ, ''యాడా ఇన్లేదు. పూజారైనోడు ఇట్లా మాటలనడం యాడా ఇన్లేదు'' అన్నాడు.

పూజారి, ''నిజమే. పురాణాల్లో హిరణ్యకసిపునట్టాటోల్లు ఇట్టాటి మాటలనేటోల్లు. నువ్వు చెప్పన్నా. ఇప్పుడు దేశం మీద జరిగే నారాగోరాలు హిరణ్యకసిపుని దొరతనంలో జరిగినాయా? ఇప్పుడు జరిగే కరుమోలాలు ఖరదూషణాదులేలిన దండకారణ్యంలో జరిగినాయా?'' అన్నాడు.

ఆగంతకుడు కాసేపు పూజారి వైపు, మరి కాసేపు పుల్లిగాని వైపు ఆయోమయంగా చూసి, తుండుగుడ్డను భుజాల చుట్టూ కప్పుకుని, తనలో తాను గొణుక్కుంటున్నట్టు, ''యాడా ఇన్లేదు, పూజారేంది? ఇట్టాటిమాటలనే దేంది? కలిగ్గం మీద యాడా ఇన్లేదు'' అను కుంటూ మట్టిబాట మీద కెక్కసాగాడు.

15

గ్రామం నాలుగు వీధుల కూడలిలో ఒక వేపమాను వుంది. వేప మాను కింద రచ్చబండ వుంది. వెన్నెల కలుగజేసిన వేపమాను తాలూకు నీడ రచ్చబండను కప్పుతూ వుంది. ఆ చీకటిలో కొందరు రైతులు కూర్చుని వున్నారు. చీకటిలో వాళ్ళ ఆకారాలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. వారి నోళ్ళలో కాలుతున్న చుట్టలు, బీడీలు మాత్రం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

తలారివాడు డప్పును భుజానికి తగిలించుకుని వీధి వెంబడి నడిచి వచ్చాడు. వాడు నేరుగ వచ్చి నాలుగు వీధుల కూడలిలో నిలబడి డప్పును మ్రోగించడం ప్రారంభించాడు. వీధులలోను, ఇళ్ళలోను, పెరళ్ళలోను, కొట్టాలలోను వున్న రైతులకు డప్పు మోత వినిపించసాగింది. తలారివాడు డప్పును మ్రోగించడం ఆపి, మోర ఎత్తి గొంతును పెంచి దండోరాను ప్రకటించాడు. ''ఒరే ఒరె,

మరి ఏవంటే. వూర్లో వుండే సకల జనానికి గవుర్మెంటు సెప్పమనింది ఏవంటే రాయపాటి తిరిపాలనాయడోల్ల కయ్యలు యాలాని కొచ్చుండాయి. రేపు పది గెంటల పొద్దుకు యాలం జరుగుతుంది. యాలం పాట పాడేవోళ్ళంతా రేపు పది గంటలకు పంచాయితీ ఆపీసుకాడ హాజరు కావల్సిందహో---?

డప్పుమోత మళ్ళీ ప్రారంభయింది.

రచ్చబండ మీద కూర్చుని వున్న రైతుల నోళ్ళలో వెలుగుతున్న చుట్టలు, బీడీలు వాళ్ళ చేతులలోకి మారాయి. అక్కడ నుండి రచ్చబండ అంచుల మీదకు రాలి, అక్కడ నుండి వీధిలోని ఇసుకమీదకు దొర్లాయి. అవి ఇసుకల్లో కాసేపు నిస్తేజంగా మినుకు మినుకుమని ఒక్కటొక్కటే ఆరిపోయాయి. రైతులు చేతులను వొడులలో వేసుకుని, గడ్డాలు రొమ్ములను తాకేలాగ తలలు వంచుకుని మౌనంగా కూర్చున్నారు. పెరళ్ళలో స్నానం చేస్తుండిన రైతులు మధ్యలోనే చెంబులను తొట్లలోకి జారవిడిచారు. భోజనానికి కూర్చున్న రైతులు నోటిదాక తీసుకెళ్ళిన ముద్దను కంచంలో విదిలించి పైకి లేచారు. కుక్కిమంచంలో పడుకుని వుండిన రైతులు దిగ్గున లేచి జవసత్వాలుడిగినట్లు గోడకు జారగిలబడ్డారు.

వీధిలో డప్పు మ్రోగుతూనే వుంది. తలారివాని కళ్ళు చెమ్మగిలుతున్నాయి. చెమ్మగిల్లిన ఆ కళ్ళలో చంద్రకాంతి ప్రతిఫలించసాగింది. అతడు మోరను ఆకాశానికెత్తి కళ్ళను గట్టిగా మూసుకుని డప్పు మ్రోగించసాగాడు.

డప్పు లయతప్పి మ్రోగసాగింది.

16

కల్లు సారాలు వాసన, చెమటతో తడిసిన బట్టల వాసన గుప్పు గుప్పుమని వీస్తూ వుంది. కల్లుపాకలో చోటుచేసుకుని వున్న చీకటిని పారద్రోలడానికి ఆ వారన వ్రేలాడదీసి వున్న ఎలక్ట్రిక్ బల్బు ప్రయత్నిస్తూంది. బల్బు కింద ఒక కొయ్యటేబిలు, దాని వెనుక కీళ్ళూడిన కుర్చీ వున్నాయి. కల్లుపాక యజమాని కుర్చీలో కూర్చుని కాతాపుస్తకంలో టిక్కులు పెట్టుకుంటున్నాడు. మరొకవైపున మండుతున్న పొయ్యి ముందర యజమాని భార్య కూర్చుని వుంది. ఉప్పులో వూరవేసిన మాంసపు ముక్కలను ఆమె నూనెలో వేయిస్తూ వుంది.

కల్లుపాకకు ఒకవైపున మట్టిగోడ వుంది. మరొకవైపున కొబ్బరి కీతులతో

అల్లిన తడక వుంది. కల్లు సారాలను సేవిస్తున్న వాళ్ళు కల్లు పాకలోను, కల్లుపాక ముందున్న ఖాళీస్థలంలోనూ గుంపులుగా జంటలుగా కూర్చుని వున్నారు.

తలారివాడు ఒక సీసాను ఖాళీచేసి కింద పెట్టి బొంగురు గొంతుకతో, ''నల్లదొకిటి ఇట్టందకో అన్నా'' అన్నాడు.

యజమాని పెన్సిలును చెవిలో చెక్కుకుని కుర్చీలోంచి లేచి ఒక సీసాను తలారివానికి అందించి, ''గొంతు సుద్దంగా రాచిపోయుండాదేవిరా?'' యాడ కూసోని యాలకతలు పాడతా వుంటివి?'' అనడిగాడు.

తలారివాడు సీసాను అందుకని, ''యాలకతలు కాదన్నా. యాలంపాట పాడతా వుంటి'' అన్నాడు.

యజమాని మళ్ళీ కుర్చీలో కూర్చుని, ''ఓ. ఈపొద్దు తిరిపాలనాయుని కయ్యలు యాలవయినాయంటగదా. యాలం పాడింది నువ్వేనా?'' అన్నాడు.

తలారివాడు సీసా మూతను గిరవాటు పెట్టి, ''నేనేనన్నా. కోర్టు జవాను యాలం పాడనని మొండికేసినాడు. వాని పెండ్లాం కడుపుతో వుందంట. పెండ్లాం తీర్త వాడేదాక యిట్టాటి పాపిష్ఠిపన్లు చెయ్యనని మొక్కుకున్నాడంట. పాపిష్ఠిపన్లు, నాబర్డాపన్లూ ఎవురికి తప్పినా తలారోనికి తప్పవుగదా. తీరా యాలం ముగిసేట ప్పటికి నా గొంతు పుండయిపోయింది'' అన్నాడు.

యజమాని చెవిలోనుంచి పెన్సిలు తీసుకుని, ''మొత్తానికి తిరిపాలనాయుడ్ని ముండమోయిస్తివి'' అన్నాడు.

పొయ్యిమీద మాంసం ముక్కలు చుయ్యిమన్నాయి. తలారివాడు సీసాను చటుక్కున కిందబెట్టి, ''నేను అప్పుడే అనుకున్నా, ఇట్టాంటి అగుడు మోయాల్సొస్తుందని.. ఇందులో నాదే ముందన్నా. పని నాదిగాని పాతకం నాదికాదన్నా'' అన్నాడు.

కొబ్బరితడక కవతల చీకటిలో నుండి ఒక స్వరం, ''ఆ మాట ఇప్పుడు నువ్వనేదేంది? ఆ మాట కిష్టపరమాత్మ బగవద్గీతలో నాడే అనుండాడు. పని నీది గాని పాతకం నీదికాదురా అని నాడే అనుండాడు'' అని వినిపించింది.

తలారివాడు తలతిప్పి, ''ఎవురాడ? గొంతు ఎప్పుడూ విన్నట్టులేదు. ఈ వూరి మనిషి కానట్టుండాది'' అన్నాడు. అందరూ తలలు తిప్పి కొబ్బరి తడకవైపు చీకటిలోకి చూశారు.

కొబ్బరి తడక వెనుకనుండి పూజారి యివతలకు వచ్చాడు. అతని చేతిలో

దాదాపు ఖాళీ అయిన సీసా వుంది. అతని వెనక పుల్లిగాడు వున్నాడు. పూజారి వెలుతురులో కొచ్చి కూర్చుని, ''ఈ వూరి మనిసినే. ఈ వూరి నీళ్ళు నలబై సంవత్సరాలుగా తాగినోడినే'' అన్నాడు.

తలారివాడు నోరు వెళ్ళబెట్టుకుని కాసేపు ఆశ్చర్యంగా చూసి, ''ఇదేంది! దేవలం పూజారేంది? కల్లు దాగడవేంది!'' అని యజమాని వైపు తిరిగి, ''ఇంత అన్యాయానికి పాలుమార్తివేందన్నా? పూజారికి కల్లుబోసి పాపం మూట గట్టుకుంటివిగదన్నా'' అన్నాడు.

యజమాని కాతా పుస్తకంలో టపటప కొన్ని టిక్కులు పెట్టి ''ఇందులో నాదేవుంది? ఇంచేపు నువ్వే చెప్తివి గదా – పని మనదిగాని పాతకం మనదిగాదని'' అని పూజారి వైపు తిరిగి ''చెప్పేవి సావి. నీకు నేను గొట్టం పెట్టి కల్లు పోస్తినా?'' అనడిగాడు.

పూజారి సీసాను పైకెత్తి గుక్కెడు నోట్లో పోసుకుని మింగి, ''నిన్నటిదాక నాకెవుడన్నా గొట్టం పెట్టి పోసినా తాగి వుంటేబోడ్ని కాను. నిన్నటిదాక ఆ గెరిగుడిలో గబ్బిలం మాదిర బతకతావుంటి. ఈ పొద్దిటికి అవన్నీ వగదెంచుకుని బయటకొచ్చి ఎల్తురులో కూసోనుండా. ఇప్పుడు నాకెవురూ గొట్టం పెట్టి పాయ్యాల్సిన పనిలేదు'' అని తలారివాని వైపు తిరిగి, ''అదట్టుండనీ. పాతకం నీది కాదంటివి. పని మాత్రం నీదంటివి. మరి పాతకం ఎవుర్ది?'' అన్నాడు.

తలారివాడు ''నాకేవిదెల్సు. నువ్వు శాస్త్రాలు చదువుకున్నోడివి. నువ్వే చెప్పు'' అన్నాడు. పూజారి ఏదో చెప్పబోతుండగా పుల్లిగాడు, ''శాస్త్రాలన్నీ సుట్టబండలవ్వెప్పి గుడినొదిలేసి కల్లంగడి కొచ్చుండాడు. మల్లా ఆయన్ను శాస్త్రాలు చెప్పమనేదేంది? నీ కొచ్చినుకు జవాబు నేవ్వెప్తా. ఈ పాతకవంతా గవుర్మెంటోనిది'' అన్నాడు.

తలారివాడు ఆ సమాధానం కోసమే ఎదురుచూస్తుండినట్లు, ''ఆ మాటే నేను అన్నావనుకుంటా వుంటి. కాని అన్లేక పోయినా. నేను గవుర్మెంటోని కొలువు చేసేటోడ్ని, వాడిచ్చిన రూకల్తో పొట్ట పోసుకునేటోడ్ని. ఆ మాట నేననేదానికి యాడుంది?'' అని పెదాలకంటుకుని వున్న కల్లుచుక్కలను తుడుచుకుని, ''గవుర్మెంటోడంటే తెగీ తెగని కత్తితో గొంతులు కోసేటోడన్నా. యాలం జరిగినప్పట్నుంచి నాకు తిండి సయించాటం లేదన్నా'' అన్నాడు.

యజమాని ''అందుకేనా దినాం ఒక సీసా తాగేటోనివి ఈ పొద్దు రెండు సీసాలు తాగతావుండావు?'' అన్నాడు.

తలారివాడు ''ఇంగా ఒక సీసా తాగితేగాని రాతిరికి నిద్దరపట్టదన్నా. నిద్దర పట్టినా కలలో తిరిపాలనాయుడే కనపడతాడన్నా'' అన్నాడు. అతడు వగరుగాను, ఘాటుగాను వున్న సారా ఒక గుక్క నోట్లో పోసుకుని చప్పరించి, ''యాలం జరిగినంతసేపు తిరిపాలనాయుడు పాచికల్లో ఓడిపోయిన దర్మరాజు మాదిర పంచాయితీ ఆఫీసులోపల కూసున్నాడు. మొకంకళ తప్పిపోయింది. పేగులు, గుండెకాయ తీసేసినోడు మాదిర గోడకానుకుని కూసున్నాడు. యాలవంత అయిపోయినాక నన్ను లోపలకు పిల్చి 'కడా పాట ఎంతకు పాడినారు?' అనడిగాడు. కడాపాట పదివేలు పలికిందని చెప్తి. 'రేపు ఊరిడ్సిపెట్టి దేశంలమీద పోదావనుండా. దారి కర్సులకు ఏవన్నా మిగుల్తుందో లేదో' అన్నాడన్నా. ఆ మాటినంగానే నా కడుపు దగ్గోత్తరంగా కాలిపోయిందన్నా. యాలవంత అయిపోయినాక కోరుటోల్లు బయట కూసోని జమా కర్సులు రాసేదానికి మొదులు పెట్టినారన్నా. లెక్కలా అవి? వాళ్ళ పెండ్లాల - వాళ్ళ బిడ్డల - లెక్కలా అవి? అసలు ఐదువేలంట. వడ్డి నాలుగువేలంట. అపరాదం రెండు నూర్లంట. ఇతర బాపతు ఎనిమిది నూర్లంట.''

అతనిని మధ్యలో ఆపి యజమాని, ''ఇతర బాపతేంది?'' అనడిగాడు.

తలారివాడు ''ఇతర బాపతంటేనా? వాళ్ళను కాష్టం మీద పెట్టి కాల్చేదానికయ్యే కర్సులు'' అని కాండ్రించి వుమ్మి '' ఆర్నెల్లుగ తాకిదులు పంపిందానికి రెండు నూర్లయినాయంట. యాలం ఎయ్యబోతావని పేపర్లో ఏసిందానికి యాభై అయిందంట. తలారోడ్ని పంపి నాలుగూర్లలో దండోరా ఎయ్యించిందానికి యాభై అయ్యిందంట. ఈ పొద్దు జీపేసుకుని వొచ్చినారుగదా. దాని పెట్రోలుకు మూడునూర్లంట. వాళ్ళకు తెల్లారి టిఫిన్లు, మద్దానం బోజనం కర్సులు రెండు నూర్లంట. ఈ లెక్కలన్నీ అయ్యేటప్పటికి ఒక్క దమ్మిడి మిగల్లేదన్నా. కోరుబోడు ఆ మాటే తిరిపాలనాయునికి చెప్పి రసీదు కాయితం ఆయన చేతిలో పెట్టినాడు. ఆ రసీదు కాయితాన్ని ఒడిలో పెట్టుకుని తిరిపాలనాయుడు జావుసేపు తడివినాడు. ఒక్కొక్క అచ్చిరాన్ని జావుసేపు తడివినాడన్నా, చూస్తె వుండంగానే ఒక్కొక్క కంట్లో బొటనవేలు లావు నీళ్ళు దూకాటం మొదులు పెట్టినాయి. పదిమంది వుండారని గూడా సూడకుండా ఎలుగెత్తి ఏడ్సినాడన్నా. 'బూమ్మీద పడి కండ్లు తెర్సినప్పట్నుంచి కయ్యాల్లో కూరాడుకుంటూ బతికితి. కయ్యాల్లో వుంటే మన్నే ఒంగారవని నమ్ముకోనుంటి. ఆ కయ్యల గుండా ఈ కాయితవేనా నాకు దక్కింది' అని ఏడ్సినాడన్నా.

కాయితాన్ని మొకాని కడ్డంగా పెట్టుకోని పసిపిల్లోడు మాదిర ఏడ్సినాడన్నా'' అని సీసాను పైకెత్తి ఒక్క పెట్టున ఖాళీచేసి కింద పెట్టాడు. అతనికి పలక మారింది. గొంతుమీద తీడుకుంటూ తననుతాను సమాళించుకుని, ''నా కండ్ల ముందర్నే తిరిపాలనాయుడు కూటిమీద నడ్సినాడన్నా. అట్టాటి మారాజు ఈ నాటికి ఈదిలో నిలబడే'' అని తలవిదిలించి, ''లేదన్నా ఇంగ రెండు సీసాలు తాగితేగాని నాకీ రాత్రి నిద్దర పట్టదు'' అన్నాడు.

17

అప్పులు, పన్నులు ఆ గ్రామస్థులకు కొత్తవి కావు. అవి వాళ్ళ రక్తంలో, ఉచ్ఛ్వాస నిశ్శ్వాసాల్లో రంగరించుకుని ఉన్నాయి. అవి వాళ్ళ నాగరికతలో, సంస్కృతిలో ఒక భాగంగా ఉన్నాయి.

ఆ గ్రామంలో హరిశ్చంద్రుని కథ ఎరగనివారెవరు? అప్పు తీర్చలేక హరిశ్చంద్రుని సింహాసనాన్ని పోగట్టుకోలేదా? భార్యను అమ్ముకోలేదా? ఒక్కగానొక్క కొడుకును పోగొట్టుకోలేదా? కాటికాపరిగా నికృష్టమైన జీవితం గడప లేదా? హరిశ్చంద్ర నాటకాన్ని చూస్తే కంటతడి పెట్టనివెరు? నక్షత్రుని వైపు మెటికలు విరచనివెరు?

భద్రాచలం రామదాసు గోలకొండ నవాబుకు పైకం చెల్లించలేక జైలుపాలు కాలేదా? అతడు జైలులో బండరాళ్ళను వీపుపైన మోయలేదా? ఏనుగులు లాగే గానుగను నడుముకు కట్టుకుని లాగలేదా? కొరడా దెబ్బలు తినలేదా? రామదాసు కీర్తనలు విని కరగని వారెవరు? నవాబును శపించనివెరు?

శ్రీ వెంకటేశ్వర స్వామి తను కుబేరుని వద్ద తీసుకున్న అప్పు చెల్లించడానికి భక్తుల నుండి ఈ నాటికీ వడ్డికాసులు వసూలు చేస్తుండడం లేదా? ఎన్ని దశాబ్దాలు గడిచాయి? ఎన్ని శతాబ్దాలు గడిచాయి? ఐనా అతని అప్పు తీరనే లేదు. అతని సోదరుడు శ్రీ గోవిందరాజస్వామి వడ్డికాసులను బళ్ళతో నిరంతరంగా కొలుస్తూనే ఉన్నాడు. కొలిచి కొలిచి అలసిపోయి బళ్ళనే తలగడగాజేసుకుని దిగువ తిరపతిలోని గుడిలో శయనిస్తున్నాడు.

ఆ గ్రామస్థుల నిట్టూర్పుల మధ్య, ''ఊ. దేవాను దేవతలకే తప్పలేదు. మనకేడ తప్పుతుంది?'' అనే మాట వినిపిస్తూ ఉంటుంది.

అప్పు లభించే వనరులు కోకొల్లలు. ఊర్లో వడ్డి వ్యాపారులున్నారు. టౌనులో ప్రభుత్వబాంకులున్నాయి. ప్రయివేటు బ్యాంకులున్నాయి. ఇతర సంస్థలున్నాయి.

కాని తేనెలో పడ్డ ఈగ తేనె తాగుతూ వృద్ధి చెందేది లేదు. సాలెగూడులో పడ్డ ఈగ ఆ తీగల మీద ఊయల లూగుతూ ఆనందించేది లేదు. అప్పు వెంట వడ్డి ఉంటుంది. చక్రవడ్డి ఉంటుంది. అపరాధ వడ్డి ఉంటుంది. అదనపు వడ్డి ఉంటుంది. ఒక్కొక్కటి ఒక బ్రహ్మరాక్షసి. ఒకటి రక్తం పీలుస్తుంది. ఇంకొకటి కండలను చప్పరిస్తుంది. ఇంకొకటి ఎముకలను నములుతుంది.

పుట్టిన మనిషి చావక తప్పదు. తీసుకున్న అప్పు తీర్చక తప్పదు. తీసుకున్న అప్పు చీమంత. తీర్చబోయేనాటికి ఏనుగంత. ''ఇన్ని రూపాయలు నేనేడ తెద్దు? ఇన్ని రూపాయలు తెచ్చేసత్త ఉంటే అప్పు తీసుకోకనే పోదును గదా'' అంటూ రైతు రోదిస్తాడు. ''తీర్చే సత్త లేని వాడిని ఎందుకు తీసుకుంటివి? తీసుకునేటప్పుడు శోభనం నాటి పెండ్లికొడుకు మాదిరి వచ్చి తీసుకుంటివి. తిరిగి కట్టమంటే పాడె మీదకు పాయ్యేటట్టు యాడస్తా ఉండావు'' అని అప్పు ఇచ్చినవాడు ఈసడిస్తాడు.

నాడు హరిశ్చంద్రునికి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఆదుకున్నారు. నాడు భద్రాచలం రామదాసును ఆదుకోవడానికి శ్రీరామ లక్ష్మణులు పరతెంచి వచ్చారు. నేడు శ్రీ వేంకటేశ్వరుడిని కోటానుకోట్ల భక్తులు ఆదుకుంటున్నారు. కాని రైతును ఎవరూ ఆదుకోవడం లేదు.

నోటీసులు. మొదటి నోటీసు. రెండవ నోటీసు. మూడో నోటీసు. చివరకు జప్తునోటీసు. రైతు ఇంటి తలుపు మీద జప్తు నోటీసు పంచాయితీ ఆఫీసు గోడకు జప్తు నోటీసు. రెవిన్యూ ఆఫీసు నోటీసు బోర్డు మీద జప్తు నోటీసు. స్థానిక వార్తాపత్రికల్లో జప్తునోటీసు.

రైతు కయ్యలను అప్పుల వాళ్ళకు అప్పగించి, ఇంటికి చెదులెక్కించి దేశం మీద పడుతున్నాడు. కయ్యలపైన మరులు తెంచుకోలేని వాడు ఒక నడిరాత్రి రాయిరాయి కరిగే వేళ బయలుదేరి వెళ్ళి వేలంలో అమ్ముడైన తన పొలం మధ్య కూర్చుని చెవిలో ఎండ్రిన్ పోసుకుని మట్టి మీదకు వాలిపోతున్నాడు.

'పులికాదు చంపేది, గిలి' అని నానుడి. మరణం వేదనాభరితమైనది. మరణం సమీపిస్తున్నదన్న ఎరుక మరింత వేదనా భరితమైనది. కాని కయ్యల్ను పోగొట్టుకోవడం రైతుకు అన్నిటి కన్నా ఎక్కువ వేదన కలిగిస్తుంది. వేదన నుండి పాటలు, పదాలు ఉద్భవించాయి. వేదన నుండి కథలు, గాథలు పుట్టాయి. ఆ కథలు, గాథలు గ్రామజీవితంలో మిళితమై పోయి ఉన్నాయి.

అలాంటి కథల్లో ఒకటి-

'ఓబు కాలాన' ఎప్పుడో ఈ రాజ్యాన్ని ఒక రాజు ఏలేవాడు. ఆ రాజు ఎవరో తెలియదు. ఆ రాజ్యానికి ఎల్లలు ఏవో తెలియదు. ఆ రాజ్యంలో ఎన్ని గ్రామాలుండేవో తెలియదు. సదరు గ్రామం ఆ రాజ్యంలో భాగంగా ఉండేదో లేదో తెలియదు.

ఆ రాజు పరమ దుర్మార్గుడు. రాజ్యంలోని రైతుల నుండి నిర్దాక్షిణ్యంగా పన్నులు వసూలు చేసేవాడు. పొలాలు పండినా, ఎండినా రాజుగారి బొక్కసం మాత్రం నిండాల్సిందే.

ఒకసారి విపరీతమైన కరవు వచ్చింది. వరసగా ఏడు సంవత్సరాలు వానచుక్క పడలేదు. పంట పొలాలన్నీ ఎండి నెరియలు చీలిపోయాయి. చెరువులో తుమ్మచెట్లు మొలిచాయి. కాలువలు పూడిపోయాయి. తినడానికి గడ్డిలేక పశువులు మందలు మందలుగా రాలిపోతున్నాయి. రైతులు నాగదాడి కాయలను, పేరు తెలియని చెట్ల వేర్లను, ఆకులను తింటున్నారు.

అలాంటి పరిస్థితిలో పన్ను కట్టమని రాజుగారు నోటీసు పంపించారు. రైతులు పన్ను కట్టలేదు. పన్ను కట్టని వాళ్ళ కయ్యల్ను జప్తుచేయమని రాజుసిపాయిలకు ఆజ్ఞాపించాడు. సిపాయిలు గుర్రాల మీదెక్కి గ్రామంలోకొచ్చారు. రైతులు గ్రామం వదిలి పెట్టి అడవిలోకి పారిపోయారు. వాళ్ళు తలా ఒక చెట్టుమీదెక్కి కొమ్మల చాటున దాక్కున్నారు. సిపాయిలు వారిని వెంబడిస్తూ అడవిలోకి ప్రవేశించారు. చెట్టమీదున్న రైతులు గుర్రపుడెక్కల చప్పుడు విన్నారు. తాము పట్టుబడక తప్పదు. పట్టుబడ్డాక తమ కయ్యలు జప్తు కాక తప్పదు. భయంతో వాళ్ళ రక్తం గడ్డకట్టింది. శరీరాలు కొయ్యబారిపోయాయి. వాళ్ళు ముఖాలను పైకెత్తి, ''భగవంతుడా! మమ్ములను రైతులుగా ఎందుకు పుట్టించినావు తండ్రీ. పుట్టించిన వాడవు ఈ పన్నులు, అప్పుల్ను ఎందుకు సృష్టించావు? మాకీ వరకయాతన వద్దు తండ్రీ. మమ్మల్ని ఈ అవడిలోరాళ్ళుగా మారేట్టుగా శపించు. జంతువులుగా మారేట్టు శపించు. పక్షులుగా మారెట్టు శపించు. మాకీ రైతు జన్మవద్దు తండ్రీ!'' అని ప్రార్థించారు. వాళ్ళ మొర భగవంతుని చెవిన పడింది. చెట్టకొమ్మలను కరచుకొని, భయంతో గడగడలాడుతున్న రైతులకు భగవంతుడు, ''మీరందరూ ఏ చెట్టు మీదున్నవాడు ఆ చెట్టుమీదే కోతులవుతారు. మీరు నిత్యం ఉపయోగించే ముల్లుగర్రలు మీకు తోకలవుతాయి'' అని వరమిచ్చాడు. వెంటనే రైతులు కోతులుగా మారిపోయారు. ఆ కోతులు తోకల

సహాయంతో కొమ్మల నుండి వ్రేలాడుతూ స్వేచ్ఛగా బతకసాగాయి. వాటి నుండి వాటికి పన్నుల బాధ లేదు. అప్పుల భయం లేదు. సిపాయిల బాధ లేదు. అధికారుల బాధ లేదు. అవి అడవిలోనే తిరుగుతూ చెట్లలోని కాయగసరులు తింటూ, దొనలలోని నీళ్ళు తాగుతూ స్వేచ్ఛగా బతకసాగాయి. కాని అవి అప్పుడప్పుడు గ్రామాలవైపు వచ్చి పంటపొలాలను చూసినప్పుడు వాటికి తమ పూర్వీకుల చరిత్ర గుర్తుకొస్తుంది. అప్పుడవి పండ్లను బయటపెట్టి, వికృతంగా, హృదయవిదారకంగా అరుస్తూ, చేతులతో కొమ్మలను ఊపుతూ రొమ్ము మీద బాదుకుంటాయి.

18

చెరువులో సగానికి మాత్రం నీళ్ళున్నాయి. చెరువు కట్ట వెంబడి ఈత చెట్లున్నాయి. ఉదయపు ఎండ కలగజేసిన చెట్లనీడలు కట్టమీద చారలు చారలుగ పడుతున్నవి.

ఒక చెట్టు నీడన ముత్యాలనాయుడు కూర్చుని వున్నాడు. అతని పక్కన కల్లుదుత్త వున్నది. దుత్తలోని కల్లును ముంతలోకి వొంచుకుని అతడు తాగుతూ కూర్చుని వున్నాడు.

కొంతసేపటికి పెదనాయుడుగారి పశువులు చెరువు కట్టమీద వస్తూ కనిపించాయి. ముసలివి, కోడెలు కలిసి అవి దాదాపు యిరవై వున్నాయి. వాటి వెనక ముగ్గురు జీతగాళ్ళు తమ చేతుల్లో కొబ్బరి పీచు పట్టుకుని నడచి వస్తున్నారు. పశువులు వరుసగా నడచి మొరవ వద్ద కట్టదిగాయి. అవన్నీ నీటి అంచువద్ద గుంపుగా నిలబడ్డాయి. జీతగాళ్ళు ఒక్కొక్కదాని పగ్గం పట్టుకుని సైగలు చేస్తూ, నీటితో చప్పుళ్ళు చేస్తూ వాటిని నీటిలోకి నడిపించారు. అవి జంకుతూ మెల్లమెల్లగా నీటిలోకి నడిపించారు. క్రమ క్రమంగా వాటి కాళ్ళు, కడుపులు, తోకలు, వీపులు, మెడలు నీళ్ళలో మునిగిపోయాయి. నీటి మట్టంపైన కొమ్ములు, తలలు మాత్రం కనిపిస్తుండగా అవి అద్భుతంగా ఈదసాగాయి. వాటి పాటుకు చెరువు అలల మయమయింది. అలలు ఒకదాన్నొకటి తరుముకుంటూ గట్టువైపు పరుగెత్తసాగాయి. చెరువు కోళ్ళు క్వాక్ క్వాక్ మని అరుస్తూ నీటిమట్టం మీద పరుగిడుతూ రెల్లు పొదల్లో మాయమయిపోయాయి.

పశువులు కొంతసేపు వలయాకారంగా నీళ్ళలో ఈది ఒక్కటొక్కటే గట్టుకు

రాసాగాయి. తడిసి నీరోడుతున్న పశువుల దేహాలను జీతగాళ్ళు కొబ్బరిపీచుతో రుద్దసాగారు.

ముత్యాలనాయుడు చెరువు కట్టమీద కూర్చుని పశువుని స్నానాన్ని పర్యవేక్షిస్తున్నాడు. అతని పక్కనున్న దుత్తఖాళీ అవుతున్నది. అతని కడుపు వుబ్బరిస్తున్నది. కళ్ళు ఎర్రనవుతున్నాయి.

కొంతసేపటికి పూజారి పొలాల మీదుగా నడచివచ్చి చెరువు కట్టమీదకు ఎక్కి యిటువైపే వస్తుండడం కనిపించింది.

ముత్యాలనాయుడు, ''ఇదేంది పూజారీ దేవలానికి దోవ మర్సినావా యట్ట?'' అన్నాడు.

పూజారి దగ్గరగా వచ్చి, ''నీ కోసరవే వచ్చినానన్నా, నీ కోసరం యింటికి పోతే నువ్వు చెరువు కాడుండావని చెప్పిరి. ఎతుక్కుంటూ యిట్టొచ్చినా'' అన్నాడు.

ముత్యాలనాయుడు, ''ఔ. గొడ్లను ఈత తోలేదానికి తీసుకొచ్చినా'' అని చెరువువైపు చేయి చూపి, ''అట్టజూడు'' అన్నాడు.

కొన్ని పశువులు నీటిలో వలయాకారంగా తిరుగుతూ ఈదుతున్నాయి. గట్టుకు ఎక్కి వచ్చిన పశువులను జీతగాళ్లు కొబ్బరి పీచుతో రుద్దుతున్నారు.

ముత్యాలనాయుడు గట్టిగా ''ఒరే బక్కోడా గట్టిగా అదిమిపెట్టి రుద్దు. గొడ్డు ఒక్కొక్కటి పెండ్లి కొడుకు మాదిరి తయారు కావాల. నీళ్ళు ఎగర జల్లి రుద్దు'' అనరచాడు.

పూజారి, ''గొడ్లను యిప్పుడు తానం చేయించేదేవిటికన్నా? పసల పండగ ఇంగాశానా దినాలుందిగదా'' అన్నాడు.

ముత్యాలనాయుడు, ''పసల పండుగతో నాకేం పని. పలమనేరులో పసల సంత జరగతావుండాది. ఇవిట్నన్నిటినీ సుబ్బరంగా తయారుచేసి సంతకు తోలాల'' అన్నాడు.

పూజారి ''సేద్దిం నాద్దిం కొట్టిన గొడ్లు గదన్నా సంతకు తోలి అమ్మెదెందుకు?'' అనడిగాడు.

''అమ్మెయ్యెకుండా గాట్లో కట్టేసుకుని ఏవి పుణ్యం. దినానికి నాలుగు బిగువులు వరిగడ్డి దండగ. భూవి దున్నేదానికి ట్రాక్టర్లుండాయి. నీళ్ళు తోడేదానికి ట్రక్కులుండాయి. ఈ కాలం గొడ్లతో సేద్దించేసే నాబర్దాకొడుకెవురు?''

''నేద్దానికి కాకపోయినా పేడకోసరం ఇంటి ముందర నాలుగు గొడ్లుండాల గదన్నా.''

ముత్యాలనాయుడు, ''పేడతో ఏం పని? మూతికీ, ముడ్డికీ పూసుకోనా? నువ్వు పూజల్జేసేటోనివి. నేద్దింకతలు నీకేవి దెల్సు. ఈ కాలం పంటలే వేర్లే. ఈ కాలం పంటలకు నల్సేట్లు, ఫాస్సేట్లు - ఇట్లాటివి ఏస్తేనే రతికెక్కతాయి. పంటలకు పశువుల ఎరువులు ఏసే కాలం ఎప్పుడో ఎల్లిపోయింది'' అన్నాడు.

పూజారి పశువులవైపు కాసేపు చేసి; ''ఒకటి కాదు. రెండుగాదు. ఇరవైకి పైగా వుండాయి. ఇవిట్నన్నిట్నీ ఒకేసారి తోలుకుని పోతే కొనేటోడెవరు?'' అన్నాడు.

ముత్యాలనాయుడు, ''నువ్వొక ఎర్రిబోగలోడివి. ఇరవైగాదు ఇన్నూరు గొడ్లయినా గెడిసేపట్లో అమ్ముడైపోతాయి. కోడిపిల్లల్ని గెద్దలెత్తక పోయినట్టే. కొనుక్కున్నోడు యివిట్ని ఏవి జేస్తాడనుకున్నావు? లారీల్లో ఏసుకుని అట్ట బెంగుళూరుకో, యిట్ట మద్రాసుకో తీసుకునిపోతాడు'' అన్నాడు.

''ఏవిటికి?''

''కోసుకు తినేదానికి. పట్నాల్లో గొడ్డుమాంసానికుండే గిరాకీ యింగ దేనికీ లేదు. ఊర్లల్లో ఐతే మాలోడూ, మాదిగోడే గొడ్డు మాంసం తింటారు. పట్నాల్లో నీయట్టా పూజారి మొదులుకుని, ఆఫీసురు మొదులుకుని అందరూ అదే తింటారు'' అని చటుక్కున ముందుకు వంగి కనుబొమలు ముడివేస్తూ పూజారిని చూసి ''నీ జందెం పోగు ఏవయింది పూజారీ'' అనడిగాడు.

పూజారి తలవంచి తన ఛాతీమీద లేని జందెం పోగును తడివి, ''ఆ మాట చెప్పేదానికే వొచ్చినానన్నా'' అన్నాడు.

''ఏమాట?''

పూజారి మెల్లగ బొడ్లోంచి గుడి తాళం చెవిని బయటకు తీశాడు. నల్లటి ఆ తాళం చెవి వ్రేలెడు పొడవుంది. అతడు దాన్ని ముత్యాలనాయుడికి అందిస్తూ, ''ఈ పొద్దుట్నునుంచి గుడిలో పూజల్జేసేదానికి వేరే ఎవురినన్నా పెట్టుకొండన్నా. ఈ పొద్దుట్నుంచి నేను సాలించుకుంటాను'' అన్నాడు.

ముత్యాలనాయుడు తాళం చెవి కోసం చేయిచాచకుండా, ''అదేందీ? ఇరవై ఏండ్లుగా పూజారిగా వుండావు. మీ అయ్య చచ్చినప్పట్నుంచి నువ్వే పూజారిగా వుండావు. ఇప్పుడు సాలించుకునే దేంది?'' అన్నాడు.

పూజారి తాళం చెవిని తనకూ ముత్యాలనాయుడికీ మధ్య నేలమీద వుంచి,

''ఔనన్నా. ఇరవై ఏండ్లుగా పూజారిగా వుంటి. ఈ పొద్దిటికి సాలైపోయింది. ఇంగ మీరు ఎవర్నన్నా సూసుకోండి'' అన్నాడు.

ముత్యాలనాయుడి ముఖంలో ఆశ్చర్యభావం ద్విగుణీకృత మయింది. అతడు ''అదే అడగతావుండా ఎందుకు సాలించుకుంటా వుండావని అడగతావుండా. నీకేవన్నా వరుమానం సాల్లేదా? ఈ కాలం కమ్మరోడు, కుమ్మరోడూ అందరూ కులరుత్తులు గిట్టుబాటు కావటంలేదని మొత్తుకుంటా వుండారు. నీగ్గూడా పూజల్జేసే పని గిట్టుబాటు కావటం లేదా యట్ట?'' అనడిగాడు.

''నాకు గిట్టుబాటు కాకపోయేదేందన్నా. నాకిరేని చెరువు కింద గుడి మాన్యం పన్నెండెకరాల బూవి ఉండాది. పోయిన సంవత్సరవే పెదనాయుడు యానాది మిట్టన రెండెకరాల బూవిని గుడి మాన్యంలో కలిపినాడు. అదంతా నేనే అనుబోగిస్తా ఉండా. అదట్టుండగా ప్రతి దినం పూజ పెట్టేటోల్లు ముట్ట జెప్పేకానుకలు ఉండనే ఉండాయి.''

ముత్యాలనాయుడు మధ్యలో అందుకుని, ''మరి నీకేవి తీపరవొచ్చింది. ఎందుకు సాలించుకుంటా ఉన్నట్టు. ఊరు నీకేవన్నా కీడుచేసిందా?'' అనడిగాడు.

పూజారి నిర్జీవంగా నవ్వి, '' ఊరు నాకేవీ కీడు చెయ్యలేదన్నా. నేనే ఇరవై ఏండ్లుగా ఊరును బెస్టు పట్టిస్తా ఉండా'' అన్నాడు.

ముత్యాలనాయుడి ముఖంలో ఆశ్చర్యం హద్దులు దాట సాగింది. అతడు, ''నీ పోవిడి నాకేవీ అర్థంగావటం లేదు. ఊరుకోసం పూజల్జేసేటోనివి. నువ్వు ఊరును బెస్టు పట్టించేదేంది?'' అన్నాడు.

పూజారి తల వంచుకుని కాసేపు మౌనంగా ఊరుకుని, ''ఊరు కిలపడిపోతా ఉందన్నా. నానాటికి ఊరు కిలపడిపోతా ఉంది వొళ్ళు గుల్ల జేసుకుని కష్టంజేసి బతికే రైతులు నేలబడి పోతా ఉండారు. గిట్టుబాటుకాని కయ్యాల్ను తొండల కప్పగింజేసి దేశంమీద పోతా ఉండారు. ఇండ్లకు చెదులెక్కించేసి రాజ్జంమీద పోతా ఉండారు. ఇరవై ఏండ్ల కింద ఇదే ఊర్లో పాళేగాడు మాదిర బతికిన రైతు ఇప్పుడు దిన కూలి కోసం తిరగతా ఉండాడు. ఇరవై ఏండ్ల కింద దినకూలి చేసుకుని బతకతా ఉండినోడు ఇప్పుడు బిచ్చమెత్తుకుంటా ఈదుల్దిరగతా ఉండాడు'' అన్నాడు.

ముత్యాలనాయుడు ''అది తెలస్తానే ఉంది. ఈ ఊరేగాదు రాజ్యవంతా అంతే. దానికి నువ్వేమి జేస్తావు? నేనేవి జేస్తాను? ఎవుని రాతకాడికి వాడు బతకాల. మద్దిన నువ్వు పులిసిపోయేదేవిటికి?'' అన్నాడు.

పూజారి అలాగే తలవంచుకుని, ''మరి ఊరిముందర గుడి ఉండేదేవిటి కన్నా. గుళ్ళో దేవుడుండే దేవిటికి? కంటిని రెప్ప మాదిరి, కాలిని గోరుమాదిర ఊరును దేవుడు కాపాడాల. ఊరు ఇట్ట కిలపడి పోతా ఉంటే దేవుడు ఉన్నట్టా లేనట్టా?'' అని తలెత్తి, ''మరి గుళ్ళో దేవుడు లేనప్పుడు ఆ రాతి బొమ్మకు పూజల్జేసే దేవిటికి?'' అన్నాడు.

ముత్యాలనాయుడి ముఖంలో పేరుకుని ఉండిన ఆశ్చర్యం ఒక్కసారిగ కోపంగా మారిపోయింది. అతడు దుత్తను వంచి కల్లును ముంతలోకి పోసుకున్నాడు. ముంతను పెదాల కంటించుకుని ఒక్క పెట్టున ఖాళీచేసి కింద బెట్టాడు. ఇదివరకే ఎర్రనయ్యిండిన కండ్లు మరింత ఎరుపెక్కుతున్నాయి. అతడు పూజారిని గుచ్చిచూస్తూ, '' ఐతే నువ్విప్పుడనేదేంది? గుళ్ళో దేవుడే లేడంటావు! గుడిని కట్టించినోడు ఎర్రోడంటావు! గుడిని మరమ్మత్తు చేయించినోళ్ళం ఎర్రోళ్ళంటావు!'' అని మీసాల కంటుకుని ఉన్న కల్లు చుక్కలను తుడుచుకుని, '' ఇద్దో నువ్వు పూజల్చాలించుకుంటే చాలించుకుంటివిగాని దేవుడు లేడనే మాట అనొద్దు. వెనకటి కెవతో ఒక ముండ బిచ్చం పెట్టకపోయే దట్టుండగా ఇంటిముందర కొచ్చినోని మీదికి కుక్కను ఉసికొల్పిందంట. నువ్వు మాత్రం దేవుడు లేడనే కూతకుయ్యొద్దు'' అన్నాడు. అతడు మళ్ళీ దుత్తలోని కల్లును ముంతలోకి వంచసాగాడు. వాళ్ళిద్దరి మధ్య ఉన్నా తాళం చెవి ఎండలో మెరుస్తుంది.

ఇంతలో ఈడిగవాడు ఒక కల్లు దుత్తను భుజం మీద పెట్టుకుని వచ్చి ముత్యాలనాయుడి పక్కన దించాడు.

ముత్యాలనాయుడు తల ఎత్తి ఈడిగవానిని చూస్తూ, '' ఇది విన్నావంట్రా, ఈడిగోడ గుడిలో దేవుడు లేడంట. ఇంగ రేపట్నుంచి ఈయన పూజల్జెయ్యడంట. తెల్లారి లేసి సుక్కేసుకున్నట్టు మాట్లాడతా ఉండాడు అన్నాడు.

ఈడిగవాడు కిసుక్కున నవ్వి, ఏదో జ్ఞాపకం వచ్చినట్టు తల వెనకభాగాన గోక్కుని, ' ఆ! మామావ చెప్పినాడు. నిన్నరాత్రి పూజారి కల్లంగడికాడ..'' అంటూ మధ్యలో ఆపేశాడు.

ముత్యాలనాయుడు పైకి చూస్తూ, '' ఏవి చెప్పినాడు మీ మావ? అన్నాడు. ఈడిగవాడు పూజారివైపు చూస్తూ కాసేపు తటపటాయించి, ముత్యాలనాయుని పక్కన కూర్చుని, గుడ్లు తిప్పుతూ, నిన్నరాత్రి పూజారి కల్లంగడి కొచ్చినాడంట. లోపల గూసోని నల్లగల్లు రొండు సీసాలు తాగినాడంట'' అన్నాడు.

ముత్యాలనాయుడు పెదలదాక తీసుకెళ్ళిన ముంతను కిందకు దించి, పూజారిని ఎగాదిగా కాసేపు చూసి, ''మ్! శానా దూరం వొచ్చినావు, బుజమ్మీదుండే జందెంపోగు తెంపేసి నావు. నొస్టిన నామం కడిగేసినావు. అసలు దేవుడే లేదంటా ఉండావు. పబ్బిలిగ్గ కల్లు దాగేదానికి మొదులు పెట్టినావు'' అని నేలమీదున్న తాళం చెవిని చేతిలోకి తీసుకుని, '' ఇంగ నువ్వు పూజారిగా ఉంటాననన్నా ఉండనిచ్చేదిలేదు. పో ఏవి జేసి బతకతావో, యాడ బతకతావో బతుకు. పూజారి పనిచేసేదానికి మాకు నీ యట్టాటోల్లు లచ్చా తొంభై మంది దొరకతారు'' అన్నాడు.

పూజారి మెల్లగ పైకిలేచి, ''నేనొచ్చిన పనయిపోయిందన్నా. తాళం అప్పగించేసినా ఇంగ నేను పోతాను దండం'' అని చేతులు జోడించి వెనుదిరిగాడు.

19

తారు రోడ్డు మీద ఎండమావులు లేస్తున్నాయి. రోడ్డు పక్కన ఒక సైన్ బోర్డు నాటబడి ఉంది. దాని మీద ఊరి పేరు తెలుగులోను, ఆంగ్లంలోను రాసి ఉంది. సైన్ బోర్డును ఆనుకుని టీ కొట్టు ఉంది. దానిపై కప్పు తాటి ఆకులతోను, గోడలు మట్టితోనూ నిర్మించబడి ఉన్నాయి. బాయిలర్‌లో నీళ్ళు సలసల కాగుతున్నాయి. టీ కొట్టువాడు పటకారుతో బాయిలర్ కింద బొగ్గులను కెలుకుతూ నిలబడి ఉన్నాడు. రోడ్డు మీద బస్సులు, లారీలు అప్పుడొకటి, అప్పుడొకటి చప్పుడు చేసుకుంటూ పరుగిడుతున్నాయి.

పుల్లిగాడు హరిజనవాడవైపు నుంచి వస్తూ టీ కొట్టును సమీపించాడు. తలపాగాను తీసి కిందవేసి దాని మీద కూర్చుని, ''తిరపతి బస్సు ఎన్నిగంటల కొస్తుందన్నా?'' అనడిగాడు.

టీ కొట్టువాడు, ''తిరుపతి బస్సులకేవి కరువు? గెంట గెంటకే ఉండాయి. తిరపతి బస్సుతో నీకేం పని?'' అన్నాడు.

పుల్లిగాడు, ''మా ముసిలోడు తిరపతికి పోయినాడన్నా, ఈ పొద్దిటికి ఆరుదినాలయింది. ఇయ్యాలకు పత్తాలేడు. వాడు సావి దర్శనానికి పోయినాడో, తలకోనలో దూకి సచ్చేదానికి పోయినాడో తెలవకుండా ఉంది.'' అన్నాడు.

టీ కొట్టువాడు, ''తల కోనలో చస్తే నేరుగా వైకుంటమే గదా. ఎంతబోల్లకు

కలగాల అంత అదృష్టం!'' అని గోడకు వేలాడుతున్న టీ ఫిల్టరును అందుకుని, ''నీ కొక గ్లాసు టీ ఎయ్యమంటావా?'' అన్నాడు.

పుల్లిగాడు తల అడ్డంగా ఊపి, ''ఎండకు వళ్ళంతా కవిలిపోయుండాది. ఇప్పుడు గాని టీ నీళ్ళు తాగితే పేగులు గూడా ఉడిగిపోతాయి. ఒక సోడా కొట్టియ్యి'' అన్నాడు.

కొట్టువాడు నీళ్ళ తొట్టిలో నుండి సోడా సీసా అందుకుని, ''వొచ్చినోడంతా సోడానీళ్ళు కావాలని అడిగేబోళ్ళే. ఎండకాలం రానన్నా వొచ్చింది గాని టీలు, కాఫీలు ఊరికే ఇస్తానన్నా తాగేటోడు కనబడటం లేదు'' అంటూ సీసాను 'టిష్యూ' అని కొట్టాడు.

పుల్లిగాడు సీసాను అందుకుని, '' ఎన్ని పైసలు?'' అన్నాడు.

''నలభై''.

పుల్లిగాడు సీసాను ఒక పెట్టున ఖాళీ చేసి కింద పెట్టి, బ్రేవ్‌మని త్రేన్చి, ''దీనమ్మ పిల్ల పేగుకు సాల్లేదు. వెల మాత్రం నలభై పైసలు. ఇదే సీసా పట్నంలో ఇరవై పైసలకిస్తారు'' అన్నాడు.

కొట్టువాడు ఖాళీ సీసాను తీసుకుంటూ, ''మరి ఇది పట్నంలో తయారై దిగుమతి అయ్యే సరుకాయె. ఆడ అమ్మినట్టే ఈడ అమ్మాలంటే యట్టకుదుర్తుంది? నువ్వు ముందు నలభైపైసలు ఎత్తు'' అన్నాడు.

పుల్లిగాడు చొక్కా జేబులోనుంచి రూపాయ నోటు తీసి ఇస్తూ ''నువ్వూ ఎన్నన్నా చెప్పన్నా. ఇట్టాటి సరుకులన్నీ ఈడకన్నా పట్నంలోనే సలీసు'' అన్నాడు.

కొట్టువాడు రూపాయనోటును గళ్ళా పెట్టెలో వేసి చిల్లర తిరిగి ఇస్తూ'' పట్నంలో బతుకు అంత లచ్చనంగా ఉంటే ఆడనే ఉండక పోతివా?'' అన్నాడు.

పుల్లిగాడు, ''మాఅయ్య అర్జంటుగా యలబారి రమ్మని జాబు రాస్తే వొచ్చినానన్నా. ఏంపనుండి రమ్మన్నాడో తెలవకుండా ఉంది. ఎర్రిముండాకొడుకు. నన్నిట్ట రమ్మనేసి తిరపతికి పోయినాడు'' అన్నాడు.

''వాడుగూడా పట్నం వస్తానంటాడేవో. అందుకే రమ్మని జాబు రాసి ఉంటాడు.''

పుల్లిగాడు, ''వస్తానంటే దండం పెట్టి తీసకపోతానన్నా. ముప్పై ఏండ్లుగ పెదనాయుడి దగ్గిర రావగోస పడతా ఉండాడు. ఇదే ఆకీరు సంవత్సరం. ఈ గంగ పండగతో పెదనాయుడికి రాసిచ్చిన బాండు తీరిపోతుంది. నాతో వొచ్చేదానికి ఒప్పుకుంటే ఇంటికి చెదులెక్కించేసి ఇద్దరం లారీ ఎక్కేస్తాం'' అన్నాడు.

కొట్టువాడు బాయిలర్ కింద బొగ్గులను కెలుకుతూ, ''ఆ పన్జేసి పుణ్యం కట్టుకో. పెదనాయుడి దగ్గిర జీతగాడుగా చేరి ముప్పై ఏండ్లుగా చాకిరీలు చేస్తా ఉండాడు. ఊతకట్టి చేతికొచ్చేస్తా ఉంది. ఉడిగిన పాయాక కూసో బెట్టి నీళ్ళు పాయ్. కడుపున పుట్టిందానికి ఆ పన్జేసి పుణ్యం కట్టుకో'' అన్నాడు.

ఇంతలో ఒక బస్సు రొదచేసుకుంటూ వచ్చి రోడ్డుమీద ఆగింది. కోనిగాడు చేతిలో ఒక మూట పట్టుకుని బస్సులోంచి దిగాడు.

టీ కొట్టువాడు, ''అద్దో మీ అయ్యొనే వొచ్చినాడురా. మీ ముసిలోనికి నూరేండ్లాయుసురా పుల్లిగా మనం మాట్లాడు కుంటా ఉండగానే వచ్చినాడు'' అన్నాడు.

బస్సుమళ్ళి రొద చేసుకుంటూ బయలుదేరి వెళ్ళిపోయింది. కుడిచేతిలో మూటను పట్టుకుని కోనిగాడు రోడ్డు దిగి వచ్చాడు. అతని తల నున్నగా క్షవరం చేయబడింది. ప్రయాణ బడలిక ముఖం మీద కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది.

పుల్లిగాడు తండ్రికి ఎదురుగా వెళ్ళి, ''బాగుండావా అయ్యా?'' అన్నాడు.

కోనిగాడు తన చత్వారపు కళ్ళను చిట్లించి చూసి, ఎవురూ? నువ్వా. ఎప్పుడొచ్చినావురా? అన్నాడు.

పుల్లిగాడు మూటను అందుకుని, ''నేనొచ్చి ఈ పొద్దిటికి ఆరు దినాలయింది. నన్నిట్ట రమ్మనేసి నువ్వు తిరపతికి పోతివి. నీకోసరం దోవ జూసి చూసి ఇంగసాలై పోయింది'' అన్నాడు.

వాళ్ళిద్దరు ఒకరి పక్క, ఒకరుగా హరిజన వాడవైపు నడవసాగారు. కోనిగాడు, ''ఏవి జెయ్యమంటావురా. సావి దర్శనం చేసుకుని మర్సదినమె మల్లుకోనొచ్చేద్దావని బయల్దేర్రి. తీరా ఆడికి పోయినాక ఆడ బెమ్మోత్సవాలు జరగతా ఉండాయి. ఇంత దూరం రానే వొచ్చినాం. ఇంగరొండు దినాలుండి అది గూడా సూసి పోదావని చెప్పి అట్టనే ఉండిపోతి'' అన్నాడు.

పుల్లిగాడు అతని బోడితలను చూస్తూ, ''తలనీలాలు గూడా ఇచ్చినావు. ఏవని మొక్కుకోనుంటివి?'' అనడిగాడు.

కోనిగాడు, ''నేను మొక్కుకోనూ లేదు. వర పడనూలేదు. దేవునికే దయబుట్టి వరమిచ్చినాడు. అందుకే నిల్చినిలువవున బయల్దేరిపోయి తలనీలాలిచ్చినా'' అన్నాడు.

పుల్లిగాడు నవ్వి, ''ఏవి వరాలిచ్చినాడు? యానాది మిట్టన బంగారు కడ్డీలు కనబర్చినాడా?'' అన్నాడు.

కోనిగాడు, ''అట్టాటిదే అనుకో'' అని కొడుకు వైపు సగర్వంగా చూస్తూ, ''పెదనాయుడు యానాది మిట్టన యకరా నేల నాకు పట్టా జేసిస్తాడంటరా'' అన్నాడు.

''యకరా నేలా? ఎంతకు?''

''వెలకు కాదు. ఊరికినే. ఆదరమరాజుకు యంకటేస్వరసావి ఆ బుద్ధి పుట్టించినాడు. బతికి నన్నాళ్ళు పకీరోని మాదిర బతికితి, ఈనాటికి ఆ దరమరాజు యకరా నేలకు సొంతదారుడ్ని చేసినాడు. ఆ పుణ్యార్తుడ్ని దీపం పెట్టి తల్సుకోవాల.''

పుల్లిగాడు, ''యకరానేల ఇస్తానని నోటి మాటే అన్నాడు? పట్టా గూడా చేసిచ్చినాడా?'' అనడిగాడు.

''పట్టా అయ్యేదెంత నేపు. అంతా రడీగా ఉండాది. రేపు రిజిస్టారాపీసుకు పోయి ఏలి ముద్దర్లు, సంతకాలు ఏసెయ్యటవే. అందుకే నిన్ను రమ్మని జాబు రాసినా.''

పుల్లిగాడు తనకేవీ అర్థంగాక'' మద్దిన నేనెందుకు? పట్టా జేసిచ్చేది ఆయన. చెయ్యించుకునేది నువ్వు. మద్దిన నేనెందుకు?'' అనడిగాడు.

కోనిగాడు, ''చెప్తె ఉండు'' అని తుండు గుడ్డతో ముఖం మీద చెమట తుడుచుకుని, ''ముప్పై ఏండ్ల కింత పెదనాయుడికి బాండు కాయితం రాసిచ్చినా. ఈ గంగ పండక్కు బాండు తీరిపోతుంది.

''ఈ గంగ పండగ నుంచి నువ్వు జీతగాడుగా కొలువెక్కాల'' అన్నాడు.

నడుస్తుండిన పుల్లిగాడు గబుక్కున ఆగిపోయి, ''అంటే నేను గూడా నీ మాదిరిగా ముప్పై ఏండ్లు పెదనాయుడు దగ్గిర జీతగాడుగా పడుండాలంటావు!'' అన్నాడు.

''ఔ నువ్వు జీతగాడుగా కుదిర్తే ఆయన నాకీయకరా పట్టా జేసిస్తాడు''.

పుల్లిగాడు కోపంగా, ''ఇందుకా నువు నన్ను రమ్మని రాసింది. ఇట్లని తెల్సుంటే నేను ఊర్లో అడుగే పెట్టక పోదును, ఇట్లని తెల్సుంటే నీ జాబుకు అగ్గిపుల్లగీసి పెట్టుందును'' అని మళ్ళీ సాగబారి, ''నా పానం పోయినా సరే నేను జీతగాడుగా ఉండను. కయ్యలు సంపాదించాలని నీ కంత తీపరంగా ఉంటే నువ్వే ఇంగొక ముప్పై ఏండ్లు జీతగాడుగా ఉండు'' అన్నాడు.

కోనిగాడు కొడుకు భుజం పైన చేయివేసి, ''కయ్యల నాకేవిటికిరా, నేనేచి

ఎల్లకాలం గూటం కొట్టుకో నుండబోతానా? ఈ పొద్దో రేపో గుంతలోకి పోయేటోడ్ని, నేను పోయినాకా అవినీవే కదరా''. అన్నాడు.

పుల్లిగాడు తన భుజం మీదున్న తండ్రి చేతిని తోసివేస్తూ, ''కయ్యలు గావాలని నేనడిగితినా? కయ్యలు సంపాదించి పెట్టమని నేన్నీకు జాబురాస్తినా?'' అన్నాడు.

కోనిగాడు మళ్ళీ కొడుకు భజం మీద చేతులేసి బలవంతంగా ఆపి, ''నువ్వొప్పుకుంటావనే నమ్మకంతోనే పెదనాయుడికి మాటిచ్చినానురా. నేను వయసుడిగి మూల మడిపోయినా. నేను సచ్చేముందు నువ్వు బతికే దానికొక చెయ్యక పోతినే అనుకుంటా ఉంటి. ఈ పొద్దిటికి పెదనాయుడు - దరమరాజు - మనకీ దోవజూపించినాడు. కండ్లకద్దుకుని పట్టా జేసుకోకుండా ఈ ఎర్రి మాటలే విటికిరా?'' అన్నాడు.

చూస్తుండగానే పుల్లిగాని కళ్ళలో కోపం మాయమయింది. అతడు మళ్ళీ నడవడం ప్రారంభించి, ''అయ్యా, నువ్వు ఎర్రికాలంలో పుట్టినోడివి., ఎర్రోడిగానే, బతికినోడివి. నేను నాలుగు రాజ్జాలు తిరిగినోడ్ని. నాలుగు యవ్వారాలు చూసినోడ్ని. నేను చెప్పేది ఇను. యకరా, రెండెకరాలు నమ్ముకుని రైతులు బతికే కాలం ఎల్లిపోయింది. మర్రిమాను కింద ఎంపిలి చెట్టు మొలుస్తుందా? మొలవదు. ఒక వేళ మొలిచినా పెవళంకాదు. ఇదీ అంతే, యానాది మిట్టన పెదనాయుడి బూవి ఇన్నూరు ఎకరాలుండాది. మూలన నీది యకరా. ఆ యకరా నేలను అడ్డం పెట్టుకుని నువు బతకనూ బతకలేవు చావనూ చావలేవు'' అన్నాడు.

కోనిగాడు నిరాశగా చేయి విదిలించి, ''లాబంలేదురా. సంవత్సరం దినాలు ఊరిడ్సి ఉండనన్నా ఉంటివిగాని నీకు పూర్తిగా పిచ్చిపట్టి పోయింది.'' అని, ''యానాది మిట్టన బూవి సటపటమయింది కాదురా. బంగారు పండేబూవి. అమ్మకానికి పెట్తే యకరా ముప్పైవేలకు తన్నకపోయేటోల్లుండారు''. అన్నాడు.

పుల్లిగాడు, ''నేన్జెప్పేది పూరా యిను.'' అని అతన్ని వారించి, ''యకరా నేల సొంతం జేసుకుని ఏవి జేస్తావు? దాంట్లో మట్టి బెడ్డలు పెరక్క తింటావా? పంట పెట్టాలంటే ముందు దుక్కి దున్నాల. దున్నే దానికినాగలెక్కడ్నుంచొస్తుంది? నాగలీడ్సేదానికి గిత్తలెక్కడ్నుంచొస్తాయి? తీరా దుక్కి తయారైనాక ఇత్తనం గింజలు కావాల. అసలే ఇప్పుడు కలికాలం పంటలొచ్చినాయి. వడ్లే డెబ్భై పదకొండు రకాలుండాయి. ఏ రకానికి తగిన ఎరువులు దానికేయ్యాల. అన్నీ కలికాలం ఎరువులు. గంపెడు ఎరువుకు గంపెడు రూపాయలు పొయ్యాల. తీరా పంటకోసి

కళ్ళం చేస్తే నీకు దక్కేది గింజలు కాదు. సంవత్సరం పొడుగునా చేసిన అప్పులే నీకు దక్కేది''. అన్నాడు.

వాళ్ళిద్దరూ ఒకరి పక్క ఒకరుగా నడుస్తూ బొంత జెముడు పొద వద్ద మలుపు తిరిగారు. అల్లంత దూరాన హరిజనవాడ కనిపిస్తూ వున్నది.

కోనిగాడు, ''ఐతే పెదనాయుడు మనకీ యకరా నేల ఏవిటికిస్తె ఉండాడంటావు? మనల్ను ముంచేదానికే నంటావా?'' అన్నాడు.

పుల్లిగాడు, ''సాలెపురుగు గూడును ఏవిటికడ్తుంది? ఈగలు, దోమలు వచ్చి అందులో తగులుకోవాలని కడ్తుంది. ఈగ గనక సాలెగూట్ల పడితే అది ఆడ బతకనూ బతకదు. ఆడ్నుంచి తప్పించుకునీ రాదు. పెదనాయుడు మనకీ కయ్యాల్నిచ్చేది గూడా అందుకే. పెదనాయుడు గాదు. గవుర్మెంటోడు గూడా అంతే. మాలోల్లకు, మాదిగోల్లకు తలా రొండెకరాలు పోరంబోకు బూవి పట్టాజేసిచ్చేది గూడా ఇందుకే'' అన్నాడు.

కోనిగాడు ఆశ్చర్యంగా కొడుకు వైపు చూసి, ''గవుర్మెంటోడు గూడా అంతేనంటావంట్రా?'' అన్నాడు.

పుల్లిగాడు తేలిగ్గా, ''గవుర్మెంటంటే ఏంది. మన పెదనాయుడట్టా వోల్లు నలుగురు పోయి ఐద్రాబాదులో కూసుంటే వాళ్ళే గవుర్మెంటు. ఈల్లు చేసే పన్లన్నీ పారే నీళ్ళకు కాళ్ళడ్డం పెట్టే పన్లే. మనబోటోల్లు రతికొచ్చేపన్లు ఎప్పుడూ చెయ్యరు'' అన్నాడు.

కోనిగాడు తలవంచుకుని మౌనంగా నడవసాగాడు. కొడుకు చెప్పిన మాటలు అతని మనసులోకి ఇంకుతున్నాయి. ఏండ్ల తరబడి అతని మనసులో స్థిరపడిన భావాలకు, ఇప్పుడు కొడుకు చెప్పిన మాటలకు మధ్య ఘర్షణ జరుగుతూంది. అతడు అస్పష్టంగా గొణుకుతూ, అర్థరహితంగా తల ఊపుతూ నడుస్తున్నాడు.

కోనిగాడు తలెత్తాడు. ఎట్ట ఎదుట హరిజన వాడ కనిపిస్తూంది. హరిజనవాడ అతనికి కొత్తగా కనిపించసాగింది. ఇటుకలతో నిర్మించిన గోడలు, పెంకులతో తయారైన కప్పులు, ఇండ్ల ముందర తైలంచెట్లు, వీధుల వెంబడి కరెంటు స్తంభాలు అన్నీ అతనికి విచిత్రంగా కనిపిస్తున్నాయి. అతడు పెంకుటిండ్లను చూపిస్తూ, ''మన మాలపల్లి జూడు. పూర్తిగా మారిపోయింది. నువ్వు ఊరిడ్సి పోయేముందు ఊర్నిండా గుడిసెలు, పూరిండ్లు ఉండె. ఇప్పుడు జూడు. ఊరు పట్నంగా మాదిరయిపోయింది. మనం బతికే దానిగ్గాకపోతే ఇదంతా గవుర్మెంటోడు ఇంకెందుకు చేసినాడంటావు?'' అన్నాడు.

పుల్లిగాడు సన్నగా నవ్వి, ''పస్తుల్తో ఈల కర్సుకుని పడుండేవాడు గుడిసెలో పడుంటేనేవి? పెంకుటింట్లో పడుంటేనేవి? తిండిలేక చచ్చేవాడు చీకట్లో చస్తేనేవి? కరెంటు దీపాలకింద చస్తేనేవి? ఏడిచే బిడ్డకు యలక్కాయ నిచ్చినట్లు గవుర్మెంటోడు మనకివన్నీ ఇచ్చినాడు'' అన్నాడు.

కోనిగాడు ఏదో చెప్పబోయి ఆ ప్రయత్నం విరమించుకుని తల వంచుకుని నడవసాగాడు. అతని మనసులో ఘర్షణ తీవ్రతరమవుతున్నది. అప్పుడప్పుడు కుడిచేతిని, తలకాయను విదిలిస్తున్నాడు. నడుస్తూనే ఒకటి రెండుసార్లు అస్పష్టంగా, ''ఏవీ తెలవకుండా ఉంది. నాకేవీ తెలవకుండా ఉంది'' అని గొణిగాడు.

వాళ్ళిద్దరు వీధుల వెంబడి నడిచి తమ పెంకుటింటిని సమీపించారు. వాళ్ళింటికి ఒక వైపున తైలం చెట్టు, మరొక వైపున సుంక్రేసు చెట్టు ఉన్నాయి. ఇంటి గుమ్మాని కిరువైపుల రెండు తిన్నెలున్నాయి.

ఒక తిన్నెమీద ఎవరో కూర్చుని ఉండడం పుల్లిగాడు అంత దూరం నుంచే గమనించాడు. అతడు, ''మన తిన్నెమీదెవరో కొసోనుండారయ్యా, ఎవరో కాపు మనిషి మాదిరనిపిస్తె ఉంది'' అన్నాడు.

కోనిగాడు తన చత్వారపు కళ్ళతో చూడడానికి వ్యర్థ ప్రయత్నం చేసి, ''మాలోని తిన్నెమీద కాపోళ్ళింటికి కూసుంటారు. మనోళ్ళే అయ్యుంటాడు. సుట్టాలెవురెన్నా వొచ్చినారేవో'' అన్నాడు.

వాళ్ళిద్దరు వడివడిగా ఇంటివైపు నడిచారు. దాపుకు వచ్చాక తిన్నెమీద కూర్చుని ఉన్నది తిరిపాల నాయుడని పోల్చుకున్నారు.

పుల్లిగాడు, ''నువ్వాసావి తిన్నెమీద కూసోనుండావేంది?'' అన్నాడు.

తిరిపాలనాయుడు ''నేన్నీకోసరవే తెల్లార్నుంచి చూస్తె ఉండాన్రా. వెదకాల్సిన తావులన్నీ వెదికి ఇంగ సాలైపోయి ఈడొచ్చి కూసుంటి'' అన్నాడు.

పుల్లిగాడు తిన్నెముందల నేల మీద కూర్చుని, ''నాతో ఏం పని సావి?'' అన్నాడు.

తిరిపాలనాయుడు దీర్ఘంగా నిట్టూర్చి, ''మాలోన్దగ్గిరికి రైతు ఏం పనిమీదొస్తాడు? కూలికి రమ్మని పిలిచేదానికొస్తాడు. ఐతే నేనిప్పుడు నిన్నడిగేదాని కొచ్చినా'' అన్నాడు.

కోనిగాడు గూడా కొడుకు పక్కన నేలమీద కూర్చుని, ''అదేవి మాట సావి. రైతు మారాజులు నీ నోట్లో ఇట్టాటి మాటలు రాకూడదు సావి'' అన్నాడు.

తిరిపాలనాయుడు నిర్జీవంగా నవ్వి, ''ఇంగా యాడరైతు మారాజు. సదరాలట్టా కయ్యాల్ను పోగొట్టుకుంటి. నన్ను నడీదిలో నిలబెట్టి నా కయ్యాల్ను యాలం వేసుకుని పోయిరి..'' అంటూ ప్రారంభించి నిన్నటి ఉదయం తన భూమి వేలంలో అమ్ముడైన వైనం వివరించాడు.

అతడు చెబుతుండగా వాళ్ళిద్దరు తలలు వంచుకుని విన్నారు. చివరన పుల్లిగాడు, ''అంతా విన్నాను సావి. నిన్న మావిటేళే కల్లంగడి కాడ చెప్పుకుంటా ఉంటే విన్నాను. కాలం మారిపోతా ఉంది సావి. సన్నబోల్లు బతికేది కష్టమైపోతా ఉంది. కయ్యాల్ను నమ్ముకోని బతికేదానికన్న నడువుకొక బండ కట్టుకుని బాయిలో దూకేది మేలనిపిస్తా ఉంది'' అని తలయెత్తి ''ఇప్పుడు నాగుండా నీకేంపని సావి?'' అన్నాడు.

తిరిపాలనాయుడు, ''నువ్వు పట్నంలో పోయి బతకతా ఉండావంటగదా, నువ్వు పోయేటప్పుడు నన్ను గూడా తీసుకుని పో, నాసత్తకాడికి నాలుగు పన్లు చేసి పొట్ట పోసుకుంటా'' అన్నాడు.

కోనిగాడు అలసటతో కూడిన ముఖంలో బాధ కదులాడుతుండగా, ''పుట్టి పెరిగిన కొంపకు చెదులెక్కించేస్తే మల్ల ఆ పాపం ఈడేరేదెప్పుడు సావి. అదాలోసించడం లేదు నువ్వు'' అన్నాడు.

తిరిపాలనాయుడు, ''పాపంవేంది, పుణ్యంవేంది. పుట్టి పెరిగినూర్లో బతికే దోవలేకనే రాజ్జింమీద పోతా ఉండానుగాని, తిని ఉండబట్టలేక ఈ పని మొదలు పెడ్తినా'' అన్నాడు.

కోనిగాడు ''అదిగాదు సావి. మీది రైతు పుటక. ఊరూరు తిరిగి బతకాలంటే మీకు తక్కువ గద సావి'' అన్నాడు.

తిరిపాలనాయుడు, ''నా పుటక అగ్గబడినట్టే ఉంది. గాదెలు, గెరిసెలు నిండి తొణకతా ఉంటేనే రైతు. కూలోడు అని ఏర్పడేది అన్నీ కడిగి బోర్లించేసినాక రైతూ ఒకటే కూలోడు ఒకటే'' అన్నాడు.

తండ్రి కొడుకులిద్దరు ఏమి చెప్పాలో తెలియక తలలు వంచుకుని కూర్చున్నారు.

తిరిపాలనాయుడు కాళ్ళను అరుగు కిందకు విడిచి కూర్చుని, ''నువ్వట్ట మాటా మంతీ లేకుండా కూసోనుండే దేవిటికారా పుల్లిగా నేన్నీతో రావాటం ఇష్టం లేకుండా ఉంటే ఇప్పుడే చెప్పెయ్ తల ఎత్తి''. అన్నాడు.

పుల్లిగాడు చటుక్కున తల ఎత్తి, '' ఆమాట నేనెట్టఅంటాను సావి. నిన్ను పట్నంలో నా ఇంట్లో ఉంచుకుని కూడు పెట్టబోతానా యట్ట. నవ్వంత గెట్టిగా మనసు చేసుకోనుంటే ఆ పకారవే బయల్దేరు సావి'' అని ఏదో చెప్పబోయి ఆగి తల పక్కకు తిప్పి, ''సూస్తా ఉండంగానే కాలం యట్టమారి పోయింది సావి. నా కండ్ల ముందరనే ఈ ఊర్లో పాశెగాని మాదిరి బతికినోడివి. కాలం ఎట్టిట్టు మారిపోతా ఉందో తల్సుకుంటా ఉంటే కడుపులో ఏపిస్తాది సావి'' అన్నాడు.

20

ప్రతియేటా ఆ గ్రామంలో ఒకటి రెండు ఇండ్లు ఖాళీ అవుతున్నాయి. వ్యవసాయం గిట్టుబాటుకాని వాళ్ళూ, వృత్తిపనులకు గిరాకీలేని వాళ్ళూ, చేతినిండా కూలిపని దొరకని వాళ్ళూ గ్రామం విడిచి పెడుతున్నారు. వాళ్ళు బ్రతుకు తెరువుకోసం అటు బెజవాడకో, ఇటు మద్రాసుకో లేక సమీప పట్టణాలకో తరలి వెళ్ళుతున్నారు. పుట్టి పెరిగిన గడ్డను వదిలి వెళ్ళడం సులభమైన పని గాదు. ముప్పై ఏండ్లుగా, నలభై ఏండ్లుగా, యాభై ఏండ్లుగా ఈ గ్రామంతో అల్లుకున్న బంధాలు ఒక పట్టాన తెగేవి కావు. ఆ గ్రామం తిండి పెట్టలేదు. ఆ గ్రామం బట్టనివ్వలేదు. ఐనా అది సృష్టించిన బంధాలు చాల బలమైనవి. చిన్నప్పుడు చెడుగుడు ఆడుకున్న వీధులను, కోతి కొమ్మచ్చులాడిన చెట్లను, చెమటలు కారుస్తూ దున్నిన పొలాలను, కయ్యాలు వియ్యాలూ నెరపిన బంధువులను, కష్ట సుఖాలను పంచుకున్న ఇరుగు పొరుగులను వదిలి పెట్టడం రంపపు కోతగా అనిపించేది.

అవునండి లేగను పాలు పిదికేవాడు వేరుచేస్తాడు. తల్లికోడినుంచి పిల్లలను గద్ద వేరుచేస్తుంది. కాని తమ స్వంత గడ్డనుండి తమను వేరుచేస్తున్న శక్తి ఏదో వాళ్ళకు తెలియదు. గ్రామాన్ని వదిలి పెట్టేటప్పుడు లేగలవలె, కోడిపిల్లల వలె అంగలార్చేవారు; శోకించేవారు.

తాము ఊరును విడిచెపెట్టే రోజును ముందుగానే నిర్ణయించుకునే వారు. రాహుకాలం, వారశూల లాంటివి అడ్డురాకుండా చూసుకునేవారు. పొరుగూళ్ళలో ఉండే బంధు, మిత్రులకు ఈ విషయం తెలియజేసే వాళ్ళు. పెండ్లిండ్లు,

పెంపకాలు వంటి ఆయా బాధ్యతలను ఆయా వ్యక్తులకు అప్పగించేవారు. తాము నిర్ణయించుకున్న రోజు ఎప్పుడొస్తుందా అని అతురతతో ఎదురు చూసేవాళ్ళు. తీరా ఆ రోజు వచ్చేటప్పటికి వాళ్ళ మనో నిబ్బరం నీరైపోయేది. సామాను సర్దుకోవడానికి చేతులు నిరాకరించేవి. గడప దాటడానికి కాళ్ళు నిరాకరించేవి. వీడ్కోలు చెప్పడానికి నోరు నిరాకరించేది. అప్పుడు వాళ్ళు నల్ల కల్లును సీసాలలో తెచ్చి తాగేవారు. కొడుకుకు తండ్రి తాపించేవాడు. తండ్రికి కొడుకు తాపించేవాడు. భార్యకు భర్త తాపించేవాడు. భర్తకు భార్య తాపించేది. ఆ మైకంలో వాళ్ళకు కావలసినంత తెంపు, తెగువ లభించేది. '' యల బారండ్రా. రాముడుండాడు రాజ్జివుండాది. యలబారండ్రా'' అని ఒకరి నొకరు పురమాయించుకునేవారు. ఇండ్లకు తాళాలు వేసి, మూటలును, పెట్టెలను నెత్తిన పెట్టుకుని వాళ్ళు తడబడుతూ వీధుల వెంబడి నడిచేవాళ్ళు. ఊరు ముంగటకు వచ్చి, వెనుదిరిగి ఊరును తేరిపార జూసే వారు. అప్పుడు వాళ్ళ కళ్ళలోగంగ సుడులు తిరిగేది. ఆంజనేయస్వామి గుడి, గుడి పక్కన మర్రి మాను, దాని వెనుక ఊరు, ఊరు వెనక పచ్చని పొలాలు, పొలాల కవతల కొండలు ఇవన్నీ కన్నీటి పొరగుండా గజిబిజిగా కనిపించేవి. దుఃఖంతో అసహాయతతో వాళ్ళ శరీరాలు ఆపాద మస్తకం కంపించేవి. కడుపుకు కూడు పెట్టని ఊరు, మానం మీదకు బట్టనివ్వని ఊరు – ఆ ఊరు తన అదృశ్య హస్తాలను చాచి వాలి గుండెలను వొడిసి పట్టుకుని పిసికేది. దుఃఖాతిశయంలో వాళ్ళు పిచ్చిగా కేకలు వేసేవాళ్ళు. నడుము వంచి దోసెడు మన్ను తీసుకుని తూర్పు దిక్కుగా ఎగర జల్లేవారు. మళ్ళీ వంగి దోసెడు మన్ను ఉత్తర దిశగా, మరో దోసెడు మన్ను పడమర దిశగా, ఇంకో దోసెడు మన్ను దక్షిణ దిశగా ఎగర జల్లేవారు. ఆ ధూళి మేఘం వలె వారిని ఆవరించుకుని గాలిలో నిలిచేది. ధూళి మేఘంలో నిలబడి వాళ్ళు రొమ్ము బాదుకునేవారు. కొడుకును ఓదార్చబోయి తండ్రి బావురుమనేవాడు. భర్తను ఓదార్చబోయి భార్య నేలమీద పడి దొర్లేది. కాలువల్లో నీళ్ళు వాళ్ళ శోకాన్ని సరుకు చేయకుండా గలగల ప్రవహిస్తుండేవి. బంగారు రంగు వరి కంకులు వాళ్ళ వేదనను గమనించకుండా చిరుగాలిలో ఊయ్యాలలూగుతుండేవి. వాళ్ళు మట్టి బాటమీద కూర్చుని తమ కన్నీటి గ్రంధులు ఇంకిపోయేవరకు, తమ మెదళ్ళు మొద్దుబారి పోయేవరకు విలపించేవారు. ఒకరి కన్నీళ్ళనొకరు తుడిచి, ఒకరి బుజాలనొకరు పట్టుకుని లేవనెత్తేవారు. మూటలను, పెట్టెలను నెత్తిమీద పెట్టుకోవడానికి ఒకరికొకరు సాయం చేసి అనిశ్చితాలకు ఆలవాలమైన తమ సుదీర్ఘ ప్రయాణాన్ని ప్రారంభించేవారు.

వాళ్ళు వెళ్లి పొయ్యాక వాళ్ళ ఇండ్లు ప్రేత కళను ఆపాదించుకునేవి. ఆ ఇండ్ల ముంగింట జిల్లేడు చెట్లు వెంపలి చెట్లు మొలిచేవి. ఇండ్ల తిన్నెలమీద ఊరకుక్కలు కాపురముండేవి. వర్షం పడినప్పుడు ఇండ్ల కప్పులమీద ఎన్నెద్రగడ్డి మొలిచేది. చలికాలంలో కప్పు ఎగిరిపోయి ఆడుగున ఉన్న వెదుర్లు కనిపించేవి. ఆ వెదర్లు శవం తాలూకు ఎముకలవలె కనిపించేవి. ఇంటి లోపల దొంతుల కింద పాములు స్థిరనివాస మేర్పరచుకునేవి. ఇంటి వాసాల నంటి పెట్టుకుని గబ్బిలాలు నివశించేవి. గబ్బిలాలు కీచుకీచుమని చప్పుడు చేసినప్పుడు బయట అరుగుమీదున్న కుక్కలు భౌభౌమని మొరిగేవి.

21

కోనిగాడు పెదనాయుడుగారి భవంతిని చేరుకునే సరికి భళ్ళున తెల్లవారింది. అతడు భవంతి ముందర నిలబడ్డాడు. సింహద్వారం వద్ద ట్రాక్టరు నిలబడి ఉన్నది. షెడ్డులో కారు పార్కు చేయబడి ఉన్నది. జీతగాళ్ళు అటూ, ఇటూ తిరుగుతున్నారు. ముత్యాలనాయుడు ఎవరిపైనో కేకలేస్తుండడం లోపల్నుంచి వినిపిస్తుంది.

కోనిగాడు సింహద్వారం దాటుకుని మెల్లగ లోపల అడుగు పెట్టాడు. ముత్యాలనాయుడు వరండాలో పచార్లు చేస్తూ అరుస్తున్నాడు. గోపాలుగాడి భార్య చేతులు కట్టుకుని వరండా కింద నిలబడి ఉంది. కోనిగాడు ఒక స్తంభం చాటున నిశ్శబ్దంగా నిలుచున్నాడు.

ముత్యాలనాయుడు పచార్లు చేస్తూనే, గోపాలుగాడి భార్యను చూసి, ''ఏడు దినాలయింది. నీ మొగుడు ఆస్పత్రిలో చేరి ఈ పొద్దిటికి ఏడు దినాలయింది. వాడు పోయి ఆస్పత్రిలో పడుకుంటే ఈడ సేద్దిం ఎవురు చేస్తారు?'' అన్నాడు.

గోపాలుగాడి భార్య దీనంగా, ''మే వేవి జేతుం సావి. వాని చెయ్యి ఇరిగి రెండు తునకలయి పోయింది. మిసన కాడనే నాలుగు బళ్ళల నెత్తురు కారింది. డాకట్రు ఆపరేషను చేసి పిండి కట్టు కట్టినారు సావి. పానవే పోవాల్సింది. బగమంతుడు సల్లగ చూసి బతికించినాడు'' అంది.

ముత్యాలనాయుడు, ''ఐతే తప్పంతా మాదే నంటావు. వాడ్ని మిరపతోటకు నీళ్ళు పెట్టమని పంపింది మా తప్పు. మిషను స్టార్టు చెయ్యమనింది మా తప్పు. తప్పంతా మాదేనంటావు'' అన్నాడు.

గోపాలుగాని భార్య, ''ఆమాట నేనెప్పుడంటి సావి. మా గాచ్చారాలు సాలక ఇట్టయింది. చెట్టంత మొగోడు చెయ్యి ఇరగ్గొట్టుకోని ఆస్పత్రిపాలాయె. ఇదంతా మా సాలకాలం సావి. చెయ్యి కట్టుకోవాలంటే యట్టలేదన్నా నెల దినాలవుతుందంటా ఉండాడు డాకట్రు'' అన్నది.

ముత్యాలనాయుడు పచార్లు చేయడం ఆపి,'' నెల దినాలు!నెల దినాలు వాడు ఆస్పత్రిలో పడుకుంటే మా సేద్దిం ఏవి గావాల? వాడ్ని జీతానికి పెట్టుకునింది సేద్దిం పన్లు చేసేదానికా? ఆస్పత్రిలో నిద్దర్లు చేసే దానికా? ఈ ఏడు దినాలు నీళ్ళు లేక మిరపతోట ఎండి వొరుగైపోయింది. పూత పిందెతో సహా రాలిపోయింది. కాపు చేతికొస్తే వెయ్యి రూపాయల మిరపకాయలు ఇల్లు చేరును. నీ మొగుని మూలంగా ఇప్పటికే మాకు వెయ్యి రూపాయలు నష్టం వొచ్చింది. నువ్వేవో వాడింకా నెల దినాలు పడక దిగేది లేదంటా ఉండావు'' అన్నాడు.

గోపాలుగాని భార్య కళ్లు వొత్తుకుంటూ, ''మే వేమి జేతుం సావి. ఇది నెత్తి బరువా దించుకోవడానికి. బగమంతుడు గావించిన యనుకూలం బగమంతుడే కాయాల'' అంది.

ముత్యాలనాయుడు, ''యనుకూలం మీకుగాదు కాదు. అది సాలకుండా మల్ల ఎగుపొద్దున ఈ నంగి ఏడుపులేవిటికి? ఇట్టా నాచు యదవాల్ను జీతగాళ్ళుగా పెట్టుకోవడమే మా తప్పు. పో.పో. వాడు ఆసుపత్రి నుంచి రాంగానే వొచ్చి పనిలోకి ఎక్కమన్నెప్పు. పో'' అన్నాడు.

ఆమె చీర చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ వెనుదిరిగి సింహద్వారం వైపు నడిచింది.

ఆమె వెళ్ళిపోయాక కోనిగాడు స్తంభం చాటు నుండి ఇవతలకొచ్చాడు. లోపలికి వెళ్ళబోయిన ముత్యాలనాయుడు కోనిగాడిని చూసి, ''ఎప్పుడొచ్చినావురా తిరపతి నుంచి?'' అన్నాడు.

కోనిగాడు వరండా చేరువగా నడిచి, ''నిన్న మావిటేళ వొచ్చినాను సావి'' అన్నాడు.

ఇందాక ముత్యాలనాయుడి ముఖంలో కనిపిస్తుండిన కోసం మాయమై ప్రసన్నత చోటు చేసుకుంది. అతడు తలనీలాలు గూడా ఇచ్చినావంట్రా. శానా ముడుపులు కట్టినట్టుండావు. రా ఇట్టొచ్చి కూసో'' అన్నాడు.

కోనిగాడు వరండా మెట్లదగ్గర నేలమీద కూర్చున్నాడు ముత్యాలనాయుడు పై మెట్టుమీద కూర్చుని, కోనిగాడిని కాసేపు సాలోచనగా చూసి, ''మ్ మొన్న ఫిలిచేదానికి ఘాలపల్లికి నొచ్చుంటి. నీ కొడుకు కనబడినాడు. పిలగాడు బాగ యిడిగి పోయి నాడురా. పిడిగిత్త మాదిర తయారయ్యుండాడు'' అన్నాడు.

కోనిగాడు, ''ఔ సావి. ఈడుండినప్పుడు ఎలికి నరం మాదిరుండినాడు. ఈ సంవత్సరం దినాలు దినానికి మూడు పూటలు తిన్నట్టుండాడా. అందుకే మల్లా అడికే పోతానంటా ఉండాడు'' అన్నాడు.

ముత్యాలనాయుడు ఉలిక్కి పడినట్టు ''ఏందీ? మల్లి ఆడికే పోతానంటా ఉండాడా? మరి మనమనుకు నిందేవయింది?'' అన్నాడు.

కోనిగాడు, ''మనవనుకుని ఏవిలాబం సావి. వాని మనసంతా పట్నంలోనే ఉండాది. రేపే యలబారి పోతానంటా ఉండాడు'' అన్నాడు.

ముత్యాలనాయుడు పొగాకు కాడనునోట్లోవేసుకుని, ''వాడట్ట అంటాడని నాకు తెల్సురా. వానికి జోగలోల్ల బుద్దులు పుట్టిపోయినాయి. నువ్వు నచ్చ జెప్పాల. నువ్వు వాడ్ని కంటివా కక్కితివా? వాడు నాడోడి మాదిర దేశం మీద పడి బతకతా ఉంటే తండ్రినయినోడివి నువ్వు నిట్ట చూస్తా ఉంటావు?'' అన్నాడు.

కోనిగాడు, ''నేను రాత్రంతా సత పోరినాను సావి. యకరా నేల కతగూడ చెప్పినా. నేను చెప్పింది వాడు నాబిలో గూడా పెట్టాటం లేదు సావి'' అన్నాడు.

ముత్యాలనాయుడు పొగాకు కాడను నమలడం గబుక్కున ఆపి, ''ఓరి ఈనమ్మ. యకరా నేల గూడా ఈనికి లెక్క లేకుండా పోయిందంట్రా? ఈనికి సెనిమాయ పూరా కమ్మేసింది. మేవు యకరా నేల ఇస్తానంటిమి. గవుర్మెంటోడు బంగళా మాదిర ఇల్లు కట్టించె. ఇవి పెట్టుకుని గుట్టుగా బతక్కుండా దేశం మీద పోతానంటే అది సెనిమాయ గాక ఇంగేవనుకోవాలి?'' అన్నాడు. తరవాత అతడు పొగాకు కాడను కాసేపు నమలి, ''సరే వానికత వొదిలెయ్.నీ కజ్జెప్పు రేపట్నుంచి నువ్వేవి చెయ్యబోతా ఉండావు?'' అన్నాడు.

కోనిగాడు, ''నువ్వే చెప్తివి గదా: ఈ గంగ పండక్కు నా బాండు తీరిపోతుందని గంగ పండగ పోయి నాలుగు దినాలయింది. ఆ బాండ కాయితాన్ని నా మొకాన పారేస్తే నా బతుకు నేను బతుక్కుంటాను'' అన్నాడు.

''అదే. యట్ట బతకతావని అడగతా ఉంది.''

''మావోడు నన్ను గూడ పట్నం రమ్మంటా ఉండాడు సావీ. ఇద్దరం కలిసి రేపు యలబారేట్టుగ అనుకున్నాం.''

ముత్యాలనాయుడు కాసేపు సాలోచనగా తల ఊంచి ''మ్ ఐతే వాడు నీకు గూడా మాత్ర ఏసినాడు. సూడబోతే వాడు నీకు పుట్టినట్టు లేదు. నువ్వే వాడికి పుట్టినట్టుండాది.'' అని పైకి లేచి, ''మీరిద్దరూ కూడ బలుక్కున్నాక ఇంగ నేను వొట్టి నోరు నవిలేదేవిటికి? ఉండు నీ కాయితం నీకిచ్చేస్తా. యకరా నేలిస్తానంటే పెండ్లాం బిడ్డల్తోవొచ్చి మా పంచన వాలే వాళ్ళు ఇదే మాలపల్లిలో లచ్చమంది ఉండారు'' అనేసి లోపలికి వెళ్ళి పోయాడు.

కోనిగాడు చేతులు పిసుక్కుంటూ అలాగే కూర్చున్నాడు. కొంత సేపటికి ముత్యాలనాయుడు ఒక పురాతనమైన కాగితాన్ని తీసుకుని వచ్చి వరండా పై మెట్టు మీద నిలబడి, ''ఇది నువ్వు ముప్పై ఏండ్ల కింద ఏలిముద్దరేసిన కాయితం. ఇండ దీంతో నీకూ మాకూ తీరిపోయింది. ఇంగ నీ యిష్టం వొచ్చినట్టు బతుక్కో'' అన్నాడు.

కోనిగాడు లేచి వరండా ఆఖరు మెట్టుమీద నిలబడి రెండు చేతులతో ఆ కాగితాన్ని అందుకున్నాడు.

ఇంతలో ఇంటిపని మనిషి ఒక జత కొత్త పంచెలను తెచ్చి ముత్యాల నాయుడికిచ్చింది. అవి రెండూ ముతక నూలుతో తయారైనవి. వాటి చుట్టూ పుల్లరంగు కాగితం చుట్టబడి ఉంది. ఆ కాగితం మీద ఆ బట్టలు తయారైన కంపెనీ తాలూకు లేబిలు అతికించబడి ఉంది.

ముత్యాలనాయుడు ఆ జత పంచెలను కోనిగాడికి అందిస్తూ, ''ఇంద ఇవిట్ని పెదనాయుడు నీకు యినాంగా యిమ్మనవి చెప్పినాడు'' అన్నాడు.

కోనిగాడు బాండు కాగితాన్ని బొడ్లో దోపుకుని, వినయంగా ఆ రెండు పంచెలను అందుకున్నాడు. వాటిని వంక నిరికించుకుని, నండువంచి ముత్యాలనాయుడి పాదాలను కళ్ళకద్దుకున్నాడు. తరువాత నడుమెత్తి, ''దండాలు సావి'' అని చేతులు జోడించి వెనుదిరిగాడు.

22

పుల్లిగాడు ఇంటి ముందర నిలబడి వేపపుల్లతో పండ్లు తోముకుంటున్నాడు. కొంత సేపటికి కోనిగాడు కాళ్ళీడ్చుకుంటూ వచ్చి సుంకేసు చెట్టు కింద నిలబడ్డాడు. పుల్లిగాడు పండ్లుతోమడం ఆపి తండ్రివైపు చూపి, 'ఏమయింది?' అన్నట్టు కళ్ళెగుర వేశాడు.

కోనిగాడు బొడ్లోంచి బాండు కాగితాన్ని తీసి ''అన్నీ తెగతెంపులు చేసుకుని వొచ్చేసినా'' అంటూ ఆ కాగితాన్ని కొడుక్కు అందించాడు.

పుల్లిగాడు మడతలు విప్పి దాన్ని కాసేపు చూసి, కసికొద్దీ దాన్ని ఉండగా నలిపి వీధిలోకి గిరవాటు పెట్టాడు.

కోనిగాడు జతపంచెలను చూపిస్తూ, ''ముప్పై సంవత్సరాలు పన్జేసినందుకు యినాంగా ఇవిట్ని ఇచ్చినారు'' అన్నాడు.

పుల్లిగాడు వాటిని అందుకుని కాసేపు తిప్పించి, మళ్ళించి చూసి, ''ఇంతకన్న నాసిరకం గుడ్డ సద్ది కూడు కట్టుకోని బయల్దేరి దేశవంతా తిరిగినా దొరకదు. రొండూ కల్సి నలభైరూపాయలుంటాయి'' అని వాడిని తిన్నె మీదకు గిరవాటు పెట్టి, ''ఉండనీ నాలుగు దినాల కాలం తొయ్యొచ్చు'' అన్నాడు. అతడు తుండు గుడ్డను భుజాన వేసుకుని పెరట్లోకి నడిచాడు.

కోనిగాడు తిన్నెమీద కూర్చుని వీపును గోడకు ఆనించాడు. తూర్పు కొండల వెనక కొద్ది కొద్దిగ పైకి వస్తున్న సూర్య బింబాన్ని అతడు తదేకంగా చూడసాగాడు.

ఉండగా నలపబడిన బాండు కాగితం గాలి పాటుకు కొట్టుకుని పోతూ మధ్యకు చేరింది. ఒక కుంటి గాడిద కాలెగరేసుకుంటూ వచ్చి ఆ కాగితాన్ని స్వాహాచేసింది.

పెరట్లో పుల్లిగాడు ముఖము, కాళ్ళు, చేతులు కడుక్కున్నాడు. తుండు గుడ్డతో ముఖం తుడుచుకుంటూ బయటకొచ్చాడు.

కోనిగాడు తిన్నెమీద శిలా ప్రతిమవలె నిశ్చలంగా మౌనంగా కూర్చుని, రెప్ప వేయకుండా సూర్య బింబాన్ని చూస్తున్నాడు.

పుల్లిగాడు ముఖం తుడుచుకుని, ''సముద్రం కాలిపోతా ఉన్నట్టు చూస్తా ఉండా వేందయ్యా. ఏవాలోచిస్తా ఉండావు?'' అనడిగాడు.

కోనిగాడు ఉలిక్కి పడినట్టు తల తిప్పి, ''ఏవాలోచిస్తా ఉండానా? అది మల్ల చెప్తానుగాని, నేనొకటి అడగతాను అజ్జెప్పు'' అన్నాడు.

''ఏంది?''

''పట్నంలో సంవత్సరం దినాలుంటివి గదా లెక్క లేవన్నా నేర్చుకున్నావా?''

''జాస్తి నేర్చుకోలేదయ్యా. కూడికలు, తీసివేతలు నేర్చుకున్నా ఎందుకు?''

కోనిగాడు, ''ఐతే ఈ లెక్క చెప్పు'' అని గొంతు సవరించుకుని, ''ఏడు దినాలకు వెయ్యి రూపాయలైతే నెలదినాలకెన్ని రూపాయలు?'' అన్నాడు.

''ఎట్టిట్టా?'' అన్నాడు పుల్లిగాడు.

కోనిగాడు స్పష్టంగా చెప్పడానికి ప్రయత్నిస్తూ గొంతు పెంచి, ''ఏడు దినాలకు వెయ్యి రూపాయలైతే నెల దినాలకు ఎన్ని రూపాయలు?'' అన్నాడు.

పుల్లిగాడు చేతివేళ్ళ సహాయంతోను, కాలి వేళ్ళ సహాయంతోనూ కాసేపు లెక్కపెట్టి! ''ఏడు దినాలకు వెయ్యి రూపాయలైతే నెల దినాలకు నాలుగువేల రూపాయలు?'' అన్నాడు.

కోనిగాడు కొడుకు ముఖాన్నే చూస్తూ, ''నెల దినాలకు నాలుగువేల రూపాయలైతే సంవత్సరాని కెంత?'' అనడిగాడు.

పుల్లిగాడు కాసేపు మనో గణితం చేసి, ''సంవత్సరానికి నలభై ఎనిమిది వేల రూపాయలు'' అనేసి ఇంట్లోకి పోబొయ్యాడు.

కోనిగాడు ''ఉండుండు'' అని అతడిని ఆపి, ''ఒక సంవత్సరానికి నలభై ఎనిమిది వేల రూపాయలైతే ముప్పై సంవత్సరాల కెంత?'' అనడిగాడు.

పుల్లిగాడు మళ్ళీ ఓపిగ్గా లెక్కవేసి, ''ముప్పై సంవత్సరాలకు లక్ష రూపాయలు దాటుతుంది'' అని తుండు గుడ్డను సుంక్రేసు చెట్టు కొమ్మ మీద వేసి, ''ఏవి లెక్కలయ్యా ఇవి?'' అన్నాడు.

కోనిగాడు ఉరుకుహరం వ్యాపించేలాగ నిట్టూర్పు విడిచి, ''ఏవి లెక్కటా కడుపు కాలిపోయే లెక్కలు. కడుపు దగోత్తరంగా కాలిపోయే లెక్కలు. ''అని కాళ్ళను తిన్నె కిందకు వ్రేలాడు వేసి, ''నేను నిద్దర లేసి పెదనాయుడింటికి పోతిని. నేను పోయేటప్పటికి గోపాలుగాడి పెండ్లాం యాడస్తా ఉండాది....'' అని ప్రారంభించి ముత్యాలనాయుడికీ; గోపాలు గాని భార్యకు జరిగిన సంభాషణనంతటనీ వివరించి, ''ఆ లెక్కన నేను ముప్పై ఏండ్లు జీతగాడుగా ఉండి పెదనాయునికి లక్షరూపాయల పైగా వరుమానం సంపాదించి పెడితి. మరి నాకేవి దక్కింది? ఒక జత అడ్డ పంచలు. ముప్పై సంవత్సరాల పొడుగునా ఉత్త పిండి సంగటి. అద్దల్సుకుంటే కడుపు దగోత్తరంగా కాలిపోతా ఉందిరా. ముప్పై సంవత్సరాలు కండ్లుండీ కబోదినైతి. చెవులుండీ చెవుటోడినైతి. తల్చుకుంటే కడుపు కాలిపోతా ఉందిరా'' అన్నాడు.

పుల్లిగాడు మెల్లగ తండ్రి దాపుకు నడిచి, అతని భుజం మీద చేయి వేసి, ''అయిపోయిందానికి వొగిసే దేవిటికయ్యా. ఇంక జరగాల్సింది సూడు.

రేపియాలకు మనం పట్నంలో ఉండాలి. లేచి గుడ్డ గుసురూసర్దుకో'' అన్నాడు.

23

నేషనల్ హై వే నంబరు 4. సువిశాలమైన రోడ్డు. మజలీలు, మలుపులు కలిగిన రోడ్డు. మానవ నాగరికతకు చిహ్నమైన రోడ్డు. నాగరికతతో బాటు మార్పులు చెందుతున్న రోడ్డు. మానవ చరిత్ర వలె ఆది ఏదో అంతమేదో తెలియని రోడ్డు.

ఎండ కళ పెళలాడుతుండడం వల్ల రోడ్డు మీద తారు కరుగుతున్నది. తారు రోడ్డు మీద ఎండ మావులు సముద్రపు అలల వలె అవిరామంగా లేస్తున్నాయి. మాయవలె అంతరిస్తున్నాయి.

రోడ్డు పక్కన ఉన్నతమైన చింతమాను ఉన్నది. దాని వేళ్ళు భూమిని పొడుచుకుని వచ్చి ఉన్నాయి. ఆ వేళ్ళ మీద పుల్లిగాడు, కోనిగాడు కూర్చుని ఉన్నారు. వారి వెనక కంసాలి, తిరిపాల నాయుడు ఉన్నారు. ఇంచుక దూరాన పూజారి కూర్చుని ఉన్నాడు. ఆ ఐదుగురు తమ పక్కలలో గోనె సంచులను, కొయ్యపెట్టెలను ఉంచుకుని ఉన్నారు. ఆ సంచులలో, పెట్టలలో వాళ్ళ నిత్యావసర వస్తువులున్నాయి. వాళ్ళ ముఖాలలో ఏ వికారమూ లేదు. వాళ్ళ కళ్ళలో ఏ భావమూ లేదు. పుట్టి పెరిగిన గడ్డను వదిలి పెడుతున్నామన్న చింత లేదు. రహస్యాలకు, అనిశ్చితాలకు అలవాలమైన పరాయి గడ్డను గురించిన ఉత్సాహమూ లేదు.

కొంత సేపటికి రోడ్డు మీద ఏదో వాహనం వస్తున్నట్టు చప్పుడు లీలగా వినిపించింది. పుల్లిగాడు పైకి లేచి రోడ్డు మీద కొచ్చాడు. లారీ ఒకటి కరుగుతున్న తారును తొక్కుకుంటూ దూసుకు వస్తుంది. అది చేరువగా వచ్చాక పుల్లిగాడు చెయ్యి అడ్డం పెట్టాడు. లారీ చింత మానును దాటుకుని నాలుగు బారల కవతల ఆగింది. పుల్లిగాడు గబ గబ కాబిన్ చెంతకు నడిచాడు. డ్రైవరు తల బయట పెట్టి ఇంజను చేస్తున్న సవ్వడిని అధిగమించేట్టు గొంతు పెంచి ఏదో అడిగాడు. పుల్లిగాడు సమాధానమిస్తూ చింతచెట్టు కిందున్న మనుషులను చూపించాడు. డ్రైవరు తలను లోపలకు లాక్కుని లారీని బాక్ చేసి చింతమాను కిందకు తీసుకొచ్చి ఇంజను ఆపుచేశాడు.

చింతమాను కిందున్న వాళ్ళు తమ తమ సామానులను భుజాల మీద, నెత్తుల మీద మోసుకుంటూ లారీ చెంతకు వచ్చారు. పుల్లిగాడు ట్రైల్ గేటు

మీదెక్కి బాడీలోకి దూకాడు. కిందున్న వాళ్ళు సామానుని పైకి చేరవేశారు. తరువాత ఒక్కొక్కరే ట్రైల్ గేటు మీదకెక్కి లోపలకు దుమికారు.

అందరూ లోపలకు చేరాక ఇంజను స్టార్టయింది. చక్రాలు భారంగా ముందుకు కదిలాయి. లారీ ఎండ మావులను తొక్కుకుంటూ రోడ్డు మీద పరుగెత్తసాగింది.

SIDDHARTHA, V.S.
M.Sc. (Phy.)

కథాశిల్పి కేశవరెడ్డి సాగిస్తున్న తాత్విక యాత్ర

''నేనే కాదు, సమాజంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక విధమైన పోరాటంలో మెడదాకా కూరుకుపోయి ఉండడం గమనించాను. కొందరు జానెడు పొట్టకోసం, కొందరు బ్యాంకులు నింపడం కోసం, కొందరు పదవి కోసం, కొందరు కీర్తి కోసం, మరి కొందరు ఆడవాళ్ళ కోసం వివిధ స్థాయిల్లో పోరాటం సాగిస్తున్నారు... చీకటి మూలానే వెన్నెలను చూసి ఆనందిస్తున్నాం. దుఃఖం మూలాన్నే సంతోషాన్ని కోరుకుంటున్నాం. మరణం మూలాన్నే జీవితాన్ని ప్రేమిస్తున్నాం. స్వర్గ లేకుంటే జీవితం స్తబ్ధతతో నిండిపోయి నిస్సారమైపోతుంది. దీనిబట్టి మానవజీవితంలో పోరాటం అనివార్యమే కాక అవసరం కూడా అని అంగీకరించవచ్చు.''

ఈ మాటలు ఇప్పటికి పదేళ్ళనాడు తెలుగు పాఠకలోకానికి, కథాప్రియులకు, నవలాప్రియులకు లభించిన ఉత్తమ నవల 'అతడు అడవిని జయించాడు' రచయిత, కథాశిల్పి డాక్టర్ కేశవరెడ్డివి. తిరిగి పదేళ్ళ అనంతరం ఈ నవల మలి ముద్రణ అందుకుంది. అనేక మంచి ప్రశంసలకూ, కథా సంవిధానంపై కొన్ని విమర్శలకు పాత్రమైన ఈ నవలకానీ, కేశవరెడ్డి కలం చిందులు తొక్కిన ఇతర రచనల్లో పేరొందిన ''చివరి గుడిసె'', ''మూగవాని పిల్లనగ్రోవి'' నవలికలు గానీ అందిస్తున్న సందేశం మానవుడి జీవన పోరాటం, దాని అనుభవాలు, వాటి నుంచి తీసుకోవలసిన గుణపాఠాలూ, వైరుధ్యాలతో కూడిన ఈ జీవితానికి కేవలం తాత్వికులు చెప్పే భాష్యానికీ, రచయితలుగా కథకులూ, నవలాకారులూ నడిపించే కథాక్రమానికీ చాలా తేడా ఉంటుంది. ఒకటి సిద్ధాంత నిరూపణకు ప్రయత్నిస్తే మరొకటి జీవితానుభవంతో సిద్ధాంతాన్ని మేళవించి సామాజిక పరిణామక్రమాన్ని దర్శించే తీరునూ, దృష్టినీ పాఠకులకు అందించడానికి ప్రయత్నిస్తుంది. కేశవరెడ్డి రచనలు ఈ సామాజికస్పృహను కాచి వడపోసిన జీవిత సత్యాలనుంచి తిరిగి పాఠకులలో కల్పించడానికి ఉద్దేశించినవిగా భావించాలి. మనకు గొప్ప నవలలు లేవన్న బెంగ కొందరికి ఉన్నట్టుంది. ఉన్నవ 'మాలపల్లి', జి.వి.కృష్ణారావు 'కీలుబొమ్మలు', రా.వి.శాస్త్రి 'రాజు-మహిషి', 'రత్తాలు-రాంబాబు', కాళీపట్నం 'యజ్ఞం', అల్లూరు స్వామి 'ప్రజల మనిషి', 'గంగు', దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు', 'జనపదం', 'మోదుగుపూలు', మధురాంతకం, మునిపల్లె రాజు, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు కథలూ సామాన్య మధ్య తరగతి పాఠకలోకాన్ని వాటికీ, నేటికీ ఊగించి శాసిస్తున్న రచనలే. మనస్సులను చిత్రిక పట్టి ఆలోచనా తరంగాలను రేకెత్తించినవే. ఈ వరసలో కేశవరెడ్డి చేసిన ప్రయత్నం వర్తమాన ప్రపంచ పరిస్థితుల్లో, దేశ కాలమాన స్థితిగతులకు కర్మసాక్షిగా సామాజిక

జీవితంలో, వ్యక్తి జీవనంలో వస్తున్న ఒడిదుడుకులకు, జీవన సమరంలో ఎదుర్కొంటున్న కష్టనష్టాలకు, సుఖదుఃఖాలకూ సామాన్యుడి కామనను పతాకశీర్షికగా మార్చుకోవడం! అద్భుతమైన కథాశక్తి, మానవుడి నిత్యజీవనాన్ని ప్రభావితం చేసే ప్రతిసన్నివేశాన్ని, ప్రతి చిన్న కదలికనూ సూక్ష్మదర్శినితో పరిశీలించి అక్షరరూపమివ్వడంలో సిద్ధహస్తుడు కేశవరెడ్డి. జీవితం వైరుధ్యాల పుట్టగా భావించిన రచయిత మానవుడి జయాపజయాలను సమంగానే చూడగల శక్తిగలవాడు. ప్రకృతి శక్తులపై మానవుడు సాగించే నిరంతరపోరాటంలో ఓటమిని కూడా విజయంగానే భావిస్తాడు. ఒక చోట ఆరిపోయేది జీవితమే, మరొక చోట వెలిగేదీ జీవితమేనన్న జూలియస్‌ఫ్యూజిక్ అపురూప నిర్వచనానికి వారసుడు కేశవరెడ్డి.

పాతవారి అనుభవాలూ, సందేశాలూ ఆ తరువాతి తరాలకు అందివస్తాయి. పెద్దపెద్ద సన్నివేశాలు కాదు, చిన్నచిన్న సంఘటనల ఆధారంగానే మహత్తరమైన జీవనసత్యాన్ని, అనుభవసారాన్ని రసగుళికలుగా అందించగల శక్తియుక్తులున్న కథాశిల్పి కేశవరెడ్డి. ''అడవిని జయించిన'' ముసలివాడు. బీభత్స రస ప్రధానమైన 'చివరిగుడెసె'లో యానాదుల బతుకుల్లో తారసిల్లే 'మన్నుగాడు', బైరాగి, కరుణరసాన్ని చిప్పిల్లచేసే 'మూగవాని పిల్లనగ్రోవి'లో భూమి కోసం, భుక్తికోసం, దాస్యవిముక్తి కోసం ప్రాణాలు విడిచిన రైతు 'బక్కిరెడ్డి' ఈ భూమిపై ఆఖరి మానవుడు విమోచన జరిగే వరకూ సామాన్యుడికి జీవజీవాలున్న ప్రతినిధులుగానే, జీవన పోరాటంలో తలవంచని వీరులుగానే ఉండిపోతారు. తన జైలు జీవితంలో అనుభవాలను రంగరించి నవనీతంలాంటి సారాన్ని దుష్టశక్తులపై విజయపతాకంగా ఆధ్యాత్మిక యాత్రగా జాన్ బన్యన్ అందించిన 'పిలిగ్రిమ్స్ ప్రోగ్రెస్' రచనలో సత్యాన్వేషి (Valiant-for-truth), అడవిని జయించిన ముసలివాడూ ఒకలాంటి మనుషులేనని చెప్పవచ్చు! జనాథన్ స్విఫ్ట్ 'గలివర్' యాత్రలు ఒకప్పుడు ఇంగ్లీషు జీవన విధానంపై వ్యంగ్య ప్రభావంతో తీసిన దెబ్బలూ, 'అతడు జయించిన అడివి'లోని ముసలివాడు జీవన పోరాటంలో గడించిన అనుభవాలనుంచి సామాజికులకు అందించిన పాఠాలూ మరువరానివి. జాన్ బన్యన్ ఆధ్యాత్మిక యాత్రలో దైవదత్తంచేసిన కత్తీ, జీవన సమరంలో చెడును చెండాడుతూ కేశవరెడ్డి సృష్టించిన పాత్ర 'ముసలివాడు' చేపట్టిన ఈటి- దుష్ట శక్తులను దునుమాడడానికి ఉద్దేశించిన ప్రతీకలే! అలెక్స్ హేలీ రచన 'దిరూట్స్' (తెలుగులో 'ఏడు తరాల కథ') లోనూ, మోరీ తెగల గురించి కేరీ హల్మీ రాసిన 'ది బోన్ పీపుల్' (The Bone People) లోనూ నడిపిన జీవన సమరం లాంటి పోరాటం కేశవరెడ్డి అన్ని రచనల్లోనూ మనకు దర్శనమిస్తుంది. ''బోన్ పీపుల్'' రచనలో పాత్రధారిణి అయిన కెరివిన్ అనే కళాకారిణి తెగల జీవన విధానంలో పడుగుపేకల్లా అల్లుకుపోయిన

మూగభాషకు (సైన్ లాంగ్వేజ్) అలవాటు పడిపోయినట్టే ''అడవిని జయించిన'' ముసలివాడు సామాజిక జీవనంలో అన్యాయపరంపరతోనే కాదు, అటవీన్యాయంతో అడవిలోని ప్రకృతితో, జంతుజాలంతో, ఇతర ప్రాణి కోటితో ఎలా మమేకమైపోయి, వాటి భాషను తన భాషగా మార్చుకుంటాడు. పరిసరాలకు, పరిస్థితులకు అలవాటు పడడమంటే జీవన యాత్రలో సుఖదుఃఖాలకు, పోరాటాలకూ సిద్ధం కావడమేనన్నది కేశవరెడ్డి తాత్విక సందేశం. ప్రతి సన్నివేశాన్ని దృశ్యకావ్యంగా మలచగలిగిన కేశవరెడ్డి దృష్టిలో స్వీయానుభూతికన్నా సహానుభూతి గొప్పది. ఎందుకంటే స్వీయానుభూతి వ్యక్తిగతం, సహానుభూతి సామాజికం. రాబర్ట్ ఫ్రాస్ట్ అలాపించినట్లు జీవనయానం అనంతం. ఆ అనంత యాత్రలో ముసలివాడు, మన్నుగాడు, బక్కిరెడ్డి బతికి బట్టకట్టాలంటే బతుకుపోరుకు సిద్ధం కావాల్సిందే.

కేశవరెడ్డి సృష్టించిన ముసలివాడి పాత్రనూ, లేదా అతని నవలనూ ఎర్నెస్ట్ హెమింగ్వే రచన ''ది ఓల్డ్ మాన్ ఎండ్ ది సీ'' (ముసలివాడు-సముద్రం) తో పోల్చడం కద్దు. కానీ అందులోని ముసలి బెస్తవాడు సముద్రంలో అక్కడ తారసిల్లే జంతుకోటితో జరిపే జీవన సమరం కన్నా కేశవరెడ్డి 'ముసలివాడు' 'జరిపే బతుకు పోరు గొప్పది. అయితే హెమింగ్వే తండ్రి తన కొడుకును వేటకు, చేపల వేటకు అలవాటు చేశాడు. అలాంటి అనుభవం అడవిలో కేశవరెడ్డికి ఉందో లేదో తెలియదు కానీ ముసలివాడి పాత్రద్వారా మనల్ని అడవి పట్టించి, ప్రకృతి సౌందర్యాన్ని, అనంత ప్రాణికోటిని, బీభత్సాన్ని బొమ్మకట్టి చూపుతాడు. ఇదెలా సాధ్యమైంది? ఆయనే చెప్పినట్టుగా ''సాహిత్యం సరదాకోసమో, కాలక్షేపానికో ఉపయోగ పడే ఆషామాషీ వ్యవహారం కాదన్న ''దృఢ విశ్వాసం కేశవరెడ్డి రచనాలక్ష్యం కాబట్టి. తన లక్ష్యాన్ని సాధించడంలో ఆయన వ్యర్థ పదాలు వదిలేశాడు, అర్థ గౌరవాన్ని కాపాడాడు, వర్ణనా రోచస్సులు వెదజల్లాడు. హెమింగ్వే తన రచనలో ఒక నూతన శైలికి అంకురార్పణ చేసినట్లే ఇక్కడ కేశవరెడ్డి కూడా (అప్పుడప్పుడూ మధ్యే మధ్యే కృతకంగా ఉన్నట్టు కనిపించినా) ఒక కొత్తశైలీ సౌభాగ్యానికి పాఠకులను అలవాటు చేస్తున్నాడు! అయితే హెమింగ్వే కథా రచనకు సంబంధించి ఒక సందర్భంలో ''రచనలో వాస్తవాన్ని వక్రీకరించని వాక్యాలుండాలి'' అన్నాడు. (All you have to do is write one true sentence, a true simple declarative sentence)

ఈ అగ్ని పరీక్షలో కేశవరెడ్డి ఏనాడో అగ్రజుడిగా ఎదిగి వచ్చాడు. అంతే కాదు, ఆబోతులతో, ఎనుబోతులతో పోరులో, వేటలో, యుద్ధంలో పొందే అనుభవాలు వ్యక్తిలో భౌతికంగా కలిగించే సెన్సేషన్స్‌ను సక్రమంగా అక్షర బద్ధం చేయాలన్నాడు హెమింగ్వే. ఇందుకుచేయవలసిన పని- జీవితాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం. ఆ పిమ్మట నీ

సొంత పాత్రలను అందుకు అనుగుణంగా రూపుదిద్దుకోమంటాడు. నిజానికి అతడు జయించిన అడవిలో కేశవరెడ్డి వాస్తవిక సృజనే ముసలివాడు, మన్నుగాడు, సుక్కపంది, దాని పిల్లలూ తోడు గువ్వ, నక్కలూ! ముసలివాడి ఏకాగ్రత ఎలాంటిది? దుష్టశక్తులపై సమరానికి ఆ ఏకాగ్రత అవసరం. ''సూదికి దారాన్నెక్కిస్తున్న వాని ముఖంలోనూ, సగం బయటికొచ్చిన పెయ్యను గర్భంనుంచి లాగుతున్న జంతువైద్యుని ముఖంలోనూ ఉండే ఏకాగ్రత అతని ముఖంలో కనిపించక'' పోతే ముసలివాడి కథ కంచికి చేరేది కాదు! కళ్ళను చెవులుగా, చెవులను కళ్లుగా మార్చుకున్నందునే అతడు బాధలు పడినా, యుద్ధంలో ఓడినట్లు భావించినా, ''అతడు పరిపూర్ణమైన సంకల్పశుద్ధిని, దీక్షను, చిత్తశుద్ధిని, ఓర్పును ప్రదర్శించాడు.'' ఆ అరణ్య జీవితాన్ని, అరణ్య రోదనలనూ, అక్కడి ప్రకృతినీ అర్థంచేసుకోవాలంటే ఎన్నో అనుభవాలను కాచి వడపోసిన వ్యక్తులతో, పరిసరాలతో పరిచయం అవసరం. మనలో ఎంతమందికి తెలుసు– బలసతవ్వలు, కాసేరాకు పాదలు, కిచ్చిలి చెట్లు, సుంక్రేసు చెట్లు, తీంట్రు పాదలు, బాగిమాను కొమ్మలు, బిలిచిత్రిపూలూ?

తన స్థిరచరాస్తులైన సుక్కపందుల బతుకుతెరువు ముసలివాడి ప్రాణం, సమాజ సంక్షేమం కేశవరెడ్డి ధ్యేయం! వీరత్వానికి దివిటీలు పట్టిన ముసలివాడు అజ్ఞానంపైన, మూర్ఖత్వం పైన కూడా సమరం నడిపిన సమన్వయ కర్త! శ్రమతో, బాధతో ప్రమేయం లేకుండా అవలీలగా ఏదీ ఒనగూడదన్న వర్క్ కల్చర్‌ను బోధించాడు! దోపిడీని ఈసడించాడు, అమాయకత్వంపై ధ్వజమెత్తుతూ ఒక్కోప్పుడు దుర్మార్గునికన్నా అమాయకుని వల్ల ఎక్కువ హాని ఎలా జరుగుతుందో గువ్వ ద్వారా తెలిపాడు!

జయాపజయాలే సమన్వయ జీవితం అన్నాడు. అయితే నిరుత్సాహం కార్య శూరుడికి లక్ష్యం కాదన్నాడు. హెన్రీ జేమ్స్ ''ది బీస్ట్ ఇన్‌ది జంగిల్'' నవలలో జాన్ మార్చర్ అనే పాత్ర ద్వారా చెప్పిస్తాడు: ''అతడు తన జీవిత అడవిని చూశాడు, దెబ్బతీయడానికి పొంచి ఉన్న మృగాన్ని చూశాడు.'' అని! మన ముసలివాడూ చూశాడవన్నీ! ''ఎండసూర్యుని నుంచి పుడుతుంది, వెన్నెల చంద్రుడి నుంచి పుడుతుంది. మరి చీకటి ఎక్కడ నుంచి పుడుతుంది? వెలుగు తాత్కాలికమై ఉండగా పైశాచికమైన చీకటి అజరామరంగా ఉండటం ఎంత దారుణం?'' అని ముసలివాడు తాత్వికంగా ప్రశ్నిస్తాడు. జీవితంలో ఎన్నో తుఫానులను ఎదుర్కొన్న వ్యక్తులకు తలపోతలు ఒకటి కాదు, ఎన్నో! కవి కార్ల్ శాండ్‌బర్గ్ అనలేదూ: "All starlights of cool memories on storm paths" అని!

వార్త దినపత్రికలో **శ్రీ ఎ.బి.కె. ప్రసాద్** సంపాదకీయం,
ఆగస్టు 25, 1996

అతడు 'విధ్వంసాన్ని' జయించాడు

హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వెళ్ళే జాతీయ రహదారిపై నిజామాబాద్ నుంచి 12 కిలోమీటర్లు ఇటువైపు డిచ్‌పల్లి దగ్గర విక్టోరియా ఆస్పత్రి వుంది. వందల ఎకరాల విస్తీర్ణంలో, పచ్చని చెట్లతో, చిన్న చిన్న గుట్టలతో ప్రశాంతంగా వుండే ఆ ఆవరణలో వ్యాధులకు చికిత్స లభిస్తుంది. మానసిక దారుఢ్యానికి అక్కడ 'టానిక్' దొరుకుతుంది. ఆ ఆస్పత్రిలో డాక్టర్‌కేశవరెడ్డి 19 సంవత్సరాలుగా రోగులకు స్వస్థత కలిగిస్తున్నారు. అదే సమయంలో తెలుగులో కుప్పలు, తెప్పలుగా వెలువడుతున్న ''సిద్ధాంత సృజనాత్మక సాహిత్యానికి'' విరుగుడులాగా ఆరోగ్యకరమైన సృజనాత్మక రచన చేస్తున్నారు.

మొదటి నవల 'స్మశానం దున్నేరు' నుంచి నిన్న మొన్నటి 'చివరి గుడిసె' వరకు ఆయన రచనలు పాఠకులను మంత్ర ముగ్ధుల్లా తమ వెంట నడిపిస్తూ, అంతరంగ విధ్వంసాలను తట్టి లేపుతాయి. ''చెట్లు, పుట్టల మధ్య ప్రశాంతంగా వున్నానంటున్నారు. కాని జీవితంలోని విధ్వంసం కల్లోలం మీ రచనల ద్వారా వ్యక్తమవుతూనే వుందని మేం అంటే, విధ్వంసనాలోనూ వుంది. విధ్వంసాన్ని చూసి స్పందిస్తున్నాను. అక్షర రూపం ఇస్తున్నాను'' అని కేశవరెడ్డి తన రచనల సారాన్నీ వివరించారు.

ఇవాళ వున్న వ్యాపార సంస్కృతిలో వైద్యుడు పట్టణంలో ఓ 'చిన్నదుకాణం' తెరిచినా ఏడాదిలో లక్షాధికారి అవుతాడు. అయినా ఆయన ఈ వ్యాపార విలువలకు దూరంగా చెట్లు, పుట్టల మధ్య జీవిస్తున్నారు. 90 ఏళ్ళనాటి కుర్చీలో కూర్చుని రచనలు చేస్తుంటారు. లేదా గతంలో ఎన్నోసార్లు చదివిన ఆంగ్ల నవలలనే 'టోన్ ఆఫ్ నెరేషన్' కోసం మళ్ళీ చదువుతుంటారు. ఎందుకిలా పుట్టలు, గుట్టలు పట్టుకుని వుండడం, నిజామాబాద్‌లో ఆస్పత్రి నడపవచ్చుగదా అన్న శ్రేయోభిలాషుల మాటవిని ఆమధ్య ఆయన ఎనిమిది నెలలు వైద్యాన్ని వ్యాపారం చేయాలని ప్రయత్నించారు. అయితే అది ఆయన తత్వానికి సరిపడలేదు. ఈ విషయం గురించి ప్రస్తావిస్తే, ఆయన 'పసిబాలుడి'లా నవ్వి ''మారుమూలన వుందామంటే నడివీధికి లాగాలని చూశారు'' అని అన్నారు. కమర్షియల్ లైన్ తన ఆరోగ్యానికి సరిపోలేదన్నారు.

మీ ప్రాంతం సంస్కృతి, భాష, మీ చిన్ననాటి జ్ఞాపకాలు చెదరకుండా కాపాడుకోడానికే మీరిలా నగర జీవితానికి దూరంగా, ప్రశాంతంగా వున్నారా అంటే, ''పనిగట్టుకొని దూరంగా వుండలేదు ఇట్లా వుండడం నాకిష్టం. వృత్తి రీత్యా

మారుమూల ప్రాంతంలో వున్నాను'' అని జవాబిచ్చారు. ఆ పాత ఇంటిముందు చెట్ల నీడన, ప్రశాంత వాతావరణంలో ఆయన తన రచనల గురించి, సాహిత్యం గురించి, ఇంకా అనేక విషయాల గురించి కల్లాకపటం లేకుండా మాట్లాడారు.

● మీ ప్రాంత సంస్కృతిని, భాషను కాపాడుకునేందుకే జనారణ్యాలకు దూరంగా ఈ గ్రామంలో పచ్చని చెట్ల మధ్య జీవిస్తున్నారా? దాని వల్లనే మీ మట్టివాసనను పోగొట్టుకోలేదనిపిస్తోంది, నిజమేనా?

నిజమే. గత 20 ఏళ్ళుగా ఇక్కడ ఉంటున్నాను. అయినా చిత్తూరు జిల్లాకు చెందిన నా చిన్న నాటి ముద్రలు పోలేదు. మాట్లాడితే తెలంగాణా భాష వచ్చేస్తుంది. రాయడానికి కూర్చునేసరికి చిత్తూరు సంస్కృతి, భాష వచ్చేస్తోంది.

● వ్యాపార సంస్కృతిలో భాగం కావడానికే అన్నట్లు నిజామాబాద్ పట్నంలో ఎనిమిది నెలలు ఉండి మెనక్కి వచ్చేశారు ఎందుకు?

పట్టణ సంస్కృతి మానవ నివాస యోగ్యం కాదు. కృత్రిమంగా ఉంటుంది. చెట్లు, పుట్టలే నాకు బాగుంటాయి. నేనో ప్రిమిటివ్ మేన్‌ను అనుకుంటాను. ఒకప్పుడు మనం అడవుల్లోనే ఉంటిమి కదా! గుహల్లో జీవించే వాళ్ళం కదా!

● అసలు మీరు దేనికోసం రచనలు చేస్తున్నారు?

నన్ను నేను అభివ్యక్తి పర్చుకోవడానికి. నాలో ఓ శూన్యం ఉంది. ఏకాంతం ఉంది. దాన్ని భర్తీచేసుకోవడానికి ఏదో చేయాలనిపిస్తుంది. దీన్ని సైకాలజీలో ''ఇంటెన్సిటీ డ్రయివ్'' అంటారు. దానివల్లనే నేను రచనలు చేశాను. మరో మాటలో చెప్పాలంటే ఇంటెన్సిటీ డ్రైవ్‌ను తృప్తి పర్చుకోవడానికే నా రచనావ్యాసంగమంతా!

● సామాజిక స్పృహ, ప్రయోజనం పేరుతో తెలుగు నవలల్లో రచయిత నేరుగానూ, పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి ప్రబోధాలు చేయడం పరిపాటి, దీనినుంచి మీరెట్లా తప్పించు కోగలిగారు?

రచనలో రచయిత పాఠకుడికి కనిపించక పోవడమే గొప్ప తనం. రచయిత ఉపన్యాసాలుదంచుతుంటే శిల్పం చెడుతుంది. నవలలో రచయిత చేయి, ముఖం కనిపించకూడదు. అప్పుడే శిల్పం పటిష్టంగా ఉంటుంది.

● దళితుల అనుభవాలను దళితేతరులు సరిగా వ్యక్తీకరించలేరనే వాదన కూడా జరుగుతోంది...

అది చాలా తప్పు. దళితుల గురించి దళితేతరులు బాగా రాయగలరు. అధ్యయనం ద్వారా దళితేతరులు దళితుల గురించి బాగా అర్థం చేసుకోగలుగుతారు.

వాత్స్యాయనుడు బ్రహ్మచారి. బ్రహ్మచారి రాసిన కామసూత్రాలను అంగీకరిస్తున్నాం. బాగా రాశాడని ప్రపంచమంతా ప్రశంసిస్తోంది. దీన్నే మంటారు? దళితుల గురించి దళితేతరులు సరిగా రాయలేదని రుజువేమైనా ఉందా?

● మూగవాని పిల్లన గ్రోమిమిత్ అంటున్నారు. మీపైత్రిపురనేని మధుసూదనరావు లాంటివారు చాలా ఆశలు పెట్టుకున్నట్లు '' ఇన్‌క్రెడిబుల్ గాడెస్'' కు రాసిన ముందుమాటను బట్టి అర్థమవుతోంది. మీరు వారి ఆశలను వమ్ము చేసి దారి తప్పారా?

నేను మార్క్సిజానికి దూరమయ్యానని ఎందుకనుకుంటున్నారు? నేను మార్క్సిస్టునే ''అతడు అడవిని జయించాడు'' ''మూగవాని పిల్లనగ్రోవి'' ఒక ఫిలాసఫీకి చెందినవి. అంతమాత్రాన నేను మార్క్సిస్టును కాకుండా పోతానా? నా రచనల్లో మార్క్సిస్టులు వాడే పడికట్టు పదాలు కనిపించవు. అంతమాత్రాన నేను మార్క్సిస్టును కానని చెప్పేయవచ్చా?

● మీరు పీడితుల గురించి దయనీయంగా రాస్తారు, కానీ పరిష్కార మార్గం చూపరు. అయినా మిమ్మల్ని ప్రగతి కాముకులనే అనుకోవాలా?

పేదరికం గురించి, ఆకలిగురించి బాగా రాస్తున్నాను. ప్రజలకు పరిష్కార మార్గం నేను చెప్పాలా? ప్రజలు అంతఅమాయకులా? పరిష్కారానికి ఒకే మార్గం ఉంది. తిరుగుబాటు చేయాలి. విప్లవం తేవాలి. ఈ విషయాన్ని కేశవరెడ్డో, మరో రచయితో చెప్పాలా? పనిగట్టుకొని ప్రజలకు పరిష్కారమార్గం బోధించాల్సిన అవసరం లేదు. అది వాళ్ళకు తెలుసు.

● మీ చుట్టూ ఉద్యమాలు జరుగుతున్నాయి. మానవ జీవితం కల్లోల భరితంగా ఉంది. మీరెందుకు పట్టించుకోవడం లేదు?

ఇక్కడి (తెలంగాణా) ఇతివృత్తాలతో ఒకటి రెండు రచనలు చేస్తాను. ఇక్కడి ఉద్యమాలను గమనిస్తున్నాను. అధ్యయనం చేస్తున్నాను. తప్పకుండా రాస్తా.

● మీ చాలా నవలల్లో 'బైరాగి' పాత్ర వచ్చిపి మార్గదర్శకత్వం చూపుతుంది, ఆ పాత్ర రచయితనేనా?

మౌత్‌పీస్ అనా మీ ఉద్దేశం?

● అవును...

దాన్నో ప్రొటొగనిస్టు'' అంటారు. బైరాగినా ప్రొటొగనిస్టు కాదు. అయితే దాదాపు బైరాగినా ప్రతి నవలలో వస్తుంటాడు. నేను కూడా ఛాలా సార్లు ఆలోచించా. నాకు తెలియకుండానే ఆ పాత్రను పట్టుకొస్తున్నా. కొన్నేండ్ల తర్వాత నేను అట్లా అవుతానేమో!

- **మేం వచ్చేసరికి ఏదో ఇంగ్లీష్ నవల చదువుతున్నారు....**

లాంగ్ మార్చ్; చైనీస్ లాంగ్ మార్చ్ కాదు. పాత అమెరికా నవల, విలియం స్టాయిర్ రాశారు. ఫిజికల్ ఫిట్నెస్ కోసం సైనికులను 36 కిలోమీటర్లు నడిపిస్తారు. అదీ ఇతివృత్తం. దాన్ని ఎన్నోసార్లు చదివా. మళ్ళీ చదువుతున్నా. స్టైయిల్‌ను స్టడీ చేయడానికి నాకు నచ్చిన కొన్ని నవలలను పదేపదే చదువుతా.

– ఇంటర్వ్యూ : **కాసుల ప్రతాప్‌రెడ్డి**
సుప్రభాతం 20 జూన్-3 జులై 1996

''ఏకాంతాన్ని పూడ్చుకునేందుకే రచనా వ్యాసంగం''

నాలో ఏదో ఏకాంతం. దాన్ని పూడ్చుకోవాలన్న తపనతోనే నేను కలం పట్టాను. తొలినాళ్ళలో నూరుమంది, వేయిమంది చేయలేని పనిని చేయాలనిపించేది. దాని ప్రతిఫలనమే రచనా వ్యాసంగం.

* * *

నేను తొమ్మిదో తరగతిలో వుండగా కథలు రాయటం ప్రారంభించాను. నా తొలి కథ 'సమాంతర రేఖలు'. ప్రేమ, అపరాధ పరిశోధన ఇతివృత్తాలుగా ఆరేడు కథలు రాసాను. బెంగుళూరు, మద్రాసుల నుంచి వెలువడిన ప్రజామాత, కథాంజలి పత్రికలలో ఆ కథలు అచ్చయ్యాయి. ఆ తర్వాత కథలు రాయటం మానేసాను. కవిత్వం ఎప్పుడూ రాయలేదు. కనీసం ప్రయత్నించలేదు కూడా. కథల తర్వాత నవలే ప్రధాన ప్రక్రియగా ఎంచుకున్నాను.

కథ కాన్వాస్ చిన్నది. వాతావరణ చిత్రణకి, పాత్రల భావ వ్యక్తీకరణకి, పాత్రల అభివృద్ధికి, సందేశమివ్వడానికి కథలో చోటు చాలదనిపిస్తుంది. వీటన్నిటిని సమగ్రంగా చిత్రించడానికి కనీసం నవలిక అయినా రాయాల్సివుంటుంది. అందుకే నా రచనకు నవలని వాహిక చేసుకున్నాను.

నన్ను ప్రభావితం చేసిన రచయితలుఎవ్వరూ లేరు–తెలుగులోకాని, ఇంగ్లీషులోకాని, హెమింగ్‌వే, జాన్‌స్టీన్ బెకన్ లను నా గురుసమానులుగా భావిస్తాను. కవిత్వం విషయంలో నాది కలర్ బ్లైండ్‌నెస్. ఆధునిక కవిత్వంతో నాకు వేవ్‌లెంత్ కుదరలేదు. వేమన, గురజాడ అర్థమయినంత హాయిగా ఆధునిక కవిత్వం నాకు అర్థంకాదు.

* * *

నాకు బాగా పరిచయమున్న ప్రపంచంలో పేదరికం, ఆకలి నిండివున్నాయి. ఏ నవల రాసిన అలాంటి జీవితాన్నే ఇతివృత్తంగా ఎన్నుకుంటాను. **Identify my self with Dalit.** అందుకే వాళ్ళ గురించే నేను రాస్తాను. కళ్ళు తెరిస్తే ఆకలి, దారిద్ర్యమే కనిపిస్తున్నప్పుడు వీటి గురించికాక ఇంకేంరాస్తాం! నేను పుట్టుకతో దళితేతరుణ్ణి. కానీ నా ఆర్థిక పరిస్థితి దృష్ట్యా నేను దళితుణ్ణి. దళితవాద సాహిత్యాన్ని ఒక కులానికో, మతానికో పరిమితం చేయడం సమంజసం కాదు. పీడనకు గురయ్యే వాళ్ళంతా దళితులని భావిస్తే, అది ఇంకా ఆహ్వానించదగిందిగా వుంటుంది. స్వీయానుభూతిలో వున్నంత తీవ్రత సహానుభూతిలో వుండకపోవచ్చు. అయితే దళితేతరులు దళితుల

జీవితాలని బాగా అర్థం చేసుకుని కూడా రాయవచ్చు. నాకు దళితుల సమస్య బాగా తెలుసు. పుట్టుకతో దళితులైన వారికంటే ఎక్కువ ఆర్ద్రతతో, కన్సర్న్‌తో వాళ్ళ గురించి రాయగలిగాను. ఏది ఏమైనా దళితవాద సాహిత్యాన్ని ప్రోత్సహించవలసిందే.

* * *

ఎక్కాలు అప్పచెప్పినట్టు- అనేక మంది రచయితలు తమకు తెలిసిన విషయాలను కక్కేస్తున్నారు తప్ప కళాత్మకంగా చెప్పాలనుకోవడం లేదు.

* * *

ఇతివృత్తం- ఉదాత్తమైనది అయినంత మాత్రాన రచన అజరామరంగా వుండదు. శైలి కూడా పవర్‌ఫుల్‌గా ఆర్టిస్టిక్‌గా వుండాలి. లేదంటే ఏ రచనైనా ఎక్కువ కాలం బతకదు. ఈ రెంటిలో ఏది లోపించినప్పటికీ రచన విఫలమవుతుంది. ఉదాత్తమైన వస్తువుతో పాటు శక్తివంతమయినశైలి రచనను మళ్ళీ మళ్ళీ చదివిస్తుంది. పుస్తకాన్ని పదికాలాల పాటు జ్ఞాపకం వుంచుకునేలా చేస్తుంది. 'కన్యాశుల్కం' లో వస్తువు సమకాలీనతకు దూరమైనశైలి దృష్ట్యా అది జీవించే వుంది.

ఇతివృత్తం రచయిత హృదయంలోంచి నిజాయితీగా రావాలి. రచయిత తనను తాను ప్రశ్నించుకోవాలి.

- మనస్ఫూర్తిగా ఫీలవుతున్నాడా?

- ఇతివృత్తాన్ని, సందేశాన్ని నమ్ముతున్నాడా?

శైలిలో పరిపూర్ణతని, భాషపై పట్టును సాధించాడా?

ఇవి ప్రధానమయినవి. లేకుంటే పెన్ ముట్టవద్దు. పారితోషికం కోసమో, పేజీలు నింపడం కోసమో రాయకండి. తెలియని ప్రక్రియలలో రచనలు చేసి జనం ప్రాణాలు తీయకండి.

* * *

దురదృష్టవశాత్తు తెలుగు సాహిత్యంలో సగర్వంగా చెప్పుకోతగిన నవల ఏదీలేదు. నేను చదివి పది మంది చేత చదివించదగిన నవల ఇప్పటివరకు రాలేదు.

మన కల్చరంతా వ్యాపారమయమైపోతోంది. అందువల్లే మనకి మంచి నవలలు ఎక్కువ రావడంలేదు. నేటి తరం రచయితలెవరూ సంతృప్తికరంగా రాయటం లేదు. కె.ఎన్.వై.పతంజలి,. నామిని సుబ్రహ్మణ్యంనాయుడు రచనల్లో మంచి స్పార్క్ వుంది.

కానీ వాళ్ళిద్దరూ రాయవలసినంత రాయటంలేదు. చేయవలసినంత కృషి చేయటం లేదు.

ప్రాంతీయ రచన - ప్రోత్సహించవలసిన ధోరణి. ప్రాంతీయ జీవనాన్ని క్షుణ్ణంగా చెప్పగలిగితే గొప్ప విషయమే. ఇటువంటి ఇతివృత్తాలతో వచ్చే నవలని ' ఆంచరిక నవల' గా వ్యవహరిస్తున్నారు. ఈ రచనలకు నేడు మంచి ఆదరణ వుంది.

కవిత్వ పరంగా తెలుగు సాహిత్యం సంపన్నమైనది. జాతీయ స్థాయిలో నిలవగలిగిన కథలు కూడా వస్తున్నాయి. నవల విషయంలో మనం చాలా వెనకబడినట్టే చెప్పాలి.

టి.వి., స్టార్ టి.వి.లు కమర్షియల్ నవలని దెబ్బ తీస్తాయి కానీ కమిటెడ్ నవలని దెబ్బతీయలేవు. నేడు కమర్షియల్ నవల మూల పడింది. సీరియస్ రీడర్ మాత్రం మంచి సాహిత్యాన్ని ఆహ్వానిస్తూనే వున్నాడు.

భారతీయ భాషల్లో వస్తున్నంత మంచి సాహిత్యం మన భాషలోనూ వస్తోంది. మిగత భాషల్లో అయితే వాళ్ళ సాహిత్యాన్ని అనువాదాలు చేసి దేశానికి పరిచయం చేస్తున్నారు. తెలుగు నుంచి ఎక్కువ అనువాదాలు కావడంలేదు. కనీసం ప్రయత్నంకూడా జరగడం లేదు.

* * *

తెలుగులో విమర్శ ఎదగ వలసినంత ఎదగలేదు.

* * *

ఒక పుస్తకాన్ని అన్ని పార్శ్వాలనుంచి పరిశీలించి సమగ్రంగా విమర్శించగల వాళ్ళు చాలా తక్కువమంది వున్నారు. ఇది చాలా బాధాకరం. నారచనల విషయంలో విమర్శకులు చాలా అన్యాయం చేసారు. 'ఇన్‌క్రెడిబుల్ గాడెస్' లో హరిజన వ్యతిరేక తను వెదకటం విమర్శకుల అవగాహనా రాహిత్యానికి నిదర్శనం. అస్పష్టత, సంక్లిష్టతలకు చోటులేని నుడులని అర్థంచేసుకోవడంలో విమర్శకులు విఫలమవుతున్నారు.

* * *

పుస్తకాలవల్ల ప్రపంచం మారదు. ఎప్పటికైనా సమాజాన్ని మార్చేది భౌతిక పరిస్థితులే కానీ సాహిత్యం ఇతర కళలు కాదు. అయితే ఇవి సమాజం మారడానికి ఇతోధికంగా సహాయంచేస్తాయి.

* * *

నన్ను నేను వ్యక్తపరుచుకోవడానికి రచనలు చేస్తాను. నాలో కొన్ని భావాలుంటాయి. కొన్నాళ్ళకి వాటిని ఇతరలతో పంచుకోవాలనిపిస్తుంది. అప్పుడే నేను రాస్తాను.

ఏ సాహిత్య సంస్థలోనూ సభ్యత్వం లేదు, వాటితో భేదాభిప్రాయం కానీ, విరోధభావం కానీ లేదు. వృత్తి రీత్యా మారుమూల గ్రామంలో వుండటం వల్ల సాహిత్య సంస్థలకు దూరంగా వుండిపోయాను.

* * *

ప్రతిరోజూ 'కన్యాశుల్కం' లో రెండు మూడు పేజీలు చదవందే నాకు నిద్రపట్టదు. కన్యాశుల్కం లాంటి నాటకం రాయాలని లేదు కానీ అలా చిరస్థాయిగా నిలిచిపోయే నవలొకటి రాయాలని వుంది.

'వార్త' దినపత్రిక ''సృష్టి'' ఇంటర్వ్యూ :
నామాడి శ్రీధర్, ఒమ్మి రమేష్‌బాబు
మే 25, 1996.

''..... ఈ తరంలో దళిత సమస్యను చాలా నిజాయితీగా, వాస్తవికంగా చిత్రించిన రచయిత డాక్టర్ కేశవరెడ్డి. ఆయన రాసిన ''బానిసలు - భగవానువాచ.'', ''స్మశానం దున్నేరు,'' ''ఇన్‌క్రెడిబుల్ గాడెస్,'' ''అతడు అడవిని జయించాడు'' నవలలు ఇందుకు తార్కాణం. దళితవాదం బలపడకముందే ఆయన ఈనవలలు రాశారు. ఎవరి అనుభవాలను వాళ్లే రాయగల రని కేశవరెడ్డి నిరూపించారు. ఆయన రాసిన ''చివరి గుడిసె'' దీనికి దాఖలా. ఈనవలలో యానాదుల జీవనశైలిని రూపుగట్టించారు రచయిత. వాళ్ల మాట, యాస, భాష అన్నీ చాలా సహజంగా తొంగి చూస్తాయి ఈనవలలో.''

- గుడిపాటి
'ఏకలవ్య'
దళిత సాహిత్య సాంస్కృతిక
ప్రత్యేక సంచిక: జనవరి - ఫిబ్రవరి 1997.